# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక, జనవరి, 2018 ₹30

ISSN 2454–4329



అల్లసాని పెద్దన - కృష్ణదేవరాయలు

# మిసిమి

మాసపత్రిక

**సంపుటి 29** **సంచిక 1**

**జనవరి 2018**

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

ప్రధాన సంపాదకులు : చెన్నూరు ఆంజనేయ రెడ్డి

సంపాదకుడు : వల్లభనేని అశ్వినీకుమార్

సహాయ సంపాదకుడు : కాండ్రేగుల నాగేశ్వరరావు

సహకార సంపాదకులు : వోలేటి పార్వతీశం,
కరుటూరి విజయ్ చౌదరి

---

Printed & Published by

**BAPANNA ALAPATI**

at **Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad,
**Hyderabad - 500 020.**
Ph: 040 - 27612436, 27645538.

---

పత్రిక ప్రతి నెలా ఒకటవ తేది మీ తలుపు తడుతుంది....

ప్రతి : ₹ 30/- సంవత్సరానికి : ₹ 360/-

విదేశాలకు ప్రతి : $ 3.⁰⁰ సంవత్సరానికి : $ 36.⁰⁰ (by Air Mail)

కార్యాలయ కార్యదర్శి : వేముల రాణి

ఫోన్ : 040 – 27645536. సెల్ : 994 951 6567.

---

**LCCN 91-903060** **ISSN 2454-4329**

E-mail : misimi90monthly@gmail.com,
www.misimimonthly.com
e-magazine : www.kinige.com/misimi
facebook.com/misimimaasapathrika
https://twitter.com/MISIMIMONTHLY

**: Silver jubilee celebrations of MISIMI Telugu Monthly**

**అట్టతో కలిపి 100 పేజీలు**

# మిసిమి

## జనవరి 2018 నెల సూచికలు...


కమ్మతెమ్మెరలు : ఉత్తరాలు... 5

సప్త సహోదరీల ప్రాంతం ఈశాన్య భారతం : ముకుంద రామారావు... 7


కృష్ణశాస్త్రి

విమర్శకుడిగా – కృష్ణశాస్త్రి : రెంటాల శ్రీవెంకటేశ్వర రావు... 19

వేమన యోగం : అమినేని సిద్ధయ్య నాయుడు... 23


చే

క్యూబన్ విప్లవం : ముక్తవరం పార్థసారథి... 28

క్షేత్రలక్ష్మి : గెల్లి రామమోహనరావు...31


చేరా

మోహన గీతం : అశ్వినికుమార్... 35

సిగ్నేచర్ ట్యూన్ : డా. సి. మృణాళిని.. 36

మనసున్నవాళ్ళు : గొల్లపూడి మారుతీరావు...44


తలిశెట్టి

పల్నాడు గేయాలు : కోన రమణరావు... 49

ఎడిటర్స్ డైరీ : కాండ్రేగుల నాగేశ్వరరావు...51

తొలి తెలుగు వ్యంగ్య చిత్రకారుడు తలిశెట్టి రామారావు : బాలి... 57

ఇందూరు జిల్లాలో జైనమతం : సిద్ధ సాయరెడ్డి... 60

బాధ పడిన కవి : వేగుంట మోహన్‌ప్రసాద్.... 65



శతాధిక నాటకకర్త డా. కొట్టుపాటి గంగాధరరావు : సి.యస్. రావు... 70

అవే నెలలు, అవే పండుగలు... కానీ... : డా. విజయ బక్ష్.. 73

ఐన్‌స్టీన్‌తో – ఎమ్.ఎన్. రాయ్ దంపతుల పరిచయం : డా. నరిసెట్టి ఇన్నయ్య... 75



దేరా సినిమాలు : రావి కొండలరావు... 77

పూజాఫలం : డా. పి. దక్షిణామూర్తి... 79

కినిమా : బి.కె. ఈశ్వర్... 80

కులపతి అడివి బాపిరాజు : ప్రొ. రావినూతల సత్యనారాయణ... 84

నజరానా : డా. ఎండ్లూరి సుధాకర్... 95


చిత్రాలన్నీ శ్రీకర్, తిరుపతి ప్రపంచ తెలుగు మహాసభలు సందర్భంగా వేసినవి




ముఖచిత్రం : రెండవ అరియ కేసరి... వేములవాడ చాళుక్యుడు... పంప మహాకవి...

రెండవ అట్ట : అల్లసాని పెద్దన – కృష్ణదేవరాయలు

మూడవ అట్ట : అలియ రామరాయలు – రక్షస తంగడి యుద్ధం

నాల్గవ అట్ట : కాకతీయ చక్రవర్తి గణపతి దేవుడు – శిలాతోరణం




వివరాలు 50వ పుటలో...

# కమ్మతెమ్మెరలు

✧ "…. రావినూతల సత్యనారాయణ *తెలంగాణ తెలుగుతేజం దేవులపల్లి రామానుజరావు* గురించి చక్కని వ్యాసం అందించారు. రామానుజరావు భాషాభ్యుదయానికి మహత్తరమైన సేవలందించి చరితార్థులైనారు. ఉభయ రాష్ట్రాలలోని తెలుగు వికాసానికి అకాడమీ ద్వారా ఎన్నో మంచి కార్యక్రమాలు నిర్వహించారు. గొప్ప దేశభక్తుడు. రవీంద్రనాథ్ వ్యక్తిత్వాన్ని ఆత్మీయంగా వివరించారు ఇన్నయ్య. *అనంతరాగాల అనంతకృష్ణులు* లో అనంతకృష్ణశర్మ సంగీత సాహిత్యాలతోపాటు వారి అనంతమైన ప్రతిభను గురించీ ఆర్వీయస్ సుందరం చాలా బాగా వివరించారు. గతంలో **మిసిమి** లో అనతంకృష్ణశర్మ గురించి ప్రస్తావనం చేయడం నాకు జ్ఞాపకం ఉన్నది. మొదటిగా శర్మ ప్రతిభను గుర్తించినవారు కట్టమంచి రామలింగారెడ్డి. వీరుభయులూ భారతం ఇతిహాసాన్ని ఆమూలాగ్రంగా ఎన్నో పర్యాయాలు చదివారని పెద్దలు చెప్పగా విన్నాను. వీరితోపాటు అబ్బూరి రామకృష్ణారావున్నూ ఉండేవారు… తూము రామదాసు తొలి నాటకకర్త అయితే తూము నరసింహదాసు గొప్ప వాగ్గేయకారుడు. కర్ణాటక సంగీత విద్వాంసులు నరసింహదాసు కీర్తనలు గానం తప్పకుండా చేస్తారు. నరసింహదాసు పరమ భాగవతోత్తములు సుమా! ఇద్దరు బాలసరస్వతులున్నారు. ఇరువురూ సంగీత నాట్యాలలో ఉగ్రూతలూగించారు. ఒకరు నృత్యబాలసరస్వతి – మరొకరు లలిత సంగీత గాయని రావు బాలసరస్వతి. సినీ పాటలు పాడిన మొదట నేపథ్యయగాయని రావు బాలసరస్వతి… ఆ రోజుల్లో ఎందరో కవుల భావగీతాలను రసరమ్యంగా అందించారమె…. బాలసరస్వతులుభయులూ గొప్ప కళాకారిణులు. ఎన్.టి.ఆర్. గురించి యాగా వేణుగోపాలరెడ్డి చాలా సన్నిహితంగా చూశారు. ఉన్నతమైన వ్యక్తితో ఏ క్షణంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో, ఆవేశంతో ఆదేశిస్తారో 'మేము ఆలోచిస్తాం మేము చూసుకుంటాం' అనే వ్యక్తితో ఎలా వ్యవహరించారో శ్రీ వేణుగోపాలరెడ్డి చెపుతుంటే ఆసక్తిగా చదివాము. రెడ్డి హుందాతనం విశిష్ట గుణసంపదా – ఆలోచనా విధానం పాఠకుల్ని ముగ్ధులను చేశాయి… ప్రతి రచనా అద్భుతం. ఆనందాన్ని కలిగిస్తున్నాయి. తొలి నాటకకర్తకి నా వందనాలు…."




*– చెరుకువాడ వెంకట్రామయ్య, విస్సాకోడేరు*

✧ "…. **మిసిమి** అక్టోబర్–2017 సంచికలో *ముక్త్యాల సంస్థానాధీశులు* వ్యాసంలో 'ఆర్ష రసాయనశాల ద్వారానూ ప్రజలకు ఉచిత సేవలందించారు. వారి ఆర్ష రసాయన శాలలు ప్రముఖ పట్టణాలలో ఉండి ప్రజలకు అందుబాటులో ఉంచి తమ బాధ్యతను నిర్వహించారు' అని రాశారు. అవును, రాజావారితోపాటు వేటూరి మొదలైనవారు ఆ ప్రాంతాల్లో లభించిన ఎన్నో శిలాశాసనాలను సేకరించి కోటలో ఓ మూలగా పడవేశారు. వారు అలా సేకరించి ఆ శిల్పాలను ప్రజలు దర్శించడానికి వీలుగా ఓ ఏర్పాటు చేయాలనుకుని సేకరించిన విలువైన శిల్పాలు అవి! కానీ – వారి వారసులు ఆ శిల్పాలను అలా గాలికి వానకు వదిలివేయడం బాధాకరం. క్షంతవ్యం కాని విషయం. వారు స్వయంగా తమ నిర్వహణలో ఓ మ్యూజియం నిర్వహించవచ్చుగదా! అలా వీలు కాకపోతే ఆ శిలలను, శిల్పాలను నూతన రాజధాని అమరావతికి చేర్పించవచ్చుగదా! ఏదీ చేయడానికి ఇష్టపడనివారికి తెలుగుజాతికి చాలా నష్టం చేకూర్చినవారిలా చరిత్రలో భావించబడతారు. గమనించకోర్తాను…"

*– గుడిపూడి సుబ్బారావు, సూర్యాపేట*

✧ "…. స్వాతంత్ర్యోద్యమంలో రాజకీయ, సామాజిక కార్యక్రమాలలో డప్పు ప్రాముఖ్యత చాలా గొప్పది. అలాగే గద్దర్ పాటలలో, తెలంగాణా రాష్ట్ర సాధనలో ఊరూరా మారుమ్రోగిన కార్యక్రమాలలో డప్పు ప్రముఖపాత్ర వహించింది…"

*– టి.వి. ప్రసాద్, నల్లగొండ*

శ్రీకృష్ణ


వి.ఎ.కె.రంగారావు,

కేరాఫ్ ఎల్.మహేష్ కుమార్

1ఏ, ఈస్‌డేల్ ఎన్‌క్లేవ్, 111/2,

స్టెర్లింగ్ రోడ్డు, చెన్నై - 600034

సెల్ : 94447 34024.




వి.ఎ.కె. రంగారావు

**మిసిమి** సంపాదకులకు

తేది : 1-12-2017

మహాశయా,

నవంబరు సంచికను నాట్యంతో నింపినందుకు మీకు అభివాదము. వ్రాసిన వారికి అభినందన.

నేను చెప్పవలసినవి.

1. ఒడిసీకి సంబంధించిన బాలురను 'గోటిపుఆ' అనాలి. 'గోట్టీపున' కాదు (పుట 14).

2. హస్తము 'కపిత్థము'. 'కవిద్ధము' కాదు (పుట 16).

3. 'బిటు' నృత్యము కాదు 'బటు' (పుట 17)

4. 'మధురానగరి' యింకా 'కులములోన గొల్లదాన', 'మావల్ల కాదమ్మ దేవీయశోదా!' పాటలను ఆ వాగ్గేయకర్త చిత్తూరు సుబ్రమణ్యం గోపికా గీతాలన్నారు. అయితే అవి ఛందస్సులో జావళీలే. (పుట 62)

5. 'సరసుడా' పాటను "ప్రియురాలు" చిత్రంలో సాని వేషధారి కనకం పాడింది, ఆడింది మేజువాణి పద్ధతిలో. 'భల్లమాని' కాదు 'భల్లమూని!' (పుట 66)

6. 'శివదీక్షా' మూడవ చరణంలోనే తెలుస్తుంది అది కృష్ణునిపై (మన్నారు రంగా! అన్న సంబోధనతో) నిందాస్తుతి అని. 'పని' జరిగిపోయిందని ఆ రచనలో లేదు (పుట 67)

7. 'అపుడు మనసు' ఒక స్త్రీ తన తోటి స్త్రీతో చెబుతున్నది కాబట్టి 'కలవాడైన' కాదు 'కలవారైన' (స్త్రీ లెటువంటి సమర్థులైనా తగిన పురుషుడు తారసపడితే నిలువరించుకోగలరా' అన్నది ప్రశ్న).

నేను గర్భంలో వున్నప్పుడే యింటికి వచ్చి నన్నాశీర్వదించినది బెంగళూరు నాగరత్నమ్మ.

మూడేళ్లప్పటి నుంచే నాట్యాన్ని చూపింది బొబ్బిలి వేణుగోపాలుని సేవకి, బొబ్బిలి ఆస్థాన నర్తకి గడ్డిభుక్త సీతారాం. పాతికేళ్ల వయసులో దేశాది మధ్యాదితాళాల మర్మం తెలిపింది విజయనగరానికి కీర్తి తెచ్చిన కళావర్ రింగ్.

ఇందరు సానుల గరిడీలలో సాము చేసిన వాడిని. జావళీల గురించి ఎవరూ వ్రాయని విషయం మీకు వ్రాయమంటారా? ఒకరిని నొప్పించే విషయాలుండవు. వాటికి సాని ఊపిరే ప్రాణవాయువని ఒప్పించే సుద్దులుంటాయి!

ఇట్లు

వి.ఎ.కె.రంగారావు




# సప్త సహోదరీల ప్రాంతం ఈశాన్య భారతం

*– ముకుంద రామారావు*

భారతదేశపు ఈశాన్య ప్రాంతంలోని – అస్సాం, అరుణాచల ప్రదేశ్, మిజోరాం, మణిపూర్, నాగాలాండ్, మేఘాలయ, త్రిపురలను సప్తసహోదరిల ప్రాంతంగా పిలుస్తారు. స్వాతంత్ర్య సమయానికి ఆ ప్రాంతంలో – అస్సాం, రాజవంశీక రాష్ట్రాలైన మణిపూర్, త్రిపుర – ఈ మూడు రాష్ట్రాలే ఉండేవి. భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాక, అక్కడ మరో నాలుగు రాష్ట్రాలు – 1963లో నాగాలాండ్, 1972లో మేఘాలయ, 1987లో మిజోరాం, అరణాచల ప్రదేశ్‌లు చేరాయి. ఈ ప్రాంతానికి సప్తసహోదరీల ప్రాంతం అని పిలవడానికి అనేక కారణాలున్నాయి. వాటిల్లో ముఖ్యంగా వాటిమధ్య ఉన్న అన్యోన్యాశ్రయ సంబంధం, భారతదేశానికి విడిగా ఉన్నట్టున్న ఆ రాష్ట్రాలన్నింటికీ వెళ్లాలంటే ఉన్న ఒకే ఒక్క దారి పశ్చిమ బెంగాలులోని సిలిగురి నడవ ద్వారా వెళ్లే మార్గం, చికెన్స్ నెక్ అనబడే కోడిమెడలాంటి త్రోవ. బంగ్లాదేశ్‌తో చుట్టుముట్టబడి, విదేశంలో ఉన్న స్వదేశ భాగం త్రిపుర. రవాణాకోసం పూర్తిగా అస్సాం మీద అధారపడ్డ రాష్ట్రం. మిజోరాం, మణిపూర్‌కి, అస్సాంలోని బరక్‌వేలీ గుండానే భారతదేశంతో సంబంధం. అస్సాంలోకి పరుగులెత్తే నదులు అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్‌లో ఆవిర్భవించినవే. అస్సాం ప్రభుత్వ పౌరపరిపాలకుడు జ్యోతి ప్రసాద్ సైకియా మొట్టమొదటిసారిగా, ఆయా రాష్ట్రాల మధ్య ఉన్న దగ్గరితనాల మూలంగా ఈ నామకరణం చేసారు. ఆ పేరే బాగా స్థిరపడిపోయింది. 1975లో రాచరికపు వ్యవస్థని రద్దుచేసి, భారతదేశపు 22వ రాష్ట్రంగా స్వీకరించాక, ఈ సప్త సహోదరీల ప్రాంతానికి, ఒకే ఒక్క సోదరుడుగా ఈశాన్య రాష్ట్రాల సరసన సిక్కిం చేరింది. ఈ ఎనిమిది ఈశాన్య రాష్ట్రాలకు, అంతర్జాతీయ దేశాలైన చైనా, భూటాన్, నేపాల్, మయన్మార్, బంగ్లాదేశ్ ల్లో ఏదో ఒకదానితోనైనా సరిహద్దులుండటం ఒక విశేషం.

ఈశాన్య భారతదేశం, ఈశాన్య భారత మానవ పరిణామ శాస్త్రసంగ్రహాలయం. సుమారు 400 భాషలు మాండలికాల, 70 వరకూ బృహత్ వర్గాల, ఉప వర్గాల ప్రాంతం, విభిన్న జాతుల ప్రజల సమ్మేళనం. వివిధ సంస్కృతుల, భాషల, మతాల మిశ్రమం. అక్కడ ఆంగ్లేయులు ప్రవేశించేవరకూ, ప్రాచీన లేదా మధ్యయుగానికి చెందిన భారతదేశ చరిత్రలో ఈ ఈశాన్య దేశాల ప్రస్తావన అంతగా ఎక్కడా కనపడదు. 19వ శతాబ్దం చివరికి బెంగాలు బర్మా మధ్యనున్న ఈ ప్రాంతాన్ని ఆంగ్లేయులు ఆక్రమించి, భారతదేశ సంస్థానాల్లో భాగం చేశారు. ఆంగ్లేయులు వదిలి వెళ్లిన తరువాత, వారి పరిస్థితి ప్రశ్నార్థకమయింది. తూర్పు బెంగాల్, తూర్పు పాకిస్తాన్ అయ్యాక ఈ భూభాగం పూర్తిగా ఏకాకిగా మారినట్టయింది. ఉత్తర బెంగాలులోని 14 కిలోమీటర్ల విశాలమైన నడవ ఒక్కటే భారత భూభాగంతో ఆ ప్రాంతాన్ని అంటించి వేలాడదీసినట్టు ఉంచగలిగింది. ఒక విధంగా అది ఆ ప్రాంతాన్ని భారత భూభాగంలో ఏకాకిగా వదిలేసిన, భిన్నమైన భావనలో ఇప్పటికీ ఉంచుతోంది. ఆ కారణంగా ఈ కీలకమైన ప్రాంతం అనేక రకాల తిరుగుబాట్లతో దక్షిణ ఆసియాలో అత్యంత కల్లోల ప్రాంతంగా తయారైంది. వేర్పాటు

వాదాలు, స్వయంపాలన, నిరంతర వలసవాదుల చొరబాట్లు, వనరుల దోపిడీ, తీవ్రవాదం, జాతి-భాషా పరమైన సంఘర్షణలతో ఈ భూభాగం ఎక్కడో ఒక చోట నివురుగప్పిన నిప్పులా ఉంటూనే ఉంది.

సామాజిక-రాజకీయ అస్థిరత, ఆర్థిక వెనకబాటుతనం, వేరుపర్చిన భావన, సులువుగా అక్కడకు పోలేనితనం వగైరా అక్కడి సమస్యల్ని జటిలంగానే ఉంచుతున్నాయి. రమారమి 272 వరకూ గిరిజన తెగలున్నాయి, అస్సాం మణిపూర్ లాంటి ప్రాంతాల్లో గిరిజనేతరులు కూడా అధికంగానే ఉన్నారు. ప్రపంచంలోనే బహుశా రణప్రియులైన బృందాలు పుట్టగొడుగుల్లా అధికంగా పుట్టుకొచ్చే ప్రాంతం కూడా ఇదే. 30కంటే ఎక్కువగా తీవ్రవాద బృందాలు, అక్కడ తమ కార్యక్రమాలు కొనసాగిస్తున్నాయని చెబుతారు. 1960లో మిజోల తిరుగుబాటు, 1970 చివర్లో ఉలా (అస్సాం సంయుక్త విమోచన సంఘటన)లాంటివి ఎన్నో వాటి అస్తిత్వాన్ని రుజువు చేశాయి. భూభాగాల, వనరుల పంపిణీ విషయంలో గిరిజన తెగల మధ్య కూడా ఘర్షణ వాతావరణం ఉంటూనే ఉంది. అరుణాచల్‌ప్రదేశ్‌లాంటి తక్కువ సమస్యలున్న ప్రాంతంలో కూడా ఇటీవల తీవ్రవాద శక్తుల ప్రాబల్యం పెరుగుతోంది. దానితో ఈ ప్రాంతాన్ని తిరుగుబాటుశక్తుల హృదయ స్థావరంగా ఎవరైనా భావిస్తారు.

సాహిత్యం విషయానికొస్తే, ఈశాన్య ప్రాంతానిది కేవలం సంఘర్షణ ప్రధానమైన సాహిత్యమే కాదు, అనేక ఇతరాలు కూడా ఉన్నాయి. సహజంగానే అక్కడి అద్భుతమైన ప్రకృతి (అనుబంధం, అందం, దాని విధ్వంసం) కూడా, అక్కడి సాహిత్యంలో అధిక భాగం ఆక్రమిస్తుంది. ఎంత విభిన్నంగా ఉన్నా, వారిలో ఉమ్మడి లక్షణాలు అనేకం కనిపిస్తాయి. ప్రాంతీయ అస్తిత్వం, సాంస్కృతిక మూలాలు, గతవైభవం, తాముంటున్న కాలపు వాస్తవికత, ఇవన్నీ వారి కవిత్వంలో బలంగా వేళ్లూనికుని ఉన్నాయి. అవే వారి కవిత్వానికి ఒక ప్రత్యేక లక్షణాన్ని ప్రసాదిస్తున్నాయి. సామాజిక రాజకీయ కవిత్వంతోబాటు, తాముంటున్న కాలంలో ఎదురయ్యే సంఘటనలకు, తక్షణ స్పందనగా బలమైన ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తున్న కవిత్వం కూడా ఎప్పటికప్పుడు వస్తూనే ఉంది. అక్కడ జరిగిన అనేక సాంస్కృతిక సంఘర్షణలు - భక్తి ఉద్యమంతో మొదలుకొని, సంస్కరణ ఉద్యమాలు, వలసపాలన ప్రభావాలు, క్రైస్తవ మతబోధకుల కార్యకలాపాలు, ఆంగ్ల భాష విస్తరణ, పశ్చిమ దేశాల ఆధునికతలాంటివన్నీ అక్కడి కవిత్వంలో ప్రతిబింబిస్తాయి. అస్సాం అసోమియాలు, త్రిపుర బెంగాలీలు ఆధిపత్యంగల ఇండో ఆర్యన్ కుటుంబానికి చెందినవారైనా, అక్కడ కూడా స్థానికులుగా భావించే ఆదివాసులు ఉన్నారు. వారి అసంతృప్తి ఎప్పుడెలా పరిణమిస్తుందో తెలియదు. అసోమియాకు, మణిపురీకి, త్రిపుర బెంగాలీలకు వారిదైన లిపి, సాహిత్యం 15వ శతాబ్దం కాలం నుండీ ఉన్నాయి. కానీ ఇతర ప్రాంతాల, భాషలకు 19వ శతాబ్దం వరకూ లిపి కూడా లేకపోవడంతో వారి లిఖిత సాహిత్యం బొత్తిగా ఇటీవలది, కొత్తది. అప్పటికే ప్రచలితంగా ఉన్న, వారికి అనుకూలమైన లిపినే వారు ఎన్నుకున్నారు, వాడుకుంటున్నారు. ఉదాహరణకు అస్సాంలోని, బోడా భాషని అసోమియాలోనూ, దేవనాగరిలోను, రోమన్ లిపుల్లో రాస్తున్న వారున్నారు. అలాగే త్రిపురలోని కక్-బరక్ భాషని కూడా బెంగాలీలోనూ, దేవనాగరిలోను, రోమన్ లిపుల్లో రాస్తున్నారు. అస్సాం, మణిపురి, త్రిపురలో సంస్కృతం, హిందీ, బెంగాలీ సాహిత్య మూలాలు ఉన్నాయి. కానీ ఆదివాసుల ప్రాంతాల్లో క్రైస్తవ మత వ్యాప్తి మూలంగా, ఆంగ్ల భాషా సాహిత్యాల ప్రభావం వారిమీద ఉంది. అటువంటి ఈశాన్య భారతంలో వైశాల్యంలోను ఇతరత్రా కూడా పైమెట్టుమీద ఉన్న, అస్సాం - అక్కడి భాష, చరిత్ర, కవిత్వ విశేషాలను ముందుగా తెలుసుకుందాం. ఆ తరువాత శతాబ్దాలుగా సాహిత్య మూలాలున్న మణిపూర్, త్రిపుర కవిత్వాల్ని చూద్దాం. ఈ మూడు రాష్ట్రాలకు భిన్నంగా ఉన్న మిగతా ఐదు (మిజోరాం, మేఘాలయ, అరుణాచల ప్రదేశ్, నాగాలాండ్, సిక్కిం) ఈశాన్య ప్రాంతాల్ని చివరగా పరిశీలిద్దాం.

**ఈశాన్య ప్రాంతంలో మౌఖిక సాహిత్యం:**

వందలకొద్దీ గిరిజన తెగలున్న ప్రాంతంలో సహజంగానే మౌఖిక సాహిత్యం ఉంటుంది. అయితే

ఏ తెగలవారైనా మాట్లాడుకునే భాషలకు సాహిత్యం, వ్యాకరణం, లిపి లేనందువల్ల, ఆ భాషలను మాండలికాలుగా సరిపుచ్చుకుంటున్నాం. అయితే ఆ భాషలకు రాతపూర్వకమైన సంప్రదాయం లేకపోయినా, మౌఖిక సంపద ఉండకపోదు. వాటిని సేకరించక పోగొట్టుకున్నవీ ఉన్నాయి, సేకరించి మిగిలినవీ ఉన్నాయి. అసంఖ్యాక పిల్లవాగులు, ఉపనదులని తమతోబాటు తీసుకుపోతున్న నదుల్లా, ఆయా ప్రాంత సాహిత్య నదులు కూడా అక్కడి అప్పటి జాతి సంస్కృతుల సంక్షోభాల్ని, వ్యయప్రయాసల్ని, ఆనంద విషాదాల్ని తమతో కలుపుకుని ప్రవహిస్తూనే ఉన్నాయి. మాటను పాటను నమోదు చేసుకుందుకు శతాబ్దాలక్రితం ఏ విధమైన ధ్వని యంత్రాలు లేవు. వాటిని నిక్షిప్తం చేయడానికి ఒకే ఒక్క సాధనం రాత లిపి. అయితే ఆ భాషను నమోదు చేసేందుకు రాత లిపి కూడా లేనప్పుడు, వాటిల్లో మనస్సుకు హత్తుకునే భావాల మూలంగా, ఒకరి నుండి ఒకరికి జ్ఞాపకాల ద్వారా వచ్చినదే ఏ కొంతో మౌఖిక సాహిత్యం దొరికింది. ప్రపంచ సాహిత్యంలో కూడా, అలా దొరికినవాటిల్లో గ్రీక్ హోమర్, ఫిన్నిష్ కలవెల, సుమేరియా/బాబిలోనియన్ల గిల్గమెష్‌లాంటి మహాకావ్యాలు లేకపోలేదు. శతాబ్దాలుగా తరతరాల్లో వాటిల్లో ఎన్ని కొత్త చరణాలు కలిశాయో, రానురాను ఎన్ని అద్భుతమైన చరణాలు పోయాయో ఎవరికీ తెలీదు. దొరికిందే అంత గొప్పగా ఉంటే అసలు మూలం ఎంత గొప్పగా ఉండి ఉంటుందో కదా అని సంబరపడటం వినా చేయగలిగేదేముంది.

మౌఖిక సాహిత్య ప్రక్రియలో – జానపద కథ, జానపద రూపకాలు, పురాణ గాథలు, పాట, పాటల్లో – కీర్తించేవి, శ్రమ గీతాలు, ఐతిహాసిక చారిత్రిక గానాలు, సామెతలు, పొడుపు కథలు మొదలైనవ ఎన్నో ఉంటాయి. గుర్తించుకుందుకు వీలుగా అవి శ్రావ్యంగా లయబద్ధంగా పాటల రూపంలోను, కొంత నాటకీయ రూపంలోనూ ఉంటాయి. దాని మూలంగా వాటి కథనం మరింత ఆసక్తికరంగాను ఆహ్లాదకరంగాను ఉంటుంది. ఆ కథనాత్మక శైలితో ఆ యా గిరిజన తెగల గుర్తింపుతోబాటు, వారి చరిత్ర కూడా తెలుసుకుందుకు వీలవుతుంది. వారి గతాన్ని పునర్నిర్మించుకునేందుకు కూడా అది దోహదపడుతుంది. నిజానికవి వారికి తెలియని అమూల్య భాండాగారాలు. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి రాత రూపంలో నమోదుచేసి వాటిని సేకరించినా, ఆ సేకరణ పురుషులే చేయడాన్ని స్త్రీల విషయంలో న్యాయం జరగలేదన్న విమర్శ కూడా ఉంది. ఆ కారణంగానే నాగాలాండ్ కి చెందిన కవయిత్రి తెంసుల ఆవో, అరుణాచలప్రదేశ్‌కి చెందిన కవయిత్రి మమంగ్ దాయిలాంటి కవయిత్రులు వారిదైన పద్ధతిలో గిరిజన సాహిత్యాన్ని నమోదుచేసే పనిలో ఉన్నారు. రివాజులకు క్రతుకాండకు సంబంధించిన వాటిని నమోదు చేసేందుకు ఒప్పుకోని తెగలు కూడా ఉన్నాయి.

అధిక సంఖ్యాకుల మధ్య అల్ప సంఖ్యాకుల కలిసి జీవించే క్రమంలో, కొన్నాళ్లకు అధిక సంఖ్యాకుల భాషే, అల్ప సంఖ్యాకుల భాష కావడం ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా చూస్తూనే ఉన్నాం. ఈశాన్య ప్రాంతం అందుకు మినహాయింపు కాదు. వారి అస్తిత్వాన్ని కాపాడుకుందుకు అధిక సంఖ్యాకుల భాషా లిపిని వాడుకుని, వారి భాషను బ్రతికించుకుందుకు ప్రయత్నాలు సాగినా, జీవనోపాధి దృష్ట్యా వారి ఇళ్లల్లో సైతం మాతృభాషని మాటాడలేని పరిస్థితుల్లో కొన్ని భాషలు ఇంకా ఏదో కొనఊపిరితో మాత్రమే కొనసాగుతున్నాయి. మౌఖిక సాహిత్యం ఎన్ని నోళ్ళు మారుతూ వచ్చిందో ఎంత అపభ్రంశమయిందో అని, ఎవరెంత మార్చేసారో అని, మూలం ఎంతగా చెడిపోయిందో అని రకరకాల సంశయాలతో సేకరించినది సేకరించినట్టుగా నమోదు చేసుకోడానికే ఇష్టపడని పక్షంలో మిగిలిన ఆ కొంతకూడా పూర్తిగా పోగొట్టుకునే వాళ్లం. సేకరించే వారి లక్ష్యానికి అవేవీ అడ్డు రాలేదు కావునే ఈ రోజు అప్పటి అద్భుత సంపద సాహిత్య ప్రపంచానికి దొరికింది.

గిరిజనులనుండి ఒడిసి పట్టుకున్న కొన్ని మౌఖిక కవిత్వాల్ని కూడా ఈ వ్యాసంలో చూడొచ్చు.

* * *

**అస్సాం:**

బ్రహ్మపుత్రా నదిని పర్యవేక్షిస్తున్నట్టున్న నీలాచల్ కొండలతో, ఈశాన్య భారత దేశానికి ప్రవేశద్వారం అస్సాం.

అనేక గిరిజన తెగల, సమాజాల ప్రాంతం. కనీసం 66 గిరిజన తెగలున్నాయని ఒక అంచనా. అస్సాంలో ప్రధానమైన భాషలు రెండు. ఒకటి అసోమియా, రెండవది బోడో. కర్బి, మిషింగ్, రభ లాంటి ఇతర భాషలున్నా, సంఖ్యాపరంగాగాని, సాహిత్యపరంగాగాని, అవి అంతగా ప్రాముఖ్యత సంతరించుకోలేదు. అయితే అక్కడ కూడా వారి వారి భాషల్ని పదిలపరచుకోవాలని, ఇతర భాషల ముందు వెనుకంజలో ఉండకూడదన్న అకాంక్ష ఆ యా సమాజాల్లో రానురాను బలపడుతూనే ఉంది. ఫలితంగా మున్ముందు ఆ భాషలు కూడా సాహిత్యంలో తమ తమ స్థానాన్ని సుస్థిరపర్చుకునే అవకాశాలు లేకపోలేదు.

**అసోమియా కవిత్వం:**

*చరిత్ర – భాష – నేపథ్యం:* ఉత్తరాన – భూటాన్, అరుణాచలప్రదేశ్, తూర్పున – నాగాలాండ్, మణిపూర్, దక్షిణాన మిజోరాం, త్రిపుర, పశ్చిమాన – బంగ్లాదేశ్, మేఘాలయ, పశ్చిమ బెంగాల్, అస్సాం రాష్ట్రానికి సరిహద్దులు. పొరుగు రాష్ట్రాలైన అరుణాచలప్రదేశ్, నాగాలాండ్, మేఘాలయ, మిజోరాం ఒకప్పుడు అస్సాం రాష్ట్రంలోనివే. అస్సాం అన్న పేరు అంతరించిపోయిన ఒకప్పటి భాష అహొూం నుండి తీసుకున్న పదం. "అసమ" అంటే అసమానమైన లేదా సాటిలేనిదని, "అపరాజిత" అని, సమతల ప్రదేశం కావున "అసమ" అని వివిధార్థాలు ప్రాచుర్యంలో ఉన్నాయి. అక్కడి మూల భాష అసోమియా, లేదా అహోమియా. అసోమియా భాష ఇండో ఆర్యన్ భాషా కుటుంబానికి చెందినది. సంస్కృత భాష నుండి 7వ శతాబ్దం నాటికే రూపొందిన భాష అసోమియా. నిజానికి పాళీ సంస్కృత భాషల మూలంగా తయారైన మాగధి ప్రాకృతం నుండి వచ్చిన భాష ఇది. అసోమియా తరువాత అస్సాంలో ఎక్కువగా మాట్లాడే భాషలు బోడో, బెంగాలీ. ఇవికాక అనేక ఇతర భాషలు కోచ్, కచార్, లాలుంగ్, దిమక, మిషింగ్, కర్బి, రభ, తివ లాంటివి కూడా అక్కడ ఉన్నాయి. సంస్కృతానికి బదులు వాడిన లిపి అసోమియా లిపి. 5వశతాబ్దం నుండి మొదలై 17వ శతాబ్దానికి ఒక రూపాన్ని సంతరించుకుని, బెంగాలీ వర్ణమాలలో స్థిరపడింది. అసోమియాలో అక్షరాలు 52, అచ్చులు 11, హల్లులు 41. బెంగాలీ కంటే ఒక అక్షరం/హల్లు (వ అక్షరం) ఎక్కువ. చరిత్రకారుల ప్రకారం మహాభారత కాలంనాటి విశాల సామ్రాజ్యమైన కామరూపలోనిది అస్సాం. అప్పటి ఆ సామ్రాజ్యం రాజధాని ప్రాగ్జ్యోతిషపురమే ఇప్పటి గౌహాతీ. ప్రాగ్ అంటే పూర్వ లేదా ప్రాచ్య, జ్యోతిష ఒక మెరిసే నక్షత్రం. అంటే బహుశా, ప్రాచ్య జ్యోతిశ్శాస్త్ర నగరం కావచ్చని చరిత్రకారుల అంచనా.

పాలా, కోచ్, కచారీ, చుతియాలాంటి వివిధ వంశీయులు అస్సాంని పరిపాలించారు. వారి మధ్య తరచు అంతర్యుద్ధాలు జరుగుతూ ఉండేవి. ఆ పరిస్థితి 13వ శతాబ్దంలో అహోంలు మైనామార్ ప్రాంతం నుండి వచ్చి, అక్కడ తమ ఆధిపత్యాన్ని నెలకొల్పే వరకూ కొనసాగింది. సముద్రగుప్తుడి సమకాలికుడైన మహారాజాధిరాజ్ పుష్య వర్మన్ {(క్రీ.శ. (350–380)}, తరువాత భాస్కర్ వర్మన్ {(క్రీ.శ.(594–650)}, హర్షవర్ధన్ {క్రీ.శ.(606–648)} కాలాల్లో ఆ ప్రాంతంలో నిలకడని, శాంతిని తీసుకురాగలిగారు. 15వ శతాబ్దంలో అప్పటి అహోం రాజులే ఆ ప్రాంతానికి అహోంగా నామకరణం చేసారు.

**కవిత్వ – నేపథ్యం:** అసోమియాలో 8వ శతాబ్దం నుండి 13వ శతాబ్దం వరకూ బౌద్ధ గ్రంథాలు వెలువడ్డాయి. బౌద్ధ ధర్మాన్ని చర్చించే "చర్యపద" ఆ విధంగా అసోమియా భాషలోని ప్రథమ సాహిత్య ప్రక్రియగా చెప్పుకోవచ్చు. అసోమియాలో 13వ శతాబ్దం దుర్లభ నారాయణుని ఆస్థాన పోషణలో, సాహిత్య లతకు అల్లుకుందుకు ఒక పట్టు దొరికింది. ఆ శతాబ్దంలో సంస్కృత పద్ధతిలో హేమా సరస్వతి రాసిన ప్రహ్లాద చరిత్ర, హరిహర కవి రచించిన బభ్రువాహనార్ యుద్ధ, లవకుశర్ యుద్ధ మొదలైనవి ప్రసిద్ధి చెందాయి. అయితే ఎక్కువగా అవి ధార్మికం, వచన రూపంలో ఉన్నవే. అవి కూడా సంస్కృత పురాణాల నుండి తీసుకున్నవి. వ్యక్తిగత అనుభూతులకు సంవేదనలకు తావులేనివి. 14వ శతాబ్దపు మాధవ్ కందాలి, ప్రజల భాషలో అనువాదం చేసిన సప్తకంద రామాయణం వారి మొదటి కావ్యం. అదే కాలానికి చెందిన కీర్తన ఘోష, భక్తి ప్రదీపలాంటి గీత కావ్యాలు రాసిన మరో గొప్ప కవి, రుషి, వైష్ణవ ప్రచారకుడు, శంకర్దేవ్ (1449–1469)

ఆ అనువాదాన్ని ఎంతగానో కీర్తించారు. శంకరదేవుని భాగవత పురాణం, మన తెలుగువారి పోతన భాగవతంలా మక్కువతో, భక్తితో ప్రజలు ఇప్పటికీ పఠిస్తున్నారు. ఈ భాగవతానువాదం అసోమియా కవిత్వానికి ఒక విధంగా పునరుజ్జీవనం కలిగించిందనే చెప్పుకోవచ్చు. అతని శిష్యుడు మాధవదేవ్ (1489–1596) కూడా గురువుగారి కీర్తనల్ని ప్రచారం చేయడమే కాకుండా స్వయంగా హిందూ తాత్విక ధర్మాల్ని మిళితం చేసిన గీతాల్ని అద్భుతంగా రాశారు. అప్పటి కూచ్ బిహార్ రాజు నరనారాయణ్ దగ్గరి ఆస్థాన కవి రామసరస్వతి మహాభారతాన్ని అనువాదం చేసారు. అప్పటి అహోమియా రాజులు కూడా సాహిత్యంపట్ల అభిరుచితో అన్ని విధాలా సాహిత్యానికి ప్రోత్సాహాన్నీ అందించారు. 16వ శతాబ్దం 19వ శతాబ్దానికీ మధ్య కాలంలో పురాణేతిహాసాలు, పురాణాలు, కథాకావ్యాలు అనేకం అనువాదం చేసుకున్నారు. 1817లో పొరుగున ఉన్న బర్మా అసోమియాపైకి దండెత్తి, 1821 నుండి 1825 వరకూ పాలించింది. 1650 నుండి 1826 వరకూ వైష్ణవానంతర సాహిత్యంగానే చెప్పుకోవచ్చు. ఆ తరువాత బ్రిటీష్ హయాంలో 1826 నుండి 1947 వరకూ ఉన్నంత కాలమూ, ఈ వైష్ణవ సాంప్రదాయపు సాహిత్యంతో బాటు ఆంగ్ల సాహిత్య ప్రభావం, దేశభక్తి పూరిత సాహిత్యం ఆ ప్రాంతంలో చాలావరకు కొనసాగింది ఆంగ్లేయులు 1836 నుండి 1882 వరకూ పరిపాలనా వ్యవహారాలకు బెంగాలీని మాధ్యమంగా వాడటంతో సహజంగానే అక్కడి స్థానీయుల్లో వ్యతిరేకత మొదలైంది. అస్సామీయులు వారి మాతృభాషని కాకుండా బెంగాలీలో చదువుకోవడం వారు జీర్ణించుకోలేకపోయారు. అక్కడి విద్యార్థులు దానికి వ్యతిరేకంగా జరిపిన పోరాటంతో ఆంగ్లేయులు బెంగాలీ మాధ్యమం పొరపాటును సవరించుకోక తప్పలేదు. దాని మూలంగా ఆ భాషకు జరిగిన నష్టం నుండి తేరుకుందుకు కూడా వారికి కొంత సమయం పట్టింది. ఆ కాలాన్ని వారు అసోమియా సాహిత్యంలో చీకటి రోజులుగా చెప్పుకుంటారు.

అమెరికా బాప్టిస్ట్ మిషన్ మూలంగానే అసోమియాలో కొత్త కవిత్వానికి బీజాలు పడ్డాయి. హానికారకమైన నల్లమందు మీద వచ్చిన మొదటి కవితతోనే అది ప్రారంభమయింది. భోలానాథ్ దాస్ (1858–1929), కమలాకాంత భట్టాచార్య (1853–1936), రమాకాంత చౌధురీ (1846–1889) కాల్పనిక కవిత్వాన్ని ముందుగా ప్రవేశపెట్టారు. ఆ సమయంలోనే కలకత్తాలో పై చదువులు చదువుకుందుకు వెళ్లిన లక్ష్మీనాథ్ బెజ్బరువ (1864–1938), చంద్రకుమార్ అగర్వాలా (1867–1938), హేమచంద్ర గోస్వామి (1872–1928)లు కలిసి, 19వ శతాబ్దపు పాశ్చాత్య కాల్పనిక వాదాన్ని ప్రవేశపెడుతూ 1889లో జొనకీ (వెన్నెల) పేరుమీద *అసోమియా* మాసపత్రికని స్థాపించి, అసోమియా ఆధునిక కవిత్వానికి శ్రీకారం చుట్టారు. వారు ముగ్గురూ ఒకవిధంగా అసోమియా కవిత్వానికి ఆధునిక కవిత్రయంలా పనిచేశారు. పాశ్చాత్య ప్రభావంతో అంత్యప్రాసలు లేని వచన కవిత్వమే కాకుండా, ఆంగ్ల కవితల అనువాదాల్ని సైతం వారు ప్రవేశపెట్టారు. జాతీయోద్యమం, దేశభక్తి, ప్రకృతి ప్రేమలాంటివి విరివిగా కవిత్వంలో చోటుచేసుకోవడం అప్పటినుండీ మొదలయింది. నూతన సంవత్సరం సందర్భంగా పాడుకునే బిహూ పాటలకు కొత్త రూపాల్ని సమకూర్చుకున్నారు. జొనకి అనేక కవిత్వ పత్రికలకు మార్గదర్శి అయింది. *బిజులీ, ఉషా, బణి, ఆలోచన, చేతన, మిలన్, సాధన, అసోన్ హిత్యిసి, ఆవ్హాన్* లాంటి పత్రికలు అప్పటి ప్రసిద్ధ కవుల సంపాదకత్వంలో వెలువడ్డాయి. ఆనందచంద్ర ఆగర్వాల (1874–1940) కవిగాకంటే అనువాదకుడుగా ఆంగ్ల సాహిత్యాన్ని అసోమియా పాఠకులకు అతి దగ్గరగా తీసుకుపోయారు.

ఆ తరువాత వచ్చిన కవులలో – కాల్పనికవాద కవిత్వంతో గీతమాలికలను అద్భుతంగా రాసిన హితేశ్వర్ బర్బరువా (1876–1939), ప్రకృతి మార్మికత, భారతీయ భావనతో రఘునాథ్ చౌధురీ (1879–1966), మార్మిక తాత్విక చింతనతో దుర్గేశ్వర్ శర్మ (1882–1961), ఆత్మాశ్రయ కవిత్వం ఉమర్ ఖయ్యాం రుబాయీల అనువాదాలతో జతీంద్రనాథ్ దువారా (1892–1964), వేదాంత మార్మికతతో కవయిత్రులు ధర్మేశ్వరి దేవి బరువని (1892–1960), శైలాధర్ రజకోవా (1892–1968)

కవిత్వంలో సంగీతం మేళవించి, మరింత లోతైన భావకవిత్వంతో సూర్యకుమార్ భుయన్ (1894–1964), జాతీయవాద మార్మిక కవిత్వంతో కవయిత్రి నలినీబాల దేవి (1898–1978), ప్రకృతి పట్ల మార్మిక కవిత్వ భావనతో దింబేస్వర్ నియోగ్ (1899–1966), ప్రముఖ కవి, పాటల రచయిత, చలనచిత్ర నిర్మాత జ్యోతిప్రసాద్ అగర్వాలా (1903–1951), ప్రథమ కవిత్వ సంపుటితో బొకుల్ బొనర్ కవిగా ప్రసిద్ధుడైన పద్మశ్రీ గ్రహీత ఆనంద్‌చంద్ర బరువా (1907–1983), ప్రేమ కవిత్వంతో గణేష్ గొగోయ్ (1907–1938), ప్రత్యేకమైన ఉత్కృష్ట వచన కవిత్వంతో నీలమని ఫూకాన్ (1933–) అసోమియా కవిత్వంలో తమదైన పాత్ర పోషించారు.

పెట్టుబడిదారీ వ్యవస్థకు, సామ్రాజ్యవాదానికి, విరుద్ధమైన కవిత్వంతో అంబికాగిరి రాయ్ చౌధురీ (1885–1967), ప్రసన్నలాల్ చౌధురీ (1898–1986), రాబర్ట్ బ్రౌనింగ్ ని గుర్తుకు తెచ్చే దేవకాంత బారువా (1914–1996), దేశభక్తి ప్రేరణతో బినందచంద్ర బారువా (1901–1994), నిగూఢ కవిత్వంతో హేం బారువా (1915–1977), సయ్యద్ అబ్దుల్ మాలిక్ (1919–2000), నూతన వ్యక్తీకరణతో కొత్తతరాన్ని ప్రభావితంచేసి 1946 కలకత్తా మారణకాండలో మరణించిన అమూల్య బారువా (1922–1946), అప్పటి సామాజిక అలజడి, ఆర్థిక దోపిడీని ప్రశ్నిస్తూ కేశబ్ మహంత (1926–2006), నవకాంత్ బారువా (1926–2002), హరి బార్కకతి (1929–2006) మొదలైనవారు గొప్ప కవిత్వం రాశారు.

శోకకావ్యాల పునరుజ్జీవనోద్యమంలా ఆ తరువాత చాలామంది కవులు చేరారు. వారిలో ముఖ్యులు – నలినీధర్ భట్టాచార్య (1921–2016), బీరెంద్ర కుమార్ భట్టాచార్య (1924–1997), మహిం బోరా (1924–2016), ఆధునిక కవిత్వానికి ఆద్యులుగా భావించే నవకాంత్ బారువా (1926–2002), అజిత్ బారువా (1926–), మహేంద్ర బోరా (1929–); “మరణం కూడా ఒక కళ/ జీవితపు ధృఢమైన శిలలమీద/ నైపుణ్యంతో చెక్కిన శిల్పం” అన్న అతని చరణాల్ని అందరూ గుర్తుంచుకునేలా చేసిన గొప్ప కవి హిరెన్ భట్టాచార్య (1932–2012), నీలమని ఫూకాన్ (1933–), నిర్మలప్రభ బొర్దొలోయ్ (1933–2004), బిరెస్వర్ బరువా (1933–), మానవతావాది, అనువాదకుడు హిరెంద్రనాథ్ దత్త (1937–), భబెన్ బరువా (1939–), హరెక్రిష్ణ దేక (1943–), ఇందిరా గోస్వామి (1942–2011), కబిన్ ఫుకాన్ (1946–), అనిస్–ఉజ్–జమన్ (1947–), సనంత తంతి (1952), సమీర్ తంతి (1955–), అనుభవ్ తులసి (1958–), అనుపమ బసుమతరి (1961–), నీలిం కుమార్ (1961–) , బిపుల్ జ్యోతి సైకియా (1966–), జిబన్ నరహ్ (1970–), నితూ దాస్ (1972–), బిపుల్ జ్యోతి హేమంగ కుమార్ దత్తా (1973–), కమల్ కుమార్ తంతి (1982–), బిజయ్ శంకర్ బర్మన్ (1980–), నిబేదితా ఫుకాన్ (1980–) మొదలైనవారు సమకాలీన ఆధునిక అసోమియా కవిత్వంలో ముఖ్యులు. ప్రముఖ సంగీతకారుడు, గాయకుడు పద్మవిభూషణ్ భూపెన్ హజారికా (1926–2011) కూడా అద్భుతమైన కవి. చాలావరకు పాటలు తాను రాసుకున్నవే.

స్వాతంత్ర్యానంతరం వచ్చిన కవిత్వంలో రొబింద్ర సర్కార్ (1945–), బీరెస్వర్ బారువా (1931–), దినేశ్ గోస్వామి (1940–), భబెన్ బారువా (1941–), హెమెన్ బొర్గొహైన్ (1931–), దిలిప్ బారువా (1933–), తరున్ బారువా (1946–), నిరెన్ బారువా (1947–), బిరేశ్వర్ బారువా (1933–), ప్రేం నారాయణ్ నాథ్ (1956–), కవయిత్రి లుతొహినుం సెలిమ బేగం (1961–), కవయిత్రి అర్చన పుజారి (1961–), రాజీవ్ బారువా (1963–), మిథింగ దైమరీ (1967–), సౌరవ్ సైకియ (1969–) కూడా ముఖ్య భూమిక నిర్వహించారు.

బాగ్దాద్ నుండి వచ్చి అస్సాంలో స్థిరపడ్డ 17వ శతాబ్దపు సూఫీ సాధువు అజన్ ఫకీర్‌గా ప్రాచుర్యంగల హజ్రత్ షా మిరాన్, రచించిన కీర్తనలు జిక్రిస్‌గా అసోమియా సాహిత్యంలో మంచి స్థానం సంపాదించు కోగలిగాయి. ఖురాన్ పురాణాల సారాంశం ఒకటేనన్న బోధన ఆ కీర్తనల్లో చాలాచోట్ల కనిపిస్తుంది. ఈ సూఫీ గురువుకు సంబంధించి అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. వాటి ఆధారంతో అక్కడ “అజన్ పీర్ షా” పేరుమీద ఒక చలన చిత్రం కూడా రూపొందించబడింది.

ఈ కవుల్లో ఇప్పటివరకూ 15 మంది సాహిత్య అకాడమీ బహుమతులు పొందినవారున్నారు, వారు – జతీంద్రనాథ్ దువారా, అంబికాగిరి రాయ్ చౌధురీ, నలినీబాల దేవి, ఆనంద్ చంద్ర బరువా, భబెన్ బరువా, నీలమని ఫూకాన్, నిర్మలప్రభ బొర్దొలోయ్, హరేక్రిష్ణ దేక, అజిత్ బారువా, హిరేన్ భట్టాచార్య, కేశబ్ మహంత, బిరేస్వర్ బరువా, హిరేంద్ర నాథ్ దత్త, కబిన్ ఫుకాన్, రొబింద్ర సర్కార్.

**నవకాంత బారువా (1926–2002):** అసోమియా ఆధునిక కవిత్వానికి ప్రధానంగా ఎంతగానో దోహదం చేశారు. గొప్ప నవలాకారుడు కూడా. మానవతావాదం, జీవితామోదమూ వీరి కవిత్వంలో ప్రధానంగా కనిపిస్తాయి. లయాత్మక పదాలతో ప్రయోగాలు చేశారు. పదికిపైగా కవిత్వ సంకలనాలొచ్చాయి. వీరి సాహిత్య కృషిని గుర్తిస్తూ అనేక అవార్డులు అందుకున్నారు. వాటిల్లో – పద్మభూషణ్, సాహిత్య అకాడమీ అవార్డు, సోవియట్ లాండ్ నెహ్రూ అవార్డు ముఖ్యమైనవి.

**కొలతలు**

*సాయంత్రం అయింది ఇపుడు. / పద దర్జీల దగ్గరకు వెళదాం కొలతల కోసం. / ఛాతీ చేతులు భుజాల కొలత బొటనవేలు కొలత. / అరచేయి గుండె కొలతలు మనం ఇద్దాం.*
*పేగులు, ప్లీహం, కాలేయం, / ప్రేమ హార్మోన్ల లెక్క చెబుతాయి.*
*జీవితం కొలతలు మనం ఇద్దాం / దీనివి దానివి అనేక ఇతరాలవి / కేవలం కొలతలివ్వు / కుట్టడం సంగతి ఆ తరువాత ఆలోచిద్దాం / ప్రస్తుతానికి సరిగా కొలతలే ఇద్దాం / కొలతలే మనం ఇవ్వగలం / అంచనానే మనం వేయగలం / ఆత్మహత్యలు చెప్పుకునేటంత పెరిగాయని మనం నమోదు చేయగలం / ప్రసంగంలో అక్షరాల లెక్క ఇవ్వగలం రేబియాలో క్రైస్తవుల సంఖ్య చెప్పగలం / కుట్టడం సంగతి ఆ తరువాత ఆలోచిద్దాం / కేవలం కొలతలివ్వు ఆలోచన మాత్రం చేయ్ / మన తరువాత మరొకరెవరో కొత్తగా కొలుస్తారు / మన కొలతలన్నీ తప్పు అని తేలుస్తారు కొత్తగా వాళ్లు కొలతలు తీసుకుంటారు / ఎవరైనా మనిషికి యోగ్యమైన బట్ట ఎపుడు కుడతారు.*

**నీలమని ఫూకాన్ (1933–):**

ఫ్రెంచి ప్రతీకవాదంతో ప్రభావితమై అసోమియా కవిత్వంలో ప్రతీకవాదాన్ని అద్భుతంగా ప్రవేశపెట్టిన గొప్ప కవి. వీరి తొలి కవితల్లో ప్రతీకలు, భావచిత్రాలకంటే ఎక్కువగా రూపం మీద శ్రద్ధ కనబడుతుంది. ఆ తరువాతి కవితల్లో జీవితాన్ని లోతుగా అర్థం చేసుకున్న తీరు ఎక్కువగా ఉంది. 50 ఏళ్ల ప్రాయంలో కవిత్వం మొదలుపెట్టినా, కవిత్వంలో ఒక సుస్థిర స్థానాన్ని సంపాదించుకోగలిగారు. పదాలకు సందర్భాన్నిబట్టి ఒక ప్రత్యేక జీవాన్ని ప్రసాదించడం వీరి ప్రత్యేకత. వీరికి పద్మశ్రీ పురస్కారంతో బాటు, సాహిత్య అకాడమీ అవార్డు కూడా లభించింది.

**నా నిద్రలో కూడా ఆమె నన్ను వెంబడించింది**

*నా నిద్రలో కూడా ఆమె నన్ను వెంబడించింది*
*ఎక్కడుందో ఆమె ఇపుడు?*
*ఆమె మొహం ఇంకా / పెకిలించబడ్డ చెట్టులానే ఉందా?*
*రెండు ఎర్రబడ్డ నదులు / ఆమె పెదాలను ఇంకా కడుగుతున్నాయా?*
*ఆ రెండు నలుపు గుర్రాల్నీ / ఆమె కనులు ఇంకా మోస్తున్నాయా?*
*నా గుండెను తొక్కుతూ అవి / ప్రతిరాత్రీ నేటికీ విశ్రాంతి తీసుకుంటూనే ఉన్నాయి*

**కవిత్వం**

*కిటికీనుండి ప్రవేశించి / గిరగిరా తిరిగి నవ్వుతూ నిద్రిస్తున్న శిశువు మీద పడి / సీతాకోకచిలుకగా మారిపోయింది*
*ఒక భయంకరమైన శబ్దం / దానిని అనుసరించి లోతైన నిశ్శబ్దం / అ తరువాత మరొక భయపెట్టే శబ్దం*
*సీతాకోకచిలుక / రాతి వక్షస్థలంలోకి పోయింది*
*ప్రతిధ్వనించే సమయంలా / సముద్రంలోని అల్లల్లా*
*శూన్యంలో ప్రతిధ్వనించే నవ్వు /*
*రాత్రి నేను ఎలా ఉండగలిగాను / రక్తమయమైన నా కళ్లతో తిరుగుతూ / ఎలా తలుపు తీసుకుని బయటకు రాగలిగాను*
*నా హృదయంలోని కూనిరాగాల్ని గట్టిగా పట్టుకొని*
*మళ్లీ మరో భయానక చప్పుడు*
*ఇల్లు తగలబడుతోంది / ఎవరి ఇల్లు / ఎవరి ఇల్లు*

**నిర్మలప్రభ బొర్దొలోయ్ (1933-2004):**

నవ్య కాల్పనిక వాదానికి ప్రాతినిధ్యం వహించారు. ప్రేమ ఆమె కవిత్వంలో ప్రధాన వస్తువు. గేయ రూపంలోను, జానపద బాణీలోనూ కూడా పాటలు రాశారు. ఆంగ్లంలోను, అసోమియాలోను వీరివి 50కి పైగా గ్రంథాలున్నాయి. సాహిత్య సంస్థల్లో చురుకుగా పాల్గొన్నారు. ప్రతిష్టాత్మక సరస్వతీ సమ్మాన్ పురస్కారంతోబాటు, సాహిత్య అకాడమీ అవార్డు కూడా పొందారు.

**అరుణోదయం**

*తుపాకీ చప్పుళ్లతో / అరుణోదయం అవుతుందా?*
*ఎప్పటికీ కాదు / రాత్రి చీకటిని / చాలా నెమ్మదిగా*
*కొద్ది కొద్దిగా కొరుక్కుతిన్న / ఆ పక్షి కూతలతోనే అవుతుంది*

**గుండెను చీలుస్తూ**

*సూర్యుడు క్రిందికి ఒరిగిపోతున్నప్పుడు / వరి పొలాల వెంబడి అతను / వెళ్లిపోవడం చూశాను*
*అతని తలమీద పేముటోపీ / అతని భుజాలమీది బరువుకి మూలుగుతూ కిర్రుమంటున్న / అప్పుడేకోసిన రెండు ధాన్యం మూటలు / అతనివెనకే నిష్క్రమించిన -/ బంగరు శరత్కాల సూర్యుడు / గడ్డి మాసికల తుప్పల బురద దారి పాడుకుంటున్న పక్షులు*
*అతను వెళ్లిపోతున్నాడు / వెళ్లిపోయాడు / అతని జీవితకాలంలో / అతను తిరిగొస్తాడో లేదో / ఎవరికి తెలుసు*

**సమీర్ తంతి (1956-):**

12 కవిత్వ సంకలనాలు ప్రచురించిన ప్రఖ్యాత కవి, విమర్శకుడు, అనువాదకుడు . ఆఫ్రికా జపాన్ ప్రేమ కవితల అనువాద సంకలనాలు ప్రచురించారు. వీరి కవిత్వం ఆంగ్లంలోకి విరివిగా అనువాదమయింది. అస్సాం వేలీ సాహిత్య పురస్కారం లభించింది, చిత్రకళతో మొదలైన నా వ్యాపకం దాని సహజ పరిణామంగా కవిత్వమయింది, అని ఆయనే చెప్పుకుంటారు. అది వారి కవిత్వాన్ని చెప్పకనే చెబుతుంది. ఆఫ్రికా, లాటిన్ అమెరికా కవుల ప్రభావం వీరి మీద ఎక్కువ.

**ఎముకల గేయం**

*రోజులొస్తాయి పోవడానికే / వీడ్కోలు తీసుకుంటూ వాటికవే రోదిస్తాయి*
*ఏదో ఒక రోజు నీకు చెబుతాను / ఇలా ఎందుకు జరుగుతోందో / అకస్మాత్తుగా జరుగుతుంది*
*నీకోసం ఎముకల పోగు / అదిక్కడ ఉండనీ / ఈ గడ్డిమీద ఎముకలకు భూమిమీద / వాటికంటూ ఎవరూలేరు*
*బంధువులు లేరు, మిత్రులు లేరు*
*దానికి సమయం / దాటిపోతుంది / దాటిపోతూ దానికదే ఖాళీ అయిపోతుంది*

**నీలిం కుమార్ (1961-):**

ప్రముఖ కవి, నవలాకారుడు. అసోమియాలో ఈయనవి పదిహేడు కవిత్వ సంకలనాలు వెలువడ్డాయి. రెండు ఆంగ్లంలోను, ఒకటి హిందీలోను ఉన్నాయి. రజా ఫౌండేషన్ అవార్డు, ఉదయభారతి జాతీయ అవార్డు పొందారు.

**అద్దె ఇల్లు**

*నా ఒక గదిలో అతను కూర్చుని / చదువుకుంటాడు*
*మరొకగది విందుకి భోజనానికి / ఇంకొక గదిలో పాడుతాడు*
*మరొక దానిలో నిద్రిస్తాడు*
*అతను అద్దెకు తీసుకున్నాడు / నా హృదయం నాలుగు గదుల్ని*
*అతనెవరో కాదు / దుఃఖం*

**బిపుల్ జ్యోతి సైకియా (1966-):**

జీవద్రవ్య భౌతిక శాస్త్ర రంగంలో పనిచేస్తున్న శాస్త్రవేత్త, కవి. కవిత్వంలోనే కాకుండా వృత్తిపరంగా కూడా అనేక గ్రంథాలు రచించారు. సహజంగానే వీరి కవిత్వంలో శాస్త్రీయ కోణం కనిపిస్తుంది.

**ప్రేమ**

*నా అనేక ముఖాల్ని ఆమెకు చూపించాను / నదిలాంటివి నీ ముఖాలంది*
*నా చిరునామాలన్నీ ఆమెకిచ్చాను / నీ చిరునామాలు ఆకాశం లాంటివంది*
*నా చీకటి కోణాలన్నీ ఆమెకు చూపించాను / నిశ్శబ్దంగా నన్ను ముద్దెట్టుకుంది*

**మిథింగ దైమరీ (1967-):**

మెగన్ కచారీ గా అందరికీ తెలిసిన ప్రఖ్యాత ఉల్ఫా ఉద్యమ కార్యకర్త, ప్రచార కార్యదర్శి. ఉద్యమంలో చేరక

ముందు నుండీ కవిత్వం రాశారు. అతని కవిత్వం – తుపాకులు గులాబుల, వేదనలు ఆనందాల, నమ్మకాలు అపనమ్మకాల, లాభ నష్టాల మిశ్రమం. అతని కవిత్వ సంకలనం "మేం సాహిబ్ ప్రిథ్వీ"ని జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత ఇందిరా గోస్వామి, పూనుకుని, దాని ఆంగ్లానువాదానికి సంపాదక బాధ్యత వహించి, పీఠిక రాసి జర్మనీలోని ఫ్రాంక్ ఫర్ట్ పుస్తక ప్రదర్శనలో Melodies and Guns అన్న పేరున విడుదల చేశారు. దానికి ప్రపంచ వ్యాప్తంగా మంచి స్పందన వచ్చింది.

**శూన్యం**

*అలలకు తెలియదు ఎన్నడూ / సముద్రం లోతెంతో*
*తీరాలకు తెలియదు ఎన్నడూ / నదుల పొడవెంతో*
*రక్తానికి తెలియదు ఎన్నడూ / గుండె ఎక్కడుందో*
*వసంతం ఆలింగనంలో / శీతకాలం బతుకుతూనే ఉంది*
*అలసటలో శాశ్వతంగా ..*

**హేమంగ కుమార్ దత్తా (1973–):**

ఆశావహ యువ కవులలో ముఖ్యుడు. ఎక్కువగా రాయకపోయినా, జీవితం మీద అతని దృక్పథం, సమాజంపట్ల అతని పరిశీలన ఎవరినైనా అబ్బుర పరుస్తాయి. అసోమియాలో ప్రఖ్యాత రచయిత, విమర్శకుడు మునిన్ బర్కొటకి పేరున నెలకొల్పిన అవార్డును పొందారు.

**రాత్రిమీద పద్యం**

*మేఘాల మీద పద్యం / నేలను తడపదు / మేఘాలు తడుపుతాయి*
*పంట మీద పద్యం / తిండి పెట్టదు / పంట పెడుతుంది*
*గాలి మీద పద్యం / చెమట తుడవదు / గాలి తుడుస్తుంది*
*ఏ రాత్రీ సూర్యుణ్ణివ్వదు / రాత్రిమీద పద్యం ఇస్తుంది*

ప్రముఖ గాయకుడు భూపెన్ హజారికా (1926–2011) అసోమియా సాహిత్యాన్ని అక్కడి గిరిజన సాహిత్యం సుసంపన్నం చేసిన తీరుని అతని పాటల్లో ఇలా చెప్పుకున్నాడు.

*నేను భాషల పరిణామం గురించి మాటాడతాను గిరిజన భాషల సహాయాన్ని కీర్తించకుండా ఎలా ఉండను నేను బోడో, టివా, హైజొంగ్, రభా, దెవురి, మణిపురి టయి భాషలు అసోమియా భాషని సంపన్నం చేస్తూనే ఉన్నాయి నూతన అసోమీయులు, కచార్ సమాజం, తేయాకు తోటల గిరిజనులు / అసోమియా సాహిత్యానికి కొత్త రంగులు పూయిస్తున్నారు / అరుణాచలీ అసోమియాల కలయిక శాశ్వతం / రాజకీయాలు ఈ తీయని స్నేహాన్ని గ్రహించలేవు సిమెంట్ కంపెనీల యజమానులు నాగామీస్ మాటాడతారు అది అసోమియా నాగాల ప్రేమాంకురం*

మొదట్లో సంస్కృతం, తరువాత బెంగాలీ, ఆంగ్ల మధ్యమం ద్వారా పశ్చిమ దేశాల కవిత్వ ప్రభావం మరీ ముఖ్యంగా కాల్పనికవాదం, ప్రతీకవాదం అసోమియా కవిత్వంలో స్పష్టంగా కనిపిస్తాయి. బిహూ పాటలు, సూఫీ జిక్రీల ప్రభావం కూడా ఉంది.

అస్సాంలో అనేకమందికి కనీసం మూడు భాషలైనా వచ్చు. ఆసోమియాలోని కవులు వారి కవిత్వాన్ని ఆంగ్లంలోను, బెంగాలీలాంటి ఇతర భాషల్లోకి అనువాదం చేసుకుంటున్నవారు, ఆంగ్లంలోనే కవిత్వం రాస్తున్నవారు కూడా ఉన్నారు. ఇంగ్లీషు, హిందీ, బెంగాలీ తమ భాషలోకి అనువాదం చేసుకుంటున్నారు. అసోమియా కవిత్వం ఇతర భాషల్లోకి అంతగా పోవడంలేదనే చెప్పుకోవాలి. ఇటీవల కాలంలో కవిత్వం కంటే వచనమే అక్కడ ముందంజలో ఉంది.

**అస్సాంలోని బోడో:**

సైనో టిబెటన్ భాషా కుటుంబంలోని, టిబెటో బర్మన్ ఉప కుటుంబానికి చెందిన భాష బోడో. బోడోలు సంచార జాతులని, మంగోలియా మూలాలు ఉన్నవారని కూడా చరిత్రకారుల నమ్మకం. బోడో అన్న పదం బోడ్ రాజ్యం నుండి వచ్చిందని, అప్పటి బోడ్ ఇప్పటి టిబెట్ అని కూడా ఒక అంచనా. ఈ బోడ్ నుంచి వలస వచ్చిన వారు కావున వీరు బోడోలుగా పిలబడుతున్నారని చెబుతారు. బోడో అనేక గిరిజన తెగల అనార్యుల సముదాయం. దేశీయ బోడో భాషలో మాట్లాడేవారిని బోడోలుగా చెప్పుకుంటే, హిందూ అసోమియా మాట్లాడేవారిని కచారీలని లేదా బోడో కచారీలని చెప్పుకుంటారు. బోడోని బోరో అనే పలుకుతారు. బ్రహ్మపుత్ర వేలీలో చాలావరకు విస్తరించిన జాతి బోడో. ఎక్కువ భాగం ధుబ్రి, గోల్ పారా, కోక్రాజార్, చిరంగ్, బాగ్సా, ఒడల్గురి, కామ్రూప్,

దర్రాంగ్ జిల్లాల్లో వ్యాపించారు. అస్సాంలోని ధింసా భాషకు, మేఘాలయలోని గరో భాషకు, త్రిపురాలోని కోక్బొరోక్ భాషకు – బోరో భాషతో అనేక పోలికలున్నాయి. బోడోలు ప్రకృతి ప్రేమికులు, జీవితాల్ని శాసించేది కూడా ప్రకృతే అని వారి నమ్మకం.

13వ శతాబ్దంలో మొదలై దాదాపు ఆరు శతాబ్దాల కాలం రాజ్యమేలిన అహోం రాజుల కాలంనుండే, ఆ రాజులతో వైరం ఉండటం మూలంగా ఎప్పుడూ ఏదో ఒక మూలకు బోడోలు నెట్టబడ్డారు. ఆర్యుల మూలంగా వారి అస్తిత్వాన్ని కోల్పోయామన్న భావన వారిలో బలంగా పాదుకుని ఉంది. అస్సాంలో స్థిరపడ్డ వలస జనం తమదైన మాండలికాల్లో వారు మాట్లడుకునేవారు. సాహచర్యం, ఏకీకరణ, సమైక్యత మూలంగా కొన్నాళ్లకు, బహు వంశీయ, బహు భాషల, బహు మతాల, బహు కులాల, బహు సాంస్కృతిక సమాజపు అహోం అస్సాంలో, అసోమియా భాషే వారందరిమధ్యా అనుసంధాన భాషగా తయారైంది. ఆ కారణంగా 16 లక్షలమంది బోడో భాషీయుల్లో, బోడో ప్రత్యేక రాష్ట్రం కావాలన్న అలజడి అశాంతికి కారణం అయింది. ఆర్థిక వెనకబాటుతనం, భాషతోబాటు వారి అస్తిత్వాన్ని కోల్పోతున్నామన్న ఆవేదన, రాజకీయంగా ఎదగాలన్న కొందరు నాయకుల ఆకాంక్షలు కూడా కారణాలు.

1952లో బోడో సాహిత్య సభ ఏర్పడ్డాక, తమకంటూ గుర్తింపు కోసం నిర్దిష్టమైన ప్రణాళికతో బోడోలు ముందుకు సాగారు. అంతవరకూ అస్సామీ లిపిలో ఉన్న బోడో భాషకు, 1974లో రోమన్ లిపి కోసం ఉద్యమించారు. అస్సాం ప్రభుత్వం అందుకు సమ్మతించక ఉద్యమాన్ని అణిచే ప్రయత్నం చేయడంతో ఉద్యమం హింసాత్మకం అయింది. అప్పటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ జోక్యంతో చివరికి దేవనాగరి లిపికి మారేందుకు అంగీకారం కుదరడంతో అప్పటినుంచీ బోడొ భాషకు రాత లిపి, దేవనాగరిగా మారి అదే కొనసాగుతూ ఉంది. 1963లో బోడో భాష ప్రాథమిక పాఠశాలలో బోధన భాషగా ప్రవేశపెట్టబడింది. 1968లో మాధ్యమిక పాఠశాలల్లోనూ అమలు పరిచారు. క్రమక్రమంగా బోడో భాషలో పుస్తక ప్రచురణ విరివిగా కావడం మొదలయింది. బోడో ఐక్య విద్యార్థి సంఘం 1987లో, బోడోల పితామహుడుగా కీర్తించబడ్డ ఉపేంద్రనాథ్ బ్రహ్మ నాయకత్వంలో అస్సాం నుండి వేరుగా బోడోలాండ్ కోసం ఉద్యమించారు. అయితే అది సాధించలేకపోయినప్పటికీ ఆస్సాం, కేంద్ర ప్రభుత్వంతో 2003లో కుదిరిన ఒప్పందం ప్రకారం తమ భాషకు ప్రాంతానికి వారికొక ప్రత్యేక గుర్తింపు మాత్రం సాధించుకున్నారు. ఆ ఉద్యమ ప్రభావం, బోడో యువకుల మీద, మరీ ముఖ్యంగా రచయితల మీద చాలా ఎక్కువగా ఉంది.

విలక్షణమైన సుసంపన్నమైన మౌఖిక సంప్రదాయం, బోడో లకుంది. బోడో భాష ప్రాచీనమైనదే అయినా, ప్రామాణికమైన భాషగా గుర్తింపు పొందకపోవడానికి ముఖ్య కారణం, ఆ భాషకు 20వ శతాబ్దం రెండవ దశకంవరకూ లిపి లేకపోవడమే. గురుదేవ్ కాళీచరణ బ్రహ్మ 20వ శతాబ్దం మొదటి దశకంలో పూనుకుని, బ్రహ్మ ఉద్యమంగా అక్కడి బోడోలకోసం శ్రమించనంతవరకూ, సామాజిక సాంస్కృతిక జాగరణ సైతం అక్కడ జరగలేదు. క్రైస్తవ మతబోధకులు బోడో మాట్లాడే ప్రాంతాల్లో చొచ్చుకుపోయి, ఆంగ్లంలో బోడో భాష ఉదాహరణలతో మొదటిసారి పుస్తకాలు ప్రచురించారు. బోడో సాహిత్య సభ ఏర్పడ్డాక, బోడో ఆధునిక సాహిత్య ప్రక్రియ సైతం ఊపందుకుంది. 1920లో సతీష్ చంద్ర బసుమతరి (1901–1974) సంపాదకత్వంలో ప్రచురించబడిన బిబర్ (పువ్వు) పేరుమీద మొదటి పత్రిక, సాహిత్యపరంగా వచ్చింది. 1923, 1926లలో, *మొదరం బ్రహ్మ* (1903–1990), *రూప్నాథ్ బ్రహ్మ* (1902–1968)ల రెండు బోడో కవిత్వ సంకలనాలొచ్చాయి. *బిబర్* పత్రిక తరువాత, 1926లో *జెంథోఖ*, 1932లో *హథోర్ఖి హల*, 1938లో *ఆలొంగ్బర్* సాహిత్య పత్రికలొచ్చాయి. బెంగాలీ, అసోమియా సాహిత్య ప్రభావాలు వారి సాహిత్యంలో సహజంగానే ఎక్కువగా కనిపిస్తాయి. అయితే ఎక్కువ ప్రభావం చూపింది ముందుగా బెంగాలీ కవులు, ఆ తరువాత అసోమియా, ఆంగ్ల కవులు.

కొత్తదనం, వైవిధ్యం, కొత్త సాంకేతిక ప్రక్రియ విభిన్నమైన శైలులతో రాసేందుకు బోడో కవులు రచయితలు

ప్రయత్నించారు. ప్రకృతి వర్ణనతో ప్రసేన్ జిత్ బ్రహ్మ (1929–1992), నదుల చుట్టూ తిరిగే కవిత్వంతో జగదీష్ చంద్ర బ్రహ్మ (1936–), ఉమర్ ఖయ్యాం మార్మిక కవిత్వంతో ప్రభావితుడైన కమల్ కుమార్ బ్రహ్మ (1929–2006), మాతృభూమి మీద అమితమైన ప్రేమతో సమర్ బ్రహ్మ చౌధురీ (1932–1991), గొప్ప కాల్పనిక వాద కవిత్వంతో ఇషాన్ ముషహరి (1915–1940), ప్రేమ కవిత్వంతో మనోరంజన్ లహరి (1939–2008), బ్రజేంద్ర కుమర్ బ్రహ్మ (1943–), రాబర్ట్ బ్రౌనింగ్ లా తననుతాను తెలుసుకుందుకు నాటకీయ స్వగతంతో రాసే కవిత్వంతో సూరథ్ నర్జారీ (1945–), కొత్త అభివ్యక్తి తపనతో నీల్ కమల్ బ్రహ్మ (1944–1998), మొదరం బ్రహ్మ, రూప్నాథ్ బ్రహ్మ, బోడో సాహిత్య సభలో ముఖ్య భూమిక పోషించిన ప్రముఖ కవి బిహూరాం బోరో (1941–1990), సోనేస్వర్ బోరో, మహేస్వర్ నర్జారీ, సూరథ్ నర్జారీ (1944–), సతీష్ చంద్ర బసుమతరి (1901–1974), జలధర్ బ్రహ్మ (1903–1959), పర్సురాం బ్రహ్మ, జుధిష్ఠిర్ హజుగ్సుమరి (1901–1971), మొహెస్వర్ నర్జరి (1938–2016) , మోతీలాల్ బసుమతరిలాంటి కవులు బోడో కవిత్వాన్ని సుసంపన్నం చేశారు. 1980–1990 ప్రాంతంలో యువ కవులు – అరొబిందొ ఉజిర్ (1959–), అంజు అంజలీ బసుమతరి (1963–), అనిల్ కుమార్ బోరో (1951–), సొరొజ్ బసుమతరి (1955–), జాతీయ భావనలతో బిష్ణుజ్యోతి కచారీ (1954–2000), వామపక్ష భావాలతో నందేస్వర్ బోరో (1946–), బనెస్వర్ బసుమతరి (1942), మంగల్ సింగ్ హజౌరి (1954–), బరున్ బోరో (1959), మొదలైన కవులు సమకాలీన ఆధునిక కవిత్వంలో ముందున్నారు.

దాదాపు వందేళ్ల లిఖిత సాహిత్య చరిత్ర మాత్రమే ఉన్న బోడో సాహిత్యం, ఈశాన్య భారతంలో తనకంటూ బాగానే గుర్తింపు పొందిందని చెప్పుకోవాలి. బ్రజేంద్ర కుమార్ బ్రహ్మ రాసిన "ఆకాశం అన్వేషణలో" కావ్యం వారి ఆధునిక కవిత్వానికి నాంది.

కేంద్ర సాహిత్య అకాడమీనేకాక, బోడో సాహిత్య సభ నెలకొల్పిన బోడో సాహిత్య అకాడమీ కూడా వారికుంది. ప్రతీ ఏటా ఈ రెండింటి నుండీ బోడో భాషకు అవార్డులొస్తూ ఉన్నాయి. మంగల్ సింగ్ హజౌరి (1954), ప్రేమానంద ముసహరి (1959–), అరొబిందొ ఉజిర్ (1959–), గునెస్వర్ ముసహరి (1941–), అనిల్ కుమార్ బోరో (1951–), ఉర్ఖవొ గ్వర బ్రహ్మ (1963–)లకు ఇప్పటివరకూ కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతులు కవిత్వానికి లభించాయి.

**బ్రజేంద్ర కుమార్ బ్రహ్మ (1943–):**

సమకాలీన కవులలో గొప్ప కవిగా మన్ననలు పొందారు. ప్రతీకాత్మకత, వైవిధ్య భరితమైన శైలి, అణగారిన వర్గాల పట్ల సానుభూతి, మానవతావాదం, అతని కవిత్వంలో ఎక్కువగా కనిపిస్తాయి. వ్యక్తిగత, ఆవేశపూరిత అనుభవాలు, ప్రతిస్పందనలు తెలియజేసేందుకు వీలుగా, ఆత్మాశయ ప్రతీకలనేకాక, సాంప్రదాయక ప్రతీకలు కూడా తన కవిత్వంలో వాడుకుంటారు.

**ఆకాశం అన్వేషణలో**

*ఆకాశం అవసరంలో మేమున్నాం*
*ఇరుకైన సరిహద్దులుండని చోట*
*స్వేచ్ఛా స్వచ్ఛమైన గాలి*
*మాకు ఈ రోజు కావాలి*
*ఎక్కడైతే ఖాలీ దేహం నిండి ఉంటుందో*
*మనస్సు కోరిక విషం కక్కుతుందో*
*అక్కడ ఇవాళ*
*చరిత్ర నాలుగు వర్ణాల*
*అసహ్యకర ఆమోదం ఉంది*
*అమృత వృక్షం మీద విషఫలం*
*వాటిమీద తగని ఆలోచన*

**అరొబిందొ ఉజిర్ (1959–):**

సామర్థ్యం ప్రతిభ ఉన్న యువ కవి, అనువాదకుడు. అతని కవిత్వ నైపుణ్యం – నూతనత్వం. అపరిచిత కల్పనలు, అసాధారణమైన పోలికలు, అర్థాంతరన్యాసాలు, సూటిగాలేని గూఢార్థాలతో నిండి ఉంటుంది. టి.ఎస్. ఎలియట్ ప్రభావంతో ప్రతిబింబవాదం ప్రతీకవాదం ఎక్కువగా వాడుకున్న కవి.

**అంతం నుండి అనంతం**

*వాళ్లు ఆరంభించింది వాళ్ల అంతం కాదు*
*వాళ్లు ముగించిన దగ్గర మా ప్రారంభం*
*అంతం నుండి అనంతం*
*మంచి డోలు వాయిద్యాన్ని వింటున్న మొక్క*
*పిచ్చెక్కిపోయింది*
*తీగ కాండం క్రిందికి*
*ప్రేమ దేవత ఎగురుకుంటూ వచ్చింది*
*ఎవరో రాత్రి ఏకాంతాన్ని అడిగారు*
*ఫిడేలు ఎవరు వాయిస్తున్నారని*
*బ్రహ్మజెముడు ముందర*
*బియ్యం పిండి గట్టు*

**అంజు (అంజలీ బసుమతరి) (1963-):**

అణగారిన వర్గాల స్వరం. ఆధునిక బోడొ కవిత్వంలో ప్రతిభావంతురాలైన కవయిత్రి, అనువాదకురాలు. జీవితపు సుపరిచిత దశల్ని, అరుదైన కళాత్మక వివరాలతో, పొదుపైన అభివ్యక్తితో ప్రత్యేకంగా ఆకర్షణీయంగా చెప్పగలిగే నేర్పున్న కవయిత్రి. అసోమియా ప్రముఖ కవయిత్రి నిర్మలప్రభ బొర్దొలోయ్‌తో ఈమె కవిత్వాన్ని పోలుస్తారు.

**నీ నీడ**

*నీ శరీరం నీడ కాదు*
*అది నీ ఆత్మదేహం*
*విస్తరించని చంద్రకాంతి*
*ఆకుపచ్చ నేల*
*తల్లిలో సగం వయస్సు బిడ్డ*
*తల్లి మొహం నీడ పడి*
*చదవలేని పాలిపోయిన మొహం*
*చచ్చినంత నిశ్శబ్దంతో*
*చంపి పడేసిన పాములా*
*రైలులైను పక్కన రావాకుల గుండా*
*మా బాల్కనీ నుండి రోడ్డు*

– *(వేలాడుతున్న తాడుకి చంద్రుడు – కవిత నుండి)*

**సూరథ్ నర్జారీ (1945):**

నాటకీయ స్వగతాన్ని, తనను తాను తెలుసుకుందుకు సాధనంగా కవిత్వాన్ని వాడుకున్న ప్రముఖ కవి, అనువాదకుడు. ఆంగ్లంలో కూడా బోడొ కవిత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తున్న కవి. ప్రముఖ ఆంగ్ల కవి రోబెర్ట్ బ్రౌనింగ్ ప్రభావం ఇతని కవిత్వం మీద ఎక్కువ.

**నేను పోగొట్టుకున్న ప్రేయసి**

*ఓ నా ప్రేయసీ*
*రా నా పక్కన కూర్చో*
*నువ్వడిగిన ప్రశ్నకు*
*నేను బదులిస్తాను*
*రా విను!*
*సుదీర్ఘ చరిత్ర ఇది*
*కలా వాస్తవాల కథ*
*లాభ నష్టాల అసంపూర్ణ ప్రాస*
*నా ప్రియా మరింత దగ్గరగా వచ్చి చూడు*
*ఎంత సుందరమైనదో ఆమె శరీరం హృదయం*
*కాంతివంతమైన వెడల్పాటి కళ్లు*
*పొడవాటి వంకీల జుత్తు*
*చూడటానికి ఎంత అందం ఆమెది*
*తామర పత్రాలు ఆమె అరచేతులు*

**బిష్ణుజ్యోతి కచారి (1954-2000):**

అణచివేయబడ్డ ఆదివాసులపట్ల అత్యంత కరుణ, జీవనప్రమాణాల్ని ఉన్నతీకరించాలన్న ఆలోచన అతని కవిత్వాన్ని నడిపించింది. మూడు కవిత్వ సంకలనాలు వెలువడ్డాయి. అందులో చివరిది ఆయన మరణాంతరం ప్రచురించబడింది. అసోమియా, బోడో భాషలు రెండింటిలోనూ కవిత్వం రాశారు.

**నల్ల గోరింటాకు**

*దేవుడి ప్రతినిధులు / వాంతులు వాంతులు చేసుకుంటూ*
*స్వర్గం మందులు పంచుతున్నారు*
*బక్కపలచని దేవుణ్ణి / అగ్నికురిపిస్తూ అడుగుతున్నారు*
*దినబత్తేలు ఎక్కడని*



ముకుంద రామారావు
హైదరాబాద్. ఫోన్: 990 834 7273.

# విమర్శకుడిగా – కృష్ణశాస్త్రి

– రెంటాల వెంకటేశ్వరరావు

దేవులపల్లి కృష్ణ శాస్త్రి అనగానే కవి అంటారు. వచనం రాసినా సరే అదీ కవిత్వంలాగానే ఉంటుంది కనక ఆయన కవే అంటారు. కానీ కృష్ణశాస్త్రిగారు విమర్శకులు కూడా. పైగా మంచి విమర్శకులు.

ఆయన విమర్శ అత్యధికభాగం రేడియోప్రసంగాలుగా ఉండి ఉండొచ్చు. అందులో శైలి సంభాషణాత్మకంగా ఉండి ఉండొచ్చు. . ఆ సాహిత్య విమర్శ మామూలు సాహిత్య విమర్శ మూసలో ఉండక పోవచ్చు. కానీ అచ్చమైన సాహిత్య విమర్శ అది. స్థూల దృష్టికి *వారి పాతికేళ్ళ తెలుగు కవిత్వం* ఒక్కటే విమర్శగా తడుతుంది. అందులో కొంతవిమర్శ మూస, అకడెమిక్ కోణం ఉన్నాయి కనక. తక్కిన రచన విమర్శగా అనిపించదు. కానీ మొత్తం రెండున్నర వందల పుటల విమర్శ రాశారాయన.

కృష్ణ శాస్త్రిగారి సాహిత్యవిమర్శ చదివితే కలిగే సాహిత్యాగాహనను సాధారణ పాఠకుడు చప్పున గ్రహించు కోలేడు. కానీ కాస్త నిలిచి ఆలోచిస్తే జిహ్వకి అంటుకున్న సాహిత్య రుచినీ, తన సాహిత్య రసాస్వాదనలో వచ్చిన మార్పునూ గమనించగలరు. .

నన్నయ, తిక్కన, శ్రీనాథుడు, పెద్దన, వేమన, తిరపతి కవులు, పానుగంటి,వేంకట పార్వతీశ్వర కవులు, బసవ రాజు అప్పారావు,రవీంద్రుడు, మల్లవరపు విశ్వేశ్వర రావూవీళ్ళందరి సాహిత్య వ్యక్తిత్వాలకీ బొమ్మలు గీశారు. శాస్త్రిగారు. పాశ్చాత్యులని కూడా తడిమారు. బర్న్స్ కవి మీదా అడ్గార్ అలన్‌పో మీదా రెండు పెయింటింగ్స్‌లాంటి రచనలు చేశారు. సాహిత్యంలో శబ్దం గురించీ, లిరిక్ శిల్పం గురించీ, కరుణ గురించీ కూడా మాట్లాడారు.



దేవులపల్లి

చిత్రకళలో రసన అని ఒక ప్రసంగం ఉంది. ఆయన రేడియో కోసం చేసింది. అందులో రాసిన ఒక చిన్న ఉదంతం ఆయన విమర్శను,విమర్శనే కాదు ఆయన మొత్తం రచనల లక్షణాన్ని స్పష్టం చేస్తుంది. రవివర్మగీసిన దమయంతి, శకుంతల చిత్రాలను ప్రస్తావించి అవి చిన్నప్పుడు తనకు బాగానే అనిపించేవిగాని పెద్దయ్యాక అంత రుచి కరాలుగా తోచటం లేదని శాస్త్రిగారు అంటే ఒక మిత్రుడు అందుకు కారణాన్ని వివరించాడట. రవివర్మ ఒకే స్త్రీని దృష్టిలో పెట్టుకుని రెండు బొమ్మలనూ గీశాడనీ, ఆయా సందర్భాలకు ఆ మూర్తులలో ఉండవలసిన ఉద్వేగవైశిష్ట్యాన్ని చిత్రంలో పట్టుకోలేదనీ, వాటిల్లో శకుంతలతనం దమయంతితనం లోపించాయనీ అన్నాడట.

విమర్శలో కృష్ణశాస్త్రిగారు ఒక రచనను 'పెళ్ళగించి' (ఇది ఆయనకు ఇష్టమైన మాట. ఇష్టమైన పనికూడా. )చూస్తారు. ఒక రచయిత నామరూపాలనుదాటి వ్యక్తిత్వం దగ్గరకు వెళ్ళడం ఆయన విమర్శ ప్రత్యేకత. ఎవరు రాశారు వీరేశలింగం గారి గురించి ఆయన రాసినట్టు? అంతకు ముందుగాని ఆ తర్వాతగాని? తాను విమర్శకు ఎన్నుకున్న రచయితల 'తన తనాన్ని' పట్టుకోవడమే ఆయన విమర్శలో చేసిన పని. 'తన తనం' అంటే వైయక్తిక విశిష్టత-బయట గాని లోపలగాని.

అదంత సులువుకాదు. ఉపరితల అంశాలు డజనుల కొద్దీ ఆకర్షిస్తూ అడ్డు తగులుతూ ఉంటాయి. చాలా మంది విమర్శకులు సాహిత్య మందిరావరణంలో చుట్టూ తిరుగుతూ తచ్చాడుతూ ఉండిపోతారు. గర్భగుడిలోకి ప్రవేశించలేరు. నన్నయ గారిది, తిక్కన గారిది,పెద్దన గారిది హృదయ చిత్రాలు గీసి ఇచ్చారాయన. ఒక బొమ్మ ఇంకొక బొమ్మ ఒకదాన్ని ఒకటి పోలవు. ఇంకో విశేషం ఉంది. ఆయన ఆ అంతశ్చిత్రాన్ని ఒక్క ముక్కలో కుదించి ఆవిష్కరించగలరు. 'ఎంతకూ చల్లారని కోరికలాగ కనబడతాడు నాకెప్పుడూ అప్పారావు. ఊరికే నిట్టూరుస్తూ ఉండే గుండె లాగ' అనేస్తారు బసవ రాజు అప్పారావుగారి గురించి.

మల్లవరపు విశ్వేశ్వరరావుగారి'పిపాస'చదివాక 'కాలికాలి బద్దలైన ఓపెద్ద బయలూ దాని మధ్య చేతులు చాపిన ఓ తుమ్మ చెట్టూ జ్ఞాపకం వచ్చి జాలీ భయమూ వేస్తాయి'. అంటారు.

ఇది చూడండి. గొట్టిపాటి వెంకట సుబ్బయ్యగారి జీవితచరిత్రల పుస్తకానికి ముందుమాటలో వాడిన వ్యాఖ్య. సుబ్బయ్యగారికి "కోపల్లె జీవితం ఒక దివ్య కీర్తన. ముట్నూరిది ఒక సుందర కావ్యం. పట్టాభిది ఒక ఉజ్వల నాటకం" అని. ఇలా అనడానికి అనుభవించే శక్తి, నాడిపట్టుకునే కౌశలం ఎంత స్థాయిలో ఉండి ఉండాలి!

కవిత్వం మీద కవిత్వం చెబుతున్నట్టుగా ఉన్న ఈ వాక్యాలు చదివాక ఇది విమర్శా? కవిత్వమా? అని సందేహం వస్తుంది.

సరిగ్గా ఇక్కడే ఉంది చిక్కు. కృష్ణశాస్త్రిగారి విమర్శ విమర్శగా తట్టక పోవడానికి కారణం ఇదే. ఇది ఇలా ఎందుకుందీ అని విచికిత్స చేస్తే ఏం తేలుతుందంటే...

ఒక్కొక్క విమర్శకుడికి ఇష్టమైన ప్రక్రియ ఒకటి ఉంటుంది. ఆయన పేరు చెబితే ఆ ప్రక్రియ గుర్తుకొస్తుంది. ఆరెస్ సుదర్శనంగారు అనగానే నవల గుర్తు కొచ్చినట్టు. కృష్ణశాస్త్రిగారి పేరు చెప్పగానే లిరిక్ గుర్తుకొస్తుంది. గుర్తుకు రావాలి. ఎందుకంటే ఆయన రాసిందీ చూసిందీ వివరించిందీ అంతా ఆ లిరిక్‌కి లోబడే ఉంది,అటుకవిగా కానీ ఇటు విమర్శకుడిగా కానీ.

లిరిక్ అంటే మనం పాట అని అనుకుంటాం. నిజానికి అంతే కూడాను. ఎప్పుడూ? దాని స్వరూపం, స్వభావం, స్పృశించి మట్లాడినప్పుడు కానీ ఇంకా లోతులకి వెళితే?

"లిరిక్ రాగతాళాలతో గేయమే కానక్కరలేదు. పద్యం కావచ్చు. వచనం కూడా కావచ్చు" అంటాం శాస్త్రిగారి లాగా. ఇక్కడ లిరిక్ రూపం చెరిగిపోయింది. అనుభవం మిగిలింది. "లిరిక్‌లో బుద్ధికికన్న మెదడుకి కన్న హృదయ భావానికి ఆధిక్యం" అన్నారాయన. హృదయ భావం అనే మాటకి తన అర్థాన్ని స్పష్టపచడానికి ట్రూత్ ఆఫ్ ఎమోషన్స్ అని బ్రాకెట్టులో ఆంగ్లార్థం కూడా ఇచ్చారు.

ఆయన ఇంకా ఇలా వివరించారు. "ఏ సంఘటనో వస్తువో కవి అంతరంగాన్ని స్పృశించి తన సొంత అనుభవం అయిపోయి అతని విశిష్ట వాణిద్వారా లిరిక్ అయి వెలువడుతుంది" అన్నారు. "నన్నయ గారి కన్న లిరిక్ కవి ఇంకొకడు లేడు" అన్న మాటని ఇక్కణ్ణుంచి చూడాలి. కృష్ణ శాస్త్రిగారు సాహిత్య విమర్శలో జరుగుతున్నది ఇదే. చదువుతున్న కవిని పుస్తకాన్ని తన

అంతరంగం దాకా తీసుకుపోతున్నారు. దాన్ని అనుభవంగా మలచుకోగలుగు తున్నారు. ఆ తర్వాత మాట్లాడడం మొదలు పెడు తున్నారు. అనుభవాన్ని వ్యక్త పరచడం ఎలా? దానికి వివరణ కుదరదు. అందుచేత అది మళ్ళీ కవిత్వ భాషనే స్వీకరిస్తుంది.

ఒక్కో విమర్శకుడు ఒక్కో మెట్టు మీద ఆగుతాడు. ఒకరు భాషమీద ఒకరు అలంకారం మీద, ఒకరు రసం మీద ఇలా... రసం అనే మాట ద్వారా నేను ఉద్దేశిస్తున్నది గాఢమైన అనుభవాన్ని. శాస్త్రిగారి రసం కరుణ. అంటే శోకరసం కాదు. "వేదన వల్ల కాని ప్రేమ కలుగదు. ఆ రెండూ కలిస్తే కరుణ అవుతుంది" అంటారు కృష్ణ శాస్త్రిగారు. ఆయన కవిత్వ కవిత్వేతర రచనలకు కేంద్రం కరుణే. అయితే ఆయన కరుణ అన్నమాటకి ఇచ్చిన అర్థాన్ని మరి కొంత విస్తరించుకోవాల్సి ఉంటుంది – కరుణ అంటే ఇతరులపట్ల చిత్తం ద్రవించి ఉండే స్థితి అని. కృష్ణ శాస్త్రిగారి సాహిత్యజీవితంలో ఒక ముఖ్యమైన ఘట్టం ఆయన భావకవిత్వ ప్రచార నిర్వహణ. రాష్ట్రం అంతా తిరుగుతూ తనవీ ఇతరులవీ కవితలు సవ్యాఖ్యానంగా వినిపిస్తూ భావ కవిత్వాన్ని అర్థం చేయించారు,ప్రాచీన కవిత్వాన్ని మాత్రమే ఆమోదించే స్థితిలో ఉండిపోయిన అనేకమందికి.

ఈ రకమైన పని ఆయన విమర్శలో కూడా చేశారని వేంకట పార్వతీశ్వర కవుల 'ఏకాంతసేవ'కి రాసిన పీఠిక చదివాక అర్థం అవుతుంది. అది ముందుమాట రూపంలో ఉన్న మేనిఫెస్టో. ఊరికే చదివి పక్కన బెడితే ఆ లక్షణం స్ఫుటం కాకపోవచ్చు కానీ జాగ్రత్తగా చూస్తే కాల్పనిక కవితా సారభూత లక్షణా లనదగ్గ ఎనిమిది అంశాలు అందులో సాక్షాత్కరిస్తాయి. అది చరిత్రాత్మక పీఠిక. ఒక కొత్త కవిత్వం వచ్చినప్పుడు దాన్ని అవగతం చేయించాల్సిన పని విమర్శకుడిది. అలా పుట్టిన పీఠిక అది. స్త్రీవాద కవితా సంకలనం "నీలిమేఘాలు' వచ్చిన పీఠిక, దళితవాద కవితా సంకలనం" చిక్కనవుతున్న పాట"కి రాసిన పీఠిక ఇంకా అలాంటి సంకలనాల పీఠికలు ఏకాంతసేవ పీఠిక ఇటీవలిరూపాలు. ఆయన ఇతర లాక్షణికుల్ని కోట్ చెయ్యడంతో సహా విమర్శక చర్యలు చాలా చేశారు. శాస్త్రిగారు షెల్లీని కీట్సుని కోట్ చేశారంటే ఎవరూ ఆశ్చర్య పడరు. వాళ్లు అంతా ఆయన కుటుంబ సభ్యులు. కానీ బర్న్సనీ, అలన్‌పోని, సిసిల్ డే లూయీని, హక్స్లేని హెమింగ్వేని కూడా తడిమారు. ఈ మాట చెబితే ఆయన ప్రసంగాలు చదివిన వాళ్లు కూడా ఆశ్చర్యపోతారు. ఎందుకంటే కోట్ చేసినట్టు అనిపించదు. కొటేషన్ల భారాన్ని పాఠ కుడికి తగల నివ్వరు కనక.

ఆయన వచనం ఒక సమ్మోహనాస్త్రం. తాజాగా ఉంటుంది, ఇప్పటికీ ఎప్పటికీ. క్లుప్తంగా ఆప్తంగా ఉంటుంది. మామూలుగా చెబితే మాట కాదు ఆయనకి. ఒక వైచిత్రి ఉండాలి అందులో. అది మాట స్థాయిని దాటి పోవాలి.

"భయంకరమైన తీవ్రాతి తీవ్రమైన ఆ కార్యోత్సవంలో ఆయనకి మరణించడానికి తీరిక లేకుండా పోయింది" అంటారు వీరేశలింగం గారి గురించి. ఆయన గురించే ఇంకా ఇలా అన్నారు. "వీరేశలింగం నాసికా త్ర్యంబకం. నవ్యాంధ్ర జీవితం అఖండ గౌతమి".

తమ గురుదేవులు వెంకట రత్నం నాయుడుగారి గురించి ఎంతో అందంగా ఇలా అంటారు. 'ఏబది ఏండ్లు ఆంధ్ర జాతిని మహర్షి బహిర్వివేకమై నడిపించెను.'

నాయుడు గారు ఒక నాళిక అట. అందులోంచి సమస్తమూ సంగీతమైపోయి వెలువడిందట.

వేమన్న గురించి ఒక అంచనా చూడండి. "అతను నూరేళ్ళ ఈ మధ్య పడమటి దేశాల్లో పుడితే 'షా' అయి ఉండును. పద్దెనిమిదో శతాబ్దిలో పడితే స్విఫ్ట్ అయి ఉండును. వాళ్ళకు కూడా మాట ఎంత కరుకుదో మనసంత కమ్మనిది."

కృష్ణ శాస్త్రిగారు వచన రమ్యత తెలిపే ఉదాహరణలు మొదలు పెడితే ఎక్కడ ఆపుచెయ్యాలో తెలియదు.

"మనుష్యులలాగే మాటల్లోనూ ఒక ఉదాత్త కావ్య జాతికి చెందిన శబ్దాలలోనే అంతర్వివాహం చేస్తూ పోతూ ఉంటే నీరసమైన నాజూకు సంతానం పుట్టు కొస్తుంది" అని ఆయనకు తెలుసు. అందుకనే మాట పట్టింపు చాలా హెచ్చు. విలక్షణ మైన కూర్పుద్వారా మాటకు బలం పెంచుతారు.

పైమాటలు చెప్పిన సందర్భంలోనే ఆయన ఒక హెచ్చరిక చేశారు. అసలు కవిత్వం చెప్పడంలోనే ఒక 'ఆపద' ఉంది అని మొదలు పెట్టి "దానికి చాలా మంది వశులై పోతారు. కావ్య వస్తువులులాగా కనబడేవి కొన్నింటిని ఏరుకోవడం, కవిత్వంలో నప్పేటట్లు తోచే తియ్యని మెత్తని మాటలూ సమాసాలూ ఏరడం వాటిని కూర్చి తేలికగా గేయమో ఖండకావ్యమో తయారు చేయడం. ఇదీ వీళ్ళు చేసే పని" అన్నారు. ఇప్పటికీ అధిక సంఖ్యాక కవి నామకులు చేసే పని అదే.

ఎంతో అందంగా ఉంటుంది కృష్ణ శాస్త్రిగారి విమర్శా ఎక్కడా కటుత్వ లేకుండా.

కటుత్వంలేని విమర్శ, కవిత్వంలాంటి విమర్శ ఎలా ఉంటుంది? సాహిత్య ప్రశంసలాగా ఉంటుందని అనుకుంటాం. కానీ అలా లేదు కృష్ణశాస్త్రిగారి విమర్శ. బాగునే కాదు ఓగునీ ఎత్తి చూపిస్తుంది. ఎటొచ్చీ కొట్టొచ్చినట్టు చూపదు.

పానుగంటివారి గొప్పతనం అంతా వివరిస్తూనే "పానుగంటి వారికి నాటక రచనకు కావలసిన తాటస్థ్యమూవాస్తవికతా లేవు" అని చెప్పడానికి మొహమాట పడరు. మరి ఆ నాటకాలు కొన్నయినా ఎందుకంత చక్కగా ఉన్నాయి అన్న మన సందేహానికి సమాధానం దాటవెయ్యరు. ఆ నాటకాల వస్తువులు మన కాలానికి చాలాదూరంలో ఉన్నాయి కనక ఈ రెండు లక్షణాలు లేకపోవడం వాటిని బాధించలేదని వివరిస్తారు. బసవరాజు అప్పారావుగారి పాట ఒక తొందరలో ఒక వేడిలో నగ్నంగా వస్తుందని చెప్పి ఊరుకోరు. అంత నగ్నంగానూ సరిగా అలాగే ఇవతలికి విసిరివేసి నప్పుడు కల్పనకు అవకాశం ఉండదు. శిల్పానికి స్తిమిత ముండదు అని కూడా అనేస్తారు.

సాహిత్య లక్ష్యంగా ఆయన చెప్పిన మాటలు ఇవి. "నిందించడానికీ కీర్తించడానికీ కాదు మానవుని మానవునిగా చెయ్యడానికే కావ్య నిర్మాణం."

శాస్త్రిగారి విమర్శ రచనలు ఆయన సాహిత్యాన్ని సమీపించడానికి పనికి వచ్చే సోపానాలు. కొన్ని తిరుగుడు మెట్లు అయితే కొన్ని – 'నాగొప్ప రచనా?' 'ఊర్వశి'లాంటివి– సూటి మెట్లు. గొప్ప కవుల విమర్శ రచనలన్నీ అంతే.

విమర్శకుడిగా కృష్ణశాస్త్రిగారు అన్నప్పుడు నాకు కట్టమంచి కూడా గుర్తుకొస్తారు. ఇద్దరూ సమస్థాయి విమర్శకులనీ, తెలుగు విమర్శ మీద సాహిత్యం మీదా ఇద్దరి విమర్శరచనలూ ఒకేలాంటి ప్రభావం చూపాయనీ కాదు. ఒక పోలిక ఉంది ఇద్దరికీ. అదేమిటంటే ఇద్దరూ రొమాంటిక్ యుగపు ఆవరణలో నిలిచి విమర్శ రాసిన వాళ్ళే. తేడా ఏమిటంటే కట్టమంచి ఆ యుగపు మేధ. కృష్ణశాస్త్రి ఆ యుగపు హృదయం.


రెంటాల శ్రీవెంకటేశ్వర రావు

రాజమహేంద్రవరం.

ఫోన్: 779 911 1456, 778 069 1397.




# వేమన యోగం

*- అమినేని సిద్ధయ్య నాయుడు*

ప్రజల కొరకు, ప్రజలలో మెలగుతూ ప్రజలకై కైతలల్లిన ప్రజాకవి వేమన. ప్రజల నోళ్ళలో ఇంతగా నానిన ప్రజాకవి మరొక్కరు లేరంటే అతిశయోక్తి కాదేమో. తన పాండిత్య ప్రతిభచే, సహజకవిగా వాసికెక్కిన పోతనామాత్యుని భాగవత పద్యాలు ఇంటింటా తాండవమాడేవి. భక్తిమార్గంలో ప్రజామన్ననలందిన పోతనకు తిరుగులేదు. వేమన తమ కవితను కమ్మని ఆటవెలదులలో సరళమైన, జనబాహుళ్యములోని వాడుకలోని కమ్మని పదాలతో, తన అనుభవ సారాన్నంతా వెదజల్లిన పరమ యోగి వేమన. ఆయన అనుభవాల అనుభూతులు సర్వుల మనోభావాలతో మమైకమనందువలన ప్రజాహృదయంలో తిష్టవేసుకొని కలకాలం నిలిచిపోయాడు.

పూర్వ కాలంనుండి మునులు, ఋషులు, తమ శరీరాలను ప్రయోగశాలలుగా మలచుకొని అనేక అద్భుత, అమోఘ, అపూర్వ విషయాలను కనుగొన్నారు. తత్త్వాన్ని ఒడిసిపట్టుకొన్న సాధకులు గొప్ప బోధకులవుతారనేది జగద్విితమే. ఆ పరమ సత్యాన్ని, సాక్షాత్కరించుకొన్న పరిపూర్ణ తత్త్వజ్ఞులు, ఆ అపూర్వ జ్ఞానాన్ని, తమలోనే నిగూఢంగా దాచుకోకుండా, తమతోనే జీర్ణమైపోకుండా, పదిమందికీ ఆ అమృత తత్త్వాన్ని పంచాలనే విశాల హృదయంతో జనసంచారం చేస్తూ దాన్ని వెదజల్లుతుంటారు. దాన్ని ఏరుకొని జీర్ణింపజేసుకొనేవారు ధన్యులు. జనన మరణాలు మానవులందరికీ సమానమే. దాన్లో హెచ్చుతగ్గులుండవు. ఎటొచ్చీ మన బ్రతుకులలోనే అసమానతలు. ఈ తేడాలు ఎక్కడినుండి, ఎందుకు వస్తున్నాయి, ఎవరు, ఎందుకు కల్పిస్తున్నారు? దానివల్ల వారికి ఒరిగేదేముంది? ఈ ప్రశ్నలకు జవాబులు మర్మమెరిగిన మహా మహితాత్ములే చెప్పగలరు. వివరణ దార్శనికులు మాత్రమే సహేతుకంగా ఇవ్వగలరు. వారు తమ ప్రబోధన ద్వారా మానవత్వాన్ని మేల్కొలిపి, సంఘాన్ని సన్మార్గంవైపు నడిపించగల సత్తా కలిగిన ధీరులు. వేమన బాట కూడా అదే. వ్యవస్థను, వ్యక్తిగత జీవన సరళిని మార్చగల గొప్ప దార్శనికుడు.

*నీతి తెలియజెప్పు నిజముగ వేమన / పాతకములనెల్ల పారబట్టి /*
*లోతు తత్త్వమరసి లోకులకును జెప్పు / విశ్వదాభిరామ వినురవేమ*

నీతిని సర్వులకు తెలియజేయుటకు పాతకములన్నిటిని నిరోధించి, తత్త్వాన్ని లోతులకెళ్ళి, పరిశీలించి, లోకులకు చెప్పుచున్నాడని అర్థం అవుతుంది. తన అనుభవ సారమంతా పద్యాల రూపంలో లోకానికి వెళ్ళడించారు.

వేమన నాస్తికుడు కాడు. అతనిలో ఎక్కడా ఆ ఛాయకూడా కనబడదు. విగ్రహారాధన, సంఘంలోని కొన్ని ఆచారాలను ఖండించినంత మాత్రాన ఆయన నాస్తికుడైపోడు. విగ్రహారాధన గురించి, బ్రహ్మసూత్రాలలోగానీ, ఉపనిషత్తులలోగానీ లేదు. భగవద్గీతలో సగుణ, నిర్గుణోపాసనల గురించి తెలుపబడింది. సగుణం నుండి నిర్గుణానికి వెళ్ళడానికి

విగ్రహారాధన సోపానంగా సూచించబడింది. సగుణోపాసనే పరమార్థమని ఎక్కడా చెప్పబడలేదు. స్వామి దయానంద సరస్వతీ స్వాములవారుగూడ వేదాలను స్తుతిస్తూ, విగ్రహారాధనను నిశితంగా ఖండించారు. అంతమాత్రంచేత ఆయన నాస్తికుడు కాడు. హేతువాదులు చంకలు గుద్దుకోవడానికి, విగ్రహారాధ ఖండన, సంఘ దురాచారాలను ఖండించడాన్ని సాకుగా గైకొనుట తగని పని. అదే కోవకు చెందినవాడు స్వామి వివేకానంద. తన జ్ఞాన సంపత్తిని నలుమూలల వెదజల్లిన మహనీయుడు, మానవతావాది.

*"మాటలుడుగకున్న మంత్రంబు దొరకదు / మంత్రముడుగకున్న మనసు నిలువదు / మనసు నిల్పకున్న మరి ముక్తిలేదయా"*

ఇది వేమన నిశ్చితాభిప్రాయం.

16–17 శతాబ్దాలలో అనేక మహానుభావులు భక్తి ఉద్యమంలో పాల్గొని సంఘంలోని కుళ్ళును కడిగివేసేదానికి పూనుకున్నారు. కన్నడ దేశంలో శైవులు అదేపని చేశారు. కుల, మత నిర్మూలనకు అవిశ్రాంత కృషి చేశారు. శైవ మతంలోకి తర, తమ భేదాలు లేకుండా, కులాల పట్టింపు లేకుండా అందరినీ ఆహ్వానించి అగ్రాసనమిచ్చారు. ఏ ఒక్కరిని కించపరచలేదు. తక్కువగానూ చూడలేదు. సోమనాథుని *బసవ పురాణమే* ప్రబల తార్కాణం. తెలుగునాట కూడా అనేక మహాత్ములు ఈ భావాలను వెదజల్లుతూ వసుధైక కుటుంబానికి బాటలు వేసిన వారెందరో!.. చరిత్ర పుటలు తిరగవేస్తే అర్థమవుతుంది.

వేమన పద్యాలు చాలావరకు తంత్ర గ్రంథాల శ్లోక భావాలు, కులార్ణవ తంత్రము, మహానిర్వాణ తంత్రము, తంత్ర చూడామణి మొదలగు గ్రంథాల అనువాద"మని వేమాని విశ్వనాథశర్మ గారి అభిప్రాయం.

ఆరుద్ర గారు వేమన మొట్టమొదట సంస్కృత శ్లోకాల్లోని భావాలను తెనిగించి చేసేవారని, శ్లోకం – ఉత్పలమాలలో, వేమన అనువాదాన్నీ ఉదహరించి చూపారని చెప్పారు. నాగార్జునుల *రత్నావళి* శ్లోకాలను ఛాయగా వేమన పద్యాలను పసిగట్టానని త్రిపురనేని వేంకటేశ్వరరావుగారు తమ *వేమన పరిశోధనా గ్రంథంలో* పేర్కొన్నారు.

వేమనది పోలికలేని ప్రజ్ఞ. వీరు ఏ సిద్ధాంతానికి కట్టుబడని స్వేచ్ఛాకవి. వీరి పద్యాలలో ద్వైత, అద్వైత, శైవ, జైన, రసవాద, అచలవాదుల భావాలు విరివిగా ఉన్నాయని విమర్శకుల అభిప్రాయం. వేమనను సాంఘిక తిరుగుబాటుదారుడని ఆధునిక వామపక్షవాదులు అన్నంతమాత్రాన ఆయన అనేకానేక సంస్కరణలకు పూనుకొన్నట్లు కనిపించదు. ఆయన తిరుగుబాటుతనమంతా కులవ్యవస్థను కూలద్రోయటానికే. మధ్యయుగం నుండి ప్రబలిన కులవ్యవస్థ వికృత రూపాన్ని కళ్ళకు కట్టినట్లు చూపి, దాన్ని తీవ్రంగా విమర్శిస్తే, నేటి నాయకులు మా కులంవాడని, మా ప్రాంతంవాడని, ఘోషిస్తూ, తమ లేకితనాన్ని బయటపెట్టుకుంటున్నారు. ఏ కులం వాడైతేనేమి, ఏ ప్రాంతంవాడైతేనేమి? ఆయన చెప్పిన సుద్దులు మనం ఆచరించి బాగుపడాలని వేమన జీవితాశయం.

*"కుండ కుంభమన్న, కొండకుదరమన్న / నుప్పు లవణమన్న నొకటికాదె"* అంటూ భాషలెన్నియైనను, భావమొక్కటే, పరతత్త్వమొక్కటేనంటారు. భావ ప్రాధాన్యతకు పెద్దపీట వేశారు. వెతలదీర్చువాడు వేదాంతవైద్యుడంటారు. నిజమే. కష్టాలు, వెతలు, సమస్యలతో సతమతమయ్యే బాధితులకు తత్త్వాన్ని బోధించి, కష్టసుఖాలను వివరించి, అవి ఎందుకొస్తుంటాయో, వాటి స్వరూప స్వభావాలను విడమరచి సాంత్వన చేకూర్చువాడే నిజమైన వేదాంతి. సమస్యలను తత్త్వపరంగా విశదీకరిస్తే, దానిని ఎలా ఎదుర్కోవాలో తెలిసికొని, ఆత్మవిశ్వాసంతో నిబ్బరంగా ఉంటాడు. యుద్ధరంగ మధ్యంలో రణం చేయాలా, వద్దా అనే సందేహాస్పదంతో ఉన్న అర్జునునికి

తత్త్వముపదేశించి, కర్తవ్య నిర్వహణకు పురికొల్పి సమస్యను పరిష్కరిస్తాడు భగవాన్ కృష్ణపరమాత్మ. తత్త్వవేత్తల భావన ఇదేనని వేమన్న నిశ్చితాభిప్రాయం.

"వేమన ప్రబోధించే సంసారయోగంలో వెతలుండవు. ఆనందముంటుంది. ఆలుమగల అన్యోన్యముంటుంది" అంటారు ఆరుద్ర తన *వేమన్న వేదం*లో. అందరూ ప్రగాఢంగా నమ్మే ముహుర్త జాతకాలను హేళనచేస్తూ–

*విప్రులెల్ల గూడి వెర్రికూతలు కూసి / సతిని పతిని గూర్చ సమ్మతము గా / మును ముహుర్త ముంచముండెట్లు మోసెరా...*

అని తీవ్రంగా ప్రశ్నిస్తున్నారు. అనేకమంది వేదపండితులు కలసి ఒక సుముహూర్తాన్ని నిర్ణయించారు. ఆ సమయానికే వివాహాన్ని శాస్త్రోక్తకంగా జరిపించారు. కానీ ఆ వధువుకు స్వల్ప కాలంలోనే వైధవ్యం వచ్చింది. ఎందుకని నిలదీస్తున్నాడు. ఇంకా *వెర్రికుక్కలవలె వేదాలు చదివారు... ఆశ్రయంబనెరుగరయ్యవారు...* అని వేదార్థాన్ని తెలియకుండా వేదాలను చదవడాన్ని వేమన గర్హిస్తున్నాడు.

బ్రహ్మజ్ఞానం పొందినవాడే బ్రాహ్మణుడని వారి భావన. యజ్ఞోపవీతం వేసుకున్నంత మాత్రాన బ్రాహ్మణత్వం వస్తుందా? ప్రాచీన ఋగ్వేద కాలంలో ఆర్యులకు యజ్ఞోపవీతాలు లేవు. రానురాను వర్ణాశ్రమ ధర్మాలు వేళ్ళూనుకున్నాయి. "ఈ ద్విజుడు పుట్టినపుడు యజ్ఞోపవీతం ఉందా" అని ఆరుద్ర *వేమన వేదం*లో అడుగుతున్నారు. *జనన కాలమందు జందెత్రాళ్ళు లేవు నడుమ జందెమిడగ నగుబాటు కాదొకో...* అంటాడు వేమన. పుట్టేటప్పుడు బట్టలేదు, పోయేటప్పుడు బట్ట ఉండదు. ఉండనివ్వరు. *నడుమ బట్ట కట్ట నగుబాటు కాదా* అంటాడు వేమన. శంకరులవారు వేదాంత వాక్యేషు *సదారమంతో* అన్న శ్లోకంలో "ఎల్లప్పుడూ వేదాంత వాక్యాలతో రమించువాడు, భిక్షాటనతో లభించిన దానితో సంతృప్తి చెందువాడు, శోక స్పర్శ లేని అంతఃకరణతో చరించే కౌపీనధారి భాగ్యవంతుడుగదా" అని ఎంతో నర్మగర్భంగా వ్యాఖ్యానిస్తాడు. ఇంకా చెట్టునీడనే ఆశ్రయంగా చేసుకొని, రెండు చేతులనే భోజన పాత్రగా చేసుకొని, ఐశ్వర్యంపట్ల విముఖత కలిగి, కౌపీనమును ధరించి సంచరించేవారికంటే గొప్ప భాగ్యవంతులెవరు, దేహాత్మ భావన తొలగినవారే కౌపీన ధారులుగా లేక దిగంబరులుగా ఉండగలుగుతారు. మన కళ్ళముందు నడయాడిన, రమణ మహర్షి కౌపీన ధారుడైతే, నిత్యానందస్వామి దిగంబరంగా ఉండేవారు. మనకు తెలియని ఇటువంటి మహాపురుషులు నేటికీ అనేకమంది ఉన్నారు. అనేకచోట్ల అజ్ఞాతంగా సంచరిస్తున్నారు. యోగి వేమనదీ ఈ పంథానే. వీరు బయట, లోపల, మధ్యగల వస్తువుల ఎడ ఆసక్తి లేనివారు, వాటిని కలనైనా స్మరించరు. కేవలం గోచిపాత్రను మాత్రం ధరించిన భాగ్యశాలురు. అష్టైశ్వర్యవంతులు. వారికి సాటియైనవారు ఎవరూ ఉండరు. సిగ్గుపడేవాడు సిద్ధుడు కాలేడని వేమన నిశ్చితాభిప్రాయం. సిగ్గు అంటే దేహాభిమానం. వేమన దేహాభిమానం వదలి విరాగియై సంచరించాడు. బ్రహ్మ విద్య, బ్రహ్మజ్ఞానం కౌపీనధారులదేనని అద్వైతుల భావన. ఎలాంటి ఆశ, ఆశయాలు లేని సర్వ సంగపరిత్యాగులకే ఆ విద్య లభించును. వారే అధికారులు.

సాధనామార్గంలో సాధకుల కొరకు అనేక అమూల్యా స్వానుభవ విషయాలను అనేక విధాల వివరించారు. ముందు చెప్పినట్లు–

*మాటలుడుగకున్న మంత్రంబు దొరకదు మంత్రముడుగకున్న మనసు నిలువదు / మనసు నిల్పకున్న మరి ముక్తి లేదయా...*

ధ్యానమార్గంలో మనసు నిలచేందుకు మంత్రోపదేశం చేస్తారు. మనసు కోతిలాంటిది. ఒకచోట స్థిరంగా నిలవదు. నిరంతరం చలిస్తూ ఉంటుంది. మనసు అమనస్కం కావాలి. నిరంతరం చలించే మనసు చలింపజేయకుండా ఉండడానికి ధ్యాన మార్గం అత్యుత్తమమైనది. మనసుకు ఏదో ఒక ఆలంబన

ఉండాలి. అది మంత్రం కావచ్చు, శ్వాసకావచ్చు, లేదా ఒక మూర్తికావచ్చు. దానిపై మనసు నిలపమంటారు. దానిలో భాగమే మంత్రం. సాధనాక్రమంలో మంత్రం, ఆలోచన, మాయమై ఏమీ లేని స్థితి వస్తుంది. దాన్ని నిశ్చలస్థితి అంటారు ఏకాగ్రత కాదు. ఆ స్థితిలో ఏ ఆలోచనా ఉండదు. మన చుట్టూ జరిగే విషయాలు మనకు తెలుస్తుంటాయి. కానీ మనలో ఎలాంటి ప్రతిక్రియా ఉండదు. స్పందన ఉండదు. ఆ స్థితిని కూడా అధిగమించగలిగితే అత్యద్భుత శక్తులు లభిస్తాయంటారు. ఆ స్థితిలో మార్గం సుగమమౌతుందని శాస్త్రాలు ఉద్ఘోషిస్తాయి. ఇదే విషయాన్ని వేమన క్లుప్తంగా చెప్పారు.

*నిద్రలోని నిద్ర నిజముగా దెలిసిన / భద్రమౌన నిద్ర బ్రహ్మవిద్య / నిద్ర దెలియువాడు నిర్మలయోగిరా...*

మనలోని నిద్రను గురించి తెలిసినవారు చాలా అరుదు. కానీ మనందరి అనుభవంలో ఉంది. కానీ మనకు తెలియదు. నిద్ర ఎప్పుడు వస్తుంది? ఎందుకు వస్తుంది? ఎలా వస్తుందంటే అడ్డదిడ్డంగాకాక సూటిగా చెప్పగలగాలి. ఎవరైనా నేను రాత్రి ఇన్నిగంటలా ఇన్ని నిమిషాల, ఇన్ని సెంకడ్లకు ఖచ్చితంగా నిద్రపోయానని చెప్పగలడా? కావాలంటే గడియారం ప్రక్కనపెట్టుకొని ప్రయత్నించండి. ఎందుకంటే నీవు చెపితే అది మెలకువ అవుతుంది. అలాగే నిద్ర నుండి నిన్ను మేల్కొల్పేదెవరు? ఏమిటి? ఎందుకు నిద్రలేస్తున్నావు? జవాబులు చెప్పగలరా? ఇంకా నిద్రాస్థితి ఏమిటి? మనకు ప్రధానంగా మూడు అవస్థలు (తురీయం నాలుగవది) గురించి మన అనుభవంలో ఉన్నాయి. మెలకువ, కల, నిద్ర. ఈ మూడు భిన్నావస్థలు. మొదటి రెండింటి గురించి అందరికి తెలుసు. ఈ రెండవవస్థలలో నీవున్నావని తెలుస్తుంది. కానీ మెలకువలోని నీవు, నీవుగా కలలో ఉండవు. అది భిన్నస్థితి. జాగ్రతావస్థలో ప్రమాదంలో కాళ్ళు విరిగి వైద్యశాలలో వైద్యుల పరివేక్షణలో ఉంటావు. కానీ నీకొక మంచి కల వస్తుంది. అందులో పరుగుపందెంలో పాల్గొని బహుమతులు గెలుచుకున్నట్లు ఉంటుంది. ఇదెలా సాధ్యం? ఇదే కాదు, ఇలాంటివి అనేకం. కాబట్టి మెలకువలో ఉండే, నీకు, కలలో ఉండేవాడు ఒకడు కాదు. మరి వాడి సంగతి మెలకువలు చెప్పగలుగుతున్నావు. ఇద్దరూ ఒకటా? వేరువేరా? కలలో అనేకం చేస్తుంటావు. మెలకువ రాగానే అవేవి ఉండవు. మరి కల అబద్ధమా? అబద్ధమైతే, కలల దెయ్యం. కనిపిస్తే బెబ్బర కొట్టుకుంటే, గట్టిగా అరుస్తుండే ప్రక్కవాళ్ళు తట్టి లేపుతారుకదా! నీవు మెలకువ నుండి చూస్తే అది అబద్ధం. కలలో ఉన్నంతవరకు అది నిజమేకదా. కలల గురించి ఫ్రాయిడ్‌లాంటి వారి పరిశోధనలు చేసి ఉండవచ్చు. కానీ ఇలాంటి ప్రశ్నలకు జవాబులు ఒక్క మనదైన *ముండకోపనిషత్తు* మాత్రమే జవాబియ్యగలదు. దానిపై శంకరులవారి భాష్యం అత్యద్భుతం. ఇక నిద్ర సంగతి. నిద్రలో నీవున్నావా? ఉండే ఏ రూపంలో ఉన్నావు, నిద్ర అంటే గాఢనిద్ర. ఆ స్థితిలో నీ చుట్టూ ఏమి జరిగేది నీకు తెలియదు. ఇతరుల మాటలు వినబడవు. శరీరంపై తేళ్ళు ప్రాకినా తెలియదు. ఇది ఒక విధంగా మరణంలాంటిది. అంటే ప్రతిరోజూ అది మన అనుభవంలోనిది. నిద్రలో అనుభవించే ఆనందం అనిర్వచనీయం. అందరూ దాన్నే కావాలంటారు. మత్తుపదార్థాలు సేవించేది, అన్నీ మరచిపోయి ఆనందంగా ఉండడానికే. అన్నీ మరచిపోతే ఆనందంగా ఉండవచ్చు. ఈ ఆనందం ధ్యానంలో కూడా పొందవచ్చు. మత్తుపదార్థాల జోలికి పోకుండా దీన్ని పొంది ఆరోగ్యవంతులుగా ఉండవచ్చు. నిద్రావస్థను గురించి వివరంగా *ముండకోపనిషత్తులో* ఉంది.

*తన్నువెదకి జూడ దానెపో జీవుండు / తత్త్వమరసి జూడ దానె యాత్మ / బ్రహ్మమనగ వేరే పరదేశమున లేదు బ్రహ్మమనగ తానె బట్టబయలు / తన్ను తా నెరిగిన తానె పో బ్రహ్మంబు*

అద్వైతుల బాట అదే. రమణ మహర్షులు కూడ తన్ను

తానెరగమంటున్నారు. 'నేనెవరిని?' అని ప్రశ్నించమంటారు. అదే తారక మంత్రమన్నారు. ఇంకా *లోను జూడ జూడ లోకాభిరామంబు / బయలు జూడ బంధనంబు / తన్నుజూడ తారక బ్రహ్మంబు...* ఇవన్నీ ఒకటే బోధిస్తున్నాయి. ఇది తెలియక మానవుడు కొట్టుమిట్టాడుతున్నాడు. మునిమనవళ్ళపై మమకారం తెంచుకోలేక బంధాలలో మునిగి జీవితాన్ని నికృష్టంగా కడతేర్చుకుంటున్నాడు. నీవు ఎందుకు బ్రతుకుతున్నావు? డబ్బు సంపాదించడానికా, కీర్తిప్రతిష్టలకా, అధికారానికా? ఇవన్నీ పొందినవారు ఎంత సుఖపడ్డారో, వారి జీవిత చరిత్రలు తిరగేయండి. అలెగ్జాండర్ ప్రపంచ విజేతయ్యాడు. అతని చావు ఎలాంటిదో ఒకసారి పరికించి చూస్తే అర్థమవుతుంది. అసలు సుఖమంటే ఏమిటి? అది ఎక్కడ లభ్యమవుతుంది. మానవుని నిత్యాన్వేషణ దేనికొరకు. బాహ్యవస్తువులన్నిటిలో గాలిస్తున్నాడు. తినే తిండిలో, కట్టుకొనే గుడ్డలో, నివసించే ఇంటిలో, పదవిలో, డబ్బులో అన్నిటా వెతుకుతున్నాడు. ఎక్కడా కనిపించక, కనిపించని దేవుళ్లవెంట పడుతున్నాడు. తీర్థయాత్రలు, తిరునాళ్ళు, లెక్కలేనన్నిచోట్ల వెదుకుతున్నాడు. ఈ వెదుకులాట చివరకు నిరాశనే మిగులుస్తుంది. నిన్ను నీవు అంతరింగుడవై పరిశీలించి నీవెవరో తెలుసుకొంటే నీకు జవాబు దొరుకుతుంది.

తన యోగాన్ని కొనసాగిస్తూ, *నిన్ను జూచెనేని తన్ను తా మరచు / తన్ను జూచెనేని నిన్ను మరచు / నేవిధమున జనుడనెరు నిన్నును దన్ను...* ఇక్కడ అంతర్ముఖుడై భగవంతుని చూస్తే బాహ్యప్రపంచం మాయమైపోతుంది. బయట ప్రపంచాన్ని చూస్తే బ్రహ్మ కనబడదట. ఈ బంధాలు కష్టాలు కన్నీళ్ళు గోచరిస్తాయి. నేటి కపట గురువులు కొందరు, ఈ ఆధ్యాత్మికతను వ్యాపారంగా మార్చి సకల ఐశ్వర్యాలను అనుభవిస్తూ, కల్లబొల్లి మాటలతో ప్రజలను మభ్యపెట్టి, భ్రమలు కల్పిస్తున్నారు. నీ నెత్తిన చెయ్యిపెట్టి నీకు శక్తిపాతం చేస్తానని భ్రమింపచేస్తూ కోట్లకు కోట్లు సంపాదించి కులుకుతున్నారు. వీరు సన్యాసులు కారు. మనమాదిరి సంసారులూ కారు. సంసార జంఝాటముండేవారికి ఇది లభించే ప్రసక్తే లేదని శాస్త్రాలు ఉద్ఘాటిస్తుంటే, వీరేమో ఈ వ్రతం చెయ్యండి, ఇది లభిస్తుంది, ఆ వ్రతం చెయ్యండి అది అని ఫలానా ఫలానా వస్తాయని మాయమాటలు చెప్పి ధనాన్ని గుంజుకుంటున్నారు. ఒక్కోదానికి ఒక్కో రేటు. పాదపూజకు ఇన్ని లక్షలు, మంత్రోపదేశం చేస్తే ఇంత అని వెలలు నిర్ణయించేశారు. కొందరు కొబ్బరినూనెతో సర్వరోగాలు కుదురుస్తామని, వాళ్ల దేవుడిని ప్రార్థిస్తే ఫలితం ఉంటుందని జనాన్ని భ్రమల్లో ముంచెత్తుతున్నారు. అమాయకులే కాదు, బాగా చదువుకున్నవారు కూడా వీటికి తలొగ్గి గిలగిలలాడుతున్నారు. నిజమైన స్వాములు డబ్బును అడగరు. రమణ మహర్షి అరుణాచలం వచ్చిన తదుపరి తన జీవితం చివరి వరకు ఒక్క పైసా కూడా ఆయనను తాకలేదు. అది సరియైన సన్యాస జీవితం. ఎవరిని నుంచీ ఏమీ ఆశించకుండా నిర్మల హృదయంతో తన జ్ఞానాన్ని అందరికి వెదజల్లారు. తర తమ భేదాలు లేకుండా అందరినీ ప్రేమించారు. ఆదరించారు. అందుకే వేమనగారంటారు–

*కల్ల గురుదు గట్టు నెల్ల కర్మంబుల / మధ్య గురుదు గట్టు మంత్ర చయము / ఉత్తముందు గట్టు యోగసామ్రాజ్యాలు*

ఎంత గొప్పగా సెలవిచ్చారు. గురువులలోని రకాల వెల్లడిస్తున్నారు. కపట గురువులు కర్మ అంటే ఆ మంత్రం జపించు, ఈ యాగం చెయ్యి, ఆ పూజ చెయ్యి, ఆ గుడిచుట్టూ తిరుగు, ఆ దేవుడిని దర్శించులాంటివి చెపుతుంటారు. మధ్య గురువు మంత్రోపదేశాలు చేస్తుంటారు. ఉత్తముడైన గురువు నిన్ను యోగిగా మార్చి యోగసామ్రాజ్యాభిషిక్తుడ్ని చేస్తాను. దేవుడు చూచేవాడు కాదు. తెలుసుకొనేవాడు. నీవు తెలుసుకోవలసినవాడు. అదే జ్ఞానబోధ.

**అమినేని సిద్ధయ్య నాయుడు**
**రాజంపేట, కడప. ఫోన్ : 944 094 1462.**

### ప్రపంచ చరిత్ర - ప్రత్యక్షసాక్షులు

# క్యూబా విప్లవం

*– ముక్తవరం పార్థసారథి*

పాతికేళ్ళకు పైగా క్యూబా రాజకీయాలను శాసించాడు బాటిస్టా. ఈయన పూర్తి పేరు రూబెన్ ఫుల్ జెన్సియో బాటిస్టా జాలివర్. ఒక శ్రామిక కుటుంబంలో 1901లో జన్మించాడు. తల్లిదండ్రులిద్దరూ, క్యూబా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు (అంతకు ముందు క్యూబా, స్పెయిన్ అధీనంలో ఉండేది). సైన్యంలో సార్జంట్‌గా చేరిన బాటిస్టా, క్యూబాలో రెండుసార్లు అధికారం చేపట్టాడు. మొదటిసారి 1933లో సార్జంట్ల తిరుగుబాటుతో నియంతగా ఉన్న జెరాడో మచాడోవైమోరేల్స్‌ను పదవీచ్యుతుణ్ణి చేసి, తాను స్వయంగా సైనిక ప్రధానికారి బాధ్యతలు చేపట్టాడు. రెండవసారి 1948లో ఎన్నికల్లో ఓటమి తప్పదని తెలిసినప్పుడు మరోసారి సైనిక తిరుగుబాటుచేసి అధికారంలోకి వచ్చాడు. కాని ఫిడెల్ కాస్ట్రో (1926–2016) అనబడే యువకుడి నాయకత్వంలో జరిగిన సాయుధ విప్లవ ఫలితంగా, దేశం విడిచి పోర్చుగల్‌లో తలదాచుకున్నాడు.



చే - కాస్ట్రో

1926లో సంపన్న స్పానిష్ దంపతులకు జన్మించాడు ఫిడేల్ కాస్ట్రో. 1945లో హవానా యూనివర్శిటీ నుండి లా డిగ్రీ తీసుకున్నాడు. 1954లో మెక్సికోలో చె గువెరా తో స్నేహం కుదిరింది (అప్పటికే మాంకాడా ఆర్మీ బారక్స్ మీద దాడి చేసిన కాస్ట్రో కొంతకాలం మెక్సికోలో గడిపాడు). త్వరలోనే ఇద్దరూ విప్లవ సహచరులుగా మారి, లాటిన్ అమెరికా నుండి వలస పాలకులను తరిమికొట్టి, పేదరికాన్ని నిర్మూలించటమే తమ లక్ష్యంగా ముందుకు సాగారు. 1928లో అర్జెంటినాలో ఒక ఎగువ మధ్యతరగతి కుటుంబంలో జన్మించాడు ఎర్నెస్టో గువేరా డిలా సెర్నా. రెండేళ్ళప్పుడే పిల్లవాడికి ఉబ్బసం వ్యాధి సోకటంతో తల్లిదండ్రులు ఆల్టా గ్రేసియా అనబడే మరో ఊరికి మకాం మార్చారు. బాల్యంలోనే మార్క్సును, ఫ్రాయిడ్‌నూ అధ్యయనం చేశాడు. 'చె' 1953లో బ్యూనోస్ ఎయిర్స్ యూనివర్శిటీ నుండి వైద్యవిద్యలో పట్టా తీసుకున్నాడు.

**క్యూబన్ విప్లవం:**

ఈ విప్లవానికి ఆదినుండీ అన్నీ అడ్డంకులే. విజయవంతమయ్యే అవకాశాలు ఎంతమాత్రం లేవు. పేరుకే విప్లవంగాని, సరిపడా మనుషులు లేరు. డబ్బులేదు, ఆయుధాలు లేవు, పటిష్టమైన సంస్థాగత నిర్మాణమూ లేదు. విప్లవకారులు వచ్చిన పడవ (Yacht) Granma (పడవ పేరు) మంచి కండిషన్‌లో లేదు. రంధ్రం పడి లోపలికి నీళ్ళు చేరుకున్నాయి. పైగా అధిక బరువుతో మునిగిపోయే ప్రమాదమూ లేకపోలేదు. అటువంటి Yachtలో మెక్సికో నుండి క్యూబా చేరుకున్నాడు కాస్ట్రో.

అప్పటికే సాంటియాగో డిక్యూబా (క్యూబా ఆగ్నేయ ప్రాయంలో ఉన్న నగరం)లో తిరుగుబాటు జరుగుతున్నది. కాస్ట్రో వచ్చిన Yacht అక్కడికి చేరటానికి రెండు రోజులు

ఆలస్యమైంది. తిరుగుబాటును పూర్తిగా అణచివేశాడు బాటిస్టా. క్యాస్ట్రో, అతని అనుచరులను కూడా తుడిచి పెట్టడానికి సిద్ధంగా ఉంది సైన్యం. Granma తీరం చేరటాన్ని గుర్తించాయి హెలికాప్టర్లు. విప్లవకారులు, తమ పడవను మరోచోటికి తరలించారు. పదకొండురోజుల పాటు యుద్ధం కొనసాగింది. ఎనభైరెండుమంది విప్లవకారులు హతులయ్యారు. తీవ్రంగా గాయపడ్డారు. ప్రాణాలతో బతికి బయటపడ్డ పదకొండుమంది పర్వతాల్లో తలదాచుకొన్నారు (వీళ్ళలో ఫిడేల్ క్యాస్ట్రో, రావుల్ క్యాస్ట్రో (ఫిడేల్ సోదరుడు); చె గువెరా కైడా ఉన్నారు). ఇంత నిరాశాజనకంగా ప్రారంభమైన క్యూబన్ విప్లవం, చివరికి, విజయవంతమైంది.

ప్రత్యక్ష సాక్షి:
క్యూబన్ విప్లవంలో ప్రధానపాత్ర పోషించాడు చె గువెరా. విప్లవం తర్వాత ప్రభుత్వంలో ఉన్నత హోదా లభించింది. అయినా అసంతృప్తితో క్యూబా వదిలి, 1965లో కాంగో, బొలివియాలలో విప్లవ గెరిల్లా దళాలను నిర్మించటానికి తన ప్రస్థానాన్ని ప్రారంభించాడు. రెండేళ్ళ తర్వాత CIA - బొలివియన్ ప్రభుత్వ దళాలు అతణ్ణి పట్టుకుని కాల్చివేశాయి.

'చె' అంటే అర్జెంటైనా – స్పానిష్ మాండలికంలో "Wow" లేక "Hey" అని అర్థం.

**క్యూబన్ విప్లవాన్ని గురించిన 'చె' కథనం:**
పూర్తిగా అలసిపోయాం. ఓపిక లేదు. డిసెంబర్ 2 నాడు లాస్ కొలరాడాస్ బీచ్‌కు చేరింది పడవ. వెంటతెచ్చుకొన్న సామగ్రి అంతా పోగొట్టుకొన్నాం. ఉప్పునీటి బురద గుంతలో అడుగులో అడుగువేసుకుంటూ నడిచాం. నిరంతరంగా అందరికీ కాళ్ళు బొబ్బలెక్కి పగిలి రసిక కారుతుంది. ఆ బాధతోనే నడవాలి. బూట్లు ఒరుసుకుపోయి అడుగు వెయ్యాలంటే నరకప్రాయమైంది. పగిలిన పుళ్ళతో మరే రోగాలు వస్తాయో తెలియదు. అయితే మాకున్న ప్రధాన సమస్యలు ఇవికాదు.

గల్ఫ్ ఆఫ్ మెక్సికో, కరీబియన్ సముద్రాల్లో ఏడువారాల ప్రయాణం తర్వాత క్యూబా చేరుకున్నాం. తిండి లేదు. బోట్ కండిషన్ బాగోలేదు. సముద్ర ప్రయాణం అలవాటు లేకపోవటంవల్ల అందరం Sea-Sicknessతో బాధపడ్డాం. ఎదురుగాలి ఉన్నప్పుడు సముద్ర ప్రయాణాల్ని అనుమతించరు. అటువంటి పరిస్థితిలో నవంబర్ 25 నాడు టక్స్‌పాన్ పోర్టు నుండి బయల్దేరాం. ఇప్పుడు ఆరోగ్యం ఇలా దిగజారటానికి ఇవన్నీ కారణాలే. పోరాట అనుభవంలేని కొత్త సభ్యుల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది.

ఆయుధ సామగ్రి అంతా పోగొట్టుకున్నతర్వాత మా దగ్గర మిగిలింది కొన్ని రైఫిళ్ళు, కార్ట్రిడ్జ్ బెల్ట్‌లు, తడిసిన మరికొన్ని తుపాకులు మాత్రమే. మందులు, ఇతర వైద్యపరికరాలేమీ మిగల్లేదు. మా Backpackలను మురికి నీటి గుంతల్లో వదిలేశాం. గత రాత్రి ఒక చెరుకుపొలం గుండా నడిచాం. చెరుగ్గడలు నమిలి ఆకలి, దాహం తీర్చుకున్నాం. కాని, అనుభవం లేకపోవటంవల్ల నమిలి ఉమ్మేసిన పిప్పిని అక్కడే వదిలేశాం. ఇలాంటి ఆధారాలు లేకపోయినా, ప్రభుత్వ దళాలు మమ్మల్ని వెతికి పట్టుకోగలవు. అది వేరే సంగతి. కొన్నేళ్ల తర్వాత తెలిసింది – మాకు గైడ్‌గా వ్యవహరించిన వ్యక్తే మాకు ద్రోహం చేశాడని. మా జాడ సైనికులకు తెలిపింది అతడే. రాత్రికి విశ్రమించే ముందు మేం అతణ్ణి వెళ్ళిపోవటానికి అనుమతినిచ్చాం. అదే మేం చేసిన తప్పు. కాని మా సుదీర్ఘ పోరాటంలో అలాంటి పొరబాట్లు చాలాసార్లు చేశాం. ఇక నడవలేని స్థితిలో, విశ్రాంతి కోసం నాయకులకు మొరపెట్టుకున్నాం. మధ్యాహ్నం పూట ఒక సాధారణ దృశ్యం కనిపించింది. ఆకాశంలో విమానాలు చక్కర్లు కొట్టాయి. మావాళ్ళు చెరుగ్గడలు నరికి, చీల్చుకుని తింటూనే ఉన్నారు. విమానాల్లోని శతృవులకు శత్రువులు తాము కనిపిస్తున్నామని గ్రహించలేదు వాళ్ళు. విమానాలు తక్కు వేగంతో, కిందుగా ఎగురుతున్నాయి. క్యామ్రేడ్ మోంటేన్, నేను ఒక చెట్టుకు ఆనుకుని నిలబడి మా రేషన్ (సగం సాసేజ్, రెండు బిస్కట్లు) తింటున్నప్పుడు తుపాకి పేలిన శబ్దం వినిపించింది. మరుక్షణం తూటాలు వర్షించాయి. మా ఎనభై ఇద్దరి మీద. నా దగ్గర తుపాకీ ఉందిగాని అదంత మంచిదేం కాదు. ప్రయాణంలో ఉబ్బసంతో నా ఆరోగ్యం పాడుకావటంవల్ల నేనే కోరి

ఆ తుపాకీ తీసుకున్నాను. బలహీనంగావున్న నేను మంచి ఆయుధం ఏంచేసుకోను! ఆ తర్వాత ఏం జరిగిందో గుర్తుకు రావటంలేదు. మొదటిసారి బులెట్లు కురిసిన తర్వాత ఆల్మైడా (ఒక కామ్రేడ్) ఆర్డరివ్వమని అడిగాడు. కాని ఇవ్వటానికెవరూ లేరు. అందర్నీ ఒకచోటికి చేర్చటానికి ప్రయత్నించాడు ఫిడెల్. హఠాత్తుగా జరిగిన అతిపెద్ద దాడి అది. ఒక కామ్రేడ్ ఆయుధాల పెట్టి తీసుకువచ్చి నా పాదాల చెంత పడేశాడు. నేను దానివైపు వేలు చూపించానుగాని బాధగా "(ఆయుధాలు వాడటానికి) ఆలస్యమైపోయింది" అన్నాను (తరువాతి రోజుల్లో బాటిస్టా కిరాయ మూకలు అతణ్ణి పొట్టన పెట్టుకున్నాయి).

నేనో మీమాంసలో చిక్కుకున్నాను. డాక్టర్ని. చికిత్స చేయాలి. కాని ఇప్పుడు నేను విప్లవ సైనికుణ్ణి. నా పాదాలచెంత ఉన్న Backpackలో మందులూ, ఆయుధాలూ ఉన్నాయి. రెండూ మొయ్యటం కష్టం. ఆయుధాలనే ఎంచుకున్నాను. నాకు బాగా జ్ఞాపకం. పొదల్లో మోకాళ్ళమీద వంగి ఫాస్టినో పెరెజ్ సబ్ మషీన్‌గన్ పేలుస్తున్నాడు. నా సమీపంలో నిలుచున్న మరో కామ్రేడ్ ఆల్బెంటోసా చెరుకు పొలంవైపు నడుస్తున్నాడు. శత్రువులు గురిపెట్టి మా మీద కాల్పులు జరిపారు. ఛాతీలో ఏదో గుచ్చుకుంది. మెడమీద గాయమైంది. మరణం తథ్యమనే అనుకున్నాను. ఆల్బెంటోసా నెత్తురు కక్కుకుంటున్నాడు. లోతైన గాయం నుండి నెత్తురు ధారగా కారిపోతున్నది. 45 కాలిబర్ బులెట్ తగిలిందతడికి. "నన్ను చంపేశారు!" అని అరిచాడు. నేలమీద పడుకుని "నా పనైపోయింది" అన్నాను ఫాసిస్టోతో. ఎదురు కాల్పులు కొనసాగిస్తూ "ఏం ఫర్వాలేదు" అన్నాడతడు. కాని నేను చావబోతున్నట్లుగానే అతడు భావిస్తున్నాడని తెలిసింది. చావటానికి ఉత్తమమైన పద్ధతేమిటని ఆలోచించాను. దారులన్నీ మూసుకుపోయాయి. జాక్ లండన్ కథ ఒకటి జ్ఞాపకం వచ్చింది.

అలాస్కాలోని మంచెటెడారిలో మృత్యువు అనివార్య మనుకున్నప్పుడు కథానాయకుడు చెట్టుకు ఆని నిల్చుని గౌరవప్రదంగా మరణించటానికి ప్రయత్నిస్తాడు. మేమంతా లొంగిపోవాలని అరిచారెవరో. ఇక్కడెవరూ లొంగిపోవటానికి సిద్ధంగా లేరని అరిచారు మరెవరో. ఇబ్బందిగా శ్వాస తీసుకుంటూ జోస్ పాన్స్ నావైపు నడిచి వచ్చాడు. అతని ఊపిరితిత్తుల్లోకి బులెట్ దిగినట్లుంది. "గాయమైంది" అన్నాడు. అతని మాటల్ని ఖాతరు చెయ్యకుండా "నాకూ గాయమైంది" అన్నాను. అప్పుడు పాన్స్, గాయపడని మరో కామ్రేడ్‌తో కలిసి చెరుకు పొలంవైపు పాడుతూ వెళ్ళాడు. నేను ఒంటరిగా మిగిలిపోయాను. మరణం కోసం నిరీక్షణ. ఆల్మైడా నన్ను "యాక్షన్" కోసం ఎగదోస్తున్నాడు. భరించలేనంత నొప్పిగావున్నా చెరుకుపొలంవైపు పాకాను. అప్పుడే కిందుగా ఎగురుతున్న విమానాలు పొలంమీద గుళ్ళు కురిపించాయి (దాంతే మహా కావ్యంలోని నరక దృశ్యంలా). బీభత్సంగా మారింది పరిస్థితి. మహాకాయుడు ఒకే ఒక చెరుగ్గడ వెనక నక్కటానికి ప్రయత్నించినట్టుగా ఉంది. లేదా తుపాకుల మోతమధ్య "నిశ్శబ్దం!" అని అరిచినట్లుగా.

ఆల్మైడా దారిచూపగా, అందరం అడవిలో సురక్షిత స్థలానికి చేరుకున్నాం. చెరుకు పొలంనుండి "ఫైర్!" అన్న అరుపులు వినిపించాయి. అంతే మరుక్షణం ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి అగ్నికీలలు. కాని పరాజయ భావన నన్ను కుంగదీస్తున్నది. మరణం తప్పదని మరో ఆలోచన. చీకటిపడి ఇక నడవలేమనుకున్నదాకా ముందుకు నడిచాం. చివరికి, ఒకచోట ముడుచుకుని పడుకున్నాం. ఆకలి, దాహం నిర్వీర్యం చేశాయి. మరోవైపు దోమలదాడి. అగ్నిపరీక్షలో గట్టెకాం. యుద్ధంలో మా ప్రథమానుభవం అది. డిసెంబర్ 5, 1956 నిక్వెరా పొలిమేరల్లో, రెబెల్ ఆర్మీ అలా ఆవిర్భవించింది.




ఏటుకూరి వెంకట నరసయ్య

# క్షేత్రలక్ష్మి

**– గెల్లి రామమోహనరావు**

'రైతుబాబు నేటికింకా తొలిపూజలందుకొనలేదు. కాలం మారినకొలది వెనుకపడుతున్నాడు. ప్రస్తుత ఉద్యమాలు కొన్ని ఎండమావులలా భ్రమగొలుపుతున్నాయి. ఇక బారలుసాచి బయలు కౌగిలించిన ప్రయోజనమేమ'న్నారు ఏటుకూరి వెంకట నరసయ్యగారు.

భారతదేశానికి పల్లెలే ఉనికిపట్టు. నిరంతరం హలంపట్టి దున్నే కర్షకుడే మానవాళికాయువుపట్టు. అతని జీవన గమనమే 'క్షేత్రలక్ష్మి' కావ్యానికాధారం.

ప్రాచీన కావ్యాల్లో పల్లీయుల జీవన చిత్రణ జరిగింది. కానీ అది క్వాచిత్కము (అరుదు). ప్రబంధ పరమేశ్వరుడు ఎఱ్ఱన తన *హరివంశము*న గోకుల వర్ణనము నిసర్గరమణీయం. హృదయ గంగా ఉంటుంది. ప్రబంధ కవులలో రాయలు తప్ప మరెవరూ పల్లీయులపై ఆసక్తి చూపలేదు. రాయలు, *ఆముక్తమాల్యద* కావ్యంలో విల్లి పుత్తూరు వర్ణన కడు రమ్యంగా చేశాడు. బసవపురాణం, 'హంసవింశతి'వంటి గ్రంథాల్లో సహజ సుందరమైన పల్లీయుల ప్రస్తావన ఉన్నది. ఆధునిక కవులలో దువ్వూరి రామిరెడ్డి, తుమ్మల సీతారామమూర్తి పేర్కొనతగినవారు. వీరి కావ్యాల్లో పల్లెజీవనంలో గడుపుతున్న కృషీవలులు కాన్పిస్తారు.

గ్రామాల్లో జీవించేవారిలో ఎక్కువగా వ్యవసాయదారులే ఉన్నారు. ఆ కృషీవలులే నోటికి ముద్దనందించి జీవితాలను నిలుపుతున్నారు. తుమ్మల సీతారామమూర్తిగారు మధురోక్తంగా రైతు జీవితాన్ని చాలవరకు చిత్రించి పల్లీయుల సాహిత్యానికాధారభూతులయ్యారు.

ఏటుకూరి వెంకట నరసయ్యగారు తెలుగుజాతి మహేతిహాసమనదగ్గిన 'పలనాటి వీరభారతము'ను రచింపదలచి 'మగువ మాంచాల', 'అలుగురాజు' (రెండు భాగములు) 'నాయకురాలు', 'రుద్రమదేవి', 'ప్రేమాలోకము', సిద్ధాశ్రమము', 'త్రివేణి', 'రైతు', 'హరికథ' రచనలు చేశారు. 'క్షేత్రలక్ష్మి' కావ్య విషయాన్ని ఏడు ఘట్టాలుగా విభజించి వ్రాశారు. 'ఒప్పగింత' హెచ్చరిక శీర్షికలతో ప్రథమ ఘట్టమునకు ముందు కొన్ని పద్యాలు రచించారు.

హృదయ క్షేత్రమున రైతు ప్రధాన స్థానం పొందాడు. సంస్కారయుతమైన ఫలాలు పొందటానికర్హులైనవారిలో కృషీవలుడొకరు. అతడు సామాన్యుడు. విశ్వ జీవ కళాపారంగత్యం గడించాడు. మహదానందాన్ని పొందుచున్నాడు.

అతని వస్త్రధారణ దేశీయంగా చూడముచ్చటగా ఉంటుంది. ముతక ఖద్దరు పంచె కడతాడు. ఆ పంచె కుచ్చిళ్ళుపోసి బొడ్డున బిగిస్తాడు. చొక్కా తొడుగుతాడు. కిఱ్ఱుచెప్పులు ధరిస్తాడు. రంగురంగుల చెర్నాకోలు చేబడతాడు. చేత ములుగఱ్ఱను ధరించి కోటేరుతో పొలం బాటపడతాడు. ఆ రూపం చూస్తే అతనిలో సిరి తాండవిస్తుంది.

*బట్టతడుపుజల్లు పనికుంపుగావించే కొండ్రమేర*
*దున్నుకొనెడివాడె / తడపచుట్టి మేడి తలక్రిందులైపోయి*
*అడ్డు మోపకెద్దులంకెవేసె / కట్టు సడలించి పిడిదుం బట్ట*
*పిడిచి / పైర వాసంబు గట్టుపై నారవైచి / నిలువుగాళ్ళను*
*సెగముక్కునిప్పుగొట్టి / చుట్టముట్టించె పొగమబ్బులుపట్టిపడగ*

ఇందులో రైతురంగ వర్ణన రసభూయిష్టం. ప్రథమ ఘట్టంలో ఇట్టి పద్యాలతో వ్యవసాయక జీవనారంభాన్ని కవి చెప్పారు. ఆనాడు రైతులు తోటలకు నీళ్ళు పెట్టాలంటే

రెక్కలు ముక్కలు చేయవలసిందే. నీటిని తోడే యంత్రాలప్పటికింకా అందుబాటులోకి రాలేదు. కాలువ నీరు సదుపాయం లేకపోతే బావులనుంచి ఏతాలతో నీరు తోడి తోటలకు నీరందించేవారు. ఇది శ్రమతో కూడింది. అయినను రైతు శ్రమని తలపక రేయింబవలు కష్టపడేవాడు. ప్రతి మొక్కకు నీరందుతుంటే మనసు ఉప్పొంగేది. దానికే కవి–

*హస్త సంస్పర్శ కొకవింత హంగురెచ్చు / శ్రమము లోకార్ప వీవనల్ నెమకి తెచ్చు / జిహ్వకింపగునమృతము చిలికి తెచ్చు / కులుకు ముత్యాలసరముం గ్రుచ్చితెచ్చు*

అన్నారు.

మోటబావుల క్రింద వ్యవసాయాన్ని హృదయ సమ్మోహనంగా అభివర్ణించుట ఆ కవికే తగింది. *కుంకుమ గులాబి పూవులు కోయపడతి / కొంగు పట్టిన ముండ్లకే కోర్కెగలదో పుష్పవతినిట్లు చెనకుట పోలదనియొ / పూవుబలె రాలిపోవుట పుణ్యమనియె* సర్వ ప్రపంచాన్ని ప్రకృతి శాసిస్తుంది. అది అనుల్లంఘనీయం. ఎన్నో వింతలు, విడ్డూరాలు సృష్టిస్తుంది. మనోభావాలను మనోహరంగా తీర్చిదిద్దుతుంది. కరుణ రసాన్ని వర్షింపజేస్తుంది. మరోసారి కక్షబూని కఠినవైఖరి అవలంభిస్తుంది. అప్పుడే చూడాలి ప్రకృతి విధ్వంసనం.

ప్రకృతి రహస్యాలు బహిర్గతమవుతున్నాయి. అట్టి ప్రకృతి రహస్యాలు కవులు తమ కృతులందు వివరిస్తే సత్ఫలాలు చేకూరుతాయి. ఆ తరుణం కొరకు ఎదురుచూచి ప్రకృతి ప్రసాదింఎచే పారవశ్యకత తెలియుటకవకాశం ఉంటుంది.

రైతు పొలం దున్నిన తరువాత ఎడ్లజతకు విరామమిస్తాడు. తానంతవరకు అరకపట్టి దున్నిదున్ని అలసట పడుతాడు. ఆత్మారాయుడు ఆకలి కేకలు వేస్తాడు. క్షుధా దుగ్ధచే గర్భంలో అశాంతి రేగుతుంది. ఈ లోపల తన ఇల్లాలు వస్తున్నదా లేదా అని చూపు నిగిడిస్తాడు. పది బారలుండగ గమనించి తదేక దీక్షతో చూస్తాడు. దగ్గరకు చేరుతుంది. అనిర్వచనీయమైన వింత చర్యల భాషిస్తాడు. ఇంటి విషయాలడుగుతాడు. బిడ్డెలాగున్నాడు? ఈ చిత్తెండకు బిడ్డ మెతుకు ముట్టాడా? జిహ్వ చిహ్నలేమీ లేవుకదా! అని గుచ్చిగుచ్చి అడుగుతాడు. భర్త అడిగిన వాటికి సమాధానమిచ్చి సంతృప్తిపరుస్తుంది. కాని మనసుండబట్టలేక భర్త – *వెనుక ముందులేని వెఱ్ఱిబాగులదాన / పిల్లడెంత కక్కటిల్లువాడొ / అబ్బురాన బెట్టి యాడించి పాడింప / ఇరుగు పొరుగు వారికేమి శ్రద్ధ?* అని ఇరుగుపొరుగు వారి మనస్తత్వాన్నిచెప్పి *కట్టుకొన్నలేమపై అనురాగం పొంగి ఒంటిదానవెచట కూరేగవలెనన్న కష్టమందు జీతగాండ్రు లేరు / కాలమెన్నడింత కటువుగా దోచదు / దైవమేమి చేయతలచినాడో* అంటూ ఉవ్విళ్ళూరాడు.

కృషీవలుడెంత కష్టపడినను ప్రకృతి అనుకూలించకపోతే ఆదాయం రాదు. ఉన్న ఆస్తులు తరిగిపోతాయి. దైవం తోడ్పాటు లేకపోతే ముందు నూయి, వెనక గొయ్యిలా ఉంటుంది. గుండె రాయమవుతుంది. కానీలే ఏం చేద్దాం? అని సరిపెట్టుకొంటారు భార్యతో.

అతడు మాటల్లో పడ్డాడు. ఇల్లాలిని చూచి ఆకలే మరచిపోయాడు. కాని ఆకలి ఆకలే కదా! అన్నం తినటానికి సిద్ధమయ్యాడు. పడతి మోములో చిర్నగవు చిందులాడింది. చకచకా అన్నం కలిపింది. ముద్దలు చేసింది. ఒక్కొక్క ముద్ద నోటికందించింది. తనివితీరా ఆరగించాడు. గర్భసౌలభ్యం కష్టపడేవారికి తెలుస్తుందే. కాని లాతివారికెట్లు లభ్యమగునని కవి ప్రశ్న.

పొలాలపై పొలాలున్న ఆసామి నడవడిక చాల చిత్రంగా ఉంటుంది. కూలివారిచే చాకిరీ చేయించుకోవటమే కాని చేసిన పనికి తగినట్లుగా కూలి ఇయ్యడు. ఏమిటిదని కూలివాడు నిలదీస్తే మరుచటిరోజతని కడుపుకు సెలవు. అందువల్లనే నోరెత్తక తలవంచి గొడ్డుచాకిరిలో తలమున్కలవుతాడు.

*నీరుపోయువారు నారునాటెడువారు / ఊపిరాడకుండ నొరసి కొనిరి / ముదుము ముందుసాగె ముచ్చట్లకెడమీక మండుచుండె దురుసు పిండమచట*

కూలీలు పనిచేయటానికి పొలంలోకి అడుగుపెడితే నడుం వంచవలసిందేకాని వాల్చటానికవకాశమియ్యడు. యజమాని జఫేదారు. పొట్ట నింపుకోవడానికి ముసలివారు కూడా పనుల్లో చేరతారు. వారి పాట్లు చూస్తే జాలేస్తుంది.

వారిని గూర్చి ఏటుకూరి వారు హృదయం ద్రవీభూతమగునట్లుగా వర్ణించి చెప్పారు ఈ పద్యంలో.

*కాళ్ళు తడుబడంగ కండలు సుడియంగ / నడుమువంగి పొట్ట ముడత వడగ / పండ్ల బిగువు గూరి పరువెత్తుచున్నాడు జాలి గొలుపు ముసలి కూలి బాబు*

కూలీల చేత పనిచేయించుకోవటం యజమానికే చెల్లు. వారి బాగోగులు చూడడు ఆప్యాయంగా పులకరించడు. కన్నుల్లో నిప్పులు చెరుగుతాడు. దయదాక్షిణ్యాలు లేనివాడు. తనకు రానున్న దుర్దశను తలవనివాడు. అయ్యో పాపం! అని ఓదార్చడు. గుట్టమీద కూర్చున్న భాగ్యశాలి. కూలిబాబు పడుతున్న బాధలు దొరబాబులకు జాలి పుట్టించవు. ఆ కారణంగా రచయిత దీర్ఘదర్శియై రాబోవు భూతల స్వర్గాన్ని చూపించారు.

*గాలి నీరు వోలె గల పదార్థములందు*
*భాగకర్తలకల పంచజనులు*
*స్వార్థపరులు దీని సమ్మతింపరుగాని*
*కాలమూర్తి ప్రాలు దూలదన్న*
*చీమునెత్తురున్న జీవరాసులకెల్ల*
*ఆత్మసామరస్యమబ్బినేని*
*సంఘజీవనమ్ము జాతీయ భావమ్ము*
*నిండుదనము కలిగి నివ్వటిల్లు*

సంఘజీవనంలో జాతీయ భావాలుప్పొంగినపుడు తరతమ భేదాలు లేక వసుధైక కుటుంబంగా వర్ధిల్లాలని కవి భావన. దీనివల్ల విశ్వప్రేమ చలువ పందిళ్ళు నిర్మిస్తుంది. దరిద్ర దేవత ధామాలెన్నో కూలిపోతాయి. ధర్మనిబద్ధమైన జీవితం బీటలు వారదు. జీవనభాగ్యం సిద్ధిపొంది ఫలితాలు కలుగుతాయి.

సుఖసంతోషాల్లో కష్టపడే కార్మిక కర్షకులు సంబరపడుతారు. పదారేండ్లు ఈడుకల్గిన పడుచు పిల్లలు పల్లెపదమెత్తి కోడెగాండ్రకు కోర్కెలు గుబ్బటిలునట్లుగా పాటలు పాడతారు. ఆ పాటలతో వారంతా మైమరుస్తారు. పరిహాస పరిమళాలు వెదజల్లుకుంటారు.

ఒక్కొక్కసారి ఎంతలేదన్నా కొన్ని ఇండ్లలో సమస్యలు వస్తాయి. ఆ సమస్యలు వారి మనస్సుల్లో చేరి ఇబ్బందులు పెడతాయి. లేకలేక కుమారుడు పుడతాడు. యుక్తవయసు వచ్చిన తరువాత ఈడు జోడు బాగుందని వివాహం చేస్తే కొంతకాలం కాపురంచేసి కోడలు పుట్టింటికి వెళుతుంది. అత్తమామలను చిన్నచూపు



తుమ్మల సీతారామమూర్తి

చూస్తుంది. అత్త అది భరించక – *లేకలేకొక్క నరకుడు నాకు దక్క / దొరికె నేటికి కోడలు కొఱవి వోలె / పొట్టుదిని పుట్టినిలు సేయ బోలదనును / తొంగి చూడదు మా ఇంటి త్రోవకూడ* – సంసార పక్షంగా ఉంటుందని, చదువుకొన్న పిల్లగదాని కోడలుగా తెచ్చుకొంటే మాకే ఎసరు పెడుతుందన్న లోలోన చిందులు త్రొక్కింది. అత్తదుత్త మాటలకు కోడలు నివ్వటిల్లి దూరంగా జరిగింది. పుట్టింటికి చేరింది. సంసారంలో సరిగమలు సరిగ్గా లేకపోతే సంగీతం వినసొంపుగా ఉండదు. స్త్రీలకు సహజంగా సంతానవతులై ఉండాలనే కాంక్ష ద్విగుణీకృతమవుతుంది.

*సంతానకాంక్ష అనునది*
*కాంతకు సహజమ్ము పూట గడపక యున్నన్*
*సంతానవంతురాలత్వం తాదర గౌరవములకాస్పదమన్నా*

వారి కోరికలబ్బుర పరుస్తాయి. పుట్టబోయే బిడ్డ తన పోలికో లేక తండ్రిపోలికో అని రకరకాలుగా ఊహించుకొంటుంది. కాంతుడు ముద్దుచేస్తే చాలు కాంత ముచ్చటపడుతుంది. అత్తమామల మెప్పుకాత్రంగా చూస్తుంది. ఇట్టివన్నీ చూస్తే స్త్రీ నిజంగా సృష్టికి జీవగఱ్ఱ అనే భావన కలుగుతుంది.

సాధారణంగా గ్రామాల్లో కాయకష్టం చేసేవారెక్కువ. బాధలు, వ్యథలు, సుఖసంతోషాలు వారికి ఎరుక. దేనికైనా నడుం బిగిస్తారు. కార్యార్థులై ముందడుగువేయటం వారికి వెన్నతో పెట్టిన విద్య.

పంటచేలు పచ్చగా నిగనిగలాడతాయి. కంకులు గాలి వాటానికటునిటు కదలాడుతాయి. పక్షులు కంకులు

తినటానికి పైరు చుట్టూ ప్రదక్షిణాలు చేస్తాయి. వాటిని అధిగమించటానికి పొలం మధ్యలో మంచె కడతారు. దానిపై పురుగులుగాని స్త్రీలుగాని వడిసెలలో గులకరాళ్ళుంచి పక్షులపై విసురుతారు. ఆ విసుళ్ళకు పిట్టలు ఎగిరిపోతాయి. ఆ సందర్భంలో వడిసెల పట్టిన స్త్రీని వెంకట నరసయ్యగారు చక్కగా వర్ణించారు. పల్లెల్లో పంటచేతికొచ్చిం తరువాత కంకులను కట్టగాకట్టి ఇంటిముంగల వసారాలో వ్రేలాడదీస్తారు. పక్షులు సుతారంగా ముక్కుతో పొడుచుకొని తింటూండేవి. మరి ఈనాడవి కంటికగుపించవు. మన అవసరాలు వాటిని మ్రింగివేశాయి. కలికాల ప్రభావం ఇంతనేమో మరి.

అల్లసాని పెద్దన మెట్ట పంటను ప్రశంసించాడు. ఏటుకూరి వెంకట నరసయ్య మెట్టను, మాగానిని కొనియాడారు. రైతు జీవనం చాలా చిత్రమైంది. ఆలుమగలు కష్టించి పంట పండిస్తారు. రైతు తొలి కోడి కూతతో మేల్కొంటాడు. సేద్యానికి శ్రీకారం చుడతాడు. ప్రకృతితో పోరాడుతాడు. చెమటను పిండుతాడు. శ్రమను ఆర్పివేస్తాడు. లక్ష్యాన్ని సాధించటానికి పూనుకొంటాడు.

*పుణ్యమున లభించు పురుషుండైనను / భాగ్యమున లభించు భార్యయైన / కష్టసుఖము లందు కలసి రాకున్నచో ఇంద్రపదవియైనా హితవు కాదు*

కావ్యాంతంలో అడవిజనుల ఆటవిక జీవితాన్ని చెప్పారు. నాగరక జీవితానికి దూరంగా ఉంటారు. వేట వారి వృత్తి. ఆనాడు దొరికింది తింటారు. చెలమ నీళ్ళు త్రాగుతారు. ఆకులతో అల్లుకొన్న పొదరింటిలో నివాసం. వీరికోసం ప్రభుత్వం పథకాలు రూపొందించింది. సంఘాలేర్పరచింది. ద్రవ్యాన్ని వినియోగిస్తుంది. ఎంత చేసినా వారిలో మార్పు రావటంలేదు. దళారులెక్కువయ్యారు. ప్రభుత్వం కేటాయించిన సొమ్మును అధికారులు, అనధికారులు దిగమ్రింగుతున్నారు.

వారు మృగయా వ్యాపారా పారంగతులు. సంప్రదాయాలు పాటిస్తారు. పూజలు చేస్తారు. దోరపండు, కలేపండ్లు, చానపప్పు, వెదురుబియ్యం, వేమను బిళ్ళపొడి, జుంటితేనె, కుందేటి పెంటిబియ్యం, పబ్బాలప్పుడు విందులు చేసుకొంటారు. నెమలి పింఛపు పంచెల, సీవి దిండ్లు, ఉడుము తోల్కచ్చడాలు, సంకంపేరులు, పులిగోరు చల్లడాలను వీరు ధరిస్తారు.

ఈ జాతీయుల్లో దాంపత్య జీవితం ఎలా ఉంటుందో చూడండి –

*చట్టమర్యాదలకు లొంగజాలనట్టి*
*మగడు కొరగాని యెల్లాపి మారుమనుము*
*మన విడాకుల చట్టమ్ము మారుపేర*
*సాగుచుండును బలుగాక సంబరముల*

ఈ ప్రాంతాల్లో మతపరమైన అమానుషాలేమీ జరగవు. జాతిపేరిట దురాచారాలకు స్వస్థిచెబుతారు. ఆయా ఋతువుల్లో జీవన వికాసం మహిమాస్పదమై వెలుగొందును. మిశ్రమ ప్రకృతి తాండవమాడుచుండును. కాలవే దానికి తార్కాణం. ఏటుకూరి వెంకట నరసయ్యగారు సత్తెనపల్లి ఇలాకాలోని పెదకూరపాడు జన్మస్థలం. సాహిత్య జన్మస్థలం అమృతదారు. నివాసం మైనేని వెంకటప్పయ్యగారి అద్దెగది. కొంతవరకు తెనాలి సంస్కృత కళాశాలలో చదివారు. త్రిపుర్నేని వారి సూతాశ్రమంలో చేరారు. తలశిల హనుమయ్యగారి చేయూతతో చదువులో ముందడుగు వేశారు. చిట్టిగూడూరులో నారసింహ సంస్కృత కళాశాల (శ్రీమాన్ వరదాచార్యులుగారి నేతృత్వంలో నడపబడేది)లో చేరారు. ఉభయ భాషా ప్రవీణ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. గోవాడ సభలో 'కవిబ్రహ్మ' బిరుదులిచ్చి వీరిని సత్కరించారు.

మధురసాహిత్య నిర్మాణ కౌశల్యం కృతుల్లో కనిపిస్తుంది. తెలుగు లెస్సని మ్రోయు దివ్య సందేశాన్ని రచనల్లో వినిపించారు. రచనా శైలిలో దేశీయత్వానికి పెద్దపీట వేశారు. తెలుగుతల్లి కళ్యాణమూర్తిని కళ్ళెదుట ప్రత్యక్షం చేశారు.

*రైతు హృదయ క్షేత్రాన్ని చూపించారు*
*వృషభాల మెడలో మువ్వల రవళిని వినిపించారు.*
*విశ్వమానవ కళాకాంతులు తెలుగు అక్షరాల్లో కూర్చారు*
*అదే 'క్షేత్రలక్ష్మి'గా అవతరించింది.*

**గెల్లి రామమోహనరావు**
**ఫోన్** : 0863 - 2357514.



# మోహన గీతం

మనకు తారసపడే వ్యక్తుల్ని అర్థంచేసుకుని దగ్గరవ్వటానికంటే అపార్థం చేసుకుని దూరంగా పెట్టటానికే ఈ లౌకిక ప్రపంచంలో ఎక్కువ కారణాలు కనిపిస్తాయి. రెండు దశాబ్దాలుగా 'పరిచయం' ఉన్న మోహనప్రసాద్‌ని మనం దగ్గరగా రానివ్వటానికంటే వీలయినంత దూరంగా ఉంచటానికే ప్రయత్నిస్తాం. ఎందుకంటే ఆయన మనకు రోజువారీ జీవితంలో తారసపడే వ్యక్తి కాదు. ఆయన చుట్టూ ఒక అగ్నిగోళం మండుతూంటుంది మనల్ని దగ్గరగా రానివ్వకుండా – కాని మీరు అదే వేడిని వెన్నెల వెచ్చగా కూడా మార్చుకోవచ్చు. అప్పుడు ఒక మోహనాకారం మానసికంగా మిమ్మల్ని సమ్మోహనపరుస్తుంది. ఒక పసిబాలుడు నవ్వుతూ స్వచ్ఛంగా చేతులు చాపి మిమ్మల్ని ఆహ్వానిస్తాడు. ఒక ప్రొప్రాయిటరీగల మెచ్యూర్డు మేధావి మీ కళ్ళముందు వెలిగిపోతాడు. ఇవన్నీ మీరు ఆయన బలమైన బలహీనతల్ని అంగీకరించినప్పుడే, ఆ ఉష్ణవృత్తాన్ని వరదగుడిగా మార్చుకోగలిగినపుడే. కొండంత కొండ ప్రక్కన ఆయన చిన్న ఇంటికి చిన్న వరండాకు చిన్న వనంలో చిన్న ఊయలలో మిమ్మల్ని కూర్చోబెట్టి ప్రపంచ కవుల ఆంతర్యాన్ని బోధించగలడు. సంగీత సామ్రాట్టుల గుట్టువిప్పగలడు. అంతే అలవోకగా చిన్ని మోపెడ్ ఎక్కి 'అప్పుల అప్పారావు' సినిమాని చూసి ఆనందించగలడు.

అలాంటి 'మో'తో రెండు దశాబ్దాల కాలంలో రెండు వందల గంటలు గడిపి ఉంటాను. ఆయన దగ్గరకు నేను వెళ్ళినా, నా దగ్గరకు ఆయన వచ్చినా – అలాగే నేను జగన్నాథరావుగారు కలిసి కుట్రపన్ని ఆయన్ను లక్ష్మణరేఖ దగ్గరే ఆపే విఫల ప్రయత్నాలు చేశాం. ఆయన ఏ స్థితిలో ఇంటికి వచ్చినా ఏమాత్రం 'పెటబ్' కాని సుజాతగారి స్థితప్రజ్ఞకు వందనాలర్పించాం. బయట సన్నగా వర్షం పడుతుంటే ఎస్వీ రామారావుతో 'మో'తో ఆ వరండాలో వెలుగు చీకటులు చిత్రాల విశ్లేషణలతో, 'మో' విచిత్ర కవితల ఉత్ప్రేక్షల 'మోక్షం'లో ఎన్ని క్షణాలు బ్రతికామో – మరెన్ని క్షణాలు చితికిపోయామో!

జోరున – భోరున వర్షం పడుతుంటే నేనడిగానని నా కథాసంపుటికి సమీక్షలాంటి ముందుమాటలాంటి విమర్శలో ప్రపంచ కథా లక్షణాలను ఏకరువుపెట్టి "ఈ ప్రయాణాల మనిషి తాను నిలవడు మనల్ని నిలవనివ్వడు" అని నిందాస్తుతిచేసి జాదూ కథకుడు అని అని అనధికార బిరుదొకటిచ్చి తర్వాత ఎప్పుడు నా కథ చదివినా 'నేను కథల్ని రాయలేను' అని బాధపడి నన్ను ఎంతగానో ప్రేమించిన 'మో'ని నా జీవితంలో నుంచి నిష్క్రమించాడంటే ఇప్పటికీ అనుమానమే. ఆయన ఇంటి చిన్నగేటు తీస్తుంటే నా వంటిలో ప్రకంపనలు పుడతాయి ఎందుకు? 'ఇచ్చోటనే' మా అమ్మ అమ్మమ్మల చితులు మండి చితుకులు మిగిలిపోయాయి. 'ఇచ్చోటనే' మొగల్రాజపురం అధికారిక మరుభూమి ఉండేది. కొండ సగంపైగా త్రవ్వి ఆ కంకరను టిక్కీలలో వేసి బందరు కాలువవరకు తోసుకుపోయి పడవలు నింపి కృష్ణాజిల్లా అంతా రోడ్లువేశారు. రెండు మూడు కొండలిట్లాగే కరిగిపోయాయి. ఎందుకంటే కృష్ణాజిల్లా తూర్పులో ఎక్కడా కొండలు లేవుమరి. కాలవలు పడవలే ట్రాన్స్‌పోర్టు చాలాచాలా కాలం. అదే అక్కడే ఆ చుట్టుప్రక్కల కొండగుట్టలు చుట్టూ ఆడుకుంటున్నప్పుడు ఇవన్నీ ఆయనకు చెప్పేవాడిని. చిన్నతనం అంటే ఆయనకు ఎంతో ఇష్టం. '.. నీ 'గోడ'లో కాలవగట్టు – బల్లకట్టు – బొటనవ్రేళ్ళు గుచ్చి గట్టు ఎక్కడం.. ఇదంతా నాకు నాస్టాల్జియా'

అని మత్తుగా చెప్పేవారు. ఆయన 'విశ్రాంతి' పండక్కి అది అందరూ చేస్తుంటే ఆయన కాస్త దూరంగానే ఉండిపోయారు. ఇది రాస్తుండగానే జూలూరి గౌరీశంకర్ **మిసిమి**కి వచ్చారు. ఆయన విశ్రాంతి పండగ విశేషాలు మరిన్ని చెప్పారు. ఆ సందర్భంగా గౌరీశంకర్ రాసిన వ్యాసం ఆంధ్రజ్యోతిలో పొనుగోటి కృష్ణారెడ్డి వేయటానికి 'వాడు' అని వాడారని అభ్యంతరపెట్టారు. ఆ విషయం తెలిసి, 'పొనుగోటీ... కోనేటిరాయడు 'వాడు' అని అన్నమయ అనలేదా' అని మోహన్‌ప్రసాద్ సమర్థించినట్టు గౌరీశంకర్ చెప్పారు.

ఈ ప్రపంచానికి ఆయన ఎప్పుడు ఒక అడుగు ఎత్తులోనే నడుస్తుండేవారనిపిస్తుంది. ఓ ముప్పయి సంవత్సరాలు ముందు పుట్టారేమోననిపిస్తుంది. ఓ పదేళ్ళ ముందెళ్ళిపోయారనీ అనిపిస్తుంది!!

**మిసిమి** కోసం 'దశాబ్దాల కవిత్వ ధోరణులు' విశ్లేషించమంటే ఎంతో శ్రద్ధగా 150 పుస్తకాలు చదివి వందమంది కవులను విశ్లేషించి అందించిన ఆయన నిబద్ధతకు న'మో' వాకాలు చెప్పాం!

'మో' నిషాదానికి కవర్ మీరే ఇవ్వగలరని అడిగి మరీ తీసుకున్నారు. తనికెళ్ళ – కవికి కనకాభిషేకం 'మో'కే జరిగింది. ఆయన ఎంత ఆనందించారో **మిసిమి** కి వచ్చినపుడు చూశాం. అయితే 'మోహన గీతాన్ని' వినాలంటే ప్రపంచ కవుల సంగీతాన్ని శ్రద్ధగా ఆలకించాలి – మోజార్ట్ – బెతోవిన్ నోట్సు క్షుణ్ణంగా తెలియాలి. మెహిదీ హసన్ హస్కీ వాయిస్‌ని ఆకళింపు చేసుకోవాలి – సరే త్యాగరాజు, రామదాసు, అన్నమయ్య ఆయన ప్రక్కనే ఉంటారు! ఇంతకీ – ఇదంతా ఆయన ఇంటిప్రక్క కొండని అద్దంలో చూపటమే!



---



## సిగ్నేచర్ ట్యూన్

**– మృణాళిని**

Music is the literature of the heart; it commences where speech ends. - అన్నాడు 19వ శతాబ్దపు ఫ్రెంచి కవి, రాజనీతిజ్ఞుడు, Alphonse de Lamartine.

Our sweetest songs are those that tell of saddest thoughts అన్నాడు షెల్లీ.

దీన్నే హిందీ కవి శైలేంద్ర "హై సబ్ సే మధుర్ వో గీత్ జిన్హే హమ్ దర్ద్ కే సుర్ మే గాయేంగే" అన్నాడు.

ఇవన్నీ గుర్తుకొస్తాయి మోహన్‌ప్రసాద్‌గారి కవిత్వంలోని సంగీతాత్మకతను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తే.

'మో' హృదయధర్మం సంగీతం, ఆయన కవిత్వంలో, వినిపించే సంగీతం, నిశ్శబ్ద సంగీతం రెండూ ఉంటాయి. వినిపించే సంగీతం – ఆయన స్పష్టంగా గాయకులను, రాగాలను, పాటల పల్లవులను పేర్కొన్నప్పుడు; నిశ్శబ్ద సంగీతం – మనకు తెలీని భాషలో పాట వింటున్నప్పుడు కూడా మనలో ఒక సంచలనం, అనుభూతి కలిగినట్లు, ఆయన అస్పష్ట కవితల్లో సైతం, ఆ అనుభవం మనకు కలిగినపుడు.

విషాదానికీ, సంగీతానికీ సన్నిహిత సంబంధం ఉందన్నది తిరుగులేని సత్యం. 'మో' ఒకచోట త్రిపురను సంబోధిస్తూ అడిగారు. We enjoy a tragedy, don't we? అని (రహస్తంత్రి – ముందుమాట). ఆయన గురించి మాట్లాడినవారు చాలామంది 'మో' జీవితంలో విషాదం లేదు. కవిత్వంలో ఎందుకుందని అన్నారు. 'విషాదాన్ని ప్రేమించడానికి అది మన జీవితంలో ఉండాల్సిన అవసరం లేదు. విషాదంలో ఉన్న ఆనందాన్ని ఎవడూ వినడు' అని ఒక కవితలో ఆయన విసుకున్నారు కూడ. జీవితంలోని అసంబద్ధతను, అనివార్యతను, ఈ రెండింటిలోని విషాదాన్ని ఆయన గుర్తించారు; ప్రేమించారు. ఆనందంగా స్వీకరించారు. జీవితంలో సమాజంలో అతి ముఖ్యమైన

స్థితి, ఎప్పటికీ మారని స్థితి విషాదమని గుర్తించారు. ఆ విషాదానికి పరిపూర్ణ అభివ్యక్తిని ఇవ్వగలిగింది సంగీతమే. బహుశా అందుకనే ఆయన కవిత్వంలో సంగీత ప్రస్తావన కొంచెం ఎక్కువ. 'ప్రకటన' అన్న కవితలో నేను నా సహజసిద్ధమైన హార్మనీ పెట్టె / నొక్కునొక్కు నొక్కానంటే సిగ్నేచర్ ట్యూన్ పొర్లుతుంది అన్నారేగానీ, కవిత్వం ఉబికి వస్తుంది అనలేదు. తిలక్‌లా, శ్రీశ్రీలా కవిత్వ నిర్వచనాలు, తన కవిత్వం గురించిన వ్యాఖ్యలూ చెయ్యలేదు. తన కవిత్వానికి మెటఫర్‌లుగా సంగీతాన్నే ఉపయోగించుకున్న అరుదైన కవి మోహన్‌ప్రసాద్.

మరోరకంగా చెప్పాలంటే విషాదాన్ని అందరితో పంచుకోవడానికి ఆయన ఎంచుకున్న మార్గం కవిత్వం. అందరి బాధా తనదేనని అభ్యుదయ కవుల్లా ఆయన అనుకోలేదు. తన బాధ అందరిదీ అని భావకవిలానూ అనుకోలేదు. కానయితే, విషాద స్థితిని బహిర్గతం చేయడం ద్వారా పాఠకులను తనకు సన్నిహితం చేసుకోగలిగారు. ఎజ్రా పౌండ్ చెప్పినట్లు Poetry should be sequence of musical phrase అన్నదాన్ని 'మో' నమ్మారని ఆయనే చెప్పుకున్నారు. సంగీతం మనకర్థం అయినా కాకపోయినా, ఒక త్యాగరాజకృతి వింటున్నప్పుడు ఆ రాగం మనకు తెలిసినా తెలియకపోయినా, రాగప్రస్తారం, తానం, నెరవలు, సంగతులు, గమకాలు, స్వరకల్పన, మనోధర్మంవంటి సాంకేతిక విషయాలు మనం ఎరగకపోయినా, దాన్ని అనుభవించడానికి, ఆనందించడానికీ ఈ తెలియకపోవడం అవరోధం కాదు. 'మో' కవిత్వం కూడా అంతే. మనకు ప్రత్యక్షరం, ప్రతి భావచిత్రం ప్రతి రెఫరెన్సూ ఎప్పుడూ అర్థం కావు. కానీ 'మో' ఒక్కొక్క కవితలో ఏ అనుభూతిని వ్యక్తం చేసారో, ఆ మూడ్, ఆ మనఃస్థితి మనకు తప్పక అందుతుంది. మనం కూడా ఆ మూడ్‌లోకి ఆనందంగా ప్రవేశిస్తాం. బహుశా అలా ఆలోచిస్తే 'మో' కవిత్వమంతా సంగీతమే. తనకూ, సంగీతానికీ అనివార్య బంధం ఉందని చాలాచోట్ల కవిత్వంలో ఆయనే సూచించారు.

*అయినా నా ఏకతార, తెగిన తీగ రెండూ మీటితే*
*ఆ తెగినచోటే గాలిలోనైనా ఐక్యమయ్యే*
*ఏకతానాదం నా నాదం* అంటారు *ఆశంస* అనే కవితలో (చితి–చింత)

మరోచోట – *నేనీ మధ్య వాయులీనం నేర్చుకొంటున్నా జీవన దుఃఖతంత్రిని కత్తిపెట్టి కోస్తోన్నా... శూన్యాన్ని శూన్యపు వయొలిన్ కత్తితో తెగ్గోస్తున్నా* అని తన కవితల్లో ఉపమగా సంగీత వాద్యాలను ఉపయోగించుకున్న సందర్భాలు ఎన్నో (రహస్తంత్రి, చితి–చింత).

'పునరపి'కి రాసిన ముందుమాటలో మోహన్‌ప్రసాద్‌కు సంగీతంతో ఉన్న అనుబంధం స్పష్టంగానే తెలుస్తుంది. నాగయ్య 'భక్తపోతన' చిత్రం కోసం పాడిన 'సర్వమంగళ నామా సీతారామ' పాటతో 'మో'గారి బాల్యం ముడిపడివుంది. బహుశా అంతటి మెలోడీ వింటూ పెరిగినందుకేనేమో 'మో'కి సంగీతం మీద అంత మక్కువ.

సంగీతానికీ, కవిత్వానికీ ఉన్న సంబంధం గురించి "There is delight in bare auditory quality, sheer rythm... Poetry on the sensuous side employs rythm. It is an auditory art allied to music – (Creative Imagination, Kegan Paul, London 1929) అన్నాడు డౌనీ అనే విమర్శకుడు. బహుశా 'మో' కవిత్వంలో **sensuous** ధోరణి ఎక్కువున్నందువల్లనేమో అది సంగీతానికి చేరువగా ఉంటుంది.

*"వేణువూదావా / వేయింతల వలపు / వనం వనమంతా / విశ్వగీతికాలాపన"* (క్లుప్తంగా కవిత – నిషాదం కావ్యంలో) అని అన్నట్టు, ఆయన కవిత్వంలో మరేది ఉన్నా, లేకున్నా (విమర్శకులు కోరుకునే సామాజిక స్పృహ, రాజకీయ చైతన్యం గట్రా) మనసును కుదిపేసే, చలింపజేసే గీతాలాపన మాత్రం విశ్వజనీనంగానే ఉంటుంది.

'మో' కవిత్వంలో సంగీత ప్రస్తావన, ప్రమేయం ఎన్ని రకాలుగా ఉంటుందని ఆలోచిస్తే, స్థూలంగా మూడు రకాలుగా ఉన్నట్టు వర్గీకరించవచ్చు.

1. తనకు ఇష్టమైన సంగీతకారుల ప్రస్తావనలు,
2. అసంకల్పితంగా కవిత్వంలో ప్రస్తావించబడే పాటల పల్లవులు, చరణాలు (రేడియో సిలోన్‌లో ఒకప్పుడు –

ఇప్పటికీ ఉందేమో తెలియదు. 'జబ్ ఆప్ గా ఉఠే' అనే కార్యక్రమం ఉండేది. మనకు జీవితంలో ఒక్కొక్క సన్నివేశం ఎదురైనపుడు, దానికి సన్నిహితంగా ఉండే పాట అసంకల్పితంగా పెదాలమీద వచ్చేస్తుంది. అలాంటి అసంకల్పిత గానాలు 'మో' కవిత్వంలో ఎన్నో. 3. 'మో' కవితాశిల్పంలో దాగిన గేయాత్మకత.

ఒక విధంగా చెప్పాలంటే, 'మో'కు సంగీతం ఒక కవితా వ్యూహం కాదు; అప్పుడప్పుడూ కవితా సౌందర్యాన్ని ఇనుమడింపజేయడానికి కవులు వాడుకునే ఒక శిల్పం కాదు. సంగీతం ఆయనకు ఆంతరధర్మంగా అనిపిస్తుంది. అందుకే ఆయన చనిపోయినప్పుడు *ఆంధ్రజ్యోతి* సంపాదకీయంలో "ఆయన కవిత్వం నేపథ్యంలో ఎప్పుడూ ఒక విషాదగీతం వినిపిస్తూనే ఉంటుంది" అన్నారు.

*'మో' నీ మోటో ఏమిటి? అన్న ప్రశ్న తనని తాను వేసుకుని 'మో' అన్నది నా లోగో. అది నా పేరు కాదు. అది నా సిగ్నేచర్. సంగీతంలో, గీతంలో అది నా సిగ్నేచర్ ట్యూన్ అని ఒక టీవీ స్టేషన్‌కు, రేడియోకు సిగ్నేటర్ ట్యూన్ ఉన్నట్టే తనకూ ఉందని చెప్పుకున్నారు మోహన్‌ప్రసాద్.*

**తనకు ఇష్టమైన సంగీతకారుల ప్రస్తావనలు:**

'మో'కు సంగీతం ప్రక్రియల్లో ఉన్న వైవిధ్యం, వాటి వెనక ఉన్న సిద్ధాంతం తెలిసినా, తెలియకపోయినా, అన్ని రకాల సంగీతాలను, అన్ని రకాల కంఠస్వరాలనూ ఆయన ఇష్టపడ్డారు. ఆయన ఇష్టపడిన, ఎక్కువ ఉల్లేఖించిన సంగీత విద్వాంసులను తలుచుకుంటే ఆయన అభిరుచి కూడా మనకు అర్థమౌతుంది. అన్ని దేశాల సంగీతాలను ఎంతో కొంత ఇష్టపడిన ఆయన భారతీయ సంగీతాన్ని ఎక్కువగా ప్రేమించారు. దానికి సాటి మరేదీ లేదని తీర్మానించారు. 'అనుభూతి' (చితి–చింత) కవితలో ఆయనంటారు. పురందరదాసు కీర్తన నాదస్వరంలో వింటున్నప్పుడు తన చిన్నప్పుడే చనిపోయిన అమ్మ గుర్తుకు వచ్చిందని.

'పురందరదాసు కీర్తనేదో / ఒక మధ్యాహ్నం / బయటనెక్కడో కాస్తూన్న ఎండలోకి / చూస్తూ నాదస్వరంలో విన్నపుడు.... ఆ సుస్వరం వెళ్ళిపోయిన దారినే వెళ్తే / అక్కడ అమ్మ.... ఇది నాది / ఈ సంగీత సంప్రదాయం నాది, ఇది అనాది అమ్మలా ఇది ఆదిశక్తి'

'మో' ఇష్టపడిన సంగీతకారుల జాబితా చాలా పెద్దదే. బడే గులామ్ అలీ ఖాన్, మంగళంపల్లి బాలమురళీకృష్ణ, టి.ఆర్. మహాలింగం, కుందన్‌లాల్ సైగల్, నూర్జహాన్, పర్వీన్ సుల్తానా, భీమ్‌సేన్ జోషి, నాగయ్య, టంగుటూరి సూర్యకుమారి. ఇక ట్రేసీ చాప్‌మన్ దగ్గర్నుంచి, జానపద గాయకుడు నరసింహమూర్తి వరకు ఎందరినో ఆయన అభిమానించారు. ఆయన ప్రస్తావించిన పేర్లు చూస్తే, అన్ని రకాల సంగీతాలనూ ఆయన ఇష్టపడ్డారని అర్థమవుతుంది.

*మహాలింగం వేణువాద్యాన్ని అమితంగా అభిమానించిన 'మో': తన మృత్యు సమయంలో మహాలింగం వేణువు వినాలన్న ఆశ వ్యక్తం చేశారు. 'మహాలింగం, నువ్వు ముహూర్తం పెట్టవయ్యా నా మరణానికి. నా నిర్యాణపు సదస్సులో నా పెళ్ళాం వెయ్యి వయొలిన్లయి, బాహువుల్ని కాళ్ళతో ఈడ్చేస్తోంటుంది; మిత్రులందరూ జాంబో డ్రమ్ముల్తో చుట్టూ మూగుతారు... కానీ ఒకటే ప్రశాంతి ఆఖరి వేణువు చిల్లు మీద ఒకే ఒకసారి తీసేసి ఊదేసిన ప్రాణప్రవాహపు నిద్ర కదలికలోని స్వప్న పరిష్వంగపు పడగనీడ... తప్పిపోయిన బిడ్డదెవడైనా మౌనమలిన బాష్పంతో ఉన్నపుడు మహాలింగం నువ్వు రూపక తాళంలో రాగసరస్వతిలో మెల్లగా నన్నూదుతావు కదా' అన్నారు. ఆఫ్రికన్ సంగీతంలో, ఐరిష్ సంగీతంలో వాడే తీగె వాద్యం జాంబోని, మహాలింగం వేణువుతో, వయొలిన్లతో కలిపి, మోహన్ ప్రసాద్ తన కవిత్వంలో ఎంత చక్కటి ఫ్యూజన్ మ్యూజిక్ సాధించారో.*

నిజానికి 'మో' కేవలం సంగీతాన్ని ఆలంబనగా చేసుకుని ఒక కవిత మొత్తం రాశారు. అదే వయోనాయ్ – వయొలిన్, షహనాయ్ ల సమ్మేళనంలో స్త్రీ పురుష సంబంధాన్ని, ఆ ఇద్దరి స్వభావాల్లోని వ్యత్యాసాన్ని వ్యాఖ్యానించిన విలక్షణ కవిత ఇది. వయొలిన్ స్త్రీ, షహనాయ్ పురుషుడు.

*నదీ ప్రవాహంలో కొట్టుకుపోతున్నై / స్త్రీ పురుషులులాగా వయొలిన్ షహనాయ్‌లు / ఉధృత సంగీత తరంగాలలో నాకవి మహావిషాద ఛాయలు / విషాదంలో ఉన్న ఆనందాన్ని ఒకడూ వినడు* అని మొదలైన ఈ కవిత.

*షహనాయ్ ఎక్కువ విషాదం పలుకుతుంది*
*లోక హృదయ దుఃఖ నాళాలలోకి రాగాలు సాగుతూ*
*హృద్గగన సీమలలో ఉండుండి ఎర్రగా మెరుస్తూ*
*వయొలిన్ విషాదం వ్యక్తిగతం;*

*తానొక్కటే నదిలో కొట్టుకొని పోతూన్న దుఃఖం*
*షహనాయ్‌కి విషాదం / గుండెల్లోంచి ఊపిరిలోంచీ*
*వయొలిన్‌కి ప్రకంప హస్తాల నుంచి* – అంటారు.

*షహనాయ్‌కి వెతుక్కుంటున్న విషాదం / ఆమె కోసం....*
*ఆమెకోసమని గాలిలోకి / ప్రాకిపోతుంది*
*ఆవిరవుతుంది / మెలి తిరుగుతూ / నేల రాలుతుంది*
*నిన్నెట్లా పాదువుకోను / ఏమని నీకై వెతకను* అని
షహనాయ్‌కి వేదన

*వయొలిన్‌కి రక్షించమనే ఆవేదన / సాగరంలో వయొలిన్ లీనమైపోతుంది / ఇక నా ఒంటరి షహనాయ్ పహాడీ ధున్ రాగంలో / సముద్రం ఒడ్డున చతికిలపడి ఏడుస్తూ తన దీనాలాపన / అలల నురగలలో కలుపుతుంది*

ఏక కాలంలో సంప్రదాయ ప్రతీకలుగా స్త్రీని నదితో, పురుషుణ్ణి సముద్రంతో పోలుస్తూనే, మళ్ళీ స్త్రీ వయొలిన్, పురుషుడు షహనాయ్ అని సరికొత్త ప్రతీకలతో వారిని వర్ణిస్తూ, ఒక విచిత్రమైన సంయోజనాన్ని ఈ కవితలో సాధించారు 'మో'. నది సముద్రంలో కలిసిపోయాక మళ్ళీ నది కనిపించాలని సముద్రం ఆక్రోశిస్తుంది. స్త్రీ పురుష సంయోగానికి నది సముద్రంలో కలిసిపోవడం ఒక గొప్ప ప్రతీకగా సాహిత్యంలో చలామనీ అవుతున్న స్థితిలో (అంటే స్త్రీకి విడిగా అస్తిత్వం లేదు; పురుషుడిలో అది ఐక్యమవుతుంది అన్న అర్థంలో), 'మో' దాన్ని తిరస్కరించి, నది సముద్రంలో కలిసిపోవడం సముద్రానికి ఆనందాన్ని కాదు; విషాదాన్నే కలిగిస్తుందని అంటారు. అందుకే 'సాగరంలో' వయొలిన్ లీనమైపోతే, షహనాయ్ ఒంటరిదైపోయి దుఃఖిస్తుందని వర్ణిస్తారు. వయొలిన్ షహనాయ్ ఎప్పటికీ అందుకోలేదని కూడ అంటారు.

*శృతి* పత్రిక చదివిన తర్వాత నెమరువేసుకుంటూ రాసిన కవిత గానపానవాన (రహస్తంత్రి). ఇందులో ప్రస్తావించని కళ లేదు. నాట్యం, చిత్రకళ, నాటకం – అన్నిటినీ మించి సంగీతం. ఒక రకంగా ఈ పత్రికను సమీక్షిస్తూ, తనలో తను మాట్లాడుకుంటున్న కవితలా ఉంటుంది. ఎప్పటిలాగే ఆయన అభిమాన సంగీతకారులందరూ ఉన్నారు. అయితే వారికి వాడిన విశేషణాలవల్లే, అవి కేవలం పేర్ల జాబితాలుగా మిగిలిపోక, కవిత్వమయ్యాయి.

*నృత్యనాట్య భంగిమలు దాల్చిన ప్రౌఢ బడేగులామ్*
*అలీఖాన్ / మాలీ వేణువు మధుపానంలో*
*వీణాబాలచందర్ మాత్సర్యంలో / చీలిన నాలిక*
*బాలమురళి రవళిలో / ప్రీవీపర్స్ పోయిన స్వాతి*
*తిరునాళ్‌లో / అమంగళాన్ని మంగళం చేసే బిస్మిల్లాఖాన్*
*షహనాయ్‌లో...*

ఇందులో ఒక్కొక్కరికీ వాడిన విశేషణాలన్నీ అర్థవంతమైన, సాభిప్రాయ ప్రయోగాలే. మాలీ (మహాలింగం) మధుపానం, యువరాజు స్వాతి తిరునాళ్ ప్రీవీపర్సు.... ఇత్యాదులు.

**అసంకల్పితంగా కవిత్వంలో ప్రస్తావింపబడే పాటల పల్లవులు, చరణాలు:**

"మో' కవిత్వానికి మౌలికమైన సోర్స్ అచేతనం. ఆయన కవిత్వంలో కనిపించే భావుకత, సృజనాత్మకత రెండూకూడ ఈ అచేతనపు భూమిక నుండే రూపొందుతాయి" అన్నారు బి. తిరుపతిరావు ('సారాంశం' పీఠిక). ఈ అచేతనంలో ఆయన అధ్యయనం చేసిన విశ్వసాహిత్యంతోపాటు, ఆయన ఇష్టపడిన గొప్ప సంగీతం కూడ ఇమిడి ఉంది. అందుకే ఆయన కవిత్వంలో ప్రపంచ సాహిత్య ప్రస్తావనలతోపాటు, పాటల ప్రస్తావన కూడ నిరంతరంగా కనిపిస్తుంది. ఆయన కవిత్వంలో పాటలు ఎంత సునాయాసంగా వచ్చేస్తాయంటే, మనం అప్రమత్తంగా ఉండకపోతే, ఆ పాటలు మనకు తెలిసివుండకపోతే అవి ఆయన కవితా వాక్యాలే అనుకుంటాం. ఆయన కవితాపంక్తుల నుంచి పాటలను వేరుచేసి చూడడం కూడ

పాఠకుడికి ఒక సవాలే.... ఆయన అంటారు "నేను 15వ శతాబ్దపు ఫ్రెంచ్ కవి ఫ్రాంకాయిస్ విలాన్ ని. ఎన్నో శతాబ్దాల నుండి నువ్వు నన్ను ఇలా కంటూనే ఉన్నావు. మళ్ళీ అంతమవుతున్న శతాబ్దంలో మంగళంపల్లి బాలమురళీకృష్ణ ప్రక్కల నిలబడి, కొలిచేవు ముచ్చటగా, చుక్కల రాయునీ... సుదతీ సీతమ్మ సౌమిత్రి రాముని కిరుప్రక్కలా నిలబడి..... నా ప్రక్కలా నిలబడి.. ఉరికంబం ఎల్లెడలా వ్రేలాడుతూనే ఉంటుందదేమిటి? ఈ వాక్యం కూడ అందులో ఒదిగిపోయేలాగానె. నేను ఓల్డ్ మాంక్‌ని కంఠదఘ్నంగా తాగినపుడు త్యాగరాయకృతి 'అనురాగములే నీలో' (పునరపి). ఇందులో బాలమురళీ పాడిన ఖరహరప్రియ రాగంలోని త్యాగరాజ కీర్తన 'ప్రక్కల నిలబడి' ఎంత అలవోకగా తన కవితలో, తన మూడ్‌లో కలిపేసుకున్నారో 'మో'. ఎటొచ్చీ, పాఠకుడికి కూడ ఆ పాటలు తెలిసివుంటేనే వాటి సందర్భాన్ని గుర్తించగలుగుతాడు. ఎంజాయ్ చేయగలుగుతాడు. ఉదాహరణకు కల్యాణిరాగంలో రెండు త్యాగరాజ కీర్తనలు చెప్తారు. 'ఏ తావునరా నిలకడ నీవకు' అని, వెంటనే 'నిజముగ పల్కు మనసా' అని మరో కల్యాణి కీర్తన 'నిధి చాలా సుఖమా' పల్లవిలోకి మూడో పంక్తిని ఉదహరిస్తారు. దీన్ని ఆధునిక మానవ హృదయానికి అన్వయించి చెబుతాడు. అందుకే 'మో' కవిత్వానికి, సంగీతం ఒక ఉపాధేయం మాత్రమే కాదు. మరో చోట అంటారు.

కవిత్వం ద్వారా 'తెర తీయగరాదా, నాలోని తెర తీయగ రాదా' అనుకొంటున్నాను. అధివాస్తవిక కవులు తెరమరుగయ్యారుగానీ వాళ్ళూ ఇదే ప్రార్థన చేశారు.' కవిత్వమంటే మంత్రం. అది హృదయతంత్రం అని నమ్మిన 'మో', విషాదం, ఆనందం రెండూ ఒకే నాణానికి రెండు పార్శ్వాలన్న తన నమ్మకాన్ని ధ్వనింపజేస్తూ, ఒక క్షణంలో–

*రోతే భిరహే హస్‌తే భిరహే* – అని త్యాగరాజు నుంచి రాజ్‌కపూర్‌కి వెళ్ళిపోతారు (హమ్ తుఝ్ సే మొహబ్బత్ కర్‌కే సనమ్ అన్న ఆవారాలోని ముఖేశ్ పాడిన పాటతో) 'అదృశ్యం దృశ్యమైనప్పుడు' (సాంధ్యభాష) కవితలో *పోల్చుకోలేదు కదూ / ఎటులోర్తునె మనసాని / కావేరీ తీరంలో సావేరీ రాగం తీస్తూ* త్యాగరాజు సావేరీ రాగంలో చేసిన కృతి 'మనసా ఎటులోర్తునె నా మనవి చేకొనవే'ని ప్రస్తావించడం. ఇదే కవితలో.

*ఎందుకీ వ్యాకులత పర్వీన్ సుల్తానా / గాయాన్ని గీతంగా ఎందుకు గురూ సైగల్* అన్నప్పుడు పర్వీన్ సుల్తానాకు, సైగల్‌కూ వాడిన విశేషణాలు ఆ పాటల్లో మునిగి తేలిన వ్యక్తి మాత్రమే వేయగలిగినవి.

'పునరపి'లో ఒక అధ్యాయానికి 'తెరతీయగరాదా' (త్యాగరాజ కృతి) మరోదానికి 'కాదు సుమా కలకాదు సుమా' (విమల చిత్రంలో ఘంటసాల, వక్కలంక సరళ పాడిన పాట), ఇల్లిల్లు తిరిగేవు – నీ ఒళ్ళు జాగరతె ('శివరంజని' చిత్రంలో సుశీల పాట 'జోరుమీదున్నావు తుమ్మెదా') ఏమి మురళి, అది ఏమి రవళి ('ఏకవీర'లో నీ పేరు తలచినా చాలు), మౌనమే నీ భాష ఓ మూగ మనసా ('గుప్పెడు మనసు'లో బాలమురళి పాడిన ఆత్రేయ గీతం) హిందోళనారాగం, నిషాదం – అన్నీ సంగీత ప్రమేయం ఉన్న మాటలే.

అంతర్నాటకం అనే చిన్న నాటికలో టామ్ అనే పాత్ర సమాజాన్ని, దేశం స్థితిగతులను ఎద్దేవా చేస్తూ ఆ ధోరణిలో అంటాడు 'గంగ ఉదకము తెద్దమంటే గంగలోనీ చేపలన్నీ ఎంగిలంటున్నాయి లింగా' అని. మహానుభావా, మా దేవశంభో – అని బాలమురళీ కంఠస్వరం మనలో ప్రతిధ్వనిస్తుంది.

'మో' ఉద్దేశంలో ఈ ప్రపంచమంతా తనలాగే సంగీతానికి ప్రతిస్పందిస్తుంది. "తనతో పాటు కూడ ఆది నుంచీ అంతందాకా మానవుడు పాడుకున్న మహామధురగీతాల తాలూకు నూర్జహాన్, సైగల్ రికార్డులు రోజుకొకటి వింటూంటాడు విరాట్పురుషుడు వినీ వినీ వెక్కి వెక్కి ఏడుస్తాడు" అంటారు ఒక కవితలో. భారతదేశ హిందీ చలన చిత్ర రంగంలో మకుటంలేని మహారాణిలా సంగీత ప్రపంచాన్ని ఏలి, దేశవిభజన అనంతరం పాకిస్తాన్‌లో స్థిరపడిన నూర్జహాన్ పాట విషాద మాధుర్యానికి పెట్టింది పేరు. హిందీ చలనచిత్ర రంగంలో కాలుమోపిన ప్రతి

గాయకుడికీ ఆరాధ్య దైవం కె.ఎల్. సైగల్‌ది కూడ విషాదమాధుర్యమే. వీళ్ళిద్దరి గానం వింటే విరాట్పురుషుడు వెక్కివెక్కి ఏడ్వటంలో ఆశ్చర్యమేమీ లేదు. ఇలాంటి సాభిప్రాయ ప్రయోగాల ద్వారా 'మో'కు సినిమా సంగీతం. లలిత సంగీతాల పట్ల ఉన్న అవగాహన అర్థమవుతుంది. ఒకానొక ఆవేశంలో "రేడియోలు కట్టేయండి. నాకు సంగీతం వద్దు" అన్న మోహన్‌ప్రసాదే, అదే కవితలో (బ్రతికిన క్షణాలు) "జూబెన్ మెహతా తీగలు సాగినపుడు, యెహూదీ మెనిహాన్ ఊహాలో కాలం తీగలు సాగదీసినపుడు, డ్రమ్స్ ఆఫ్ ఇండియా రికార్డులో రవిశంకర్ తాళం వేసినపుడు, బిస్మిల్లాఖాన్ తాటాకు నరాల బూరాలు దారాలుగా ఊదినపుడు.... ఎప్పుడన్నా అప్పుడప్పుడు బతికిన గుర్తులు లీలగా, మాయగా, బేలగా" అని తను నిజంగా బతికిన ఆ క్షణాల్లో సంగీత ప్రమేయాన్ని చెప్తారు.

జానపద గేయాల నరసింహమూర్తి, కొనకళ్ళ వెంకటరత్నం, నండూరి పాటలు పాడితే విని ఆనందించిన 'మో' సంగీతంలోని అన్ని వైవిధ్యాలనూ అనుభవించగలిగారు.

"ఉదయాన సూర్యుడూ ఉల్లిపూఛాయ మధ్యాహ్న సూర్యుడూ మంకెన పూఛాయ"వంటి జానపద గీతాలు 'మో' కవిత్వంలో నినదిస్తాయి (గతంలోకి స్వగతం – రహస్తంత్రి).

*పురందరదాసు ముందు / పొగులుతున్న భీమ్‌సేన్‌జోషి / గిటార్ మీద విరిగిన గిలెటిన్ / నునుబుగ్గమీద మృదంగం*

15వ శతాబ్దికి చెందిన కన్నడ వాగ్గేయకారుడు పురందరదాసుకీ, 20వ శతాబ్దపు హిందూస్తానీ విద్వాంసుడు భీమ్‌సేన్ జోషికి ఏమిటి సంబంధమని అనుకోవచ్చు. బహుశా కర్ణాటక, హిందూస్తానీ సంగీతాల సమన్వయాన్ని చెప్పడానికి మొదటి రెండు వాక్యాలను, పాశ్చాత్య సంగీతానికి, కర్ణాటక సంగీతానికి ఉన్న అనుబంధాన్ని చెప్పడానికీ తర్వాతి రెండు వాక్యాలు (గిటార్, మృదంగం) ప్రయోగించినట్లు ఉంది.

మోహన్‌ప్రసాద్‌గారికి సినిమా సంగీత పరిచయం కూడా తక్కువేమీ కాదు.

కొండమీద కొక్కిరాయి అన్న కవిత (వికలాంగాలు) – 'జయసింహ' చిత్రంలో జిక్కి పాటను గుర్తుకు తెస్తుంది. 'అన్‌దాకా అన్‌దాకా అందాకా' అన్న శీర్షిక, 'చిరంజీవులు' చిత్రంలోని ఎందాకా, ఎందాకా యుగళగీతాన్ని (ఘంటసాల, లీల) గుర్తుకు తెస్తుంది. 'తెల్లవారెను కోడి కూసెను' ('ప్రాణమిత్రులు' చిత్రంలో ఘంటసాల పాట)... ఇలా ఇంకెన్నో.

'మో' అభివ్యక్తికి సంగీతం, వాద్యాలు అనివార్య ప్రతీకలు. 'నిరీహ' కవితలో ఆయనంటారు.

నూర్జహాన్‌నీ నన్నూ వదబోసుకుంటూ / నరాల సంగీతం / గాల్లో ఏడుస్తున్నాయ్ / లక్ష సారంగీలు / నేలమీద పడి దొర్లుతున్న తబలాల్తో పాటూ / ఇక చూడూ – పొంచి చూస్తుంది ఘోర తిమిర రాకాసి / కాళ్ళు బార్లా జాపి సితారాలు / నిస్పృహలో చేతులు విసిరేసి వయొలిన్లూ / గుండెలు బాదుకుంటూ ఘటాలూ

గాయకులకే పరిమితం కాదు 'మో' సంగీత అభిరుచి, సారంగి, తబలా, సితార, వయొలిన్, ఘటం – అన్నీ మోహన్‌ప్రసాద్ గారికి అభిమానవాద్యాలే.

మరో కవికి సునాయాసంగా భావచిత్రాలూ, ప్రకృతి పరిమళాలూ లేదా సామాజిక సంఘటనలూ, విప్లవ దృశ్యాలూ కవితల్లో పోగుపోసుకుంటాయేమోకానీ, 'మో'గారికి మాత్రం అన్నిటికంటే సుళువుగా, అడిగిందే తడవు, వచ్చి వాలిపోయేవి సంగీతానికి సంబంధించిన పోలికలూ, శబ్దాలూ, దృశ్యాలే. నిషాదంలోని 'వెళ్ళి రావాలోసారి' అనే కవితలో ప్రాచీన కవులు శ్రీనాథుడూ, అల్లసాని పెద్దనా, నంది తిమ్మన, వేమనల దగ్గర్నుంచి, ఆధునిక యుగంలోని నండూరి సుబ్బారావూ, విశ్వనాథ, బైరాగి, శ్రీశ్రీ, దాశరథుల ప్రస్తావన అనాయాసంగా వచ్చింది. అంతకంటే అలవోకగా వచ్చిన జాబితా వాగ్గేయకారులది. సంగీత సాహిత్యాలు రెండూ ఆయన రెండు కళ్ళని చెప్పడానికి ఈ ఒక్క కవిత చాలు.

*"సారంగపాణి హొయలు కులుకులు / మువ్వగోపాల సరస సల్లాపాలు / రారా మా ఇంటిదాగా నన్ను పూరిల్లు / సీతమ్మకు చేయించిన చింతాకు పతకం"*

ఇలా సారంగపాణి, క్షేత్రయ్య, త్యాగయ్య, రామదాసులు ప్రాచీన కవుల సరసన కూర్చుంటారు. వీళ్ళందరూ కలిస్తేనే మోహన్‌ప్రసాద్‌గారికి నిజమైన పండుగ.

**మో కవిత్వంలోని సంగీత శిల్పం:**

ప్రముఖ సాహితీ విమర్శకుడు ప్రొఫెసర్ వెంకట్రావుగారు 'మో' గురించి చక్కని వ్యాఖ్యానం చేశారు. 'మో' కవిత్వమంతా ఓ మ్యూజికల్ మెలొడిగా ఓ విధంగా ఈ శబ్దదృశ్యనామ రూప ద్వంద్వాల సంబంధాల గురించి చేసిన సుదీర్ఘపు మ్యూజికల్ థాట్‌గా వెలుస్తుంది అనవచ్చు (న మో – పేజీ 48–49). సంగీతానికీ, సాహిత్యానికీ ఉన్న సామాన్య ఉన్న సామాన్య లక్షణాలను చూస్తే, 'మో' రెండింటినీ అంత సునాయాసంగా ఎలా కలపగలిగారో అర్థమవుతుంది. ఎం.ఆర్. గౌతమ్ అనే హిందుస్తానీ సంగీత విమర్శకుడు అన్నట్టు "Just as in language, the verbal syntax which is the fundamental convention of speech has its roots in human experience, so also in music; the syntax of notes is just as important and is based on human experience. It is as easy to make nonsense with words as with notes" (Man and Music in India – Ed. By Roshmi Goswami, pub. Indian Institute of Advanced Study, Simla, Munishiram Manoharlal Publishers Pvt. Ltd. Delhi, 1992) 'మో' కవిత్వంలోని క్రియారహిత వాక్య నిర్మాణాన్ని, పదాల అస్తవ్యస్త ప్రయోగాలను కూడా సంగీతంతో పోల్చవచ్చునన్న మాట.

ఇంకెవరో అన్న మాటలు దేనికి? స్వయంగా 'మో'నే చెప్పుకున్నారు. 'మో' అన్నది నా లోగో, గీతంలో, సంగీతంలో నా సిగ్నేచర్ ట్యూన్. నా పొట్టలోంచి ఓ పేగుని బయటికి తీసి ఏక్ తారగా వాయిస్తూ వీధి వీధినా పాడుకుంటూ పోతాను ('సీతారామ కల్యాణం'లో కానరావ కైలాసనివాసాని గుర్తుకు తెచ్చే వాక్యం). తనకు సంగీతంతో ఉన్న అనుబంధం బాల్యం నుంచీ వచ్చినదేనని స్వయంగా 'మో' చెప్పుకున్నారు. 'చిన్నప్పుడు విన్న గాలిలోకి తేలివచ్చిన భక్తరామదాసు, త్యాగయ్య, అన్నమయ్య... 'చింతాకంతయు చింతలేక' అన్న కాళహస్తీశ్వర శతక పద్యం, 'కంటిలోన నలుపు కానబొయ్యేరా' అన్న అన్నమాచార్య గీతం, తెరతీయగరాదా అన్న త్యాగయ్య విన్నపం నన్ను అనుభవవాద కవిత్వం జోలికి తీసుకెళ్ళినాయ్' (పునరపి కావ్యానికి రాసిన ముందుమాట).

సంగీత లక్షణాలైన పల్లవి పునరావృతం కావడం నిషాదంలోని ఖండికల్లో ఎక్కువగా కనిపిస్తుంది. మామూలుగా కనిపించే వచన కవిత, దీర్ఘ వచనాలకంటే భిన్నంగా ఇందులో తేలిక మాటలు, కృష్ణశాస్త్రి లయ కనిపిస్తాయి.

**ఊయల కవితలలో**

*నెమ్మదిగా నిదరపో, నెమ్మదిగానే లే / నా మదిలో ఉన్న / నదివి నీవేగావా / కన్నులు నీవీ నావీ / ఎన్నని కలలు తరంగాలు / నెమ్మదిగానే నిదరపో / మనమిద్దరమూ ఉన్నతనంలో / నిదురా నెమ్మదిగానే లే*

ఈ కవితలో ఎత్తుగడ దగ్గర్నుంచీ, ముగింపువరకూ పాట శిల్పమే. పాత సినిమాల్లోని యుగళ గీతాలను గుర్తుకు చేసే రచనా శిల్పం ఇందులో ఉంది.

అలాగే యానం కవితలో

*తలిరురాతల / తలపు దారుల / వలపు తీరాల*
*వెతల వేపుల / కొలతలెన్నో కొలవనీవక / చెక్కముక్కల*
*పక్కటెముకల / శ్వాసకోశపు / సూది దారపు /*
*కోశయానము / సదా పదనిస / నీ నాదపియానో*

ఇది 'మో' మాటల్లా ఉండదు; భావకవి గీతంలా ఉంది. 'నాద పియానో' అన్నది మాత్రం అచ్చంగా 'మో' ప్రయోగమే. ఇందులోని ఖండగతి గానయోగ్యతను ఈ కవితకు కల్పిస్తుంది.

*అసహ్యం (రహస్తంత్రి) కవితలో / విసుగులో విరామంలో / వివస్త్రంలో వైరాగ్యంలో / విమానంలో అవమానంలో కేవలం కైవల్యంలో / ఎంత విమోహితులైరో / ఎంత అనాసక్తులైరో / దుస్సహ అసహ్యంలో / దుఃఖజ్వాలల్లో కేళికేలల్లో* ఈ కవితలోని నడక, పాటకు అనుకూలమని వేరే చెప్పనవరంలేదు.

'వీడ్కోలు గీతం'లోని 'నేనీ రాత్రి / రాత్రిలోకి వెళ్ళిపోతున్నాను అనేది పల్లవిలా అనిపిస్తుంది. రెండు మూడు చరణాలకోసారి 'నేనీ రాత్రి / రాత్రిలోకి వెళ్ళిపోతున్నాను' అన్నది 'మో' వాచ్యంగా రాసినా, రాయకపోయినా మనకు తోస్తుంది. అంటే ఒక కృతిలో ఉండే పల్లవి, చరణాల లక్షణం ఈ కవితకుంది. పల్లవిలో ఒక ప్రకటన చేసి, చరణాల్లో దాని వివరణ ఇస్తూ, పల్లవిలోకి సహజంగా విషయం దారితీసే కీర్తన లక్షణం ఈ కవితకుంది. ఇలా మోహన్‌ప్రసాద్ అనుభవంలో సంగీతం ఎంతగా జీర్ణించుకుపోయిందంటే, ఆయన కవిత్వంలో స్పష్టంగానూ, అస్పష్టంగానూ రెండు రూపాల్లోనూ సంగీతం ధ్వనిస్తుంది. చేకూరి రామారావుగారన్నట్లు 'ఆషామాషీగా చదివితే అర్థమయ్యే కవి కారు మోహన్‌ప్రసాద్. ఆయన కవిత్వంలో ఆయన అనుభవించిన ప్రతి క్షణమూ ఉంటుంది. ఆయన చదివిన ప్రతి పుస్తకమూ ఉంటుంది. ఆయన విన్న ప్రతి పాటా ఉంటుంది. అవన్నీ తెలియడానికి, అర్థం చేసుకోవడానికి మనం 'ఆయన' అయిపోవాల్సిందే. మోహన్‌ప్రసాద్ కూడా పురందరదాసును వినీ, ఆయన వెంటపడీ, చివరికి 'పురందరదాసుతోబాటు నేనూ–

*అక్కడ చంద్రుని చుట్టూరా నేను / చుక్కల్లో తప్పటడుగులు వేస్తూ నేను*

నాతోబాటు రండి' అని 'పురందరదాసుని నేను' అన్నారు. అలాగే మనం కూడా 'మోహన్‌ప్రసాద్‌ని నేను' అనుకుంటే తప్ప ఆయన పూర్తిగా అర్థంకారు. మి

**డా. సి. మృణాళిని**
**హైదరాబాద్.**

*నోబెల్ బహుమతి ప్రదాతల, గ్రహీతల ఉపన్యాసాల పరంపర ఇది. ఈ వ్యాస సంపుటి* ***మిసిమి*** *మాసపత్రికలో వస్తున్న రోజుల్లో పాఠకులు తమ హృదయ స్పందనలను తెలియజేశారు. 'మా నాన్నగారి సూట్‌కేస్' అన్న అనువాదం చదివి, వారి నాన్నగారికి అలాంటి సూట్‌కేస్ ఉండేది, వారి యౌవన కాలంలో అనుభవాలను ఈ అనువాదం గుర్తుచేసిందని ఒక పాఠక మహాశయులు చెప్పారు. సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ తెలుగు పండితులవారు ఈ అనువాదాన్ని చదివి, తమ అనుభవాలు, అనుభూతులు పంచుకునేవారు. ఇవి విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని వారితో చదివించేవారు. ఈ గ్రంథం పరిశోధక విద్యార్థులకు వెలకట్టలేని నిధి. ఆధునిక గాంధేయన్ బి.వి. రామిరెడ్డి సాధారణంగా, నిస్వార్థంగా జీవనం గడుపుతూ ఇప్పటికీ విద్యార్థులకు పాఠాలు చెప్పటంలో ఆనందాన్ని పొందటమేగాక, సమాజ సేవ చేస్తున్నారు.*




ప్రతులకు : *మిసిమి* కార్యాలయాన్ని సంప్రదించండి. ఫోన్ : 994 951 6567.

# మనసున్నవాళ్ళు

– గొల్లపూడి మారుతీరావు

మనకు వచ్చే కష్టానికి బాధపడడం మన అదృష్టం. బాధ కష్టానికి సంకేతం. ఏదేనా దెబ్బ తగిలినప్పుడు డాక్టరు అడిగే మొదటి ప్రశ్న "నొప్పిగా ఉందా?" అని. నొప్పి ఉంటే బాధకి మనం స్పందిస్తున్నట్టు లెక్క. అంటే దానిని పోగొట్టే మార్గం రూఢిగా ఉంటుందని డాక్టరుకి నమ్మకం కలుగుతుంది.

ప్రపంచంలో ఒకే ఒక్క రుగ్మతకి బాధ పర్యవసానం కాదు. వ్యక్తం కాదు. నొప్పి తెలీదు. ఆ ఒక్క కారణానికే అది గుండెల్ని కోసేటంత బాధిస్తుంది. అది – మానసిక వైకల్యం. రోగి నవ్వుతూంటాడు. పరధ్యానంలో ఉంటాడు. స్థబ్ధుగా ఉంటాడు. అంతర్ముఖుడౌతాడు. కళ్ళు మూసుకుంటాడు. నవ్వుతూనే బట్టలు చించుకుంటాడు. మనం ఊహించనంత తెలివిగా మాట్లాడి మనల్ని ఆశ్చర్యపరుస్తాడు. ఇవన్నీ మానసిక వైకల్యానికి గుర్తులు. రోగి బాధపడడు. ఆ కారణానికే అతని స్థితి మన గుండెల్ని కోసేస్తుంది.

మొన్న విశాఖపట్నంలో మానసిక రోగుల ఆసుపత్రికి వెళ్ళినప్పటి అనుభవం – ఒకవిధంగా దయనీయం. మరొక విధంగా ఆశ్చర్యకరం. ఒకావిడ నా వెనుక నడిచింది: "మీరు గొల్లపూడి కదూ? మీరు కథలు రాస్తారు. నేను చాలా చదివాను. మీ కథల్లో..." ఆమె మాట పూర్తికాకుండా ఎవరో ఆమెను తీసుకుపోయారు. ఆమెకి పిచ్చిట. ఇదేమిటి? ఇంత స్పష్టంగా, ఇంత సూటిగా, ఇంత కరెక్టుగా... ఆలోచన ఒక మార్గంలో సజావుగా సాగుతుంది. అదే మార్గంలో ఎల్లకాలం సాగినా, ఆ మార్గాన్ని విడిచిపెట్టకపోయినా, మరో మార్గానికి వెళ్లడానికి నిరాకరించినా – దాన్ని 'పిచ్చి' అంటారు.

పిచ్చి కాస్త ముదిరిన దశలో ఉన్న– చూడడానికి అతి మామూలుగా ఉన్న యువకుడు – కటకటాల వెనుక ఉన్నాడు. అతనివల్ల మరొకరికి, మరొకరివల్ల అతనికి ప్రమాదం ఉండే పరిస్థితిలో అలా వేరు చేస్తారట. ఇతని ఊరు అమలాపురం. పేరు బాబీ. చక్కని శరీరం. పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగానికి పరీక్ష రాశాడట. మార్కులు తక్కువ వచ్చాయి. తనకి అన్యాయం జరిగిందన్నాడు. ఆవేశపడలేదు. ఎవరి మీదా ఎదురు తిరగలేదు. మతి పోగొట్టుకున్నాడు. నాతో వచ్చినాయన యథాలాపంగా "నువ్వు బట్టలు చించుకుంటున్నావట?" అన్నాడు. అంతే. "అబ్బే లేదే" అంటూ ఒంటిమీద ఉన్న బట్టలన్నీ వొలిచేశాడు. చివరికి డ్రాయరు కూడా తీసివేసే స్థితికి వచ్చేశాడు. మనిషిలో ఎబ్బెట్టుతనంలేదు. ఆరోగ్యంలో లోపం లేదు. చూడడానికి ఆక్షేపణీయంగా లేదు. మానసికంగా – దుడుసుగా సభ్య ప్రపంచంలో నిలవలేని విపరీత మానసిక స్థితిలో ఉన్నాడు. ఇది గుండెల్ని కోసేసే దయనీయ స్థితి.

బాధపెట్టే గాయానికి, గాయం తెలీని బాధకీగల తేడా ఆ క్షణంలో భయపెట్టింది. మనస్సుని వికలం చేసింది.

ఇది కనిపించని వ్యాధి. వీరిని అంటిపెట్టుకుని – బొత్తిగా ఈ ప్రపంచంతో సంబంధంలేని వీరిని సాకే బంధువుల వ్యథలు – మనందరికీ తెలిసే కథలు. మన రాష్ట్రంలో రెండే రెండు మానసిక రోగుల చికిత్సా కేంద్రాలు. హైదరాబాద్‌లో ఎర్రగడ్డలో ఉన్న ఆసుపత్రి.

విశాఖపట్నంలో బీచి దగ్గర ఉన్న ఆసుపత్రి. నా చిన్నతనంలో ఇది పట్నానికి దూరంగా బస్సు సౌకర్యాలు అంతంత మాత్రంగా ఉండే ఆసుపత్రి. చినవాల్తేరులో దిగి ఆనాటి శాంతి ఆశ్రమానికి, మానసిక రోగుల ఆసుపత్రికి నడిచి రావలసిందే. నేను ఆనర్స్ చదువుకునే రోజుల్లో నన్ను పరోక్షంగా ఎరిగిన అప్పటి ఏలూరు పార్లమెంటు సభ్యురాలు మోతే వేదకుమారి – ఒకనాడు పౌరాణిక నాటక రంగానికి వెన్నుదన్నుగా నిలిచిన మోతే నారాయణరావుగారి కూతురు – ఓ విచిత్రమైన కోరికని కోరారు. అప్పుడు అనారోగ్యంతో మోతే నారాయణరావుగారు శాంతి ఆశ్రమంలో ఉన్నారు కొన్నాళ్ళు. వేదకుమారిగారి కోరిక – నేను ఆయన్ని సందర్శించి ఆవిడ పంపినట్లు కొన్ని పళ్ళు ఇచ్చి పలకరించి రావాలి. ఆవిడ బిజీగా ఉండడమే ఇందుకు కారణం. మరేం లేదు. మొదటిసారిగా మా నాన్నగారు నాతో వచ్చారు. చినవాల్తేరులో దిగి వెళ్ళి వారిని కలిశాను. అది అప్పటి జ్ఞాపకం. అప్పుడు చూసిందే ఈ ఆసుపత్రి. చాలా ఏళ్ళ తర్వాత – నా దురదృష్టంకొద్దీ నేను *ప్రేమ పుస్తకం* సినిమాకు దర్శకత్వం వహించినప్పుడు ఇక్కడ రోగం ముదిరిన నేరస్థుల్ని ఉంచే ఇనుప తలుపుల గదుల్ని బందిఖానాగా షూటింగు జరిపాను. అప్పట్లో రోగుల్ని చూసి మనస్సు కకావికలమయిన గుర్తు ఇంకా చెరిగిపోలేదు.

కాగా ఇప్పుడు నగరం ఈ ఆసుపత్రిని దాటి బాగా పెరిగిపోయింది.

తెలుగు రాష్ట్రం రెండుగా విడిపోయాక ఆంధ్ర దేశానికి ఒకే ఒక ప్రభుత్వం ఆసుపత్రి మిగిలింది. ఇక్కడి రోగులు – ప్రముఖంగా కింది మధ్యతరగతివారు. బొత్తిగా ఆర్థికమయిన వనరులు లేనివారు. మానసిక వికలత్వానికి రోగితోపాటు క్రుంగిపోయినవారు.

ఒకావిడ 14 ఏళ్ళ అమ్మాయితో ఇక్కడ ఉంది. పేరు సాయిలక్ష్మి. దేవరాపల్లి. ఏమయింది? ఆ పిల్లని తండ్రి బైపీసీ గ్రూపులో చేర్చాడు. ఆమెకి సుతరామూ ఇష్టంలేదు. ఆమెకు మతి చలించింది. చదువుకున్న ఛాయలు ఆమెలో తెలుస్తున్నాయి. చెప్పుకోలేని వత్తిడీ తెలుస్తోంది.

ఒకాయనకి కుటుంబ సమస్యలు. రెండుసార్లు ఆత్మహత్యకు తలపడ్డాడు. ఆయన్ని పిచ్చి ముదిరినప్పుడు వేరుగా ఉంచే గదిలో ఉంచారు. చక్కగా మాట్లాడుతున్నాడు. వికలత్వం ఒక కెరటం. అది తాకని క్షణాలలో అతను మీలాంటి నాలాంటి మనిషి. కొందరికి – ముదిరిన దశలో ఎలక్ట్రిక్ షాకులిస్తారు. అప్పటి వారి కేకలు భయంకరం. హృదయ విదారం.

ఇక్కడికి వచ్చే రోగులకు గవర్నమెంటు ఆహారం ఇస్తుంది. సమస్య వీరిని చూసుకోవడానికి వచ్చే సహాయకులది. ఈ చుట్టుప్రక్కల ఆహారానికి వసతి లేదు. తమ రోగుల్ని పక్కవారిని అప్పగించి ఆహారం కోసం వీరు బయటకు వెళ్తారు. అప్పుడు రోగులు పారిపోతారు. వారెలా ప్రవర్తిస్తారో ఈ చూసేవారికి తెలియదు. కొందరు తప్పించుకుని బాత్‌రూంలలో దాగొంటారు. ఒకంతకి బయటికి రారు. మరికొందరు సహాయకులు దగ్గర్లో ఉన్న సాయిబాబా గుడికి పరుగెత్తి ప్రసాదాన్ని తెచ్చుకుంటారు. మరికొంతమంది తమ రోగులకిచ్చిన అన్నంలో ఒక ముద్దతో సరిపెట్టుకుంటారు. ఇది భయంకరమైన యాతన. సహాయకులకు తప్పనిసరైన నరకం. ఎవరితోనూ చెప్పుకోలేరు. తమ బాధ పెద్ద గీత పక్కన చిన్న గీత.

మరి వీరికి సహాయం ఎలా చేరాలి? ఎలాంటి సహాయం చేయాలి? అదొక పెద్ద కథ. మంచితనం, వితరణ పరిమళంలాంటిది. అది ఎలా ప్రారంభమయింది.

హైదరాబాదులో శివరాజు అనే చిన్న విలేఖరి. హైదరాబాదు పబ్లిక్ గార్డెన్‌లో ఏవో పూజాకార్యక్రమాలకు 3 వేల మందికి భోజనాన్ని సిద్ధం చేయించాడు. తక్కువమంది వచ్చారు. అన్నం మిగిలిపోయింది. ఏం చేయాలి? దగ్గరలో ఉన్న

ఆసుపత్రిలో ఆర్తులకు పెట్టాడు. కార్పొరేట్ ఆసుపత్రివారు మొదట అభ్యంతరం తెలిపారు. ఎవరో చెప్పారు– ఎర్రగడ్డలో మానసిక రోగుల బంధువులు ఎలాంటి సహాయం లేక కుములుతున్నారని. వెళ్ళి సూపరిండెంటుని కలిశారు. నిజమే. ఇది సమస్యే. బంధువులకు అన్నంపెట్టే వసతి లేదన్నారు.

ఈ శివరాజుకి ఒక అవకాశం దొరికింది. రోజూ ఎక్కడో వంట చేయించి ఎర్రగడ్డ ఆసుపత్రిలో చెట్టు క్రింద వంటని దించి బంధువులకు వితరణ చేస్తూ వచ్చాడు. ఇది ప్రారంభం. మంచితనం అంటువ్యాధి (దుర్మార్గం మహమ్మారి). ఈయన కృషిని చూసి మరో నలుగురు చెయ్యి సాయం చేయడానికి కలిశారు. వారిలో శివరాం అనే ఓ ఉద్యోగి ఉన్నాడు. అతను గవర్నమెంటు ఉద్యోగి. అయినా ఈ కృషికి 2 వేలు విరాళం ఇచ్చాడు. చెయ్యి సాయానికి అందించాడు. ఈయనది విశాఖపట్నం. కొన్నాళ్ళకి రిటైరై విశాఖపట్నం వచ్చేశాడు.

ఇప్పుడు రాష్ట్రం విడిపోయింది.

విశాఖలో ఇలాంటి మరొక ఆసుపత్రి ఉన్నదనీ, అక్కడా ఇలాంటి అవసరం తీరని ఆర్తులు ఉన్నారనీ శివరాజుకి తెలుసు. అతను విశాఖలో ఉంటున్న శివరాంకి ఫోన్ చేశాడు. “అయ్యా, నేను ఇలాంటి పనులకి సహకరించగలనుకాని, నా అంతట నేను చెయ్యలేను” అని చేతులెత్తేశాడు. ఇప్పుడు ఈ కథ విచిత్రమైన మలుపు తిరిగింది. ఈ శివరాజు ప్రముఖ రచయిత మల్లాది వెంకట కృష్ణమూర్తిగారిని సంప్రదించాడు. కృష్ణమూర్తిగారు కొన్ని పుణ్యక్షేత్రాలలో సేవాకార్యక్రమాలలో పాల్గొనడం ఈయనకి తెలుసు. కృష్ణమూర్తిగారు విశాఖపట్నంలో మేడా మస్తాన్ రెడ్డి అనే వ్యక్తి పేరుని సూచించి ఫోన్ నెంబర్ ఇచ్చారు. ఎవరీ మస్తాన్‌రెడ్డి? రచయిత. క్రియేటివ్ కామెడీ క్లబ్బుని నిర్వహిస్తారు. హుద్‌హుద్‌లో తుఫాను వచ్చినప్పుడు చాలామంది శరణార్థులకి వెంకోజిపాలెం దగ్గర ఉన్న ఆశ్రమం ద్వారా దుప్పట్ల పంపకం, కొన్ని కృత్రియ అవయవాల పంపకంవంటి సేవా కార్యక్రమాలను అడపాతడపా నిర్వహించారు. అయితే ఇవి క్రియేటివ్ క్లబ్‌కి అనుబంధ కార్యక్రమం. ఫుల్‌టైం పనికాదు. ఇప్పుడు శివరాం వచ్చి మస్తాన్‌రెడ్డిని కలిశారు. మస్తాన్‌రెడ్డిగారు ఆశ్చర్యపోయారు. ఇది ప్రతిరోజూ చెయ్యవలసిన పని. తమది నెలకో కార్యక్రమం. ఇంత పని సాధ్యమా?

అదీ మీమాంస.

అయినా నిరుత్సాహపడక కామెడీ క్లబ్బుకు సభ్యులు అంతా వెంకోజిపాలెం ఆశ్రమం స్వామీజీని కలిశారు. స్వామీజీకి ఇది నల్లేరుమీద బండి. మా దగ్గర పాత్రలున్నాయి. సరుకులు మీరిస్తే ఇక్కడ వండిస్తాను. వంటని మీరు తీసుకువెళ్ళి వితరణ చెయ్యమన్నారు. శివరాజు (హైదరాబాదు) సరుకులు, బియ్యం, పప్పులు, చింతపండు వగైరా ఏర్పాటు చేస్తానన్నారు. బస్సుల్లో అవన్నీ వచ్చేవి. ఇక వంటని మానసిక వైద్యశాలకి ఆటోలో చేర్చాలి. స్వామీజీ తనకు పనులు చేసిపెట్టే సర్వీసు ఆటోని పిలిపించారు.

ఇక్కడ కథలో మరొక ముఖ్యమైన మలుపు – ఆ ఆటో నడిపే మనిషి – భూమయ్య. భూమయ్యది తెలంగాణాలో నిజామాబాద్ జిల్లా బాన్స్‌వాడాలో ఇబ్రహీంపేట. ఊళ్ళో తండ్రితోపాటు వ్యవసాయం చేసేవాడు. పెద్ద చదువులేదు. 14 ఏళ్ళ క్రిందట అంటే తన 33 వ ఏట విశాఖపట్నం వచ్చాడు. ఇంతదూరం ఎందుకు? స్వస్థలానికి దగ్గరగా ఉంటే బంధువులు వచ్చిపోతూ ఇబ్బంది పెడతారని. ఊళ్ళో ఉండగానే బోధన్ అమ్మాయి లక్ష్మితో పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు. విశాఖపట్నంలో రెండేళ్ళు పెద్దబజారు దగ్గర అరటిపళ్ళు అమ్మాడు. రాబడి తగ్గింది. నీలం వేపచెట్టు దగ్గర రామకృష్ణ అనే ఆయన 50 రూపాయలు రోజు కూలీకి ఆటో ఇచ్చాడు. రెండేళ్ళు నడిపితే ఆటో ఇచ్చేస్తానన్నాడు. రెండేళ్ళు నడిపి ఆటో పుచ్చుకున్నాడు. ఒక సంవత్సరం తర్వాత దాన్ని అమ్మి కొత్తది 6,500 వాయిదాల పద్ధతిలో కొనుక్కున్నాడు. ఇతనికి ఇద్దరు

కొడుకులు. ఇద్దరికీ మంచి చదువు చెప్పిస్తున్నాడు. కొడుకుల పేర్లలో విశేషముంది. 16 సంవత్సరాల క్రిందట రెండో కొడుకు పుట్టినప్పుడు అమర్త్యాసేన్‌కు నోబెల్ బహుమతి వచ్చింది. దాన్ని పేపర్లో చూశాడు భూమయ్య. తన కొడుక్కి అతని పేరు అమర్త్యాసాయి అని పెట్టుకున్నాడు. అదీ భూమయ్య సామాజిక స్పృహకి నిదర్శనం. మొదటినుంచీ భూమయ్య మనసులో 'సేవ'కి చిన్న స్థానం ఉంది. వెంకోజీపాలెం స్వామీజీ సరుకులు ఇస్తే తను వంటచేసి వాంబే కాలనీ, కొమ్మాది కాస్త దూరంగా ఉన్న వైయస్సార్ కాలనీలో 14 మంది వృద్ధులకు రోజూ అన్నం పెట్టేవాడు. ఈ అనుభవంతోనే స్వామీజీ కామెడీ క్లబ్బుకి ఈ భూమయ్య పేరుని సూచించారు. ఇతని ఆటోలో వంట ఆసుపత్రికి, తద్వారా బంధువులకు చేరుతోంది. కాని ఈ పనివేళ తప్పక రోజూ జరగాలికదా? భూమయ్య రోజూ రాగలడా? "అయ్యా, నా ఆటోకి నెలకి 6,500 వాయిదా కట్టాలి. అప్పుడు టైము నా చేతుల్లోకి వస్తుంది" అన్నాడు భూమయ్య. నెలకోసారి ఓ సాయంకాలం నవ్వుకోవడానికి సమావేశమయ్యే ఈ క్లబ్బు సభ్యులకి ఇది కొరకరాని కొయ్య.

మొదటిసారిగా నవ్వించే కామెడీ క్లబ్బు సభ్యులు నెలనెలా 500 విరాళాలు పోగుచేసి భూమయ్యే ఆటో వాయిదాలు కట్టారు. భూమయ్య ఉదయం 5 గంటల నుంచీ 9 గంటల వరకూ ఆటో నడుపుతాడు. మళ్ళీ మధ్యాహ్నం 4 గంటల నుంచీ రాత్రి 9 నుండి 10 గంటలవరకు నడుపుతాడు. మధ్యలో అతనూ భార్యా వంటచేసి ఆసుపత్రికి వెళ్ళి రోగుల బంధువులకి స్వయంగా భోజనాలు పెడతారు. కొడుకులూ సహకరిస్తారు. కామెడీ క్లబ్బు సభ్యులు కనీసం రోజుకొకరు ఈ పనిలో చెయ్యి కలుపుతారు. రోజుకి కనీసం వందమందికి అన్నం, పులుసు, మజ్జిగ ఇస్తారు. ఒక్కోరోజు అనుకోకుండా మనుషులు ఎక్కువ అవుతారు. వెంటనే భూమయ్య ఇంటికి పరుగెత్తి వంటచేసి తెస్తాడు.

ఇలా ఆరునెలలు నడిచింది. ఇప్పుడు హైదరాబాద్ నుంచి శ్రీకృష్ణ అనే వ్యక్తి ఇందులో ప్రమేయమున్న వ్యక్తి వచ్చాడు. ఈ వంట ఎక్కడో జరుగుతోంది. ఆసుపత్రిక పరిసరాలయితే సౌకర్యంకదా? మానసిక వైద్యశాల సూపరింటెండెంట్ రాధారాణిగారిని కలిసి ఈ విషయాన్ని చర్చించారు. ఆమె అర్థంచేసుకొని కలెక్టరుకి ఒక అర్జీ పెట్టమన్నారు. హుద్‌హుద్ తుఫానుకి సర్వనాశనమయిన ఒక షెడ్డు ఆసుపత్రి ఆవరణలో ఉంది. దానిని వీరికి ఇవ్వడానికి ప్రభుత్వం అంగీకరించింది. శ్రీకృష్ణ రెండున్నర లక్షల ఖర్చుతో ఆ షెడ్డును బాగుచేయించి ఇచ్చాడు. 2015 ఆగస్టు 14న వెంకోజీపాలెం ఆశ్రమంలో వంటలతో ప్రారంభమయిన ఈ పని 2016 ఫిబ్రవరి 19 నాటికి ఆసుపత్రిలోనే షెడ్డులోకి మారింది. వంట సామగ్రి ఈసారి శ్రీకృష్ణ కొనిచ్చాడు. ఇంతవరకు 'జయసాయి అన్నదానం' అనే పేరుతో సాగే ఈ కార్యక్రమం 'అన్నపూర్ణ అన్నదానం'గా రాష్ట్రాన్ని దాటివచ్చి స్వయంపోషకత్వాన్ని సాధించింది. రెండు సంవత్సరాల 3 నెలల నుంచీ సాగుతున్న ఈ వితరణ క్రమంగా సానుభూతిపరులనూ, వితరణశీలురనూ ఆకర్షించింది. స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ చేయూతనిచ్చారు. వంటలకి పాత్రలు, స్టౌ సమకూరింది. కూరల్ని దాచడానికి రిఫ్రిజిరేటర్ వచ్చింది. కంచాలు చేరాయి. మట్టపల్లి చలమయ్య



ఆటో భూమయ్య

అనే శ్రేష్టిగారు తమ చలమాజీ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఈ వంటలకు కావలసిన బియ్యాన్ని పూర్తిగా ఇవ్వడానికి ముందుకొచ్చారు. ఈయన ఈ మధ్య కాలంచేశారు. ఆయన వితరణని వారి కొడుకు హనుమంతరావుగారు కొనసాగిస్తున్నారు. అయితే ఆసుపత్రికి సమీపంలో ఈ స్థలం మొదటినుంచీ దూరంగా ఉన్న కారణాన దొంగతనాలు ఎక్కువ. బయట ఉంచిన భూమయ్య ఆటో సామాన్లు పోయాయి. రాత్రిళ్ళు దొంగలు బాహాటంగా వచ్చి పలకరించేవారు. కాని ప్రక్కప్రక్కనే కొత్త భవనాలు వచ్చాయి. క్రమంగా మనుషుల రద్దీ పెరిగింది. దొంగలు భయపడ్డారు.

భూమయ్యకి – అతని కృషి తెలిసిన కూరగాయల వ్యాపారులు – కూరల్ని చవకగా ఇస్తారు. ఎవరు ఏ సరుకులు ఇస్తామన్నా గాజువాక, చోడవరం, మధురవాడ, శృంగవరపుకోట ఎక్కడికయినా ఆటోలో వెళ్ళి భూమయ్య తెచ్చుకుంటాడు. 25 నెలలుగా ఈ కృషి సాగుతోంది. క్రమంగా వంటకాల 'రాశి' కలసి వస్తోంది. అప్పుడప్పుడు 'వాసి' తగ్గుతోంది.

ఈ కృషి తెలిసినవారు తమ తమ పుట్టినరోజుకో, పండగల్లోనో ఆర్థికంగా ముందుకు వస్తారు. పండగల్లో పులిహోర, ఇంకా సాధ్యమయితే ఓ స్వీట్ ఇస్తారు. ఎవరయినా ఇస్తే అరటిపండు ఉంటుంది.

ఈ కృషిలో సాధకబాధకాలు? భోజనాలకిచ్చిన



వంటలు - ఓదార్పులు

కంచాలు కొందరు సొంతం చేసుకుని పట్టుకుపోతారు. వారిని ఆపడం కష్టం. ఒక్కోసారి పేషెంట్లు వరసలో చేరి అల్లరి చేస్తారు. ఒకసారి ఒక పిచ్చివాడు పరుగునవచ్చి సాంబారు డ్రమ్ముని తన్నేసి దూరంగా నవ్వుతూ నిలబడ్డాడు. వడ్డిస్తున్నవారిమీద వేడివేడి సాంబారు పడి శరీరం కాలింది. ఇవి ఎదురు చూడని ఇబ్బందులు.

తొలిరోజుల్లో – ఈ సౌకర్యాలు ఇంకా సమకూరని రోజుల్లో ఇలాంటి సేవకి అలవాటుపడిన భూమయ్య ఓ మాట అన్నాడు: "మీరెవరూ కలసి రాకపోతే నేనే మరో రెండు గంటలు ఆటో నడిపి వారికి అన్నం పెడతానయ్యా" అని.

"ఆ మాట మాకు స్ఫూర్తి" అంటారు మస్తాన్ రెడ్డి.

ఎవరూ పట్టించుకోని – మానసిక రోగులను సాకే బంధువులకు నిశ్శబ్దంగా జరుగుతున్న ఉపకారమిది. రోజు గడవని పేద వర్గాలపై తమ ఆత్మీయుల మానసిక వైకల్యమనే 'కొండ' విరిగి మీద పడినప్పుడు – కనీసం వారి కడుపునింపే సేవాకార్యక్రమిది.

ఇంత వివరంగా ప్రస్తావించడానికి కారణం – 'సేవ' మెల్లగా స్పందన ఉన్న మనస్సులో రూపం దిద్దుకుని విశ్వరూపం దాలుస్తుందని నిరూపించడానికి. 'మంచి' అనే కార్చిచ్చు ఏ ఒక్కరి హృదయంలోనో రగులుకొని మరెన్నో హృదయాలలో ప్రజ్వలించి ఓ గొప్ప 'సేవ'కు రూపకల్పన చేస్తుందని వివరించడానికి.

ఎవరయినా చేయూతనివ్వాలనుకున్నవారు తమ పుట్టిన రోజునాడో, ఆత్మీయుల పుట్టిన రోజులలోనో, పండగలలోనో – మరెప్పుడైనా వస్తురూపంగాగానీ, ఆర్థికంగానయినా సహాయపడవచ్చు. వారే స్వయంగా వచ్చి వడ్డన చేయవచ్చు. మస్తాన్ రెడ్డి గారి మొబైల్ నెం. 944 134 4365.


గొల్లపూడి మారుతీరావు
విశాఖపట్నం.
ఇ-మెయిల్: gmrsivani@gmail.com

# పల్నాడు గేయాలు

అలనాటి పలనాటి
పౌరుసమ్ముల దీటి
మాచర్ల గురజాల
పందాల పోటీ

రోసాలు తెగవాటి
మీసపంచుల మీటి
సరిమాగు సరితోటి
పోరాడునామేటి

ఆవైరముల సాటి
ప్రాణాలు ఏపాటి?
ఆనాటి జనకోటి
అట్లనంటె పరిపాటి

రాజుల్లపంతాలు
రాజ్యాలుదంతాలు
కోళ్ళకే సొంతాలు
చరితకాద్యంతాలు

మొనదేలి పదునైన
కత్తినారెకు గట్టి
రక్తధారలరంజు
చిందించ మునుముందు

తొలిగ రోషముపుంజు
కాల్దువ్వు నా పుంజు
కష్టాలకడగండ్ల పాలాయే పుంజులే

గెలుపందునో పుంజు
కీర్తికాంతుల పుంజు
ఓటమొందిన పుంజు
గెలుపు వారికి నంజు

పుంజునంజుల నడిమ
నడమంత్రమదియేమొ
రాజు రాయుండాయె
రాజ్యాలు రాళ్ళాయె

రాజులగెలుపు లా
రాజిన బలుపు లా

నాటి పందేలన్ని
నేటికీ ఉన్నాయి

అందాల చందాలు
చిందించు మగరాజు
అరుదెంచె మనమోజు
దీర్ఘవచ్చెనోరోజు
అటుల వచ్చినవాడు
కుక్కుటేశ్వరుడాడు
నాల్గుఝాముల రేడు
కొక్కొరొకో అన్నాడు.

జ్ఞానులందరుజేరి
మ్రొక్కరొకో అనిరీ
అజ్ఞానులందరిది
అరుదైన కూతనిరి

రైతు రాజులు వినిరి
గొర్రుకొయ్యలగనిరి
గొర్రుగొడ్లకుగట్టి
మడిదున్నసాగిరి

రాజవంశము చేరి
కోడిపందెము వేసె
రాజ్యాలు గుంజేసె
వీర భోజ్యమ నేసె

అశ్వప్రహరణ
సామ్రాజ్యవిస్తరణ
భరత భారతి భవిత
పాచికల పాల్గగ

పలనాటి పంతాలు
పరుసపులుఁగుల పాలు
రాజురాజ్యం పోయె
కోటబీటలు పారె

బీటపారిన కోట
మేటవేసిన చోట
పందేల రాయుళ్ళ
కనువైన బాటయ్యె

రాజరాజుల రంజు
రాచరికపు పుంజు
పందేల పాలాయె
మనసాగి కొనసాగె

ప్రాణాలు కోల్పోయి
పరువుగా చనిపోయె
అవని అంచులుగా
అశ్రువుయి పొంగెనా

మనలనొదిలిన చరిత
మనకు తెలిపిన ఘనత
వీరమరణమునందుమా
మనకెందుకనుకొందుమా?

ఊళ్ళపంతపు కథలు
కోళ్ళు పొందిన వ్యథలు
సుళ్ళు తిరుగుతు కళ్ళలో
నీళ్ళు మన యెదనింపవా?

రోసాలి రుసరుసలా?
మోసాల గుసగుసలా?
మీసాల పసపసలా?
యిలరా వెతల వలలో

ఆరదాయా చరిత
ఆగదా యీ జనత
కొనసాగునా పర్వమై
పల్లెసీమల గర్వమై

రాజ్యాలపై హక్కు
సామ్రాట్ తురాయిల్లో
సామ్రాట్ తురాయిపై,
కుక్కుటమరాయిదే
ఎటులైన యీ హక్కు
ఇరువుకు బహు చిక్కు
విడిన శాంతియెదక్కు వీడదే యీ చిక్కు

కోన రమణరావు
చీరాల. ఫోన్: 995 129 9876.

# అట్టమీద బొమ్మలు



**మొదటి అట్ట:** రెండవ అరియ కేసరి... వేములవాడ చాళుక్యుడు... పంప మహాకవి... వేములవాడ చాళుక్యులు మొదట పోదన (బోధను) పట్టణం రాజధానిగా, తర్వాత వేములవాడ కేంద్రంగా పరిపాలించారు. రెండవ అరియకేసరి (క్రీ.శ. 930–941) కాలంలో తెలుగువాడైన పంప మహాకవి కన్నడంలో విక్రమార్జున విజయకావ్యాన్ని రచించి అరియకేసరికి అంకితమిచ్చాడు. ఈయన ఆది పురాణాన్ని కూడా రచించాడు.



**రెండవ అట్ట:** అల్లసాని పెద్దన – కృష్ణదేవరాయలు.
క్రీ.శ. 1509 నుండి 1529 వరకు విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలించిన శ్రీకృష్ణదేవరాయల ఆస్థాన కవులలో ముఖ్యుడు అల్లసాని పెద్దన. ఆంధ్ర కవితా పితామహుడని పేరుపొందాడు. రాయలచేత అనేక గౌరవాలు పొందిన పెద్దన స్వారోచిషమనుసంభవము (మనుచరిత్ర) అనే ప్రబంధాన్ని రచించాడు.



**మూడవ అట్ట:** అలియ రామరాయలు – రక్షస తంగడి యుద్ధం.
శ్రీకృష్ణదేవరాయల అల్లుడు అలియ రామరాయలు సదాశివరాయలను (క్రీ.శ. 1542–1570) సింహాసనమెక్కించి, రాజ్యభారాన్ని వైభవంగా నిర్వహించాడు. అలియ రామరాయల కాలంలోనే విజయనగరం అత్యున్నత స్థితికి చేరుకొన్నది. రక్షస తంగడి యుద్ధంలో ఒక ఘట్టం ఈ చిత్రం.



**నాల్గవ అట్ట:** కాకతీయ చక్రవర్తి గణపతి దేవుడు – శిలాతోరణం.
కాకతీయ చక్రవర్తులందరిలోనూ గొప్పవాడు గణపతి దేవుడు (క్రీ.శ. 1199–1262). కాకతీయ రాజ్యాన్ని ఉత్తరాన నేటి గంజాం జిల్లాలోని ఆస్కా వరకు, దక్షిణాన కాంచీపురం వరకు వ్యాపింపజేశాడు. అంతేకాక వింధ్య పర్వతాలను దాటి కూడా ఈ రాజ్యం విస్తరించి ఉండేది. రాజధానిని అనుమకొండ నుండి ఓరుగల్లు కోట నిర్మించి అక్కడికి మార్చాడు. తిక్కన మహాకవి గణపతిదేవుని ఆస్థానాన్ని సందర్శించి, ఆయన రచించిన భారతాన్ని వినిపించాడు.

*అన్ని చిత్రాలు శ్రీకర్ వేసినవే.*

# ఎడిటర్స్ డైరీ

9వ తేదీ అక్టోబరు. నా అమెరికా ప్రయాణానికి నిశ్చయమైనరోజు. ఈ ప్రయాణం సరదాతోబాటుగా భయాన్ని కూడా మోసుకొచ్చింది. 24 గంటలపాటు అటు ఆకాశానికి, ఇటు భూమికి చెందకుండా, ఆకాశంలో ఊయలకట్టి అందులో విహరించటం, థ్రిల్ + భయం, ఒక మిశ్రమ స్పందన. అశ్వినీకుమార్ చెప్పినట్లు ప్రయాణం చేస్తున్నంతసేపూ విమానంలోనున్న నట్లు, బోల్టులకు మనకు తేడాలేదు.

ఇది దూర ప్రయాణమైనప్పుడు స్లీపర్ బెడ్‌లు ఎందుకు పెట్టలేదు అనుకునేవాణ్ణి. దుబాయ్ నుంచి వాషింగ్టన్ ప్రయాణమైన విమానంలో సగానికిపైగా ఖాళీలుండటంతో, మూడు సీట్ల మధ్యనున్న హ్యాండ్ రెస్ట్‌లు పైకి లేపి పడక సీనుకు అనుకూలత కల్పించింది ఎయిర్ హోస్టస్.

9వ తేదీ సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరాను. అప్పుడప్పుడే చీకట్లు ముసురుకుంటున్నాయి. నా ప్రయాణ సమయాన్ని గంటలలో కొలవడానికి వీలుగా నా వాచీ టైమ్‌ను భారత కాలమానం నుంచి మార్చలేదు. బయలుదేరడానికి ముందురోజే నాకు కావలసిన 71.ఎ విండో సీట్‌ను ఎన్నుకున్నాను. ఫ్లైట్‌లో కూర్చుని విండో తెర పైకిలేపాను. విమానం రెక్కతప్ప మరేం కనిపించలేదు. అయినా చూడటానికి ఏముంది? అంతా రాత్రి, చీకటి. ప్రయాణం మొదలైనప్పటినుంచి అంతా చీకటే! 12 గంటలు కాలం గడిచింది. రాత్రి కొనసాగుతూనేవుంది. మరో 8 గంటలు గడిచిన తరువాతగాని సూర్యోదయం కాలేదు. అంటే నేను 20 గంటలు సుదీర్ఘమైన రాత్రిలో గడిపాను. ఇది ఒక మరపురాని అనుభవం.

10వ తేదీన వాషింగ్టన్ సమయకాలం ఉదయం. 10.30 నిమిషాలు. ఇమిగ్రేషన్ చెక్ నుంచి బయటకు వచ్చాను. రమేష్, సౌమ్య, నీరజ భర్త శ్రీనివాస్ ముగ్గురు బయట నా గురించి ఎదురు చూస్తున్నారు. శ్రీనివాస్ నన్ను రిసీవ్ చేసుకుని వెళ్ళిపోయాడు. రమేష్, సౌమ్యలతో కారులో ప్రయాణం. డేటాన్ సబర్బన్ ఏరియా చేరడానికి గంట సమయం పట్టింది. సుమారు 5 వందల ఎకరాలలో చదును చేయబడ్డ పచ్చిక బయలులో, బొమ్మరిల్లులాంటి ఇండ్లను ఎవరో అందంగా బొమ్మలకొలువులో పెట్టినట్లు తీర్చిదిద్ది ఉంచారనిపించింది. అన్ని ఇండ్లూ ఒకేలా ఉండకపోయినా నమూనా మాత్రం ఒక్కటే. తలుపులు, గుమ్మాలు, కిటికీలు, ఇండ్లపైకప్పు, గ్యారేజీలు వీటన్నిటిలోనూ ఒక సజాతీయ సాధారణీకరణ కనిపిస్తుంది. ఏ ఇంటికీ చుట్టుకొలతలను నిర్దేశించే ప్రహరీగోడలు లేవు. ఒకొక్క ఇల్లు ఒక ఎకరం స్థలంలో నిర్మించబడింది. ప్రహరీ కట్టుకోవాలంటే దానిని వెనుకవైపుకు మాత్రమే అంగీకరిస్తారు. అప్పుడు కూడా పల్లెటూళ్ళలో తడికలతో కట్టినట్లు అంతగా ఎత్తులేని చెక్కలతోనే కట్టుకోవాలి. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో రమేష్‌తో కలిసి stroll కు వెళ్ళాను. ప్రతి ఇంటిలోనూ ఒకటి, రెండు గుడ్డిదీపాలు వెలుగుతున్నాయి. ఇక్కడ ఉండేవారెవ్వరూ ఎక్కువ కాంతిని ఇష్టపడరు. ఇంటిముందు వీధి దీపాలు పెడితేనే ఆ దీపపు కాంతి మా ఇంట్లోకొచ్చి మమ్మల్ని డిస్టర్బ్ చేస్తుందంటారట. ఒక్క రమేష్ ఇంట్లోనుంచే తెల్ల లైటు కాంతి బయటకు వస్తుంది. కరెంటు రాకముందు, రాత్రయితే కోడిగుడ్డు దీపాలతో బిక్కుబిక్కుమంటున్న 1950 నాటి కోనసీమ గుర్తుకొచ్చింది. తెల్లవారింది. ఇంటికి కొంచెం దూరంలో దొంతరలు పేర్చినట్లు పెద్ద చెట్లున్నాయి. పక్షులను చూడాలని లోపలికి వెళ్ళాను. కాకులు తప్ప మరేమీ కనిపించలేదు. అమెరికన్ల జాతీయ పక్షి గద్దను చూడాలని ఆకాశంకేసి ఎన్నిసార్లు చూసినా విమానాలేతప్ప గద్దలెక్కడా కనిపించలేదు. మనతో పోలిస్తే వీళ్ళకు బయోడైవర్సిటీ చాలా తక్కువ. ఎక్కడపడితే అక్కడ బలిసిన ఉడతలు మాత్రం కనిపిస్తాయి.

ఇండియాలోని వేసవిని తప్పించుకోవడానికి అమెరికా ప్రయాణానికి ఏప్రిల్, మే నెలలు అనుకూలంగా ఉంటాయని అనుకేనేవాడిని. ప్రఖ్యాత నైరూప్య చిత్రకారుడు, ఎమ్.ఎస్. రామారావుని కలిసినప్పుడు, ఆయన అక్టోబర్ నెలనుంచి, చెట్లు ఆకులను రాల్చడానికి ముందు, ఎరుపు రంగులోకి మారి ఆ సమయంలో ప్రకృతి చాలా అందంగా కనిపిస్తుందని మాటలమధ్యలో చెప్పారు. ఆయన మాటలు అక్షరాలా నిజం. మరీ ముఖ్యంగా నేపుల్

చెట్టు అందాన్ని ఆ కాలంలో చూసి ఆనందించడానికి మాటలు చాలవు.

సంవత్సరం క్రితం నేను **మిసిమి**లో *దెయ్యాల రాత్రి (Hallowen)* అనే వ్యాసంలో అమెరికాలో జరిగే *Hallowen* పండగ గురించి వ్రాశాను. అక్టోబర్ 31వ తేదీన దానిని ప్రత్యక్షంగా చూశాను. అమెరికన్లే కాకుండా కొంతకాలం క్రితం ఇక్కడకు వచ్చి స్థిరపడిన భారతీయులు కూడా దీనిని జరుపుకుంటున్నారు. ఇంటిముందు గుమ్మడికాయలతో, అస్థిపంజరాల, మంత్రెగత్తెల బొమ్మలుపెట్టి వెలిగిస్తున్నారు. వివిధ రకాల భయంకర రూపాలు ధరించిన పిల్లలు ప్రతి ఇంటికి వెళ్ళి కాలింగ్ బెల్ మోగిస్తారు. తలుపు తీసిన తరువాత ఇంటివారితో 'ట్రిక్ ఆర్ ట్రీట్' అని అడుగుతారు. అంటే మాకేదైనా ట్రిక్ చేసి చూపించండి, లేకపోతే ట్రీట్ (చిన్న విందు) ఇవ్వండని అర్థం. అందరూ వారికి చాక్‌లెట్లతో ట్రీట్ ఇస్తారు. పెన్సిల్‌వేనియా రాష్ట్రంగుండా ప్రయాణిస్తున్నప్పుడు ఒక అందమైన చిన్న పట్టణాన్ని చూశాను. దానిపేరు బర్డ్ ఇన్ హ్యాండ్. పేరులానే ఊరిలో నివసించే ప్రజలు కూడా విచిత్రంగా ఉన్నారు. వీళ్ళను అమిష్‌లంటారు. వీరంతా జర్మనీలో రిఫర్మేషన్ కాలంలో వచ్చిన అనా బాప్టిస్ట్ అనే వర్గానికి చెందినవారు. 1525 సంవత్సరంలో రేడికల్ వింగ్ ఆఫ్ ప్రొటెస్టంట్ రిఫర్మేషన్ నుంచి ఇది ప్రారంభమైంది. మతానికి నమ్మకమే ప్రధానమని భావిస్తారు. క్రైస్ట్, ట్రినిటీలను విశ్వసిస్తారు. ఇందులో కూడా చిన్న విభాగాలున్నాయి. మరీ ఛాందసంగ ఉన్నవారిని 'ఓల్డ్ ఆర్డర్' అని పిలుస్తారు. అత్యాధునిక జీవితానికి ఉదాహరణగా చెప్పబడుతున్న అమెరికాలో ఆధునికత అంటకుండా జీవిస్తున్నారు. వీరు ఇండ్లలో విద్యుత్తును వాడరు. వంటకు గాస్‌పొయ్యి వాడరు. బట్టలు ఎండలో ఆరబెడతారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించరు. వీరు జర్మనీ – స్విట్జర్‌లాండ్ ప్రాంతాల నుంచి 1693లో అమెరికాకు వలసవచ్చారు. అప్పటి జీవన విధానాన్నే పాటిస్తున్నారు. వీళ్ళ చర్చి పేరు అమిష్ చర్చి. వారు తమ మతాన్ని, విశ్వాసాలను విస్తృత పరచుకోవాలనుకోరు. క్రైస్తవ జీవితాన్ని 17వ శతాబ్దం నాటి పద్ధతులతో జీవిస్తున్నారు. తమ కూటమిలోని వారితోనే వివాహాలు చేసుకుంటారు. ఫస్ట్ & సెకండ్ కజిన్స్‌తో వివాహం నిషిద్ధం. 8వ తరగతి దాటి పిల్లలను చదువుకోనివ్వరు. వ్యవసాయం, చేతివృత్తులే ఆధారంగా జీవిస్తారు. గుఱ్ఱపు బండ్లపై ప్రయాణం చేస్తారు. ఒకటి లేదా రెండు జాతుల గుఱ్ఱాలను కట్టి నాగళ్ళు దున్నటం నేను చూశాను. ప్రభుత్వానికి సోషల్ సెక్యూరిటీ టాక్స్‌లు కట్టరు. ప్రభుత్వం నుంచి ఏ సహాయమూ అడగరు. మిలిటరీ సర్వీసు చేయటం నిషిద్ధం. కోర్టుకు వచ్చినప్పుడు



దేవునిపైగాని, బైబిల్‌పైగాని ప్రమాణం చేయరు. "ఇది నిజం కాబట్టి చెబుతున్నా"నంటారు. సివిల్ అడ్మినిస్ట్రేషన్‌కంటే చర్చికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. ఇంటిచుట్టూ గ్రామీణ వాతావరణం ఉంటుంది. పశువులను, కోళ్ళను, బాతులను పెంచుతారు. సకుటుంబంగా జీవించటంవైపు మొగ్గుచూపుతారు. కుటుంబ నియంత్రణ పాటించక పోవటంతో గత 20 సంవత్సరాలుగా వీరి జనాభా రెట్టింపైంది. కెనడాలో, అమెరికాలోని 24 రాష్ట్రాలలో జీవిస్తున్నారు. 65 శాతం జనాభా పెన్సిల్వానియా, ఓహియో, ఇండియానాలలో ఉన్నారు.

వాషింగ్టన్‌లో సుమారు 9 మ్యూజియమ్‌లు పక్కపక్కనే ఉన్నాయి. ఇవన్నీ స్మిత్‌సోనియన్‌వారి ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. ప్రతి మ్యూజియమ్ ప్రొద్దుట 10 గం॥ల నుండి సాయంత్రం 5 గంటలవరకూ ఉంటుంది. ప్రతి మ్యూజియమ్ ముందు ఒక ప్రకటన ఉంటుంది. అది This museum is opened all days expect 25th December of every year అని ఉంటుంది.

మ్యూజియంలో కట్టుబాట్లు చాలా పగడ్బందీగా ఉన్నాయి. ప్రతి గదికి ఒక అబ్జర్వర్ ఉంటాడు. లోపలికి రాకముందే మనకు సహాయకారిగా ఉండటానికి ఇన్ఫర్మేషన్ పాంప్లెట్ ఇస్తారు. ఇదికాక ఎక్కడికక్కడే వివరణలు ఉంటాయి. ఏదీ ఎవరి నుంచి తెలుసుకోవలసిన అవసరంలేదు. మధ్యమధ్యలో టి.వి. షోలు నడుస్తుంటాయి. అందులో మరింత వివరణలుంటాయి.

స్పేస్ మ్యూజియం చాలా విజ్ఞానాత్మకంగా ఉంది. ప్రతి విషయాన్ని చూసి, చదివి అర్థంచేసుకోవాలంటే కనీసం 15 నుంచి 17 గంటలు పట్టవచ్చు. పూర్వకాలం నుంచి, భూమిమీద నున్న ప్రతి వస్తువును ఎగరవేస్తే అది భూమిమీద పడుతుందనే వాస్తవ సత్యాన్ని అందరూ ఒక మాటర్ ఆఫ్ ఫ్యాక్ట్‌గా తీసుకున్నారు. న్యూటన్ భూమికి ఆకర్షణశక్తి ఉందని చెప్పి ఆగకుండా, అది ఒక వస్తువును ఎంత ఎత్తులో ఎంతగా ఆకర్షిస్తుందో లెక్కవేసి చూపించిన ఇలస్ట్రేషన్స్ నన్ను బాగా ఆకట్టుకున్నాయి. చంద్రుని మీద మనిషి మొదటిసారిగా పాదం మోపిన స్పేస్ షటిల్ ఒరిజినల్ అక్కడే ఉంది. దాని లోపలికి వెళ్ళి చూడటం గొప్ప అనుభవం. అలానే జెమినీ స్పేస్ట్ షటిల్ కూడా. మరో మ్యూజియమ్‌లో concorde ను పైన వ్రేలాడదీసి పెట్టారు. ఒక ఐమాక్స్ థియేటర్ కూడా ఉంది. 3డి సినిమాలు చూపిస్తున్నారు. ప్లానెటేరియంలో 25 నిమిషాల నిడివిగల బ్లాక్ మాటర్, బ్లాక్ ఎనర్జీ అన్న చిత్రం, ట్రావెలింగ్ టు స్టార్స్ అన్న రెండు చిత్రాలను చూశాను. అందులో బిగ్ బ్యాంగ్, డెత్ ఆఫ్ సన్ లాంటి దృశ్యాలు భయావహం. నక్షత్రాలు రాలి నెత్తిపై పడతాయా అన్నట్లనిపించింది. అదిచూసి బయటకు వచ్చిన తరువాత నాలోని హేతువాద భావాలు మరింత బలపడ్డాయి.

ఇక్కడ అమెరికన్లు చిరునవ్వుతో మనల్ని విష్ చేస్తారు తప్ప ఎక్కువగా మాటలు కలపరు. సెల్‌ఫోన్‌లలో మాట్లాడుతూ నడవటం కూడా ఉండదు. బస్‌స్టాండ్‌లో సెల్‌ఫోన్‌లు చూస్తూ కనిపిస్తారు తప్ప మాట్లాడుతూ ఎక్కడా కనిపించరు. రమేష్ ఇంటి స్థలంలో ఇంతకు ముందు కొందరు అమెరికన్లు ఉండేవారట. ఇక్కడ రమేష్‌తోపాటు కొందరు భారతీయులు ఇండ్లు కొన్నారు. ఆ అమెరికన్లు ఈ ప్రదేశాన్ని వదలి ఏకాంతంగా ఉండే మరో ప్రదేశానికి వెళ్ళిపోయారు. వీరు తెల్లవారిని తప్ప ఆఫ్రికన్ అమెరికన్‌లనబడే నల్లవారితోగాని, మనలాంటి కలర్డ్ పీపుల్ పక్కనగాని ఉండటానికి ఇష్టపడరు. వీరిని ఇక్కడ రెడ్ నెక్స్ అని పిలుస్తారు. తమలోని ద్వేషభావాన్ని మాటలలో వ్యక్తపరచరుగాని, చేతలతో చూపిస్తారు. నీగ్రోలు కాని, కలర్డ్ వాళ్ళుగాని వీళ్ళు తింటున్న హోటల్‌కు వెళ్ళితే వీరు వెంటనే లేచి వెళ్ళిపోతారట. Daytonకు దగ్గరలోనే ఇన్నయ్యగారి అమ్మాయి డాక్టర్ నవీన ఇల్లు ఉంది. ఇంటి పరిసరాలు – చాలాపెద్దవి. నేను వారి ఇంటికివెళ్ళి ఆయనతో కాసేపు గడిపి లంచ్ చేసి వచ్చాను. ఆ రోజు ఆయన 80వ పుట్టిన రోజు చేసుకుంటున్నారు. ఆ సంగతి తెలియకుండానే నేను కాకతాళీయంగా వారింటికి వెళ్ళాను.

**కాండ్రేగుల నాగేశ్వరరావు**
**అమెరికా నుంచి**

# మన్‌హట్టన్‌లో

మొదటిసారిగా మన్‌హట్టన్‌లో అడుగుపెడితే అక్కడి ఆకాశ హర్మ్యాలు వాటి పరిమాణంతో, అద్దాల మెరుపులతో మిమ్మల్ని పురుగుని, చిన్న పురుగుని చూసినట్లు చూస్తాయి.

విపరీతమైన వేగంతో పరుగులుతీసే న్యూయార్క్ వ్యాపార వ్యవహారాలు, జీవనశైలి మిమ్మల్ని అశక్తుల్ని చేసి ఒక పార్కింగ్ లాట్‌లోనో, లేక ఒక పార్క్ బెంచ్‌మీదో పడవేస్తాయి.

దీపాల వెలుగుల్లో అద్దాల వెనక నుంచి కనపడే ఖరీదయిన ఫాషన్‌వేర్, బ్రాండ్‌నేమ్స్ మిమ్మల్ని చూసి వెక్కిరిస్తాయి. వెకిలిగా నవ్వుతాయి.

మిలమిలమెరిసే విలువైన కారులు బారులుగా పరుగులు తీస్తూ మిమ్మిల్ని వాటిమీద పడిన పల్చని ధూళి పొరలుగా కూడా ఖాతరు చెయ్యవు.

ఎప్పుడూ చెవులు చిల్లుపడే విధంగా అరుస్తూ శరవేగంతో దూసుకుపోయే అంబులెన్స్, ఫైర్ ఇంజన్లు, పోలీసు కారులు – మిమ్మల్ని పిచ్చివాళ్ళను చేస్తాయి.

ఎటు పోవాలో, ఎలా పోవాలో, ఏమి చెయ్యటం, ఎవరి సహాయం అడగాలో తెలుసుకునేలోపు మీకున్న




**ఎడమవైపు హడ్సన్, కుడిప్రక్కన ఈస్ట్ రివర్, ముందు కనిపించేది అట్లాంటిక్ మహాసముద్రపు ముఖద్వారం**

కాస్త సమయం కరిగిపోతుంది. సాయంత్రం అవకముందే, చీకట్లు ముసరక మునుపే న్యూయార్క్ నగర నలుపు దొంగలు, నేరగాళ్ళు మీకోసం సిద్ధంగా ఉంటారు. మెట్రో మెట్లచాటునో సైడ్‌వాక్ షాడోలోనో, ఆగివున్న టాక్సీ ఆవలివైపునో కాచుకుని, ఈజీమాన్, ఈజీ అంటూ ఈజీగా పనికానిస్తారు. ఏమరుపాటున ఉంటే ఇంతే సంగతులు. ఇక్కడి సంపదకు, పేదరికానికి ఉన్న వ్యత్యాసం వరల్డ్ ట్రేడ్ సెంటర్ ట్విన్ టవర్స్‌కంటే ఎత్తు. హడ్సన్ నది ఈస్ట్ రివర్ అట్లాంటిక్ ముఖద్వారంకంటే కూడా లోతు.

ఎంతో వెడల్పు లోయలు, నదుల్ని దాటిస్తున్న పొడవైన న్యూయార్క్ బ్రిడ్జిలన్నీ కూడా దాటించలేని అగాధం అది.

ఈ కనిపించే వ్యత్యాసం కనపడని ఘర్షణని రేకెత్తించి, ఎప్పుడు మంటలుగా మారుతాయోననే ఆందోళన, టెన్షన్ వీరి జీవితంలో ఒక భాగం.

కదిలి వెళ్ళిపోతున్న రైలెక్కాలంటే మీరు కూడా రైలు వేగంతో సమానంగా పరుగెత్తి అందుకోవలసిందే కదా.

న్యూయార్క్ నగరంలో ఏ పనిచెయ్యాలన్నా ఇక్కడి వేగం అందుకోలేకపోతే సైడ్‌వాక్‌పై నిస్సహాయంగా నిలబడి చూడాల్సిందే?

ఈ మహానగరం ఒక అద్భుతం. ఈ అలవి కాని అద్భుతాన్ని అందుకునేదెలా? మిమ్మల్ని ఆశ్చర్యంతోపాటు భయభ్రాంతుల్ని చేసే ఈ సాంకేతిక మృగాన్ని లొంగదీసుకునే మార్గమేమిటి? ఈ భూతానికి హృదయం ఉందా? అది ఎలా తెలుస్తుంది? ఈ రోడ్లన్నీ ఎక్కడికి దారితీస్తున్నాయి? ఆకాశాన్నంటే ఈ అద్దాల మేడల్లో ఎవరుంటున్నారు? ఎప్పుడైనా క్రిందికి దిగుతారా? ఎన్ని సందేహాలు – వీటిని ఎవరు తీరుస్తారు..

న్యూయార్క్ నగరాన్ని చూడబోవటమే పెద్ద సాహసం. ఈ సాహసం చెయ్యక తప్పదు. ఇంత దూరం వచ్చిన తర్వాత నాకంటే అడుగు ఎత్తున్న హిస్పానిక్ అమ్మాయి 'హే! డిడ్ యు స్టార్ట్ యువర్ ఎడ్వంచర్?' అని అడిగింది. "యస్! యస్!" అని నీతో మాట్లాడడమే ఒక సాహసం అనుకున్నాను.

## నిత్య యౌవని, నయగరా!

నదులన్నీ కొండల్లోనే పుడతాయి. ఎక్కువగా తూర్పు దిక్కుగానే ప్రవహించి సముద్రంలో కలుస్తాయి. ఇది ప్రకృతి సహజం. నయగరా ప్రత్యేకత ఏమిటి? గణాంక వివరాల జోలికి పోకుండా ఈ నదీ సోయగాలను వీక్షించితే, కొండకోనల నుంచి నది ఆసాంతం క్రింద లోయలో దూకటం, అదీ అర్ధచంద్రాకారంగా ఉండటంతో మీరు ఎదురుగా దూరంగా నిలబడి చూస్తుంటే అక్కడ ఒక జలప్రళయం జరుగుతున్నట్లు, గగన గంగ ఆకాశాన్ని వీడి ధరాతలం మీదుగా పాతాళానికి పయనమవుతున్నట్లు అదీ మన కళ్ళముందు జరుగుతున్నట్లు ఈ అద్భుతాన్ని చూడటానికే మనం బ్రతికి ఉన్నట్లు అనిపిస్తుంది.

ఎంతమంది కవులనో కవ్వించిన, మరెంతమందో కళాకారుల కుంచెలను కదిలించిన ఈ నది, ఈ దృశ్యం, ఈ జలపాతం మీలోని కళాకారుని, కవిని వెలికి తెస్తుంది. అలవికాని అనుభూతి అంతరంగంలో గంగలా ఉప్పొంగి జలపాతంలా ప్రవహిస్తుంది.

ఎక్కడో వినిర్మలమైన మంచుకొండల్లో చినుకులైరాలి, సెలయేరులుగా పారి, వరదలా పొంగి అశ్వధాటిగా పరుగులెత్తి ఒక మహోద్ధృతిగా మారి ఒక మహాశక్తిగా రూపొంది, ఒక్కమారుగా ఆకాశం నుండి 'మహా ప్రవాహ వేగంతో' 'దిక్కులు ఘూర్ణిల్ల'గా ఆ మహానది ఆసాంతం ఆపాతమై ఒక అద్భుత సుందరి, ఆశ్చర్యకరమైన *నిత్యయౌవన* ప్రతీత్య నృత్యహేలా లయ విన్యాసాలతో, హరివిల్లు విలాసాలతో, శీతల తుషార యవనిక పరంపరలతో, మిమ్ములను నవరసాల రసోత్పత్తిలో రంగరించి ముంచివేస్తుంది నయాగరా.



నయగరా జలపాతం

అరెరె! ఎంత నీరు, ఏమి హోరు, ఏమి జోరు, ఎంత ఘోష – ఎన్ని ఘటాఘటాలు. ఈ ధాటి, ఈ పోటు ఎవరాపగలరు? క్రింద శివజటాఝూట సంఘటితమే ఉన్నదా? శతకోటిశ్వేత ఘోటక సంచయం నురగలు గ్రక్కుతున్నట్లు, పాలసంద్రంలో ఏదో పెనుతుఫాను రేగినట్లు, ఈ పతనం తనకు సుతరామూ ఇష్టం లేనట్లు, తుషారశ్వేత చేలాంచలపుటంచులతో కేలందీయమని అర్థిస్తున్నట్లు, లోయ లోతుల నుంచి ఆకాశపుటందలాల్కై అర్రులు చాస్తూ మరలా ఊర్ధ్వ లోకాలకే పయనించాలనే అత్యాశతో అణువణువునా విచ్ఛిన్నమై నింగికెగసి పోవాలని, రంగురంగుల హరివిల్లు అందుకోవాలని, విశ్వ ప్రయత్నం చేస్తోంది, ఆ మహానది నయాగరా.

అక్కడి అల్లకల్లోలం – అలల కోలాహలం, జలపాత మంద్ర ధ్వని, గంభీర సంగీత ధుని. ఒక ప్రకృతి ఘటనాఘటం. ఇది సహజం – ఇది నిత్యం – ఇదే జీవితం – దర్శించండి, తరించండి.

తర్వాత తర్వాత నిలకడగా నిండుగా నడిచే నది ఇరువైపుల జనజీవితాలను చైతన్యవంతం చేసే ప్రశాంత స్రవంతి నయాగరానది. తిలకించండి, పులకించండి.

నయాగరా జలపాత ఉధృతిని, సౌందర్యాన్ని నదీ ప్రవాహ గతిని మూడు రకాలుగా తిలకించవచ్చు. మధ్యాహ్నం నీరెండలో నదికి ఎగువగా ప్రయాణం చేసి ఏ ప్రాంతంలో ఎంత వేగంగా ప్రవహిస్తున్నదో ఎక్కడ ఎంత విస్తృతంగా ఉన్నదో చూడవచ్చు.

సాయంత్రం అంటే చీకటి పడక పూర్వం నయాగరా జలపాతపు అర్ధచంద్రాకార దృశ్యానికి ఎదురుగా కొండమీదకు చేరి జలపాతనోద్ధృతిని, ఆ ప్రళయ శబ్ద ఘోషను – ఆ దృశ్యశ్రవణ గాంభీర్యాన్ని తిలకించి, పులకించిపోవచ్చు.

రాత్రి రానివ్వండి. ఎన్ని కాంతిదీపాలు, ఎన్ని రంగుల కాంతులు, ఆ మహాశ్వేత జల సమూహాన్ని, ఆ తుషార

మేఘసముదాయాన్ని రంగులద్ది కనులపండుగ చేస్తాయి. ఎంతకాలం అక్కడ నిలబడి చూసినా తనివి తీరని సజీవ చిత్రం, నిత్యయౌవని సోయగం. వయసు ఉధృతిలో యౌవన సౌందర్యంతో, మేని వంపుతో మిమ్ములను రెచ్చగొట్టే జవ్వనిలా కనులవిందు చేస్తుంది.

మర్నాడు ఉదయం సూర్యోదయంతోపాటే మళ్ళీ నయాగరా జలపాతపు ప్రాంతానికి తరలివెళ్ళాం. ఇప్పుడు ఒక వింత భయంకర అనుభవం కోసం. అందరికీ రైన్‌కోట్‌లు తలమీదకు సరిపడా ఇచ్చారు. ఎందుకో అర్థంకాలేదు.

ఒక గ్లాసు లిఫ్ట్‌లో ఎక్కాం. లిఫ్ట్ అంటే పైకి వెళ్ళాలికదా? ఇది క్రిందకు వెళ్తోందేమిటి? జర్రున జారి నీటిమీదకు వచ్చాం. అక్కడ ఒక లాంచి సిద్ధంగా ఉంది. అందరిని అందులో ఎక్కించారు. అలలు అల్లకల్లోలంగా ఉన్నాయి. పడవ ఊగిపోతున్నది. ఇంకా బయలుదేరకముందే. సరే, గడగడ శబ్దంతో కదిలింది. ఎక్కడకు తీసుకుపోతున్నారు? ఇంతలో చల్లని మంచుతుంపర్లు తెరలు తెరలుగా మీద పడుతున్నాయి. అప్పుడప్పుడూ అలలు కూడా చింది మీద పడుతున్నాయి. ఒక మంచు తెర విడిపోయింది. ఒక్కసారిగా ఎదురుగా నదీపాతం హోరు, జలఘోష, ఆపాత సంఘర్షణ. తెల్లని తెలుపు జలపాతపు పాదాల చెంతకు చేరుకున్నాం. అద్భుత రసం భీభత్సరసంగా మారి భయంతో గడ్డగట్టుకుపోగా భయంకరంగా ఊగిపోతున్న పడవ. ఇక్కడ జలసమాధి ఖాయం అనుకుని ఇష్టమైనవాళ్ళని గుర్తుచేసుకున్నాం.

ఇక్కడే మంచుతెరల్లో దాగిన ఒక రాగిణి మిమ్మల్ని కాపాడుతుంది. తెల్లని నవ్వుల్తో మిమ్మల్ని సేదతీర్చి మీ భయాన్ని పోగొడుతుంది. అంతలోనే జలపాత సంగీతం వేల మృదంగ లయ తరంగాలతో మీకు ఆహ్లాదం కలిగిస్తుంది. నయాగరా నగారా మీకో సందేశాన్నిస్తుంది. ఈ పడవను ఇంత నైపుణ్యంతో నడిపిన నావికుణ్ణి అభినందించకుండా ఉండలేము. లిఫ్ట్ దగ్గర దిగగానే కరతాళధ్వనులతో అభివాదం చేశాం.

ఆ రాత్రి హోటల్ బార్‌లో చాలాసేపు కూర్చుని, బార్ మెయిడ్‌ను అక్కడి విశేషాలు అడిగాను. బార్‌లో ఎక్కువమంది లేరు. ఒకటి రెండు టేబుల్స్ దగ్గర ఒకరిద్దరు ఉన్నారు. బార్ మెయిడ్ నడివయస్సులో ఎంతో అనుభవంతో ఆత్మవిశ్వాసంతో మాట్లాడింది. తమ జీవితంలో నయాగరా ఎలా పెనవేసుకుపోయిందో తన జీవితం, తన కుటుంబం, తన సంతానం, తన కష్టాలు, ఎన్ని విషయాలు.

ఒక్కొక్క వ్యక్తి ఒక పుస్తకం
తెరిచి చూస్తే....
ఒక్కొక్క జీవితం ఒక నయాగరా
తరచి పరికిస్తే.....

దూరతీరాలలో.... (అమెరికా అనుభవం) - ఎ.కె.



....ఆమె ఎక్కడి నుంచి దిగివచ్చింది ఇక్కడకు?

.....ఆ ముఖంలో ముందుగా పెద్ద కనురెప్పలు ఏదో బరువుతో వాలిపోతూ....

....తెల్లని కనుగుడ్లు, నల్లని కనుపాపలు సగం రెప్పలచాటునే... ఈ ప్రపంచానికి తన రహస్యం తెలియనివ్వని చీకటి పాపల్లో రెండు వెలుగు చుక్కలు.... విలాసంగా వంగిన కనుబొమలు మధ్యలో అస్తమించే పొద్దులా కుంకుమబొట్టు.... ఎవరో చెక్కినట్లు చక్కని ముక్కు, చివరన ఒక చిన్న రత్నాల నక్షత్రం, ఎవరికో దారిచూపుతూ... నిండైన పెదవులు... చిన్ని నోరు... సన్నగా మారిన చుబుకం... మధ్యలో చిన్న గుంట, ఎవరో చిలిపిగా నొక్కినట్లు... ఆ బుగ్గలు! కనీసం వెలుగు కూడా నిలువని నునుపు.... నల్లని కురులు కప్పుకుంటూ పల్చని చెవులు.... బుట్టలోలకులు, ఊగుతూ నిశ్శబ్ద శృంగార ఘంటికలు మోగిస్తూ... గోరింటాకు మెరిసే పొడవైన మునివేళ్ళు... కళ్యాణపుటుంగరం... అరచేతులు ఏవో స్వర్గాలు దాచినట్లు... ఎవరీమె? ఏ లోకపు దేవత? ఏ శాపంతో ఇక్కడకు దిగివచ్చింది? ఆ కనుల్లో ఏవో రహస్యపు లోకాలు అనంత మర్మాలు దాస్తున్నట్లు అరమోడ్పు కనులు... ఎక్కడో నిద్రపోయి ఇక్కడ మేల్కొన్నట్లు బరువుగా వాలుతున్న నీలంపు రెప్పలు.. తన లోకంలోకి రమ్మని చిరునవ్వు స్వాగతం...

ప్రతులకు : మిసిమి కార్యాలయాన్ని సంప్రదించండి. ఫోన్ : 994 951 6567.




తలిశెట్టి రామారావు

## తొలి తెలుగు వ్యంగ్య చిత్రకారుడు

# తలిశెట్టి రామారావు

– బాలి

తలిశెట్టి రామారావు అనే పేరు ఈ మధ్య ఔత్సాహిక కార్టూనిస్టులందరూ తరచూ గుర్తుచేసుకుంటున్న పేరు. అయితే ఈ పేరు ఓ ఇరవై సంవత్సరాల కిందట ఎవరికీ గుర్తు లేనిది. కారణం వారు ఉత్తరాంధ్రవాసులే అయినా ఒరిస్సాలోని జయపురం సంస్థానంలో దివాన్‌గా వెళ్ళిపోవడం. అక్కడే స్థిరపడిపోవడం. వీరు పుట్టిందీ పెరిగిందీ ఒకప్పటి శ్రీకాకుళంజిల్లా, పార్వతీపురమే అయినా వారి చదువుసంధ్యలూ అక్కడే జరిగినా ఉన్నతవిద్య కోసం ఒరిస్సా జయపురం మహారాజావారు ఆర్థికసాయం చేయగా మద్రాస్ వెళ్ళారు. బి.ఎ., బి.యల్. పూర్తిచేశారు. ఇదంతా 1925–1930 సంవత్సరాలమధ్య జరిగింది. అయనో గొప్ప కళాభిలాషి. కార్టూనిస్ట్ చదువుకుంటున్న దశలోనే తీరికవేళల్లో పెన్సిల్‌తో చిన్నచిన్న స్కెచ్‌లు వేసేవారట. ఒకవేళ ఏ చెట్టు నీడనో ఎవరికోసమో ఎదురు చూడవలసివస్తే ఆ క్షణాలను కూడా వృథా పోనివ్వకుండా చుట్టూ ఉన్న చెట్లను ఎదురుగా ఉన్న మనుషులను, స్కెచ్‌లుగా వేసుకుంటూ ఉండేవారనీ వారి గురించి పరిచయం ఉన్న వ్యక్తులు రాసిన వ్యాసాల్లో తెలుస్తోంది. ఈ అలవాటే ఆయన లా చదవడం కోసం మద్రాస్‌లో ఉన్న రోజుల్లోనూ ఓ రూపుదిద్దుకున్నట్లు తెలుస్తోంది. మద్రాస్‌లో ఉన్నప్పటి సౌకర్యమేమంటే వ్యంగ్య చిత్రాలు, వాటి గురించి వ్యాసాలూ ప్రచురించే విదేశీ పుస్తకాలూ, పత్రికలూ అందుబాటులోకి దొరకడం. దీనివల్ల ఆయనలో తైలవర్ణంలో వేసిన రూపచిత్రాలూ నీటి రంగుల్లో వేసే వర్ణచిత్రాలే కాకుండా, చిత్రకళలోని మరో పార్శ్వం అనగలిగే కార్టూనిస్టూ కాగలిగారు. దీనికి లండన్ నుండి వెలువడే పంచ్ మాగ్‌జైన్‌లు, అమెరికా నుండి వెలువడే మేడ్ పత్రిక శైలీ ఆయన కార్టూన్‌లలో కనపడటమే సాక్ష్యం. వాటిని దృష్టిలో పెట్టుకొని, మన తెలుగువారి ఆలోచనలూ, కట్టుబాట్లనీ వ్యంగ్యంగా తమాషా రేఖల్లో చక్కటి బొమ్మలు గీశారు. అప్పటిలో ఇన్ని పత్రికలు లేవు. ఉన్న ఒకటి రెండు పత్రికలు ప్రచురిస్తాయో లేదో తెలియదు. అప్పటికి అందుబాటులో ఉన్నదీ, విశేష ప్రచారంగలదీ *ఆంధ్రపత్రిక, భారతి* లు మాత్రమే. వాటి సంపాదకులు కాశీనాథుని నాగేశ్వరరావుగారు. వీరిని ప్రోత్సాహపరచి వీరి వ్యంగ్య చిత్రాలు ఆయా పత్రికల్లో విరివిగా వేసేవారట. మాసపత్రికగా వెలువడుతూ సాహిత్య పత్రికగా గౌరవం పొందుతున్న *భారతి*లో తలిశెట్టి వారి *ప్రబంధ సుందరి* వ్యంగ్య చిత్రం ప్రచురించబడి ఆ రోజుల్లో విశేష ఆదరణ పొందిందని విన్నాను.

ఆయన కార్టూనిస్టేకాదు. మంచి వర్ణచిత్రకారుడు కూడా. చిత్రకళాయాత్రికుడు, సమీక్షకుడు కూడ. రామారావుగారికి 1930ల్లోనే కాశీనాథుని వారికి పరిచయం ఉండటంవల్లకాబోలు, ఈయన రాసిన *భారతీయ చిత్రకళ* (112 పేజీలు) అనే పుస్తకానికి ముందుమాట రాయడమేకాక వారి సంస్థలో వెలువడుతున్న *ఆంధ్ర గ్రంథమాల*లో 13వ పుస్తకంగా ప్రచురించారు. దాని ఖరీదు ఆ రోజుల్లో రూపాయి మాత్రమే. ఇంకా తలిశెట్టివారు *వలస దేశాలలోని భారతీయ చిత్రకళ* అని మరో పుస్తకాన్ని



ప్రబంధ సుందరి

వెలువరించారు. *భారతీయ చిత్రకళ*ను చదివితే ఆయనెంత నిశితంగా చిత్రకళను పరిశీలించారో తెలుస్తుంది. అంతేకాదు వంగదేశమందున్న ప్రఖ్యాత చిత్రకారుడూ, ముఖ్యంగా భారతీయ శైలినందే కృషిచేసిన అవనీంద్రనాథ్ ఠాకూర్‌వద్ద గగనేంద్ర ఠాకూర్, నందలాల్ బోసు, ఈశ్వర ప్రసాదు, అసిత్‌కుమారు హల్దరు, ప్రమోద్‌కుమార్ ఛటోపాధ్యాయ, హకీంమ్ మహ్మదుఖాన్, అబ్దుల్ రహమాన్ చుగుతాయ్ శిష్యులుగా చేరి భారతీయ చిత్రకళను గొప్పగా ఉద్ధరించారని చెప్తూ అప్పటికి బ్రిటిష్‌వారి పాలనలోనే మనం ఉన్నామని గుర్తుచేస్తూ వారి వలన దేశ భాషలు, దేశీయ నాగరికత ఎలా తగలబడిపోయిందో చెబుతూ అన్నిరంగాలవలె చిత్రకళలోనూ విదేశీ పోకడ వచ్చిందని, అలా వేస్తేనే చిత్రకారులనూ, వారి శైలినీ గుర్తించారని చెప్పాడు.

సర్ జార్జ్ బర్డ్‌వుడ్ అనేవాడు ప్రొఫెసర్ వెస్టుయకాట్ అనే ఆంగ్లేయులు మన చిత్రకళనుగానీ, శిల్పకళను ఎలా తృణీకరించారో చెప్పాడు. వారివారి శైలులు భారతీయ ఆర్ట్సులో కనిపించకపోవడం వారికి చాలా ఇబ్బంది అయింది.

ఈ విషయాలన్నీ ముందున్న పదకొండు అధ్యాయాలలో అక్కడక్కడా చెప్పినా చివరిదీ, ఆఖరుదీ అయిన పన్నెండవ అధ్యాయంలోమాత్రం తలిశెట్టి రామారావుగారు మరో చిత్రమైన విషయాన్ని విశ్లేషించారు.

అదేమంటే పాశ్చాత్య పోకడలకు, విధానాలకు పోకుండా కొంత తమదైన శైలిలో చిత్ర రచన చేసిన దక్షిణాదివారైన రూపచిత్రాలను గీయటంలో గొప్ప నిపుణుడైన మధుర నివాసి రామస్వామి నాయుడు, ఆంధ్రదేశంలో దామెర్ల రామారావులను గురించి చెప్పటం, రామారావుగారి చిన్నతనంలోనే చనిపోవడంవల్ల విచారిస్తూ, ఆయన ఇంకా చిరంజీవి అయివుంటే ఇంకా మంచి మంచి ప్రయోగాలు చేసి ఉండేవారని తపించడం బాగుంది.

పోతే రవివర్మ శైలిగురించి, చిత్రకళలో ఆయన నడిచిన బాట తలిశెట్టివారిలో ఏదో ఇబ్బంది కలిగినట్లుంది. ఈ అధ్యయనంలో మొత్తం ఆయన గురించే విశ్లేషించారు. రవివర్మలో చిన్నప్పటినుండీ ఆసక్తి ఉండటంతో, అప్పటిలో తిరువాన్కూరు ఆస్థానానికి వచ్చిన 'థియోడ్సో జెన్సను' వద్ద తైలవర్ణంలో చిత్ర రచన మొదలుపెట్టాడట. ఇంతకుముందే కొంత అభ్యాసం అలగిరినాయని వద్ద చేసి ఉండటంవల్ల ఆయన ఆసక్తి ఇటు మళ్ళిందని చెప్పాడు. ఇక వీరు చేసిన ప్రయోగాలకు తిరువాన్కూరు, బరోడా మహారాజులు ప్రోత్సహించడేమకాక తమ దేశపు సాంప్రదాయములను అనుసరించి చిత్ర రచన చేస్తున్నాడని ఐరోపియన్లు పొగిడేవారట.

దాని ఫలితమేమంటే, హిందూ సంప్రదాయ శిల్పాల పరిశీలనను పక్కనపెట్టి, రవివర్మ తన భార్యను, కుమార్తెను, కనుముక్కు తీరు బాగున్న తిరువాన్కూరు రాజప్రాసాదంలో మరికొందరు వనితల్ని మోడల్స్‌గా పెట్టుకునేవాడట. వారి ఆకారాలు ఎలా ఉండేవంటే పుష్టిగా, తెల్లగా, విపరీతమైన కేరళ నగలలో, వంపులేని నడుము భాగాలతో ఉండేవారట. ఈ విషయాలను రామారావుగారు ఇంకా స్పష్టంగా ఇలా చెప్పారు–

"రవివర్మయొక్క చిత్రాలలో హిందూ చిత్ర రచనా సంప్రదాయ చిహ్నాలేవి కానరావు. ఇప్పుడు మనకు రోజూ కనిపించే వ్యక్తుల ఛాయాచిత్రాలలాగే తన చిత్రాలుంటాయి. సుప్రసిద్ధమైన సరస్వతి చిత్తరువును చూడండి. కిరీటము, రెండు చేతులను దీసివేసిన సుందరాంగి యొకతె ఉద్యానవనంలో వీణను మీటుతూ ఆనందిస్తున్నట్లు కానవస్తుంది. వీరు దేవతలని చూపటానికి కిరీటాది అలంకారాలు, గరుడుడు, సర్పమాలలు, నాలుగు ముఖాలు మొదలైనవి మాత్రం యథార్థాలు.

మరొకమాట– చరిత్రను రవివర్మ పాటించలేదు. దమయంతి చిత్తరవునందుగాగల భవనాలు ఇప్పటి పాశ్చాత్య నిర్మాణంలానే కనిపిస్తాయి. చీరకట్టు, ఆభరణాలలో సనాతన వాతావరణం, ఆచారాలు మచ్చుకైనా లేవు"

అని అంటూనే కొన్ని పోకడలను ఈయన మెచ్చుకున్నారు.

"చెట్లు, ఉద్యానవనాలు, సరస్సులు, పచ్చికబయళ్ళు మొదలైన చిత్రాంగాలను వ్రాయటంలో ఇతడు భారత

చిత్రకారులలో అగ్రగణ్యుడు. మానవుడే లేని ప్రకృతిని ఈయన ప్రత్యేకంగా వ్రాయకపోయినా, వీటిని వ్రాయటంలో తనకి తగిన అవకాశాలు లేకపోయినా ప్రతీ చిత్రంలో ఇతని గొప్పతనం తప్పక కనిపిస్తుంది" అని చెప్పాడు. ఇదంతా రామారావుగారి పరిశీలనకు మచ్చుతునక.

ఇప్పుడీ పుస్తకం దొరికే అవకాశం లేదనుకొంటున్న తరుణంలో చిత్రకళలో ఏమాత్రం ప్రవేశం లేకపోయినా, ఆసక్తి నిండైన అభిమానంలో విశాఖపట్నం, మాధవధారలో నివాసముంటున్న శ్రీ ముల్లంగి వెంకటర మణారెడ్డిగారు ఈ పుస్తకాన్ని సంపాదించి రావెల ద్వారా ప్రచురించారు. అంటే ఆసక్తిగలవారందరికీ అందుబాటలో ఉంటుందన్నమాట. ఒక చిత్రకారుడు ఒకే శైలిని, ఒకే సబ్జెక్ట్‌ను పదేపదే వెయ్యటం చూశాను. అటు కార్టూన్‌లను, ఇటు దానికి భిన్నమైన సాంప్రదాయ బొమ్మలను వెయ్యటం చాలా తక్కువమందిలో చూడగలం. ఇవి రెండూ తలిశెట్టి రామారావుగారిలో కనిపిస్తాయి. శ్రీ బాపుగారి గురువుగారైన 'గోపులు'గారిలో కనపడింది. అది బాపుగారిలో కనిపిస్తుంది. కొంతవరకూ నేనూ దీన్ని ప్రాక్టీస్ చేశాను. ఈ పుస్తకం బ్రిటీష్‌వారి పరిపాలనా కాలంలో వ్రాయబడింది కాబట్టి చివరన ఆయన ఇలా ముచ్చటించారు– "ఈ కాలంలో భారతీయులు చిత్ర రచనను ఆదరించటం తక్కువ. కాని కొంత కాలంలో ఇలాంటి అజ్ఞానం తొలగిపోతుంది. భారతదేశపు సనాతన నాగరికత యెడల అభిమానం అధికమవుతూవుంది. సభలు జరుగుతున్నాయి, శ్రీ కళామయుని కృపవలన భారత చిత్రకళ లోకకళ్యాణానికి తోడ్పడగలదు".

కార్టూన్‌లేకాదు, సంప్రదాయ చిత్రకళలోనూ అందెవేసిన చేయిగల తలిశెట్టి రామారావుగారు తన భావాలను ఎలా వ్యక్తపరిచారో తెలుసుకోవటంలో, ఆసక్తి ఉన్నవారు తప్పక తిరగేయవలసిన పుస్తకమిది. దీనిలో ముఖ్యంగా పన్నెండవ అధ్యాయం.

బాలి
విశాఖపట్నం. ఫోన్ : 984 996 3082.

## చీకటి దొంగలు

*సీ. కలవారి యిండ్లలోపల నిధానమునెత్త*
*నరుగు దొంగలకు సిద్ధాంజనంబు*
*మగల గూరకనిచ్చి తెగి అంటుగండ్రకై*
*తారాడు కులటల తార్పుగత్తె*
*అలవోక నలితి పిట్టలన్‌బట్టి వేటాడు*
*పాడు ఘూకములకు పాడిపంట*
*మసనంబులోన నింపెసలారు శాకినీ*
*ఢాకినీ తరుల చుట్టాల సురభి*

*గీ. రే లతంగికి నల్లని మేని ముసుగు*
*కమలజాండంబునకు నెల్ల కన్నుమూత*
*సకల విద్రోహి దుర్వృత్తునికిల జోడు*
*కటిక చీకటి యలదెదిక్తటములందు*

**భావము:** చీకటిలోనే అనేకమైన అఘాయిత్యాలు జరుగుతుంటాయి. చీకటి వాటికి నేస్తం, సహకరిస్తూ ఉంటుంది. దొంగలకు, విటులకు, పిట్టలను వేటాడు వేటగాండ్రకు, స్మశానములో సంచరించు భూత, ప్రేత, పిశాచములకు చీకటి చక్కటి నేస్తం. రాత్రి కన్యకు మేలిముసుగు. సంఘ విద్రోహ శక్తులను సహకరిస్తూ ఉంటుంది.

ఈ పద్యం బలిజేపల్లివారి కలం నుండి జాలువారిన ఆణిముత్యం. హరిశ్చంద్ర నాటకంలోనిది.

దే.రా. నరసింగరావు
విజయనగరం.

# ఇందూరు జిల్లాలో జైనమతం

– సిద్ధ సాయరెడ్డి

ప్రాచీన కాలంలో భారతదేశంలోని హిందు మత సంస్కరణ, సర్వమానవ సమానత్వం కొరకు వచ్చినవే జైన, బౌద్ధ మతాలు. ఇందులో జైనమతం బౌద్ధం కంటే ప్రాచీనమైంది. ఇట్టి జైన మతానికి పుట్టినిల్లు, పరమ పవిత్ర జైన పుణ్యక్షేత్రం బోధన్ నగరం. ఇది ప్రాచీనాంధ్ర నగరాలలో ప్రసిద్ధమైంది. ఆది తీర్థాలలో మొదటిది. అందువల్ల బోధన్ మతపరంగా, సాహిత్యపరంగా, రాజకీయపరంగా, శిల్ప సంపదకు నిలయంగా వర్థిల్లింది, మార్గదర్శకమైంది. మరియు ఇందూరు జిల్లా అంతటా కూడా జైన విద్యాపీఠాలు, జైన ఆలయాలకు సంబంధించిన ఆనవాల్లు ఇప్పటికి దర్శనమిస్తున్నాయి.

**మతపరంగా:** జైనమత వాఙ్మయ ఆధారాల ప్రకారం కన్నడ మరియు తెలుగు భాషల ఆదికవి పంపడు (పద్మప్ప)అని, ఆదిపురాణం ద్వారా (జైనమత చరిత్ర లేదా జైన తీర్థంకరుల చరిత్ర), విక్రమార్జున విజయం, జీనేంద్ర పురాణాల ద్వారా తెలుస్తున్నది. దానిని ఇతర జైనమత రచనలు కూడా బలపరుస్తున్నాయి. ఆదిపురాణంలో బాహుబలి వృత్తాంతం ఉన్నది. ఆదినాథుని రెండవ కొడుకు బాహుబలి తన అన్న భరతునికి తన రాజ్యంను త్యాగం చేసి, గోమతేశ్వరునిగా (జైనమత సిద్ధ యోగిగ) కీర్తిగాంచెను.

**వివరణ:** జైనమత మొదటి తీర్థంకరుడైన అదినాథుడు క్షత్రియపురుషుడు, యుగపురుషుడని, ఇతడు సంపూర్ణ భరతఖండంను పాలించెనని, ఇతనికి గల 100 మంది కొడుకులలో ఇద్దరు కొడుకులు ప్రసిద్దులని మొదటివాడు భరతుడు (ఇతని పేరుననే మన దేశానికి భారతదేశం అని పేరు వచ్చినట్లు జైనుల విశ్వాసం) ఉత్తర భారతదేశంను అయోధ్య రాజధానిగా పాలించెను. మిగిలిన దక్షిణ భారతదేశ పాలనను ఆదినాథుడు తన రెండవ భార్య సునందదేవి కొడుకు బహుబలికి ఇచ్చెనని, ఇతడు దక్షిణ భారతదేశానికి పొధనపురం (బోధన్) రాజధానిగా పాలించినట్లు తెలుస్తున్నది.

ఉత్తర భారతదేశానికి పాలకుడైన భరతుడు రాజసూయ యాగం జరుపగా, అతడి యాగ చక్రంపోధనపురం నందు నిలిచిపోయేనని, అందుచేత భరతుడు తన సవతి తల్లి కొడుకు బాహుబలితో యుద్ధం జరిపి ఓడిపోయేనని, కాని బాహుబలి తన అన్నను విజేతగా ప్రకటించి, తాను రాజ్యపరిత్యాగం చేసి, తన కొడుకు మహబలిని పోధన పురానికి రాజుగా, భరతుని సామంతునిగా పట్టాభిషేకం జరిపి, తాను సన్యాసం స్వీకరించెనని జైన వాఙ్మయం తెల్పుతున్నది. బాహుబలి త్యాగానికి గుర్తుగా భరతుడు పోధన పురమందు 525 విల్లుల ఎత్తుగలజైన విగ్రహంను ప్రతిష్టించెనని, దానిని గోమతేశ్వర లేదా కుకుటేశ్వరుడని పిలిచేవారని, జైన సాహిత్యం ద్వారా అవగతమవుతున్నది. (ఇట్టి బాహుబలి విగ్రహాన్ని భారతదేశంలోని అన్ని ప్రాంతాల జైన భక్తులు ధర్శించేవారని వర్ణించబడింది.)

క్రీ॥శ॥ 981 సంవత్సరంలో కర్నాటకలోని పశ్చిమగాంగుల రాజు రాచమల్లుని సేనాధిపతి, జైన పండితుడు అగు చాముంధరాయుడు పోధనపురంలోని (జగత్ ప్రసిద్ధ జైన క్షేత్రాన్ని దర్శించి) బాహుబలి విగ్రహం చేత ప్రభావితుడై శ్రావణ బెళగోళయందు (ఇంద్రకిలాద్రి పర్వతంపై) గోమతేశ్వర విగ్రహాన్ని ప్రతిష్టించి, ఆ ప్రాంతానికి అభినవ పొధనపురమని పేరిడెను. హిందుమత రచనలైను ఋగ్వేద, ఆధర్వణవేదాల యందు కూడ వృషభనాథుని ప్రసక్తి ఉన్నందున జైనమతం వేదకాలానికి ముందే ఉన్నట్లు తెలుస్తున్నది. బౌద్ధ వాఙ్మయంలో జైన మత చివరి తీర్థంకరుడైన వర్ధమానమహావీరుడు గౌతమ బుద్ధుని సమకాలికుడని వర్ణించబడింది.

**జైనమతం చారిత్రక ఆధారాలు:** ఈ మతం సింధులోయ నాగరికతకంటే ప్రాచీనమైందని చరిత్రకారుల అభిప్రాయం. సింధుప్రజలు పూజించు వృషభం ఆధినాథుని శిల్ప చిహ్నమని, అమ్మదేవత జైన మత ప్రజల "చక్రేశ్వరి" అను దేవత అయి ఉండునని, నగ్నచిత్రాలు జైన తీర్థంకరుల

చిహ్నాలని రాధా కుముద్‌ముఖర్జీ వంటి చరిత్రకారుల అభిప్రాయం. జైనమతము కాంస్యయుగం (అనగా క్రీ॥పూ॥ 2500) నుండి అయో యుగం (అనగా క్రీ॥పూ॥ 1000)ల మధ్య ఏర్పడిందని చెప్పవచ్చు. క్రీ॥పూ॥ 6వ శతాబ్దికి చెందిన ఆశ్మకులు స్వతంత్ర్య భావం గలవారై ఉత్తర భారత ఆర్యసిద్దాంతం, ఆధిపత్యంను వ్యతిరేకించి, సర్వమానవ సమానత్వ భావం గల జైనంవైపు మొగ్గు చూపుటకు అవకాశమున్నది. అశ్మక రాజ్య ఏర్పాటు కాలమున (బౌద్ధము ఉన్నను) జైన మతం తన ఆధిపత్యాన్ని కల్గి ఉండేది.

మగధ సామ్రాజ్యకాలమగు క్రీ॥పూ॥ 5, 4 శతాబ్దాల యందు కూడా తెలంగాణ ప్రాంత ప్రజలు (ఆశ్మకులు) జైన మతాన్ని స్వీకరించినట్లు తెలుస్తుంది. వీరు హర్యాంక, నంద వంశరాజులకు మాత్రమే సామంతులైనట్లు, మిగతా కాలాన వీరు స్వతంత్ర్య జీవితాన్ని గడిపేవారని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. మౌర్యసామ్రాజ్య స్థాపకుడైన చంద్రగుప్త మౌర్యుడు తన శేషజీవితంలో జైన మతం స్వీకరించి క్రీ.పూ. 300 సంవత్సరంలో కర్నాటకలోని శ్రావణ బెలగోలకు వెళ్తు, మార్గమధ్యమున ఉన్న జగత్ ప్రసిద్ధ జైన పుణ్యక్షేత్రమగు బోధన్‌లో కొంతకాలం గడిపినట్లు జైన సాహిత్యం వివరిస్తుంది. మౌర్యవంశంలోని సంప్రీతి అను (అశోకుని మనమడు) చక్రవర్తిని "జైన అశోకుడు" అని అంటారు. ఇతడు తన ఆచార్యుడైన 'సుహాస్తి' ప్రోత్సాహంతో దక్షిణ దేశంన జైనమతం బాగా వ్యాప్తి చేసినట్లు వాఙ్మయు, శాసన ఆధారాలు నిరూపిస్తున్నాయి. క్రీ.పూ. 3వ శతాబ్దినాటి దక్షిణ దేశ చక్రవర్తులు అగు శాతవాహనులు మొదట జైనులనే వాదన ఉన్నది. క్రీ.శ. మొదటి శతాబ్దిలో జీవించిన కుందకుందాచార్యుడనే ఒక జైన మహాకవి కాశీ, మధుర, హస్తినాపురంల వలే బోధన్ కూడా పవిత్ర తీర్థ ప్రదేశమనితన 'దశభత్తి' అనే ప్రాకృత గ్రంథంలో ప్రస్తావించాడు.

కళింగదేశ ఖారవేలుడు అను జైన చక్రవర్తి క్రీ.పూ. రెండవ శతాబ్దిలో దక్షిణదేశమందు జైన వ్యాప్తికి కృషిచేసినాడు. మరియు క్రీ.శ. 4వ శతాబ్ది నుండి 7వ శతాబ్ది వరకు జైనమతం దక్షిణ దేశంన విశేష జనాదరణ పొంద్దేదు. ఎందుకంటే అప్పటి జైన ఆచార్యులు తమ మత సిద్ధాంతాలను కాలానుగుణంగా మార్చుటకు ఇష్టపడలేదు. కాని జైనమత మనుగడ కొరకు కాలానుగుణంగా సమాజ ప్రజల మనసెరిగి జైన మతమందు ఉన్న కఠినమైన ఆచారాలు, కట్టుబాట్లను సడలించారు. అందుచేత ఈ మతం మళ్ళీ తిరిగి తన పునర్‌వైభవదశను చేరుకొన్నది. దీనికి నాటి రాజవంశాల ప్రోత్సాహం కూడా తోడైనది. క్రీ.శ. 7వ శతాబ్ధి నుంచి 12వ శతాబ్ధి వరకు అశ్మకను పాలించిన బాదామి చాళుక్యులు, రాష్ట్రకూటులు, బోధన్ చాళుక్యులు, కళ్యాణి చాళుక్యులు మరియు మొదట కాకతీయులు దక్షిణ దేశాన జైనమత విస్తరణకు కృషి చేసినారు. ఈ కాలంన జైనమతం మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లింది. క్రీ.శ. 7వ శతాబ్ధినాటికి జైనమత వ్యాప్తికి అనుకూల పరిస్థితులేర్పడ్డాయి. సోమ దేవసూరి అను ప్రముఖజైన రచయిత "కొత్తగా జైనమతాన్ని ఆచరించువారు తమ పూర్వ ఆచార, విశ్వాసాలను పూర్తిగా త్యజించుట సాధ్యంకాని కారణాన, వారి పట్ల జైన మతం ఉదారంగా వ్యవహరించవలసి వచ్చిందని" తెలిపెను. ఆనాటి జైన పాలకులైన బాదామి చాళుక్యులు వైష్ణవి మతాభిమానులైనా జైనంపట్ల ఉదారత, ఆదరణ ప్రదర్శించారు. 2వ పులకేసి సేనాధిపతి రవికీర్తి మేగూటి శాసనంలో (కర్ణాటక) జైన ఆలయాన్నినిర్మించి ఆదర్శప్రాయుడైనట్లు తెల్పబడింది మరియు పులకేసి సోదరుడు కుబ్జ విష్ణువర్ధనుని (క్రీ.శ. 624–642 వరకు) మహారాణి అయ్యమహాదేవి జైనమత దీక్షపూని, తమ గురువైన చంద్రప్రభ ఆచార్యుని తెలంగాణలో జైనమత ప్రచారం చేయమని కోరిందని, ఆనాడు తెలుగు దేశమనగా జైనమత ప్రకారం తెలంగాణ, రాయలసీమ అని చెప్పవచ్చు ఎందుకంటే కోస్తాంధ్రలో ఆనాడు బౌద్ధం వ్యాప్తిలో ఉండేది. క్రీ.శ. 8వ శతాబ్ధి నుండి తెలంగాణ ప్రాంతాన రాష్ట్రకూటులు మరియు బోధన్ చాళుక్యులు జైనమత వ్యాప్తి జరిపినారు. రాష్ట్రకూట 3వ ఇంద్రుడు (914–922) బోధన్‌లో కొంతకాలం గడిపి ఇంద్ర నారాయణ అను జైన ఆలయాన్ని నిర్మంచినట్లు శాసన ఆధారం నిరూపిస్తున్నది.

బోధన్ చాళుక్య సుప్రసిద్ధ చక్రవర్తి రాష్ట్రకూట ఇంద్రుని అల్లుడు మరియు మేనల్లుడగు రెండవ అరికేసరి బోధన్ రాజధానిగా పాలించెను. ఇతని పాలనకాలంలో జైనమతం వైభవోపేత స్థితికి చేరింది.ఇతడు తన ఆస్థానమందు పంపన అను (జైనపండితుడిని) తన ఆస్థాన పండితుడిగా చేసి, అతనిచే "ఆదిపురాణం" అను జైనమత చరిత్ర మరియు "విక్రమార్జున విజయము" ను (కన్నడ భారతాలను) రచింపజేసెను. పంపన (పద్మప్ప) తెలుగు బిడ్డడని కన్నడ భాష పాలకుల ప్రభావమున కన్నడ ఆదికవిగా కీర్తించబడ్డాడని, కాని ఇతను తెలుగు ఆదికవియే అని పండితుల అభిప్రాయం. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రప్రభుత్వం పంపనను తెలుగు ఆదికవిగా గుర్తించింది. ఈ కాలంన పంపన తమ్ముడు జీనవల్లభుడు, మల్లియరేచన అను తెలుగు (జైన) కవులు ఉండేవారు. కళ్యాణి చాళుక్యుల పాలన కాలం అనగా క్రీ.శ. 973 నుంచి 1189 వరకు జైనమత చరిత్రలో స్వర్ణయుగం. ఎందుకనగా ఇందూర్ జిల్లాలో వీరి కాలంనాటి జైనమత (సాహిత్య, పాలన, శాసన, సారస్వత, వాస్తు నిర్మాణ రంగాలయందు గల) సమాచారం అత్యధికంగా లభ్యమవుతున్నది. కళ్యాణి చాళుక్య చక్రవర్తుల పేర్లు, వారి ప్రతినిధుల పేర్లు, జైన ఆలయాల పేర్లు, గొప్ప ధనవంతుల పేర్లు, ఆలయ నిర్మాణాల సమాచారం, ఆలయాలకు ఇచ్చిన భూమి విరాళాల సమాచారం, జైన భక్తుల సౌకర్యం కొరకు జైనమతదాతలు నిర్మించిన చెరువులు, ధర్మసత్రాలు, పండ్లతోటలు, పంట భూముల దానం మొదలగునవి మరియు జైనమతంను కొత్తగా స్వీకరించిన ప్రజల వర్గీకరణ, జైనమత దేవతల పేర్లు, జైన ఆచార్యుల పేర్లు, వారి నైతికమార్గదర్శక జీవన విధానం మొదలగు విషయాలు తెలుస్తున్నాయి. అందుకే వీరి పాలనకాలంలో ఇందూర్ జిల్లా యందు జైనమతం మతపరంగా, పాలన, ఆర్థిక, సమాజ సమానత్వ, సాహిత్య, వాస్తు నిర్మాణ రంగాల యందు వైభవోపేత దశను చేరినందున ఇది స్వర్ణయుగ కాలమని చరిత్రకారులు కీర్తిస్తున్నారు.

కాకతీయ చక్రవర్తులు మొదట జైనమతాన్ని ఆదరించి పోషించారు. కాకతీయ ప్రోలరాజు (క్రీ.శ.1052 –1076 వరకు) యొక్క మంత్రి చేతన ఇతని భార్య మహిలమ్మలు దిగంబర జైనాన్ని ఆదరించినిలువెత్తు తీర్థంకర విగ్రహాలు, జైన ఆలయాలను నిర్మించారు. కాకతీరుద్రుని కాలం (క్రీ.శ. 1158–1195 వరకు) నుండి తెలంగాణ యందు శైవమతంలోని కాలముఖ శైవుల ప్రాబల్యం చేత జైనమత నాశనం పారంభమైంది. కాకతీయ రుద్రుని తమ్ముడు మహా దేవుడు (క్రీ.శ. 1195–1198 వరకు) జైనమత రక్షణ కొరకు శైవులతో పోరాటం జరిపినాడు. కాని గణపతిదేవుని పాలనకాల (క్రీ.శ 1198–1261 వరకు) మందు జైనమతం సమూలంగా నాశనం చేయబడి, శైవమతం విస్తరించింది.

**జైనసాహిత్యం:** జైనమత సమాచారం క్రీ.శ. 3వ శతాబ్ధివరకు ప్రాకృత భాషలో జరువబడింది. ఈ సమాచారం ప్రకారం ఉత్తరభారత కంపిల్యరాజ్య యువరాజు శరభంగుడు విద్యాభ్యాసం కొరకు ఆశ్మక రాజ్యానికి (బోధన్) వచ్చినారు. క్రీ.శ. 1 శతాబ్ధిలో జీవించిన కుందకుందాచార్యుడను జైన మహాకవి మధుర, హస్తినాపురం వలె పోధనపురం కూడా పవిత్ర తీర్థమని, విద్యాకేంద్రమని తన 'దశభత్తి' అను ప్రాకృత గ్రంథంలో ప్రస్తావించారు. క్రీ.శ. 3వ శతాబ్ధి నుండి క్రీ.శ. 7వ శతాబ్ధివరకు సంస్కృత భాష అభివృద్ధి చెందింది. కాని ఈ మధ్యకాలంలో జైనం అంధకార దశలో ఉండేది. క్రీ.శ. 7వ శతాబ్ధినుండి 12వ శతాబ్ధి వరకు కన్నడ భాష అభివృద్ధిచెంది, అది రాష్ట్రకూట బోధన్ చాళుక్య, కళ్యాణి చాళుక్య రాజులకాలంలో రాజభాషగా వర్ధిల్లింది. ఈ మధ్యకాలంలో కన్నడ భాష సర్వయుగ దశననుభవించింది. బోధన్చాళుక్య చక్రవర్తి రెండవ అరికేసరి ఆస్థాన పండితుడు పంపన క్రీ.శ. 941 సం॥లో జైన తీర్థంకరుల చరిత్ర 'ఆదిపురాణాన్ని, కన్నడ భారతం (విక్రమార్జున విజయాలను) రచించెను. జీవ వల్లభుని సమకాల కవి, మరియు మిత్రుడు (రెండవ అరికేసరి ఆస్థానంలోని)కవి, మల్లియరేచన 'కవి జనాశ్రయం' అను గ్రంథాన్ని రచించెను. పంపకవి తెలుగు ఆదికవి అనునట్లు తెలుగులో తన గురువు జీనేంద్రముని చరిత్రను 'జీనేంద్ర పురాణ'మను పేర సీసపద్యం రూపంలో రచించెను.

వేగరాజు ఆస్థానపండితుడు సోమదేవసూరి "యశస్తిలక" అనుఖంధకావ్యాన్ని సంస్కృత భాషలో రచించెను.

**కన్నడ భాష శాసనాలు (పురావస్తు ఆధారాలు):** బోధన్ కోటపైన ఆధ్యాత్మిక, దాన శాసనాలు దర్శనమిస్తున్నాయి. అవి బోధన్ చాళుక్యుల కాలం నాటి మేఘనందిముని లిపి పరిణామ శాసనం మరియు (పంపన) సమాధి శాసనాలు ముఖ్యమైనవి. మరియు బానిసవాడి (ప్రస్తుత బాన్సువాడ)లో కళ్యాణి చాళుక్యరాజు ఆరవ విక్రమాదిత్యుని తెలుగు శాసనం లభ్యమైంది. కళ్యాణి చాళుక్యశాసనాల సారాంశం ప్రకారం బోధన్‌లో ఒక జైన విశ్వవిద్యాలయం ఉండేదని, ఇందులో నగన్నాథ పండితుడు, జగన్నథ పండితుడు, రుద్ర శక్తి పండితుడు వంటి వారు గొప్ప కన్నడ భాషపండితులుగా కీర్తిఘడించారని తెలుస్తున్నది.

**జైనసన్యాసుల నైతిక మార్గదర్శక జీవితం:** జైన ధర్మం ప్రకారం జైన పండితులు మరియు సన్యాసులు తమ చివరి దశయందు కైవల్యం కొరకు జైన బసదియందు చేరి ముక్తికొరకు వైరాగ్య జీవితాన్ని గడిపేవారు. వీరు జగత్ప్రసిద్ధ జైనబోధనలు,నైతిక సూత్రాలను ఇతర జైన సన్యాసులకు బోధించేవారు. వీరి కొరకు బోధన్ యందు క్రీ.శ. 10వ శతాబ్ధినుండి 12 వ శతాబ్ధి వరకు ఒక జైన బసధి (గృహం) ఉండేది. ఇందులో వీరికి భోజన ఇతర వసతులు కల్పించేవారు.వీరు తమ కైవల్యదశలో జీవసమాధి చెందేవారు. ఇట్టి వివరణ కళ్యాణి చాళుక్య రాజుల కన్నడ ('దాన లేదా ఆధ్యాత్మిక) శాసనాలలో ఉన్నది. బోధన్‌లోని బసధిలో గడిపి బోధన్ కోటపై జీవ సమాధి చెందిన మహానుభావులు మేఘనందిముని, శుభనంది, గంధవిముక్త భట్టారకుడు, చంద్ర ప్రభాచార్యులు, నగన్నాథ పండితుడు, రుద్రశక్తి పండితులు మొదలగు వారి ప్రసక్తి బోధన్‌లో లభ్యమైన బోధన్ చాళుక్య, కళ్యాణి చాళుక్యుల కాలంనాటి "కన్నడ తెలుగు భాష శాసనాలు" నిదర్శనంగ నిలిచి ఉన్నాయి.

**జైనదేవతలు:** హిందుమతంలోవలె జైన మతంనందు కూడా దేవతలు ఉన్నారు. జైనదేవతలు కూడా హిందు దేవతల పోలికలు కలిగి ఉంటారు. జైనదేవత ప్రతిమా స్వరూపం, హిందు దేవతలను పోలి ఉండేది. అవి చౌడమ్మ, చక్రేశ్వరి, అంబిక, పద్మావతి, మొ॥ ఉండేవారు. చివరి దశలో జీన, శివ,విష్ణు విగ్రహాలను జైన ఆలయాలలో ప్రతిష్ఠించి, తమ మత సామరస్యాన్ని ప్రదర్శించినారు. జైన తీర్థంకరులను కూడా దేవతలుగా భావించి వారిని శిల్ప చిహ్నాలతో పూజించినారు. జైనమతస్థులు తమ చివరి దశలో హిందుదేవతలను దత్తత తీసుకొన్నారు. ఉదా: సరస్వతి, వినాయకుడు మొదలగువారు.

**జైనమత నిర్మాణాలు:** జైన నిర్మాణాలు రెండు రకాలు ఒకటి దేవత ప్రతిమ శిల్పం, రెండు దేవాలయ వాస్తు శిల్పాలు. జైన మతమందు గల నిర్మాణాలు చాలా వరకు రాష్ట్రకూట–బోధన్ చాళుక్య, కళ్యాణి చాళుక్య, మొదట కాకతీయులు జైన నిర్మాణాలను శివలింగ– పానపట్టాలతోగాని, విష్ణుమూర్తిని స్థానమూర్తిగా, వారి ప్రతి నిధులుగా జైన తీర్థంకర నిలువెత్తు శిల్పాలు లేదా వారి శిల్ప చిహ్నాలతో ఆలయాలు నిర్మించి, జైనులు తమ మత సామరస్యాన్ని ప్రదర్శించారు. మరియు జైన దేవత ప్రతిమ శిల్పాలను విడిగా కూడా నిర్మించారు.

**జైన దేవత ప్రతిమ శిల్పం:** జైనధర్మం ప్రకారం వీరు హైందవ మత దేవతలను కూడా తమ దేవతలుగా భావించి జైనులు తమ ఆలయాలలో వారిని స్థానమూర్తులుగా, బయట ప్రతిమ శిల్పాలుగా పూజించినారు. ఆలయాలలో స్థానమూర్తులుగా శివుడు, విష్ణువులను గర్భగుడిలో ప్రతిష్ఠించి, జైన తీర్థంకరులను వారి ప్రతినిధులుగా ఆలయ గర్భగుడి ప్రవేశద్వారాల వెంబడి, తీర్థంకర చిహ్నాలతో ప్రదర్శించారు. జైనదేవత ప్రతిమ శిల్పాలుగా ఇందూరు జిల్లాలో లభ్యమైన దేవతలు జైనచక్రేశ్వరి పేరున బోధన్‌లో (చక్రేశ్వర ఆలయం) వెలసింది. అంబికదేవి ఉమ్మెడ (నందిపేట) పాతూరి గ్రామంలో వెలసింది పద్మావతి దేవత పేరున బోధన్ క్రీ.శ 12వ శతాబ్ధిలో (పద్మావతీపురం) అని కీర్తించబడింది. సరస్వతి పేరున బాసర 'జ్ఞాన సరస్వతి' దేవి వెలసింది, వినాయకుడు ప్రతిమామూర్తిగా, 15వ తీర్థంకరుడు ధర్మనాథుని వజ్రం గుర్తుతో బోధన్‌లోని పాన్‌గల్లియందు, 21వ తీర్థంకరుడు నవినాథుని పద్మం

గుర్తుతో పెద్ద తక్కడ్‌పల్లి (బిచ్‌కుంద) యందు 5వ తీర్థంకరుడు సుమలినాథుని చక్రం గుర్తు వడ్లూరు (ఎస్.ఎస్.నగర్)లో దర్శన మిస్తున్నాయి. ప్రాచీనకాలంలో బోధన్‌యందు జగత్ ప్రసిద్ధ జైన విగ్రహాలు తయారు చేయబడేవని, ఇట్టి ప్రతిమ మూర్తులకు దక్షిణ భారతదేశమంత గొప్ప ఆదరణ ఉండేదని. బోధన్‌లో తయారుచేసిన జైన (బాహుబలి) విగ్రహాలను భారతదేశమంత తరలించేవారని తెలుస్తున్నది. కావున బోధన్‌లోని శిల్పులు జగత్ ప్రసిద్ధులు, ధన్య జీవులని చెప్పవచ్చును.

**జైనాలయ వాస్తు శిల్పాలు:** జైనులు తమ జైన ధర్మప్రకారం జీన, శివ, సరస్వతి, లక్ష్మీ, గణపతి, విష్ణుదేవతలను జైన ఆలయాలలో స్థానమూర్తులుగా గర్భఆలయాలలో ప్రతిష్టించి, వారి ప్రతినిధులుగా జైన తీర్థంకరుల నిలువెత్తు విగ్రహాలను లేదా వారి శిల్పా చిహ్నాలను ఆలయ ప్రవేశ ద్వారాలపై, మండపభాగంలో ప్రదర్శించారు.

**ఇందూరు జిల్లాలోని జైన ఆలయాలయందుగల తీర్థంకరుల చిహ్నాలు:** 1) ఆధినాథుని వృషభ చిహ్నం డిచ్‌పల్లి రామాలయం, 2) అజితనాథుని ఏనుగు చిహ్నం బిచ్‌కుంద నగరేశ్వర ఆలయం, 3) సంభవ నాథుని గుర్రం ఇందూర్‌లోని శ్రీ నీలకంఠేశ్వర ఆలయం, 4) అభినందుని కోతి గుర్తు కల్దుర్కి (బోధన్) ప్రభుదేవుని ఆలయమందు, 5) సుమలి నాథుని చక్రం నగరేశ్వర ఆలయం, లింగంపేట్‌యందు, 6) పద్మనాథుని పుండరీకం గుర్తు కల్దుర్కి ప్రభు దేవుని ఆలయమందు, 7) సుపార్శనాథుని స్వస్తిక్ గుర్తు త్రిలింగరామేశ్వర ఆలయం తాండూరు యందు, 8) చంద్రప్రభుని చంద్రేఖ కిష్టమ్మ గుడి కామారెడ్డి యందు, 9) పుష్పదంతుని మకరం గుర్తు శంభుని గుడి ఇందూరు యందు, 10) సీతలనాథుని కల్పవృక్షం రాజేశ్వర ఆలయం-బినోల (నవీపేట్) యందు, 11) శేయంశనాథుని హరిణం, శ్రీకృష్ణ స్వామి ఆలయం-ఎల్లారెడ్డి యందు, 12) వసుపూజ్యుని మహిశం విఠలేశ్వర ఆలయము యంచ (నవీపేట) యందు, 13) విమల నాథుని వరహం-అష్టముఖి కోనేరు- జానకం పేట్ (ఎడపల్లి) యందు, 14) అనంతనాథుని ఎలుగుబంటి హనుమాన్ ఆలయం బోధన్ యందు, 15) ధర్మనాథుని వజ్రం అంజనేయ ఆలయం-సారంగపూర్ (ఇందూర్) యందు, 16) శాంతినాథుని దుప్పి రామచంద్ర ఆలయం ఎల్లారెడ్డి యందు, 17) అరనాథుని మత్స్యం (చేప) శివాలయరా చిల్లర్గి (పిట్లం) యందు, 18) మేషం శ్రీకృష్ణస్వామి ఆలయం - ఎల్లారెడ్డి యందు, 19) మల్లినాథుని (కుండ) రామనాథాలయం- బండరామేశ్వరపల్లి (మాచారెడ్డి) యందు, 20) ముని సువ్రతుని కూర్మము శివాలయం-చిల్లర్గి (పిట్లం)యందు, 21) నవినాథుని- పద్మం బడారాంమందిరం (ఇందూరు)యందు, 22) నమినాథుని, శంఖం-కిష్టమ్మ గుడి (కామారెడ్డి) యందు, 23) పార్శ్వనాథుని నాగేంద్రుడు రాజరాజేశ్వర ఆలయం-బడాభీంగల్ యందు, 24) మహావీరుని సింహం మ్యూజియం (ఇందూరు) యందు దర్శనమిస్తున్నాయి. జైనులు పవిత్ర ప్రతిమామూర్తులుగా పరిగణింపబడే జైనచౌవీసా (జైన తీర్థంకరుల ప్రతిమ), మ్యూజియం ఇందూరు యందు, జైన చౌముఖ (చతుర్‌ముఖ జైనతీర్థంకరుల ప్రతిమ శిల్పం)లు తహసీల్ ఆఫీస్ బోధన్‌లో దర్శనమిస్తున్నాయి. జైనమతం ప్రకారం జైనులు తమ పండగ, పర్వదినాలలో లోహపు జైన విగ్రహాలను ఉత్సవ మూర్తులుగా మరియు జైన చౌవీసా, చౌముఖలను కూడా ప్రదర్శించేవారు.

జగత్ ప్రసిద్ధ జైన క్షేత్రమైన బోధన్‌యందు ఈ మతం పూర్తిగా ధ్వంసం చేయబడి, ప్రస్తుతం ఆ ప్రదేశమందు జైన ప్రజలుగాని, జైనమతంగాని, జైన శిల్పసంపదగాని కానరాని స్థితికి చేరుట దురదృష్టకరం.

**సిద్ధ సాయరెడ్డి**
**నిజామాబాద్.**
**ఫోన్**: 984 976 4237.



వేగుంట మోహన్‌ప్రసాద్

# బాధ పడిన కవి

*- వేగుంట మోహన్‌ప్రసాద్*

కవిత్వ రచన ఒక్కటే సాహిత్యం కాదు. సారస్వతంలోని అంతఃశక్తి సాహిత్యం. సాహిత్యం బహుముఖి. ఈనాడు అనితర సాధ్యమైన అనంతాలు వస్తున్నాయి. నేడు అనితరసాధ్యమైన కథలు వస్తున్నాయి ఈనాడు అనితర సాధ్యమైన నవలలు వస్తున్నాయి. ఈనాడు అనితరులు కారు – అనేక అనితేతరులున్నారు. ఎవరెవరి సాహిత్య ప్రక్రియలలో వాళ్ళు 'అనితర సాధ్యం నా మార్గం' అనదగినవాళ్ళున్నారు. కాకపోతే కొందరు వాళ్ళవాళ్ళ స్వర్గాన్ని వాళ్ళవాళ్ళ నరకాన్ని వాళ్ళే సృజించుకుంటున్నారు. స్వర్గం ఎంత సృజనశీలమో నరకం అంతే సృజనశీల దుష్క్రియాత్మకం. నా నరకాన్ని, నా చేజేతుల చేసుకొన్న నరకాన్ని కవిత్వ ప్రక్రియలో కాకుండా కథనాత్మకంగా వృథా వ్యధాత్మకంగా *బ్రతికిన క్షణాల*లోనూ *పునరపి*లోను సృజించుకొని తీరా సముద్రపుటొడ్డున కట్టుకొన్న పిచ్చిక గూళ్ళుగా నేనే ఒక్కొక్కటిగా కూల్చేసుకున్నాను – బుచ్చిబాబు, అంతరంగ కథనంలోలాగా, ఈ రెండు రచనలలోనూ నేనే, అనితర సాధ్యం నా మార్గం అని ప్రస్తుతం అనుకుంటూనే ఉంటాను. వాటిని మించిన చొక్కా లాగు చించేసే ఆత్మస్థైర్యం వచ్చేదాకా ముందుగా నాకంటే ముందుగానే 'త్రిపుర' అలాంటి సాహితీ రచన చేయకుండా ఉంటే.

తాత్వికంగా, కవిత్వకంగా అనే రెండు సూచనలు: తాత్వికంగా అనేది ఒక పెద్ద బరువైన మాట. వాడి తత్వమే అనేది చాలా సులువైనమాట. 'చితి–చింత' అనే సంకలనానికి ఏ తత్వమూ లేదు. అయినా భయపడిపోయారు. ఒక్క కె.వి.ఆర్. తప్ప. సంజీవదేవ్, నాగళ్ళ గురుప్రసాదరావు, రోణంకి వాళ్ళవాళ్ళ అద్భుత జ్ఞానసంపదని తప్పించి 'చింతి–చింత'లోని అమాయకత్వాన్ని, నవయౌవనసందేహ సందోహాల్ని వాళ్ళు పట్టుకోలేకపోయారు. దిగంబర కవిత్వంకంటే ముందు వచ్చిన డ్రాయరు లేని పిల్లాడి కవిత్వం అది. విప్లవ కవిత్వంకంటే ముందు వచ్చిన విద్రోహచర్య అది. ఈ రెండు ఉద్యమాల ఉద్ధృతి 'చితి–చింత'ని అవజ్ఞలోకి నెట్టేయేటాన్ని ప్రయత్నం అంటూ ఏమీ లేకుండా కొత్తకొత్త పద బంధాల్తో పిచ్చి రెచ్చిపోయే సభల్తో నన్ను పాఠకులకు దూరం చేసాయ్. దిగంబరుల ముఠా. అప్పటి విప్లవుల గుంపు. ముఠాలోనయినా నిలిచిపోయే కవి ఈ నాటికిన్నూ ఒక మహాస్వప్న. గుంపులో చెర. అప్పటి అరుణతార ఈనాటి హెచ్.ఆర్.కె. ఆనాటి సమీక్ష వ్యాసం, ఈనాటి వ్యక్తిగత లేఖ, అర్థం చేసుకోవటంలోని వైఫల్యానికి అనర్థాలకి ఉదాహరణలు.

గ్రామం.. ఊరు... అమ్మ.... ఇవన్నీ వీటి విలువలన్నీ ఎప్పుడు తెలిసొస్తాయంటే వాటిని పోగొట్టుకొన్నప్పుడే పల్లెటూరు పోయిందనేకాదు నా ఏడుపు... నిన్నగాక మొన్న మా వట్లూరు (మా స్వంత గ్రామం) వేణుగోపాల స్వామి ఆలయంలో 150 సంవత్సరాల దేవతా విగ్రహాలు నల్లబారిపోయాయన్నా, అటు మొన్న నా మహానగరం న్యూయార్క్ కుప్పకూలిపోయిందన్నా నాకు అనంతమైన ఏడుపు. దుఃఖమే దుఃఖం. ప్రాచీన సముద్రాలలో పురాతన నగరాలెన్నో కూలిపోయినాయో అప్పటి ఆ జనజీవనం ఎంత సజలనయనమైనదో కదాని నా అనంత దుఃఖ దీన గానం! 'మట్టివాసన' అనేది పొలాన్ని హలాన్ని అమ్ముకుంటే కవికి కలాన్ని అమ్ముకొన్నంత ఏడుపు రాదా! పదెకరాలు

అమ్ముకొని సిద్ధార్థ కాలేజీ చుట్టుప్రక్కల ఓ చిన్న ఇంటి చోటు కొనుక్కున్నవాళ్ళు, పొలాల్ని అరువుకో ఎరువుకో ఇచ్చేసి పిల్లల ఇంజనీరింగ్, డాక్టర్ చదువుల కోసం వచ్చేసినవెన్ని కుటుంబాలు! అగ్గి పేటికల్లాంటి అపార్టుమెంట్స్‌లో ప్రక్కవాళ్ళ పేర్లు కూడా తెలీని తనాల్లా ఇతరత్వాలు...! పైగా వీళ్ళే మళ్ళీ ప్రైవైటైజేషన్, గ్లోబలైజేషన్, ఎం.ఎన్.సి.ల మీద కంప్యూటర్ కంపెనీలమీద వ్యాజ్యమాడే వేషగాళ్ళు. ముఖ్యంగా మన కవులున్నూ, వాళ్ళ పిల్లలకి ఈ చదువులే ఈ వీసాలే కావాలి. మైక్ ముందు మాత్రం వాక్చాతుర్యంతో మనల్ని అవమానిస్తారు. ముఖ్యంగా వాళ్లలోనూ లెఫ్టిస్ట్‌లు, దళిత, స్త్రీవాద కవులు, కవయిత్రులున్నూ, కెరీరిస్ట్ సేవాసంఘాలు ఎవరికి వారే వేరువేరు కుంపట్లు నెలకొల్పుకొని స్వీయసేవాకీర్తి, తృప్తిపొందుతున్నవాళ్ళు. నిజానికి మాట్లాడే పెదాల శబ్దాల లోపలికి వెళ్ళి వింటేఎంత అనృత వాసనో శబ్ద కాలుష్యమో కదా! 'నేటివిటీ' అంటే బాల్యభాషలో అందంగా నా తనాన్ని నేను శాశ్వతంగా చెప్పటమే. నేనిపుడు పుస్తకాల్నించి కాక చిన్నపిల్లల్నించి 'భాష'ని నేర్చుకుంటున్నాను. 'నామిని' ఎంత ప్రాంతీయ సాహితీవేత్తో అంత విశ్వాంతరాళపు కవి. 'నీతోటి రహస్యమొకటయున్నదోయీ' అన్న పాటలో వ్యక్తికీ సమాజానికీ ఇద్దరికీ చెప్తూనే తన రహస్యాన్ని తనకు తాను చెప్పుకునేవాడే నాకు ఆత్మీయుడైన కవి. సాహిత్య, సాంఘిక, సాంస్కృతిక, వైయక్తిక రహస్యాల్ని ఓ వారం పదిరోజుల క్రితం నా కళ్ళమ్మట ఊ అదే పనిగా నీళ్ళొచ్చేట్టుగా చెప్పిన మహారచన చేసినవాడు రాణి శివశంకరశర్మ. 'తండ్రి ప్రథమ శత్రువు! తల్లి ప్రథమ ప్రేయసి. ఇతరులకు చెందని జ్ఞానం, విజ్ఞానం, సంస్కారం విషవృక్ష ఫలాలు. చదువు ప్రథమ ప్రభుత్వం. నాకు నేనే ప్రేమికుణ్ణి, ద్వేషినీ, 'గమనాగమనం'లోలాగా 'పింజారి'లోలాగా. మన అంతర్యాలేమిటో కన్నీళ్ళ హ్యాంకీలతో తుడుచుకునేదాకా మనం మానవ విలువల మూల్యాలు తెలుసుకోలేం. తండ్రిలానో, తల్లిలానో మానవ హక్కులకోసమో, మానవత్వం కోసమో, ఔన్నత్యంకోసమో ఏడ్చే, దుఃఖించే మహామానవుడు – ఆయన మన మామూలు కవిత్వ పరిభాషలో కవి కాకపోవచ్చుకాని ఒక్కపక్క వృద్ధుడిని, యువకుడిని, స్వాప్నికుడిని, బాలుడిని, కరుణాంతరంగుణ్ణి ఒకే ఒక్క కాళోజీలో నేను చూశాను.

ఆర్బేనిటీ మనిషిని డీ హ్యూమనైజ్ చేస్తుంది. డీ ఫెమీలియర్ చేస్తుంది. మనిషంటే ఒకరుకాదు, వాడికి మూడు ముఖాలు అని మన ముఖం మీద కొట్టి చెప్పిన మహాద్భుత క్యూబిస్ట్ పికాసో. ఈ అన్నమయ, జీర్ణమయ కోశాల్నించి మనల్ని మనోమయ కోశాలకు ఉన్మత్తుల్ని చేసేదే సంగీత చిత్ర శిల్ప కళావైభవాలు. పంచభూతాల్లో స్వరాల్ని పట్టేసిన ఫ్లూట్, వయోలిన్, డ్రమ్స్, షహనాయ్, సితార్, క్లారినెట్, కసెట్స్‌ని వింటూ కూడా ఉభయ సంధ్యలు వార్చొచ్చు కాస్తంత విస్కీ సిప్ చేస్తూ. 'మళ్ళీ పరుండేవు మసలుతూ ఉండేవు మారాము చాలింక లేరా' అని మళ్ళీ మరో ప్రత్యూష ఊహ నిద్రలేపుతుంది. వాస్తవ ప్రపంచంలోని సమస్యలైన ఆర్థిక, సామాజిక, కౌటుంబికమైనవి వీటికి రాజకీయాలను చేర్చి సోకాల్డ్ అభ్యుదయ, ప్రగతివాద విప్లవ కార్యాచరణ సోకాల్డ్ సాహిత్య తత్వవేత్తలు మానవుడికి మరొక సగభాగమైన మానసిక ప్రపంచమంటూ ఏదీ లేకుండా చేశారు. నలభై, యాభై ఏళ్ళుగా సాహిత్యానికి ఒక స్వయం ప్రతిపత్తి అంటూ ఏమీ మిగల్చనీయకుండా తయారుచేశారు. ఈనాటి ప్రచార సాధనాలు అన్నీ కలగలసి చేస్తున్న మూస ఆలోచనా ధోరణికంటే సాహిత్యానికి ఎక్కువ హాని చేసింది ఆ సోకాల్డ్ వామపక్ష మేధావులే. లిటరేచర్‌కీ సోషియాలజీకి నడుమనున్న సూక్ష్మరేఖను చెరిపివేశారు. సాహిత్యానికి మనస్తత్వ జ్ఞానానికి ఉన్న సాన్నిహిత్యాన్ని ఛిద్రం చేశారు. వ్యక్తి (వ్యక్తివాదం!) అంటే వీళ్ళకున్న అంచనా అల్లా స్వీయ ఆలోచన నశించిన మందబుద్ధి, మందలో కలిసిపోలేనివాడని, వాడొట్టి నిరాశావాది అని. నామిని, ఖదీర్‌బాబు, గోపిని కరుణాకర్ అంతా గొప్ప రచయితలవ్వటానికి మూలకారణం వాళ్ళ కారెక్టర్స్‌లోని వ్యక్తిత్వాల మూలాల్ని సృజించటమే.

పియానోకి హార్మోనియంకీ తేడా తెలుసుకోలేకపోతే ఎలా? గొప్పగా పియానో వాయించేవాడినొక్కసారి చూడండి! వీపు వెనక్కు వాల్చుకొని కీబోర్డు మీద చూడకుండానే గొప్ప నొక్కులు నొక్కుతాడు. నొటేషన్ కాగితాన్ని పదేపదే చూడదుకదా. తల వెనక్కి వాల్చుకొని

కళ్ళు మూసుకొని అద్భుత సంగీత ప్రకంపనాలని అందిస్తూ ఉంటాడు. 'త్వమేవాహం' కావ్య రచనలో మనం మరిచిపోయిన, తెలీని తెలుగు ఛందోరచనా విశేషాలున్నాయ్. పైకిమాత్రం వచన కవిత్వంలా కనిపిస్తూనే. ఆరుద్ర 'కవిహృదయం' అంటూ దాశరథికి ఓ లేఖ రాయటం... ఇదంతా చరిత్రే. అందులో భాగమే ఈ ముప్పై ఏళ్ళుగా మోహన్ ప్రసాద్ కవిత్వం అర్థం కాదనటమూను.

తాత్విక క్లిష్టత: ఇది కవిత్వ విషయంలో తత్వశాస్త్రానికి సంబంధించిన విషయం కాదు. అలవాటైన పదబంధాలని ఆలోచనను తెంచటం, తుంచటం, విశ్వనాథ సత్యనారాయణగారు "ఓ మంచి శుక్రవారంనాడు ఎర్ర శాలువా కప్పుకొని...." అన్నప్పుడు గుడ్‌ఫ్రైడే, రెడ్ సెల్యూట్ వెంటనే తట్టవు. ఆడెన్ ఒక కవితలో ప్రస్తుతం తలదాచుకుంటున్న కమ్యూనిస్టుల గురించి చెప్తూ, వాళ్ళు వెయిటింగ్ పేషెంట్లే అనేబదులు 'వెయిటింగ్ ఎక్స్‌పెన్సివ్‌లీ ఎక్స్‌పెక్టింగ్ మిరకల్స్ టు హపెన్' అని ఓ నగరంలో కూర్చున్నారని రాశాడు. మామూలుగా అయితే 'వైటింగ్ పేషంట్లే' అని రాయాలి కదా. 'సీతమ్మా చెప్పవే' అంటూ రామదాసు, రాములవారు 'నాపై చలమూ చేసినారు' అంటా వాపోతాడు. సందర్భాన్నిబట్టి 'చలము' అనే మాటకి అర్థం నినాదంగా ఇంకుతుంది మనలో. తంత్ర కవితను అర్థంచేసుకోవటం నిషిద్ధం. మంత్ర కవిత మనల్ని లీనాలీనస్థితిలో ఉంచుతుంది. తత్వాలు నిదానంగా మనలోకి ఇంకుతాయ్. అర్థం చేసుకోవటం అంటే ఒక వస్తువుని వినియోగంలోకి తెచ్చుకోవటమన్నమాట. A poem communicates before it is understood అని అన్నారు. ఆధునిక కవితా గురువులు. The moon slowly released by the boughs (మక్లీష్)లా మూలాన్ని సృజించటమే.

గుణ స్పృహ పెరగాలంటే మనకు పూర్వం (కనీసం ఓ వంద సంవత్సరాలయినా) నుండీ నిలబడిన మంచి కవితలు మనకు తెలిసినన్ని భాషల్లో అధ్యయన శీలంతోను అనుభవసారంతోనూ పఠించాలి. పైకి (లోలోపల కాక) చదువుకుంటూ పోవాలి. అప్పుడు శబ్దసౌందర్యం కొంచెం తెలుస్తుంది. సంగీతం వింటున్నప్పటిలా, సామాజిక వాదాలతో ఆగిపోకుండా ఆ వాదాల వేదనలతో రాసిన కవితల్ని మననం చేసుకోవాలి. నిజమైన ఆర్తి ఉన్న గీతమేదో కానిదేదో స్పష్టమవుతుంది. కవి 'ఎంత గొప్పగా రాశాను' అని పొంగిపోతే అది అతన్నుంచి తన్నుకొచ్చిన కవిత కాదనే. ఆర్ట్ లేని క్రాఫ్ట్ అది. సామాజిక వాదాలతో రాయబడే కవితల్లో ఇదే లోపం. ఇక తర్వాత కీర్తి! తృప్తి – నివ్వని కీర్తి!! ఆ కీర్తి కోసం ఇతర్ల వెంటబడటం! ఇది కూడా ఆర్ట్ – క్రాఫ్ట్‌ల మధ్య జరిగే గొడవే. అటూ ఇటూ రెండువైపుల నుంచి కీర్తి రావాలనే. *అరువు తెచ్చుకున్న ఆవేశంతో తనది కాని అనుభవంతో సామాజిక సమస్యలపైన తక్షణం ప్రతిస్పందిస్తేనేకాని పేరు నిలవదేమోననే ఆరాటం.* కవిత్వం భవిష్యత్తు కోసం వర్తమానంలో రాసే ప్రక్రియ. సమస్యకి పరిష్కారం దొరికిందా ఇక ఆ కవి చేతులు ఖాళీ అయిపోతాయి. ఇక వాడే కొత్త సమస్యల్ని లేనివాటిని తీరిగ్గా కూచుని సృష్టిస్తాడు. అలాంటివాడి కవిత ఒక Devils workshop. A wrong man in a workers paradise. *రాజ్యాన్ని తిడ్తూనే, రాజ్యంలో భాగంగా ఉంటూనే, వాటి ఫలాల్ని హస్తగతం చేసుకోవాలనే ప్రయత్నమిది. వాళ్ళే కెరీరిస్టు కవులు, రచయితలు.* ఈ విషయంలోనే దళితవాద, స్త్రీవాద కవులు, రచయిత్రులపై నా అసంతృప్తి.

అవును. అభ్యుదయ కవిత్వం నుంచి ఎండగా ఉన్నాను. దూరంగా కాదు. వీధిలో ప్రొసెషన్ వెళ్తోంటే దారిప్రక్కన నుంచొని చూస్తుంటామే, అలాగ. శతృత్వంతో కాదు. అభ్యుదయ, విప్లవ కవిత్వ రచనలకంటే వాటి వచన రచనలే (కథలూ, నవలలూ) ఇప్పటికీ విశ్వసనీయంగా నిలిచినాయనుకొంటాను. వాటిల్లో నిజమైన జీవిత చిత్రణ ఉంది. ఈనాటికీ అవే క్లాసిక్స్‌గా నిలిచాయనుకొంటాను. ప్రజా నాట్యమండలి వాళ్ళ నాటకాలు కవిత్వంకంటే ప్రజల్ని ఎక్కువ ప్రభావితం చేసినాయేమో. ఆనాటి నాజర్, ఈనాటి గద్దర్ గొప్ప పర్ఫార్మింగ్ ఆర్ట్‌తో ప్రజల్ని ఉర్రూతలూగించారు. వచన రచనలే పెంచినాయి. కవిత్వపు ఆవేశం తాత్కాలికాలమై పోయినవేమో.

గ్లోబలైజేషన్ అని గగ్గోలు పెడుతూ ఉన్న మనమే ఆ దారిలో వచ్చే మొట్టమొదటి అవకాశాన్ని అందరికంటే ముందుగా చేజిక్కించుకోవాలని ప్రయత్నం చేస్తున్నాం. కవులలో ఈ 'డబుల్ టాక్' ఒక్క ప్రపంచీకరణ అనే

అంశంలోనేగాక పితృస్వామిక, కౌటుంబిక, వర్ణ, మహిళ, వర్గవ్యవస్థల విషయాల్లోనూ వినిపిస్తుంది. గ్రామాలు విడిచిపెట్టడం, మూలాల్ని మరిచిపోయినట్లు నటించటం, తమతమ కులాలకే దూరంగా జరిగిపోవటం, పిల్లల చదువుల విషయంలోనూ అమెరికాపై చూపు నిగడ్చటం, వీలయితే అక్కడికే చివరి దశలోనైనా చేరుకోవడం, వీలయినంత కట్నాల్ని ఎక్కువగా గుంజుకోవటం – ఇవన్నీ మైకుల్లో వీరావేశాల్ని వెలిగక్కేవాళ్ళ ప్రతిభే, Oratorial ప్రతిభే. దేశీయ సంస్కృతి! అది బ్రాహ్మణీయ, అగ్రకుల ఆధిపత్య సంస్కృతి అనేగదా మీరు దాన్ని ధ్వంసం చేయాలనేది! అలాంటి సంస్కృతి నిజంగానే ధ్వంసమౌతుంటే ప్రపంచీకరణ తప్పకుండా ఆహ్వానించాల్సిందే. ప్రపంచీకరణ అనే పదంలో నిగూఢంగా దాక్కున్న అభ్యంతరమల్లా రాజకీయ వ్యవస్థపైనేనని నా అనుమానం. ముందు మనమందరం ఈ టాల్‌టాక్‌ని కట్టిపెట్టి మన వీధిలో మన కార్పొరేటర్ పరిధిలో, మనకు సంబంధించిన ప్రభుత్వ కార్యాలయాల్లో మన పనులు లంచాలిస్తేగాని అవ్వనితనం ఎందుకుందో, కరప్షన్‌లోని ట్రాన్సరెన్సీని మనం ఎందుకు ఎదుర్కోవడంలేదో ఆత్మశోధన చేసుకోవాలి. ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియాని విమర్శించగలం, పోలీస్ కానిస్టేబుల్‌ని పల్లెత్తు మాటనలేం.

విమర్శలు, వ్యాఖ్యలకు నేనెప్పుడు వ్యతిరేకంగా స్పందించలేదు. ఆ పని నేనూ చేస్తున్నానుకదా. అచ్చులో కూడా. పదవిలో ఉన్న కవి, రాజభవనంలో ఉన్న కవి నన్ను భయపెట్టలేరు. నాదెపుడూ నిజంగా *బాధపడిన కవి* పక్షమే. ప్రసిద్ధి అనేది స్వయంసిద్ధంగా వస్తే బాగుంటుంది. సహజంగా ఉంటుంది. లేకపోతే చాటునైనా వీపు వెనుకనైనా నవ్వుకుంటారు. నా రచనా విధానం కొంతలో కొంతైనా మంచికైనా, చెడుకైనా మారిందని నమ్మకం కలుగుతూంది. అది చెప్పాల్సింది అధ్యయనశీలురైన విమర్శకులే. వచన కవిత్వం ఇప్పటికే రాసిరాసి అరిగిపోయింది. శైలీభేదాలు లేకపోవడం ఒక కారణం. కవిత్వ రూపంగా కాదుగాని, సారంగా మాత్రం మునుముందు గేయాలలోనూ గీతాలలోనూ కథలలోనూ, నవలలోనూ దాక్కుంటుంది. ప్రస్తుతానికి ప్రచార సాధనాలదే పైచేయి. ఈ రోజైనా వార్తాపత్రిక చదవడంలో గడిపినంతకాలం, మతిలేని టి.వి. సీరియల్‌ని చూడటంలో గడిపినంతకాలం మనం ఒక కవితను చదవడానికి వెచ్చించలేకపోతే కవులు రాసినా వాళ్ళకు పాఠకులు ఉండరిక.

ఎవడి మతం మీద వాడికిపుడు పిచ్చి ముదిరిపోయింది. కార్యకారణాలతో సంబంధం లేని సాముదాయక హత్య, ఆత్మహత్యల కల్చర్ పెరిగిపోతుంది. ఉదాహరణకి బెజవాడ బీసెంట్‌రోడ్ సెంటర్‌లో ఆ బహిరంగ పూజలేమిటి? శ్రీరామనవమి అయితే సరే, అదేదో ఇంట్లోనే ఎందుకు చేసుకోగూడదు. మామూలు రోజుల్లో ట్రాఫిక్ పోలీసులు అందర్ని తంతారు కదా. మరా రోజు జిల్లా అధికారులు వారి సతీమణులు అక్కడ రోడ్డుమీద కుర్చీలేసుకు కూచోవడమేమిటి? ప్రార్థనలకు అదే మతమైనా పబ్లిక్ మైక్‌లెందుకు? ఎంత శబ్దకాలుష్యం? ప్రార్థనా మందిరాలన్నింటినీ బహిరంగ స్థలాల్నించి రాత్రికి రాత్రే తొలగించితే తప్పితే ఎవడి గుడిని ఎవడి మడిని ఎవడి దడిని వాడి ఇంట్లోనే పెట్టుకోమంటే తప్పితే, మనకింకా 'ట్రైన్ టూ పాకిస్తాన్'లూ, 'తమస్'లూ రావల్సి ఉంటాయి. కార్పొరేట్ ప్రార్థనాలయాలు (ఎన్.ఆర్.ఐ. మహానుభావులు పుణ్యం ఇవన్నీ) కార్పొరేట్ కాలేజీలు, కార్పొరేట్ హాస్పిటల్స్ అన్నీ ఉన్నప్పుడు ప్రభుత్వాలు, సి.ఇ.ఒ.లు అన్నీ ఉన్నప్పుడు కార్పొరేట్ ప్రభుత్వాలు, సి.ఇ.ఒ.లు తప్పవు కదా తప్పవు.

ప్రపంచీకరణ మూలంగా ఆరోగ్యకరమైన అంశాలు నాశనం అవుతున్నాయి. ఈ నాశనమవడం అనేది గత పదేళ్ళుగానే కాదు, అంతకుముందే మొదలైంది. సామ్యవాదం అనే ఒక వెల్లువ వచ్చి, వ్యక్తి స్వీయ వ్యక్తిత్వాన్ని కాలరాసినపుడే వచ్చింది. దైవ భక్తి మూఢత్వమే కాని భక్తి సంగీతంలోని కళ, క్లాసికల్ మ్యూజిక్ – అగ్రవర్ణ కళ అని తిరస్కరిస్తున్నాం. దేవాలయాల మీద శిల్పకళని కూల్చేస్తున్నాం. దేవాలయాల్ని కట్టినవాళ్ళు అగ్రవర్ణాలవారు కారే! హస్తకళలన్నీ నిజానికి శ్రామిక వర్గంవాళ్ళవే. ఇదొక పెద్ద కాంట్రడిక్షన్. గతంలో ఎన్నడూ లేనంతగా మళ్ళీ ఈనాడు స్వాములవార్లు ఊరికొకరు వెలుస్తున్నారు. గజ్జల మల్లారెడ్డి, అన్న 'భక్తిరసం' డ్రైనేజీ పొంగి పొరలి మనందర్నీ ముంచెత్తుతోంది. ఓల్డేజి హోమ్స్ దేశీయమైన సంస్కృతికి చిహ్నమా? న్యూక్లియర్ కుటుంబాలు దేనికి చిహ్నం? పనికిరాని వినియోగ వస్తు

క్రయ విక్రయ సంస్కృతి ఆరోగ్యకరమైన అంశమా? సామ్యవాదం మరి వీటిని ఎందుకు అడ్డుకోలేకపోయింది? దాని వైఫల్యమే గ్లోబలైజేషన్‌కి మూలం.

కవిత్వంలో మార్మికశైలి వేరు. నర్మగర్భంగా చెప్పేదంతా మార్మిక ధోరణే. చిత్ర రచనలో మార్మికత ఉంటుంది. అందులో ప్రతీకలుంటాయి. భక్తివాదం వేరు, కవిత్వంలో మార్మిక వ్యంజనవేరు. ప్రతీకల్ని, ప్రతిమల్ని చిత్ర, శిల్పకళారీతుల్లో చూపిస్తాం. ఇప్పుడిప్పుడు తెలుగులో హైకూ రచనల్లో చూస్తున్నాం. చలం 'సుధ'లోనూ కృష్ణశాస్త్రి 'ఊర్వశి', 'కృష్ణపక్షం'లోనూ మార్మికవేదన ఉంది. అన్నమాచార్య విన్నపాలలోనూ అదే కనిపిస్తుంది. మార్మికతని రెండు రకాలుగా అర్థంచేసుకోవచ్చు. "ముందుగా తెలిసిన ఈ మందిరమిటులుంచేనా'' అన్నప్పుడు ఆ మందిరం తలంటుకొని, సబ్బుతో స్నానంచేసి గంధం పూసుకొనే అనే అర్థంలోనూ తీసుకోవచ్చు. ఒకటి మానసికం, మరొకటి దైహికం. ఉద్యమ సంబంధం లేకుండా కేవలం మానసిక సంబంధంగానే కవిత్వం ఉండాలా? ఉద్యమాలు సమిష్టి ప్రేరకాలు. అనేక వ్యష్టిలు కలిస్తేనే సమిష్టి! ఉద్యమాలు బయట సంఘంలో, సమాజంలో జరిగేవి. కవి ప్రద్యుమ్నుడు.

*వైయక్తిక ధోరణి అంటే అహంతో కూడిన వ్యక్తివాదం కాదు. అహాన్ని స్వాధీనపరచుకొన్నదే నిజమైన వ్యక్తివాద కవిత్వం. నేను ఈ సమాజం గురించి రాస్తున్నానన్న కవిలో కూడా 'నేను' ఇంకా మిగిలివుండే ఉంటుంది. సామాజిక కవిత్వం అని శాసించే ధోరణిలో రాసే కవే నిజమైన నియంత.*

పరాయి దేశంలో జిప్సీల భాష వింటున్నప్పుడు వాళ్ళను చూస్తున్నప్పుడు ఆ భాష వాళ్ళ కదలికలు నిజాలే అన్నీనూ. కాని ఎదియో అర్థమ్ము కాని రక్తి స్ఫురియిస్తుంది. అదే మాజిక్ రియలిజం. స్వీయానికీ వస్తువుకీ ఉండే అసంబద్ధ సంబంధమే మాంత్రిక వాస్తవికత. జనన మరణాలకు మనం చేసే కర్మకాండ మాజిక్ రియలిజమే. యంత్రము, తంత్రము, మంత్రము ఇవన్నీ భాషలోంచి వచ్చే భావనలే. అలాంటి భాషతో మనం చేసే భాషణమే మేజిక్ రియలిజం. శోకము, మంత్ర, తంత్రాలే మన పురాణాల్లోని భాష, ఏ సంస్కృతిలోనైనా అన్ని పురాణాల్లోనూ కనిపించే పాత్రలు, ఇతివృత్తాలు మాంత్రిక వాస్తవికతను సూచించేవే. లాటిన్ అమెరికన్ సాహిత్యంలో ఈ మాజిక్ రియలిజం ఎక్కువ కనిపిస్తుంది. వైజ్ఞానిక శాస్త్రంలో ప్రతిముందడుగూ మాజిక్ రియలిజమ్‌ను తలపించేదే. ఈ మహా విశ్వంలో మనిషి పాత్ర ఎంత అణుమాత్రమో మాజిక్ రియలిజం చూపిస్తుంది.

ఉదాత్తత ముఖ్యం. 'నీ పాదం మీద పుట్టుమచ్చనై చెల్లెమ్మా!" అన్నప్పుడు అదే ఉదాతత్త. కొంత సంస్కారం కావాలి కూడా. అంటే పూర్వపు సంస్కృత భాషా భేషజం కాదు. హృదయం ముఖ్యం. 'కరుణ ముఖ్యం' అన్నారు ఇస్మాయిల్. అది కావాలి. పాఠకుడిలో కొంత ఉన్మీలనా దృష్టికావాలి. అదొక్కటే ప్రమాణం.

నిజానికి కవిత్వ పఠనంకంటే నాకు ఎక్కువ ఇష్టమైనది నవలలు – మంచి క్లాసిక్స్ అయితేనే. కవిత్వంలో అలాంటి క్లాసిక్స్ ఈ శతాబ్దిలో ఎన్ని మిగిలాయి? నవలలు తర్వాత యాత్రా రచనలు, జీవిత చరిత్రలు, ఆత్మ చరిత్రలు, ప్రాంతీయ గాథా రచనలు నాకింకా ఇష్టం. ఏ ప్రక్రియలోనైనా రచయిత ఒక దార్శనికుడు కావాలి. విమర్శా సాహిత్యంలో హృదయోల్లాసభరితమైన వ్యుత్పత్తి కనబడాలి. కవిత్వం సిస్మోగ్రాఫ్ అన్నంతవరకు నిజమే కాని స్కేనింగ్ చేసేది నవలే. నవలలో నిజమైన జీవితం కనిపిస్తుంది. భాష – ఒక జాతి మాట్లాడుకొనే భాషకు నైశిత్యాన్ని సున్నిశిత్వాన్ని, నగిషీని కవిత్వం ఇస్తుంది. అది రూపం. సారం కావాలంటే నాటకమో, నవలో కావాల్సిందే. మి

*"నా కవిత్వంలో ఋషులెవరో చెప్పేస్తానివాళ. జాన్‌డన్, విలియం బ్లేక్, థామస్‌హార్డీ, వాల్టర్‌డిలమార్, హాప్కిన్స్, మలార్మే, బాదెలేర్, ఎలియట్‌లు. 1890 క్షీణ దశాబ్ది కవులు ఎర్నెస్ట్ డౌసన్, స్విన్‌బర్న్‌లు కూడ నా గురువులే" అని వీరందర్నీ మరెంతమందినో తరచి, తరచి చదివి తెలుగు, ఇంగ్లీషు భాషల్లోని మర్మాలనెరిగి, తెలుగు భాషకు ఒక క్రొత్త ఒరవడి జోడించిన కవి మోహన్‌ప్రసాద్.*

(ఈ వ్యాస నిర్మాణానికి పుస్తకాలిచ్చిన విశ్వేశ్వరరావుకి వందనం)



గంగాధరరావు

# శతాధిక నాటకకర్త డా. కొప్పరపాటి గంగాధరరావు

– సి.యస్. రావు

బాపట్లకు గంగాధరరావుకి ఏదో ఆత్మీయ బంధం ఉంది. తెలుగునాట కవిలోకానికి, ఆధునిక నాటకరంగ నటీనటులకు డా. గంగాధరరావు పేరు వింటే బాపట్ల, బాపట్ల పేరు వింటే గంగాధరరావు గుర్తుకొస్తారు.

బాపట్లకు ఆధ్యాత్మిక ప్రాధాన్యం, చారిత్రక ప్రాధాన్యమే కాకుండా ఆధునిక స్వాతంత్ర్యోద్యమంతోనూ, సాహితీ ఉద్యమాలతోనూ, ఆధునిక నాటకంతోనూ, సినిమా రంగతోనూ కూడా ఒక ప్రత్యేకతను సంతరించుకున్న దాఖలాలు ఉన్నాయి. బాపట్ల – మెయిన్ రైల్వే లైన్ ప్రక్కన ఉన్న ఒక టౌను. ఇది ఒక వ్యాపార కేంద్రం కాదు. అనాదిగా ఒక విద్యాకేంద్రంగా రాణించడమే కాకుండా సాహితీ రంగస్థల కళాక్షేత్రంగా రాణిస్తూ వచ్చింది. దానికి కారణం బాపట్లవాసులైన ప్రముఖుల ప్రతిభాపాటవాలే. ఆ ప్రముఖుల్లో డా. గంగాధరరావు ఒకరు. పుట్టింది మచిలీపట్నం. మచిలీపట్నం కూడా సాహితీ వైభవాన్ని నెలకొల్పుకున్న పట్టణమే. గంగాధరరావు తండ్రి ఒక ప్రభుత్వోద్యోగి కావడంతో ఉద్యోగరీత్యా బదిలీ అవుతూ ఉండడంతో ఆయన విద్యాభ్యాసం మచిలీపట్నం, ఏలూరు మొదలైన పట్టణాల్లో కొనసాగింది. డాక్టరు తన బాల్యంలోనే కళారంగంపట్ల ఆసక్తి కనబరచారు. హైస్కూలు విద్యాభ్యాస దశలోనే ఒక నాటిక రాసి తనే దర్శకత్వం వహించి, తోటి నటమిత్రులతో కలసి నటించారు. పెద్దలు కూడా పిల్లలు వేసిన నాటకాలే అయినా శ్రద్ధగా చూసి ప్రోత్సహించే రోజులవి. ఆ విధంగానే అక్కడి పెద్దలు గంగాధరరావు ప్రతిభను మెచ్చుకుని, అభిమానంగా ఆశీర్వదించారు. ఆ విధంగా గంగాధరరావు నాటకరంగంపట్ల ఆకర్షితులయ్యారు.

ఆ తరువాత ఉన్నత విద్యకోసం మద్రాసు వెళ్ళి ఎల్.ఐ.ఎమ్. డాక్టరు కోర్సులో చేరారు. అక్కడ కూడా గంగాధరరావుకి ఒక చిత్రమైన అనుభూతి లభించింది. ఎల్.ఐ.ఎమ్. విద్యార్థిగా ఆ కాలేజి వార్షికోత్సవానికి ఒక నాటకం ఆడాడు. ఈయన సహవిద్యార్థి డా. గరికపాటి రాజారావు. రాజారావు ఔరంగజేబు పాత్ర, గంగాధరరావు ఔరంగజేబు ప్రియురాలి పాత్ర వేశారు. అంటే స్త్రీ పాత్ర ధరించే పురుషులు అందంగా ఉండాలి. అందులో కథానాయిక పాత్ర ధరించిన గంగాధరరావు సహజంగానే అందంగా ఉండడం అందులోనూ ఆయన గతంలోనే కొంత నటనానుభవం కలవారవడంతో ఆ పాత్ర బాగా రాణించింది. ప్రేక్షకుల మన్ననలను పొందింది. ఆ ప్రదర్శనను ఆ కాలేజికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బళ్ళారి రాఘవ కూడా చూశారు.

నాటకం అయిపోయిన తరవాత గంగాధరరావుని పిలిచి – "ఈ నాటకంలో నీ పాత్ర ఏమిటి" అని అడిగారు.

గంగాధరరావు – అప్పటికింకా వేషంలోనేవుండి చాలా మృదువుగా– "జహనారా" అన్నారు.

"అంటే ఎవరు?" అని అడిగారు.

గంగాధరరావు సమాధానం చెప్పలేదు.

రాఘవే "ముస్లిం యువతి కదా జహనారా" అని అన్నారు.

"అవునండి" అన్నారు గంగాధరరావు

ఆయన అప్పుడు "నువ్వు నీ ప్రియుడికి ప్రేమలేఖ రాసేటప్పుడు ఎడమనుండి కుడివైపుకి రాశావేమిటి.. ఉర్దూ కుడినుంచి ఎడమకు రాయాలికదా" అన్నారు నవ్వుతూ.

జహనారా పాత్రలో ఉన్న గంగాధరరావు తన తప్పును గ్రహించినట్లు మొహం పెట్టారు. రాఘవ, గంగాధరరావు భుజంమీద చెయ్యివేసి “ఎంతో చక్కగా నటించావు. నటీనటులు ఒక పాత్రను ధరించేటప్పుడు ఆ పాత్రను శ్రద్ధగా అవగాహన చేసుకోవాలి, పరిశీలించాలి. మరోసారి ఈ పాత్ర వేస్తే ఈ తప్పు చెయ్యవుకదా!” అన్నారు.

ఇది బళ్ళారి రాఘవ గంగాధరరావుకి చెప్పిన ఒక రంగస్థల మెళకువ.

గంగాధరరావు ఎల్.ఐ.ఎమ్. పూర్తి చేసిన తరువాత ఎందుకు స్థిరపడ్డారో తెలియదుకానీ ఒక చిన్న టౌను అయిన బాపట్లలో స్థిరపడ్డారు. బాపట్లలో అప్పటికి వైద్యసదుపాయాలు కూడా అరకొరగానే ఉండేవి. అటువంటి సమయంలో గంగాధరరావు ప్రాక్టీసు పెట్టిన కొద్దికాలంలోనే కలరా వ్యాధి దాపురించింది. బాపట్లలో అప్పటికి ఉన్న ఆర్.యమ్.పి. వైద్యులకు, ఇతర వైద్యులకు అదుపుచేసే మార్గం తెలియలేదు. కలరా, మశూచి అంటే డాక్టర్లు కూడా భయపడే రోజులవి. అటువంటి సమయంలో ఊరి చివర ఏడెనిమిది పాకలు వేయించి, టౌనులో ఉన్న కలరా పేషంట్లను ఆ పాకల్లోకి తరలించి, ఆయనే స్వయంగా నడుంకట్టి వైద్యం చేయడం ప్రారంభించారు. ఇంట్లో ఉన్న పేషంట్లను పాకల్లోకి తరలించడానికి కుటుంబ సభ్యుల్ని ఒప్పించడానికి కూడా ఆయన ఎంతో శ్రమపడ్డారు.

ఆయన పడిన శ్రమవల్లా, ప్రజల సహకారంవల్లా కలరా వ్యాధి సద్దుమణిగింది. రోగులు ఆరోగ్యాన్ని సంతరించుకుని తమతమ గృహాలకు చేరారు. అలా ఆయన బాపట్ల పట్టణానికి తిరుగులేని డాక్టరుగా విజయ కేతనం ఎగురవేశారు. ఆయన హస్తవాసి మంచిదని పేరొచ్చింది. అలా గంగాధరరావు బాపట్లకు డాక్టరుగా స్థిరపడ్డారు.

అప్పటికే బాపట్లలో పృథ్వీరాజ్ స్థాపించిన *ఇండియన్ నేషనల్ థియేటర్* బ్రాంచి నెలకొని ఉండి, *జాతీయ కళామందిర్* కూడా ఉండడంతో రంగస్థల కార్యక్రమాలు విరివిగా సాగుతూ ఉండేవి. జాతీయ కళామందిర్ ప్రయోక్త కీ.శే. వడ్లమూడి సీతారామారావు గంగాధరరావుకి పరిచయం కావడం, మిత్రబంధం బలపడటంతో వారు వ్రాసి, దర్శకత్వం వహించిన నాటకాల్లో గంగాధరరావుకి కామేడు వేషం ఇచ్చారు. అలా గంగాధరరావు బాపట్లలో రంగస్థల ప్రవేశం చేశారు.

ఇక రచనా వ్యాసంగానికి వస్తే 15 నాటకాలు, 23 నాటికలూ – కొండపల్లి వీర వెంకయ్య అండ్ సన్స్ ప్రచురణ సంస్థవారు ప్రచురించిన సంపుటిలు ఉన్నాయి. అంటే ఎన్నో వ్రాసి ఉంటే ఇవి అచ్చు అయి ఉండాలి. నేను పి.ఆర్. కాలేజీ కాకినాడలో ఇంటర్ చదువుతున్నప్పుడే గంగాధరరావు *గుడ్డిలోకం* నాటక ప్రదర్శన మిత్రుడు పతివాడ సూర్యనారాయణ దర్శకత్వంలో నేను చూశాను. ఆ నాటకం ఈ సంపుటిలో లేదు. నాకు తెలిసి ఆయన వ్రాసిన నాటకాలు, నేను ఆడిన నాటకాలు ఇంకా చాలా ఉన్నాయి. అవేవీ ఈ సంపుటిలో లేవు. దాదాపు 1945 ప్రాంతం నుంచి హైస్కూల్‌లోను, కాలేజ్‌లోనూ గంగాధరరావు నాటికలు, నాటకాలు విరివిగా ఆడుతూ ఉండేవి. స్కూలు వార్షికోత్సవాలకి, కాలేజీల్లో ఇంటర్ క్లాసు నాటక పోటీలకి, కాలేజీ వార్షికోత్సవాలకి గంగాధరరావు నాటకాలు విద్యార్థులు విరివిగా ఆడడం నాటకాభిలాషగల ఉపాధ్యాయులు పర్యవేక్షించడం కొనసాగింది. రాజమండ్రిలో భమిడిపాటి కామేశ్వరరావు ప్రహసనాలు రాజమండ్రి ఆర్ట్స్ కాలేజ్‌లో ప్రదర్శించబడ్డాయికానీ గంగాధరరావు నాటకాలంత విరివిగా అన్ని కళాశాలల్లోనూ, అన్ని హైస్కూల్స్‌లోను ఆడడం జరగలేదు. ఆ మాటకొస్తే వీరి సమకాలీనులైన మరే ఇతర నాటక రచయితల నాటకాలు ఇంత విస్తృతంగా ఆడబడిన దాఖలాలు లేవు. వీరి సమకాలీనులు ఒకప్రక్క ఆత్రేయ, టి.వి. నరసరాజు, ప్రఖ్య శ్రీరామ్మూర్తి, బెల్లంకొండ రామదాసు మొదలైనవారున్నా వారి నాటకాలు ఔత్సాహిక నాటక సమాజానికే ఎక్కువగా పరిమితమయ్యాయి. ఆ రకంగా గంగాధరరావు నాటకం ఆడని విద్యాసంస్థలు అరుదు అన్న పేరొచ్చింది.

ఇక ఆ తరువాత రోజుల్లో నాటక రంగాన్నే ఒక కుదుపు కుదిపి కాలేజీ విద్యార్థులకే పరిమితమైన గంగాధరరావు కలం రాజకీయ పక్షాల్ని కూడా ఆయన గురించి పట్టించుకుని ఆలోచించవలసిన పరిస్థితి *యథా*

*ప్రజా తథా రాజా*తో ప్రారంభమయింది. ఈ నాటక రచనను డి.యస్.యన్. మూర్తి హైదరాబాదు తీసుకువచ్చాడు. మేమందరం ప్రదర్శించాం. అంటే నవోదయ ఆర్ట్స్ సభ్యులం. దర్శకత్వం డి.యస్.యన్. మూర్తి. ఇందులో ఎందరో రంగస్థల ప్రముఖులు నటించారు. ఈ నాటకం– కృష్ణాజిల్లాలో ఒక హరిజనుణ్ణి ఒక భూస్వామి నిలువునా తగలబెట్టిన సంఘటనకు స్పందించి ఆయన *యథా ప్రజా తథా రాజా* వ్రాశారు. అప్పట్లో ఈ నాటకం అన్ని పరిషత్తుల్లోనూ ప్రదర్శించబడింది. ప్రేక్షక మన్ననలనూ పొందింది. ఎన్నో బహుమతులు గెలుచుకుంది. అటు ఉత్తరాది నుంచి ఇటు అనంతపూరు, హైదరాబాదు, ఏలూరు, విజయవాడ, మరికొన్ని ప్రేక్షక సంఘాల్లోనూ ఈ నాటకం మేము ప్రదర్శించాం. మద్రాసు వాణీమహల్‌లో కూడా ప్రదర్శించాం. ఎందరో పెద్దల ప్రశంసలనూ, ప్రేక్షకాభినందనలనూ అందుకున్న నాటకం *యథా ప్రజా తథా రాజా.*

ఒక సందర్భంలో విజయవాడ హనుమంతరావు గ్రంథాలయంలో ఈ నాటకం ప్రదర్శనకు నగరంలోని రాజకీయ ప్రముఖులు కూడా వచ్చారు. ప్రదర్శన పూర్తిచేసుకుని గంగాధరరావు కూడా మాతోటే ఉండటంతో మేము ఉన్న హోటల్‌కి సి.పి.ఐ., సి.పి.ఎమ్. నాయకులు వచ్చారు. గంగాధరరావు వామపక్ష భావాలు నాటకంలో బాగా కనపడ్డాయని అభినందించి ఎవరిమటుకు వారు ఆయన మావాడంటే మావాడే అనుకున్నారు. విప్లవ రచయితలూ అభినందించారు. కన్నకూతురే తన తండ్రికి మరణశిక్ష విధించడం, అమలు జరపడం హైలైట్ అన్నారు. అది ఒక గొప్ప సంచలనం. కొందరు లోపాయికారిగా ఆయన 'మీరు ఏ పార్టీ' అని అడిగారు. ఎప్పుడూ చిరునవ్వు మోముతో ఉండే గంగాధరరావు అదే చిరునవ్వుతో "నాది నాటకం పార్టీ" అన్నారు. జరిగిన సంఘటనకు స్పందించి వారు వ్రాసిన నాటకం అది. అలాగే సమాజంలో వచ్చే పరిణామాలు స్పందించి సాహిత్యం వస్తూవుంటుంది. దానికి కారణం రచయిత మామూలు వ్యక్తికి భిన్నంగా ఆలోచించడమే. సమాజ శ్రేయస్సే రచయిత లక్ష్యం. ప్రజలను ఆలోచింప చేయటమే రచన ధ్యేయం.

ఆ తరువాత గంగాధరరావు *ఈ రోడ్డెక్కడికి* అనే నాటకాన్ని కూడా మేము ప్రదర్శించాం. అంతేకాకుండా ప్రముఖ కథకులు, తెలుగు కథాపితామహుడు కాళీపట్నం రామారావు *యజ్ఞం* కథ నేను తీసుకుని, గంగాధరరావుచేత *యజ్ఞం* పేరుతోనే నాటకీకరణ చేయించాను. మూర్తి దర్శకత్వంలోనే మేము చాలా ప్రదర్శనలిచ్చాం. ఆ నాటికలో నేను గోపన్న పాత్ర వేసేవాణ్ణి. డి.యస్.యన్. అప్పల్రాజు పాత్ర వేసేవాడు. కొన్ని కారణాంతరాలవల్ల రామారావు కోరికమేరకే ఆ నాటకాన్ని ప్రదర్శించడం ఆపవలసి వచ్చింది. అప్పుడే నా కథ *ఊరుమ్మడి బతుకులు* నాటకంగా రాశాను. ఆ విధంగా *ఊరుమ్మడి బతుకులు* నాటిక వెలుగులోకొచ్చింది. నాకు పేరు తెచ్చిపెట్టింది. గంగాధరరావు *ఆరని పారాణి* అనే నాటకానికి నాచేత ముందుమాట కూడా రాయించారు. అందుకు నేను కృతజ్ఞుణ్ణి.

గంగాధరరావు ఇంకా చాలా రచనలు చేశారు. అవి 130 నాటక, నాటికలు, 12 రేడియో నాటికలు, 17 నవలలు, 7 కథలు, 65 నాటక రంగంపై వ్యాసాలు. అముద్రితం *అన్నమయ్య* నాటకం. నేను నాటక ప్రస్థానానికే పరిమితం కావటంతో వీటి గురించి నేను ఎక్కువ రాయటంలేదు. అందరి నాటక రచయితల్లాగే గంగాధరరావు సినిమా రంగానికీ వెళ్ళారు. వీరి పేరు టైటిల్స్‌లో వేయబడిన సినిమాలు ఏడెనిమిది ఉన్నాయి. వీరు పేరు లేకుండా గోస్ట్‌గా పనిచేసిన సినిమాలు కొన్ని ఉన్నాయి. తెలుగు నాటక రంగంలో ఇద్దరు డాక్టర్లు ఎప్పటికీ మరచిపోలేని ప్రముఖులు ఒకరు రచయిత, నటుడు, దర్శకుడు వ్యక్తిగా సహృదయుడు, పెదవులపై చెరగని చిరునవ్వుతో కనిపించే డాక్టరు గంగాధరరావు. రెండు డాక్టరు, ప్రముఖ దర్శకుడు, నటుడు, కోపిష్టి, ప్రజా నాట్య మండలికి అండదండ అయిన డాక్టరు గరికపాటి రాజారావు. ఆయనా సినీరంగానికి దర్శకుడిగా వెళ్ళారు. వారిద్దరికీ నా అభినందనలు.

(ఈ విషయ సేకరణకు నాకు తోడ్పడిన నా మిత్రుడు పతివాడ సూర్యనారాయణ, ఆత్మీయుడు డి.ఎస్.ఎన్., గౌరవనీయులు కె.యస్.టి. సాయి గార్లకు నా కృతజ్ఞతలు.)

# అవే నెలలు, అవే పండుగలు...కానీ...

**– కనుపర్తి విజయ బక్ష్**

డిసెంబరు, జనవరి నెలలు వచ్చాయంటే ఎంత సందడి... ఎంత హంగామా! ఎక్కడ లేని ఉత్సాహం తన్నుకొచ్చేది. అది అపుడెపుడో అప్పటి మాట. కొన్ని దశాబ్దాల వెనక్కు వెళ్ళి మనసు తలుపు తట్టి లోనకు వెళ్తే కనిపించే బ్లాక్ & వైట్ చిత్రాలు.

చిఱుచలి శరీరాన్ని కమ్మేస్తోంటే దుప్పట్లు తలమీదనుంచి చెవుల్ని కప్పుతూ మెడచుట్టూ తిప్పి కప్పుకొని తెల్లారకుండానే లేచి దొడ్లో ఉన్న తాటాకులు, గడ్డి, చెత్తా చెదారం అంతా ఒకచోట చేర్చి చలిమంటలు వేయటం, ఆ చలి మంటల సెగలు ఒంటిని తాకుతొంటే అప్పటివరకు శరీరాన్ని ఆవరించుకొన్న చలి బేజారై, జారిపోతుంటే, దుప్పట్లను జారవేసి (అప్పుడు స్వెట్టర్లు, జాకెట్లు లేవు), అరచేతులు రెండూ మంటపై పెట్టి బుగ్గలకానించుకొంటూ 'అబ్బ' 'అబ్బ' అని ఒకరితో ఒకరు పోటీ పడి మరింత గడ్డి తెచ్చి ఆ అణగిపోతోన్న మంటమీద వేసి పైకెగసిపడుతున్న మంటకి 'ఆహా ఓహో'ల మధ్య అమ్మ 'జాగ్రత్త, మంట ముందు' అనే హెచ్చరికలు వినబడేవే కాదు.

ఆ తర్వాత ప్రకరణం.... ఆవు పేడముందు కూర్చొని 'గొబ్బెమ్మ'లు గుండ్రంగా చేయటం, వాటికి పసుపు కుంకుమలు అలంకరించుకుని, ఆ పై కిందటిరోజే తెచ్చి జాగ్రత్తగా గిన్నెలో దాచుకొన్న ఉమ్మెత్తపూలు, బంతి, చేమంతి, డిసెంబరాలు, మందారాలు ఇంకా ఇంకా ఎన్నో పూలతో అలంకారం చేసి వాకిట్లో ముగ్గుల్లో అందంగా పేర్చటం




– ఇలా ధనుర్మాసం అంతా మా అమ్మాయిల సందడే. ఇక సంక్రాంతి పండగంటే 'బొమ్మల కొలువు' ఎప్పట్నించో కావడిపెట్టెలో దాక్కొన్న బొమ్మలకి మళ్ళీ ఏడాదికి జీవమొచ్చేలా చేసి నాలుగైదు వరసల్లో అందంగా చేర్చటం... సాయంకాలం పేరంటానికి ఒకరింటికి ఒకరెళ్ళంటం, ఎవరి బొమ్మల కొలువు బాగుందోనని అంచనా వేయటం.... ముఖ్యంగా మూడు రోజులకు అని అమ్మ – నాన్న మాకు కొత్త బట్టలు కుట్టించటం, అవి వేసుకొని మురిసిపోవటం ఓ మధురానుభూతి.

బొమ్మల కొలువుతోపాటు బాగా అల్లరి చేయటానికి, ఆనందించటానికి అవకాశమున్న మరొక సరదా 'సందెగొబ్బెమ్మ'. ఇక నెలంతా పెట్టే గొబ్బెమ్మలను ఈ సాయంకాలం పెట్టే సందెగొబ్బెమ్మతో సంపూర్ణం చేయటం. ఈ సందెగొబ్బెమ్మను బాగా పెద్దదిగాచేసి దానికి చిన్నచిన్న పిల్ల గొబ్బెమ్మలు చేసి పక్కన పెట్టి మంచి పీటని పసుపు కుంకుమలతో అలంకరించి పెద్ద ముగ్గువేసి రంగురంగులతో, ఆ ముగ్గులో బంతి, చేమంతి రేకలు వేసి ఆడపిల్లలందరం కలసి "గొబ్బిళ్ళో, గొబ్బిళ్ళు యదుకులస్వామికి గొబ్బిళ్ళు....." అంటూ గొబ్బి తడుతు ఆ గొబ్బెమ్మ చుట్టూ తిరుగుతూ, కొత్త పొడవు పరికిణీలు కాళ్ళకి అడ్డం పడకుండా తప్పించుకొంటూ, ఒకరినొకరం నెట్టుకొంటూ, చేతులకున్న మట్టి గాజులు గలగలమంటుంటే మేము కిలకిల నవ్వుకొంటూ (అకారణంగానే) జడలో బంతిపూల చెండు, ముందుకు పడకున్నా పడుతోన్నట్లు జడగంటల జడను వెనక్కి, ముందుకు తోస్తూ నవ్వుకోటానికే, ఆడుకోటానికే, అల్లరి చేయటానికే పుట్టామని అనుకొనేవాళ్ళం!

ముఖ్యంగా రోజూ వచ్చే హరిదాసు పాడే పాట (అర్థం అయేదికాదు) ఆ చిడతల మోత, కాళ్ళగజ్జెల రవళి వినపడగానే "ఆ. వచ్చాడు వచ్చాడు... ఈ రోజు బియ్యం వేయటం నావంతు" అని పోటీపడి, వంతులవారిగా (మేం మొత్తం ఏడుగురమ్మాయిలం, ఆపై ఇద్దరబ్బాయిలులెండి) బియ్యం పాత్రలో వేసి 'శ్రీమద్రమా రమణగోవిందో హరి..' అని వంతపాడితేకాని తృప్తిగా ఉండేది కాదు. అది భక్తో, వెక్కిరింపో ఏదో తెలియని అల్లరితనం.



ఇప్పుడు పిల్లలకి ఇవన్నీ చెబుతుంటే 'ఛీ, ఛీ... ఆపు... దాంట్లో చేతులుపెట్టి చేసేవారా' అని వెక్కిరింపు.. వాళ్ళకు అంతకంటే పండగలు, పబ్బాలు పేరుతో, చుట్టాల పక్కాల సమీకరణ, ఇరుగుపొరుగిండ్లవారితో ఆత్మీయ పలకరింపులు, ఉన్నంతలో రకరకాల పిండివంటలు చేసుకొని నలుగురికి పంచడం, తినటం, గానుగెద్దుల్లా సాగిపోయే జీవితంలో ఓ కలకలం, ఓ ఉత్సాహం, ఓ ఆనందం నిబిడీకృతమై ఉంటాయని తెలియదు!

సంక్రాంతి అనగానే గుర్తుకు వచ్చేవి అరిసెలు.. అరిసెలు లేని సంక్రాంతిని ఊహించలేము. కళ్ళు మూసుకొన్న కనిపించే అమ్మ... కట్టెలపొయ్యి ముందు కూర్చొని అరిసెలు వండుతోన్న అమ్మ నగుమోము. అల్లరి చేస్తూనో, పోట్లాడుకొంటూ, మాతో మేము గొడవలు పడుతూనో అమ్మకు చేతనైనంత సాయం చేస్తూ మొత్తం మీద ఇల్లు 'ఓ తిరణాల చోటు'లా ఉండేది.

బాగా మనసుని అలరించి, ఆనందింపచేసే మరో అమ్మాయిల పండుగ 'అట్లతద్ది'. చేతులనిండా గోరింటాకు, తెల్లవారు ఝామున లేచి భోజనాలు.. పెద్ద ఊయల ఊగటం.. బహుశః ఈ పండగకింత ఇష్టాన్ని కలగజేసింది అమ్మానాన్నలేనేమో! గోరింటాకు పెట్టుకోవాలి, తెల్లారగట్ల భోజనాలు చేయాలి, ఊయల ఊగాలి, లేకుంటే? 'ముసలి మొగుడు వస్తాడట......' మా స్నేహితురాళ్ళందరం చెప్పుకొనేవారం గుసగుసలు... ఆ భయం ఒకటే ఆ పిన్న వయసులో! అప్పటికింకా 'ఏమిటి? ఎందుకు? ఎలా?' అని ప్రశ్నించటం తెలీని అమాయకత్వం. అమ్మ ఇంతమంది అమ్మాయిలకి ఓపికగా చేమంతిపూల జడలువేసి వరుసగా కూర్చోబెట్టి బొట్టుపెట్టి కంచాల్లో అన్నంపెట్టి, బంగాళదుంప వేపుడు, గోంగూరపచ్చడి, కుండలోని (రాత్రే తోడుపెట్టిన) తియ్యటి గడ్డపెరుగుతో తిన్న అనుభూతి.... ఇన్ని దశాబ్దాల తర్వాత కూడా 'తియ్య'గా అనిపిస్తోంది. ఇక నాన్నయితే ఇంతమంది ఆడపిల్లలు ఎక్కడికో వెళ్ళి ఉయ్యాలలెట్లా ఊగుతారనే విశాలమైన మా వాకిట్లోనే పెద్ద తాడిచెట్టు, లావాటి మోకుతో పెద్ద ఉయ్యాల వేయించేవారు. ఆయన గ్రామాధికారి (కరణం) కూడా కాబట్టి చేతిలో మనుషులుండేవారు (ఆ రోజుల్లో కరణం, మునసబులు – గ్రామాధికారులు – వారికి అన్ని పనుల సహాయార్థం ఇద్దరు వెట్టివాళ్ళు, ఒక మోతాదు ఉండేవారు. ఇప్పుడీ వ్యవస్థ లేదు). ఆ పెద్ద ఉయ్యాల్లో పోటీలుపడి ఒకరి తర్వాత ఒకరం ఊపులు లెక్కించుకుంటూ ఊపుతుంటే ఊగుతూ ఆకాశాన్ని తాకినంత గర్వం..... గాలిలో తేలిపోతున్న అనుభూతి.... ఒకవైపు భయంవేస్తోన్న కళ్ళలో నీరు వస్తోన్నా గంభీరంగా ముక్కు చిట్లించి, పెదవులు బిగించి, అందరూ చూస్తున్నారని ఇంకా పెద్దగా ఊపమని అరవటం, కిందవాళ్ళ కేకలు, అరుపులు, కేరింతలు... ఓహ్... ఏమి సంతోషం, ఎంత నిర్లక్ష్యం... ఎంతటి విజయగర్వం. అలాంటి అనుభూతుల్ని మన బిడ్డలకి, మనవలకి అందించలేకపోతున్నాంకదా! అదేమంటే పట్టణాల్లో పల్లెటూళ్ళలోసైతం పండుగలన్నింటిని అంతా టి.వి.ల్లోనే, టి.వి.లతో కలిసే చేసుకొంటున్నారు! అదే పండగ సంబరం, సంరంభమూ!

ఇది రాస్తూ రాస్తూ కూడా ఆనాటి రోజుల్లోకి మనసు పరుగెత్తి గతాన్నొకసారి మనసారా కౌగిలించుకొంటే ఎంత హాయిగా, తృప్తిగా ఉంటుందో! ఇప్పటికే చెల్లా చెదరులయినట్లు అందరం ఎక్కడెక్కడో ఉన్నా కలిపి ఉంచేది, 'దూరాల దారాల్ని' విచిత్రంగా కలిపి పెనవేసేది బాల్యమే.. అంతా అమాయకత్వం, అల్లరి, చిలిపితనం, పొగరుబోతుతనం, పోట్లాటలు కలసిపోవటాలు, అన్నింటికీ నెలవైన ఆ రోజుల్ని అందరం కలిసినప్పుడు గుర్తు చేసుకొంటే.. అర్థంపర్థం లేని ఆ పనులకు నవ్వినవ్వి కళ్ళు నీళ్ళతో నిండిపోతాయి. నిండిన నీళ్ళన్నీ రెప్పల గట్లను దాటుకొని బుగ్గల మీదుగా జారుతుంటే, మాట్లాడుతూ నవ్వుతున్నామో, నవ్వుతూ మాట్లాడుతున్నామో తెలియక అప్పుడనిపిస్తోంది మన బాల్యం మన సందిటనే బంధీ అయివుంది, జారిపోలేదు సుమా! అని.....

డా. విజయ బక్ష్
మండపేట, ఫోన్: 944 138 2303.


రాయ్ దంపతులు

# ఐన్‌స్టీన్‌తో – ఎమ్.ఎన్. రాయ్ దంపతుల పరిచయం

- ఎన్. ఇన్నయ్య

ప్రపంచ ప్రసిద్ధి చెందిన సాపేక్షతా సిద్ధాంత శాస్త్రకారుడు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ (1879–1955)తో ఎమ్.ఎన్. రాయ్ (1887–1954) అతని మొదటి భార్య ఎవిలిన్ ఉత్తర ప్రత్యుత్తరాలు జరపటం ఆశ్చర్యకరమైన పరిణామం. ఐన్‌స్టీన్‌కు 1922లో నోబెల్ ప్రైజ్ వచ్చింది. 1905, 1916లో ఆయన ప్రత్యేక, సాధారణ సాపేక్షతా సిద్ధాంతాలను కనుగొని ప్రపంచానికి వెల్లడించారు. అవి సైన్స్ రంగంలో ఆలోచనలను సమూలంగా మార్చటానికి దారితీశాయి. అలాంటి వ్యక్తితో రాజకీయవాదులుగా ఉన్న ఎమ్.ఎన్. రాయ్ కు అతని ప్రథమ భార్య ఎవిలిన్‌కి ఎలా పరిచయం అయ్యిందో తెలియదుగానీ, ఉత్తర ప్రత్యుత్తరాలు మాత్రం వారికిగల సన్నిహితత్వాన్ని సూచిస్తున్నాయి.

భారత స్వాతంత్ర్యం కోసం విప్లవకారుడుగా బయల్దేరిన ఎమ్.ఎన్.రాయ్ అమెరికాలో ఎవిలిన్ ను కలుసుకుని పెళ్ళి చేసుకుని కమ్యూనిస్టుగా మారి లెనిన్ దృష్టిని ఆకర్షించి, వారి ఆహ్వానంపై రష్యా వచ్చాడు. 1920 నుండి తరచు రాయ్ దంపతులు జర్మనీతో సంబంధాలు పెట్టుకున్నారు. అక్కడ అనేకమంది ప్రముఖ కమ్యూనిస్టులను కలిశారు. బహుశ ఆ సమయంలోనే ఐన్‌స్టీన్‌ని కూడా కలిసి వుండవచ్చు.

రాజకీయ పరిణామాల దృష్ట్యా ఎమ్.ఎన్. రాయ్ 1931లో, 15 సంవత్సరాల అనంతరం స్వాతంత్ర్య పోరాటం కొనసాగించటానికి రహస్యంగా ఇండియా చేరుకున్నారు. బొంబాయిలో మారుపేరుతో మిత్రుల ఆశ్రయంతో ఉండగా ఆయన రహస్యాన్ని హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ పోలీసులకు అందజేశారు. కమ్యూనిస్టులు రాయ్ పట్ల విరోధం పెంచుకుని అలాంటి విద్రోహచర్యకు పాల్పడ్డారు. అరెస్టయిన రాయ్ విషయం ప్రముఖంగా పత్రికలలో వచ్చింది. అది ఐన్‌స్టీన్‌కు చేరింది. వెంటనే ఆయన అమెరికా నుండి ఉత్తరం రాస్తూ ఇండియాలోని బ్రిటీష అధికారులకు విజ్ఞప్తి పూర్వకంగా, రాయ్ మేధావి అని రాజకీయ కక్షలుంటే వాటిని సౌమ్యంగా తీర్చుకోవాలే కానీ ప్రాణాలు తీసే విధంగా ప్రవర్తించరాదని కోరారు. అది జర్మన్ భాషలో రాశారు. కానీ బ్రిటీషువారు ఖాతరు చేయకుండా ఆయనకు 12 ఏళ్ళ శిక్ష విధించారు. అయితే రాయ్ పట్ల ఎంతో ఆదరణ, సన్నిహితత్వం ఉంటే తప్ప ఐన్‌స్టీన్ అలా విజ్ఞప్తి చేసి ఉండరు. వారికి ఇలాంటి సున్నితత్వం జర్మనీలోనే ఏర్పడి వుండాలి. సైంటిస్ట్‌కు రాజకీయ వాదిపట్ల అభిమానం ఎలా వచ్చిందీ అని సందేహం రావచ్చు. రాయ్ కమ్యూనిస్టు రాజకీయాలలో వుంటూనే అత్యంత అధునాత వైజ్ఞానికి శాస్త్ర విషయాలపట్ల శ్రద్ధ చూపి అధ్యయనం చేస్తూ పోయారు. ఇందుకు సాక్షిగా ఆయన ఇండియాలో జైలులో వున్న సందర్భలో సైన్సు సిద్ధాంతాలు పరిశీలించి, సందేహాలను ఉత్తరాల ద్వారా సైంటిస్టులకు తెలియపరచమని రెండోభార్య ఎలెన్ ను కోరారు. ఆధునిక విజ్ఞాన శాస్త్ర తాత్త్విక ఫలితాలు లోతుపాతులతో అధ్యయనం చేయటమే రాయ్ జైలులో చేసిన పని. 6 సంవత్సరాలలో కొన్నివేల పేజీలు రాశారు. దీనినిబట్టి ఐన్‌స్టీన్‌తో సహా కొందరు శాస్త్రజ్ఞులతో తన సందేహాలు వెల్లడించినట్లు తెలుస్తోంది. ఎలెన్ ఆయన ఉత్తరాలను ఐన్‌స్టీన్‌తోసహా ఆయా శాస్త్రజ్ఞులకు పంపించేది. ఈ నేపథ్యంలో ఐన్‌స్టీన్‌కు రాయ్ కు పరిచయం వుందని భావించాలి. రాయ్ పట్ల కరుణతో వ్యవహరించమని

ఐన్‌స్టీన్ రాసిన ఉత్తరం జెరూసలేంలోని హీబ్రూ యూనివర్సిటీ పురావస్తు శాఖలో లభించింది. ఆ లేఖను వాడటానికి ప్రత్యేక అనుమతి ఇచ్చారు.

The Jewish National & University Library Department of Manuscripts & Archives Albert Einstein Archives Office of the Bern Dibner Curator

October 18th, 1994

Dr. Innaiah Narisetti 17319 Buehler Road Olney, MD 20832

USA

We hereby send you a copy of Einstein's statement concerning M. N. Roy as requested in your letter to us. We hereby grant you permission to publish this statement in your forthcoming book and in your planned article. Please note that our credit line reads as follows: "Permission granted by the Albert Einstein Archives. The Hebrew university of Jerusalem, Israel." We would greatly appreciate receiving a copy of your article as well as of your forthcoming book upon publication.

Sincerely
Zeev Rosenkranz,

Curator copied 1959 from a draft letter addressed to British Authorities in India in behalf of M. N. Roy. 1931 (date. on back of draft) also 1934 file M. N. Roy, in a cultural point of view a valuable personality is threatened by death. In the general interest it is essential that the political fight, inevitable in its way ,avoid the primitive method of extermination. Only in this way the political fight can be benedictful in longer term for the general public.

ఐన్‌స్టీన్, బెట్రండ్ రస్సెల్ 1945లో ఒక సంఘాన్ని ఏర్పరచి అణ్వాయుధాలకు వ్యతిరేకంగా ఆందోళన చేశారు. ఆటమిక్ సైంటిస్టు సంఘంగా దీనిని పేర్కొన్నారు. ఆ సంఘ కార్యకలాపాలకు ఆర్థిక సహాయం అర్థిస్తూ 1947 ఏప్రిల్‌లో ఐన్‌స్టీన్ ఒక ఉత్తరాన్ని రాయ్ మొదటి భార్య ఎవిలిన్‌కు రాశాడు. ఆమె స్పందించి యథాశక్తి సహాయం చేయటంతో ఐన్‌స్టీన్ కృతజ్ఞతలు తెలియజేస్తూ రాశారు.

Emergency committee of Atomic Scientists incorporated
room 28, 90 Nassau street
Princeton, New Jersey

Trustees
Albert Einstein Chairman

April 29, 1947

Dear friend,

On behalf of my colleagues of the Emergency Committee of Atomic Scientists, I send sincere thanks for your generous answer to my letter asking for your help in the great educational task we have undertaken. We value not only the practical support you have sent, but also the good will towards this work and the hope for a reasonable solution of this immense problem which your contribution expresses.

Faithfully yours,
A. Einstein.

దీన్నిబట్టి కూడా ఐన్‌స్టీన్‌కు రాయ్ దంపతులకు పరిచయాలు ఉన్నాయనటానికి ఆధారం కన్పిస్తున్నది. ఎమ్.ఎన్. రాయ్ – ఐన్‌స్టీన్ ఒకే సంవత్సరంలో చనిపోయారు. (1955)లో ఆ తరువాత 1970లో ఎవిలిన్ చనిపోయింది. వీరికిగల సన్నిహిత సంబంధాల గురించి ఇంకా పరిశోధన జరగవలసి వున్నది.

**డా. నరిసెట్టి ఇన్నయ్య**
**మేరీలాండ్, వాషింగ్‌టన్**. e-mail : innaiah@gmail.com

# డేరాసినిమాలు

– రావి కొండలరావు

ఇప్పుడు డేరాబాబా అనే పేరు ప్రసిద్ధంగా ఉంది. అతగాడు డేరాలో ఉండడు. కాని, ఆ అర్థం ఏమిటో తెలియదు. నా చిన్నతనంలో డేరా సినిమాలుండేవి. డేరా అంటే గుడారం. తాత్కాలికంగా పెద్ద గుడారంవేసి, కింద బెంచీలు, కుర్చీలు వేసి, తెరకట్టి సినిమాలు ఆడేవారు. టూరింగ్ టాకీస్‌లు అనేవారు. అంటే వాళ్ళు ఒక ఊళ్లోని ఖాళీ స్థలంలో (అనుమతులు అక్కర్లేదుట) టెంట్‌వేసి, కొన్నాళ్ళు సినిమాలువేసి, జనం తగ్గితే ఇంకో ఊరికి వెళ్ళేవారు. అంచేత టూరింగ్ అన్నారు. సాధారణంగా వర్షాకాలంలో తప్ప తక్కిన కాలాల్లో డేరా సినిమాలుండేవి. నేను పార్వతీపురం అనే వూళ్ళో ఒకటో తరగతో, రెండో తరగతో చదువుతున్నప్పుడు – అంటే 6, 7 ఏళ్ళ వయసు. డేరా సినిమాలు ఆడేవి. ఆ ఊళ్ళో వేరే సినిమా హాళ్ళు లేవు. ఆ డేరాలో నేను *లవకుశ*(1934) సినిమా చూశాను. అప్పటికి, ఆ ఊరు చేరేసరికి, మూడేళ్ళు పట్టింది. మా తండ్రిగారు పోస్టుమాస్టరు. అదేమిటో, పోస్టుమాస్టర్‌కి, కుటుంబానికీ సినిమా ఉచితం! ఆ సినిమాలోని పాటలు ఇప్పటికీ నాకు జ్ఞాపకం. మా తండ్రి ఆ సినిమా ఒకటి రెండుసార్లు చూసినా మా అమ్మ మా అన్నలూ నేనూ చాలాసార్లు చూసిన జ్ఞాపకం. నేల క్లాసు పెద్దది. టిక్కెట్టు అణాకాణీ.




కాణీ వినోదపు పన్ను కాబోలు. అణా అంటే రూపాయలో 16వ వంతు. ఇప్పటికీ ఆనాటివాళ్ళు “నేను 16 అణాల తెలుగువాడిని” అంటూ ఉంటారు. బెంచిక్లాసు, 10, 15 కుర్చీలూ ఉండేవి. మేము పిల్లలం, నేలమీద కూచునేవాళ్ళం. తెరముందు కూచుంటే బొమ్మ బాగా కనిపిస్తుందని! రోజుకి రెండు ఆటలు వేసేవారు. చీకటి పడిన తర్వాత మొదటి ఆట ఆరంభమయేది. అది పూర్తయేసరికి 3 గంటలు పట్టేది. సింగిల్ ప్రొజెక్టర్. కొన్ని రీళ్ళు అయ్యాక, ప్రొజెక్టర్ ఆపి, ఆ రీళ్ళు తీసి మళ్ళీ రీళ్ళు పెట్టి, ఆరంభించేవారు. ఆ విరామంలో టీలు, సిగరెట్టు బీడీలూ అమ్మేవారు. చుట్టలు, బీడీలూ ధారాళంగా కాల్చుకోవచ్చు. నిబంధన లేదు. అలాగే ఇన్ని టిక్కెట్లే అమ్మాలన్న నిబంధనాలేదు. ఎంతమందయినా కూర్చోవచ్చు. డేరాకి చుట్టూ కింది భాగంలో ఖాళీ ఉండేది. టిక్కెట్లు కొననివాళ్ళు ఆ ఖాళీల్లో దూరిపోయి, లోపలికి వచ్చేసేవారు. డేరా పక్కగా చిన్న గది. ఆ గదిలో ‘డైనమో’ ఉండేది. అక్కడ ఒకాయన డైనమో వేసేవాడు. దాంతో ప్రొజెక్టరుకీ, లోపల దీపాలకీ కరెంటు వచ్చేది. అతన్ని డ్రైవర్ అనేవారు. పెద్ద శబ్దంతో డైనమో నడిచేది. ప్రొజెక్టరున్న కాబిన్‌లో ఇద్దరు ఆపరేటర్లు ఉండేవారు. వాళ్ళు సినిమా స్టార్స్ అంతటి గొప్పవాళ్ళు ఆ రోజుల్లో. వాళ్ళని చూడ్డానికి వెళ్ళేవాళ్ళం. చూస్తున్న సినిమా అంతా వాళ్ళ చేతుల్లోనే ఉందని నమ్మకం.

*లవకుశ* సినిమా తెలుగు సినిమాల్లో మొదటి సూపర్ హిట్టు సినిమా. పార్వతీపురం డేరాలోనే చాలా రోజులు ఆడింది. 10, 15 మైళ్ళ దూరం నుంచి, జనం రెండెద్దుల బళ్ళు కట్టించుకుని వచ్చేవారు. సినిమా అయిపోయాక, బయటికి రావడానికి ఇబ్బంది అయేది. చుట్టూ వాలిన బళ్ళు, పక్కనే కట్టిన ఎద్దులూ. నేటి భాషలో ‘పార్కింగ్




ఫుల్!' అప్పుడు సినిమా అనే పేరు తక్కువగా వాడేవారు. ఎక్కువమంది గ్రామాలవాళ్ళు 'బైస్కోప్' అనేవారు. రానురాను సినిమా ఐంది. ఇప్పుడు 'మూవీ' అంటున్నారు. *లవకుశ* తర్వాత *సతీ తులసి* (1936), *హరిశ్చంద్ర* (1935) ఆడాయి. ఆ రెండు సినిమాలూ నేను చూశాను. *సతీ తులసి* కంటే *హరిశ్చంద్ర* ఎక్కువ రోజులు ఆడింది. ఆ సినిమా పాటల పుస్తకం కానీ మా అన్నయ్య ఆ పుస్తకం కొని నాకు ఇచ్చాడు.

శ్రీకాకుళంలో 1940 నుంచి ఉన్నాం. అక్కడ ఒక థియేటర్ ఉండేది. నాగావళి నది అవతల, డేరా సినిమా కూడా ఉండేది. ఆ డేరాలో *గొల్లభామ* (1947) చాలా రోజులు ఆడింది. ఆ డేరా సినిమా 1945 నుంచి నాలుగేళ్ళు ఉంది. సింగిల్ ప్రొజెక్టరే. తమిళ చిత్రాలు కూడా వేసేవారు. డబ్బింగ్ తెలీదుగనక, మధ్యలో ఒకాయన నిలబడి, తెలుగులో చెప్పేవాడు. తమిళ సినిమాలకి తెలుగుకంటే నిడివి ఎక్కువ. హిందీ సినిమాలు మధ్యమధ్యలో థియేటర్లో వేసేవారు. *గొల్లభామ* చూస్తున్నప్పుడు, ఒక రాత్రి పెద్ద తుఫాను వచ్చింది. పైకప్పు లేచిపోయింది. సినిమా ఆపేశారు. చీకటి, వాన. ఆ స్థితిలో నేను, నా మిత్రుడూ ఎటు పరుగెత్తామో పరుగెత్తాం. ఆడవాళ్ళు పిల్లలూ గోల. ఓ అరగంట తర్వాతకాబోలు సర్దుకుంది. అదయిన తర్వాత అక్కడ గుడారం లేదు, తీసేశారో ఇంకో ఊరికి తరలించారో!

**రావి కొండలరావు**
**హైదరాబాద్.**
**ఇ-మెయిల్**: ravikondalarao32@gmail.com

# పూజాఫలం

***– పి. దక్షిణామూర్తి***

దర్శకుడు బి.యన్. రెడ్డి *మల్లీశ్వరి, బంగారుపాప, వందేమాతరం, సుమంగళి, స్వర్గసీమ* మొదలైన కళాత్మకమైన, ఉదాత్తమైన చిత్రాలను సృష్టించి జాతీయ స్థాయిలో తెలుగువారి కీర్తిప్రతిష్టలను ఇనుమడింపజేశారు. బి.యన్. రెడ్డి తీసిన ఏకైక జానపదం *రాజమకుటం* (1960) విమర్శకులను మెప్పించలేకపోయినా, కొంతవరకు ప్రజాదరణ పొందింది.

బి.యన్. దంపతుల ఏకైక కుమార్తె లక్ష్మి, ఈమె భర్త హెచ్.జి.వి. రెడ్డి (ఐ.ఎ.ఎస్.) కొంతకాలం మైసూర్ రాజాగారికి ఇంగ్లండ్‌లో ఏజెంట్‌గా ఉన్నారు. తరువాత బెంగుళూరులో స్థిరపడి, పట్టణాభివృద్ధి కమిటీకు, కాఫీబోర్డుకు ఛైర్మన్‌గా పనిచేశారు. శ్రీమతి లక్ష్మి 1961లో అనారోగ్యానికి గురై, మద్రాస్‌లో వైద్యులు శాయశక్తులా కృషిచేసినా 31 సంవత్సరాల వయస్సులో అకాల మృతి చెందారు. కళాహృదయులు, సున్నిత మనస్కులు అయిన బి.యన్. పుత్రికా వియోగంతో తల్లడిల్లిపోయి, తేరుకోవటానికి చాలా నెలలు పట్టింది. సుమారు 3 సంవత్సరాలు బి.యన్. సినీరంగానికి దూరంగా ఉన్నారు. శంభూ ఫిలింస్ అధినేత యార్లగడ్డ వెంకన్న చౌదరి, ఇతర మిత్రులు బి.యన్.ను ఓదార్చి ఆయనతో ఒక చిత్రం తీయించడానికి అంగీకరింపజేశారు. రచయిత మునిపల్లె రాజు రచించిన *పూజారి* నవల ఆధారంగా బి.యన్. పటిష్టమైన స్క్రీన్‌ప్లేను వ్రాసుకోగా, ప్రముఖ రచయిత డి.వి. నరసరాజు మరిన్ని సొగసులను దిద్ది, హాస్య సన్నివేశాలను సృష్టించి, రసవత్తరమైన సంభాషణలను సమకూర్చారు.

***పూజాఫలం* కథాసంగ్రహం ఇలా ఇంది:**
జమీందారీ కుటుంబంలో జన్మించిన మధు తల్లిదండ్రులను బాల్యంలోనే కోల్పోతాడు. చాలా సున్నిత మనస్కుడు. మనసులోని కోరికలను వెల్లడించే ధైర్యం లేదు. ఆడపిల్ల కనిపిస్తే ఆమడదూరంలో నిల్చుంటాడు. సమూహంలో ఉన్నా అతను ఏకాంతంలో ఉన్నట్లే భావిస్తాడు. ఇలాంటి మధు జీవితంలో ముగ్గురు మహిళలు ప్రవేశిస్తారు.

వాళ్ళింటికి అద్దెకు వచ్చిన బ్యాంక్ ఏజెంట్‌గారమ్మాయి వాసంతి ఎంతో చలాకీగా ఉంటూ మధు జీవితంలోని వెలితిని పోగొడుతుంది. ఈమె తాను ఊహించుకుంటున్న కలల ప్రేయసి అని మధు అనుకొంటాడు. హఠాత్తుగా వాసంతి అతని జీవితం నుంచి, ఆ ఊరు నుంచి వెళ్ళిపోతుంది. దివాణంలో పనిచేసే గుమస్తా రామకృష్ణయ్యగారి కుమార్తె సీత, మధు చీకటి జీవితంలో మళ్ళీ దీపం వెలిగిస్తుంది.

ఆ సమయంలో కాలేజీ స్నేహితుడు నిత్యానందం ద్వారా విలాసిని నీలనాగిని పరిచయం అవుతుంది. ఆమెను మధు ఆరాధ్య సుందరిగా భావిస్తాడు. నీల ఆడది కాదని ఆమెకు నీడ మాత్రమేనని తెలుసుకుని మళ్ళీ నిర్వేదం పొందుతాడు. అప్పుడు సీత అతన్ని బిడ్డలా అక్కున చేర్చుకుంటుంది. సీత, మధులు ఒక్కటవటంతో చిత్రం సుఖాంతం అవుతుంది.

**నిర్మాణ విశేషాలు:**

భాగ్యరేఖ తర్వాత వాహినీ పతాకం క్రిందగాక, బయటి నిర్మాతలకు బి.యన్. రెడ్డి తీసిన చిత్రం *పూజాఫలం.* బయటివారికి తీసిన ఆఖరి సినిమా కూడా ఇదే. బి.యన్. రెడ్డి ఎంతో మనసుపడి తీసిన చిత్రం ఇది. మిత్రులతో జరిగిన ఇష్టాగోష్ఠుల్లో ఆయన ఎంతో అపురూపంగా మాట్లాడిన సినిమా, మధుపాత్రకు మొదటినుంచీ అక్కినేనినే అనుకున్నారు. బి.యన్. రెడ్డిని గౌరవించే అక్కినేనికి ఈ చిత్రం వరకు ఆయనతో పనిచేసే అవకాశం కలగలేదు. పరిశ్రమలో చేరిన నాటినుంచి, తనకంటె పెద్దవారయిన దర్శకులతో చనువుగా ఉంటూ, వారినుంచి ఎన్నో విషయాలను నేర్చుకునేవారు. 'ఆ తొలి రోజుల్లో దేవకీ బోస్ చిత్రాలు న్యూ థియేటర్స్ చిత్రాలను గురించి బి.యన్. రెడ్డి నాకు చెప్పేవారు. వీలయినప్పుడు ఆంగ్లంలోని క్లాసిక్స్ చూస్తుండమని, ఆంగ్ల భాష నేర్చుకోమని నాతో చెప్పేవార'ని అక్కినేని తన మధుర స్మృతులను వెల్లడించారు.

శాంతం, సహనం, ఆత్మాభిమానం త్రివేణీ సంగమంలా ప్రవహించే సీతగా సావిత్రి అభినయించారు. *నమ్మిన బంటు* (1960) చిత్రం విడుదలైన సందర్భంలో నటీనటులకన్నా ఈ మూగజీవాలే మిన్నగా నటించాయని చిత్ర నిర్మాతలు ఒక పోస్టర్ వేయించారు. ఈ ఉదంతం నాగేశ్వరరావు సావిత్రిలకు కొంత బాధ కలిగిందని ప్రచారం జరిగినా, పెద్దల జోక్యంతో అంతా సర్దుబాటయింది. ఇతర ముఖ్యపాత్రల్లో జమున, విజయలక్ష్మి, జగ్గయ్య, గుమ్మడి, రేలంగి, రమణారెడ్డి, రాజశ్రీ మొదలైనవారు నటించారు.

*మల్లీశ్వరి* తర్వాత, బి.యన్. రెడ్డితో 'రసాలూరు' రాజేశ్వరరావు ఈ చిత్రంలో పనిచేసి చక్కని కర్ణపేయమైన పాటలను అందించారు. డా. సి.నా.రె. రచించిన 'పగలే వెన్నెల.....' పాటను జానకి కమీనయంగా, రమణీయంగా పాడి శ్రవణానందం కలిగించారు. దేవులపల్లివారు వ్రాసిన 'నేరుతునో లేదో ప్రభూ...' 'నినుగానక ఎందుదాగున్నావో...' 'సుందర సురనందన వనమల్లి జాబిల్లి...' పాటలను సుశీల తన కమ్మని కంఠంతో ఆలపించి ప్రేక్షకులను మైమరపించారు. శీనయ్యగారి జావళి 'శివ దీక్షా పరురాలనిరా...' జానకి కంఠం నుండి జాలువారి రసజ్ఞులను అలరించింది. కథానాయకుని పాత్రకు వయొలిన్ వాద్యం పోరూరు గోపాలకృష్ణన్‌తో వినిపింపజేశారు.

*పూజాఫలం* చిత్రానికి యు. రాజగోపాల్ ఛాయాగ్రహకుడు. *మల్లీశ్వరి* సినిమాకు ఆయన, బి.యన్. రెడ్డి, కొండారెడ్డి, ఆదీ ఇరానీలను సహాయకుడిగా పనిచేశారు. ఎన్నో సొగసులు, సొబగులూ కూర్చి ఎంతో ముచ్చటపడి తీసిన *పూజాఫలం* 1964, జనవరి 1వ తేదీన కొత్త సంవత్సర కానుకగా విడుదలయింది. క్లాస్ ప్రేక్షకుల ప్రశంసలను పొందిన ఈ చిత్రం ఆర్థికంగా ఒకమాదిరి విజయం



సాధించింది. బి.యన్. రెడ్డి తీసిన పెక్కు చిత్రాలకు, జాతీయ, రాష్ట్రస్థాయి పురస్కారాలు లభించినా *పూజాఫలం* పురస్కారాలకు నోచుకోకపోవటం విమర్శకులను విస్మయపరిచింది. బి.యన్. రెడ్డి తెలుగు చలన చిత్ర కళ్యాణలక్ష్మిని సమర్పించిన ఒక పూజాపుష్పం *పూజాఫలం*.

**డా. పి. దక్షిణామూర్తి, తెనాలి. ఫోన్: 790 101 4749.**

---

# కినిమా

*– బి.కె. ఈశ్వర్*

దేశవిదేశాల్లో విశేషమైన పేరు సంపాదించిన *చందమామ* మాసపత్రిక శ్రీ విశ్వం (బి. విశ్వనాథరెడ్డి) సంపాదకత్వంలో 1966లో జులై సంచికతో ప్రారంభమైంది, సినిమా పత్రికల్లో, విలక్షణమైనదిగా, పేరుతెచ్చుకున్న 'విజయ చిత్ర', వెలువురించిన కొన్ని ప్రత్యేక సంచికలు సినిమా ప్రియులనేకాక సాహిత్యాభిమానులనూ అలరించాయి. అటువంటి ఓ ప్రత్యేక సంచికలో ప్రచురించిన *ఒక చిన్న నటుడి డైరి* అసాధారణమైన రచనగా అందరి ఆదరణనూ చూరగొన్నది. రచయిత శ్రీ దేవకీబోస్ (1898–1971) ప్రసిద్ధ వంగ దర్శకుడు. చండీదాస్, మీరాబాయి, బిద్యాపతి, శ్రీరామానుజ మొదలైన ప్రఖ్యాత చిత్రాలను రూపొందించారు. ఆయన దర్శకత్వం వహించిన *సీత* (1934) అంతర్జాతీయ చనలచిత్రోత్సవాల్లో పాల్గొన్న తొలి చిత్రమంటారు. ఈ చిత్రానికీ వెనిస్ ఫిలిం ఫెస్టివల్‌లో ఆనరరీ డిప్లొమా అందుకున్న దేవకీబోస్ తొలి అంతర్జాతీయ అవార్డును అందుకున్న భారతీయ దర్శకుడిగా ఖ్యాతినార్జించారు. మరోవిశేషం – ప్రసిద్ధ దర్శకులు బి.యన్. రెడ్డి రూపొందించన *బంగారు పాప* చిత్రం చూసి ముగ్ధులైన దేవకీబోస్ – ఆ చిత్రాన్ని 1958లో *సోనార్‌కథీ* పేరుతో బెంగాలీలో తీశారు.

రచయిత, దర్శకుడు దేవకీబోస్ రాసిన *ఒక చిన్న నటుడు డైరి* లో ఉన్న జూనియర్ ఆర్టిస్టుల పరిస్థితులు ఒకప్పుడు ఆ తర్వాత ఉన్నట్లే ఇప్పుడూ ఉన్నాయి. సాహితీ విలువల దృష్ట్యా కూడా విశేషమైన ఆదరణను చూరగొన్న ఈ రచనను 'విజయ చిత్ర' స్వర్ణోత్సవ సందర్భంగా మననం చేసుకోవడం సమంజసమే అవుతుంది.

## *ఒక చిన్న నటుడి డైరీ*

*– దేవకీ బోస్*

*అతను ఒక చిన్న వేషగాడు.*

*సినిమా భాషలో చిన్న నటుడు అంటే ఒక చిన్న వేషం (ఓ పెద్ద గుంపులో ఒకడిగా) వేసే వ్యక్తి అని అర్థం. అతని పేరు నాకు తెలియదు. కానీ అతని ముఖం మాత్రం నాకు బాగా పరిచితమైన ముఖం. నిజానికి నేనతని ముఖాన్ని ఎన్నడూ మర్చిపోలేనేమో అనుకుంటాను. అతను నన్ను చూడడానికి స్టూడియోకు, ఇంటికీ కూడా వస్తూ వుండేవాడు. వచ్చినప్పుడల్లా సతాయిస్తూ ఉండేవాడు. అతన్ని వదిలించుకోవడం అంటే మాటలు కాదు. నన్ను చూడడం అనవసరమని నేనతనికి ఏమీ చెయ్యలేననీ ఎన్నిసార్లో చెప్పాను. అన్నిసార్లూ అతను తలూపి వెళ్ళిపోయేవాడు. కొన్నాళ్ళకు మళ్ళీ ప్రత్యక్షం! నాకు విపరీతంగా కోపం వచ్చేది. అతని ఆ ప్రవర్తన చూస్తే.*



దేవకీ బోస్

*ఒకరోజు రాత్రి నేను పడుకోబోతుండగా అతను వచ్చాడు. నన్ను చూసి తీరాలని పట్టుబట్టాడు. నాకు ఒళ్ళు మండింది. అయినా తమాయించుకున్నాను. అతన్ని చూడక తప్పలేదు. నన్నలా డిస్టర్బ్ చెయ్యడానికి అతనికేం అధికారం ఉంది అని అడిగాను. అతను మాట్లాడలేదు – నాకు విసుగుపుట్టింది. అతను క్రిందటిసారి వచ్చినప్పటికంటే ఇంకా అసహ్యంగా ఉన్నాడు. అయినా అతను సినిమాలలో నటించాలని ఆశపడుతున్నాడు. సహనంగా మారుమాట్లాడకుండా అలా నుంచుని నా సహనాన్ని పరీక్షిస్తున్నాడు. వెళ్ళిపొమ్మని స్పష్టంగా చెప్పాను. అతను నన్ను పరీక్షగా చూశాడు. ఎదురు తిరుగుతాడేమోననిపించింది నాకు. కానీ హఠాత్తుగా అతని ముఖభావం మారిపోయింది. తను భోజనం చేసి రెండు రోజులయిందని, తన భార్యాబిడ్డా చావు బ్రతుకుల మధ్య ఉన్నారనీ అన్నాడు. ఈ కథ వినడం మామూలే. కానీ*

అతనిని వదిలించుకోవడానికి ఓ రూపాయి తీసి "ఇది తీసుకుని ఇక్కడి నుండి వెళ్ళు" అన్నాను.

"నేను ముష్టి అడగటంలేదు. నాకు పనికావాలి" అన్నాడతను.

"పని అడగడానికి ఇదా సమయం? నీకా సంగతి ఎన్నోసార్లు....."

"మరే" అనేసి అక్కడనుంచి వెళ్ళిపోయాడు అతను.

ఆ మర్నాడు ఉదయం మా ఇంట్లో పనిచేసేవాడు నాకు ఓ డైరీని తీసుకువచ్చి ఇచ్చాడు. బహుశా అది నిన్న రాత్రి వచ్చిన వ్యక్తిది అయివుండవచ్చును అని చెప్పాడు. ఆ డైరీ సొంతదారు ఎవరో తెలుసుకుందామని డైరీ తెరిచి చూశాను. పేరుగాని, చిరునామాగానీ కనిపించలేదు. ఆ డైరీని ఎక్కడైనా దాచమని అతని చేతికి ఇవ్వబోతుండగా నా చూపు మొదటి పేజీ కనపడింది. కొంతవరకు కుతూహలం చేతా, కొంతవరకు ఆ డైరీ సొంతదారు ఎవరు అని తెలుసుకుందామనీ ఆ పేజీలో ఉన్న విషయాన్ని చదివాను.

1942, జనవరి 1 – గురువారం
(ఇది ప్రింట్ చేసి వుంది)–
నేను గత ఆరుసంవత్సరాలుగా 'ఎక్స్‌ట్రా' దశ దాటలేదు. ప్రతి సంవత్సరం ఏదైనా మంచి పాత్ర దొరకకపోతుందా అన్న ఆశతోనే ప్రయత్నిస్తున్నాను. ప్రతి సంవత్సరమూ డైరెక్టర్లు మంచి వేషం ఇస్తాం అని వాగ్దానాలు చేస్తూనే ఉన్నారు. ఇంతవరకూ వారెవరూ వారి వాగ్దానాలని నిలబెట్టుకున్న పాపానపోలేదు. నేనసలు పెళ్ళిచేసుకుని ఉండకూడదు. ఏం చేసేది? అమ్మ బలవంతం చేసింది. మనవడిని చూస్తేగాని తన ప్రాణం పోదని అంటూవుండేది. అందుకే 1940 ఫిబ్రవరిలో నేను పెళ్ళి చేసుకున్నాను. కానీ ఏం లాభం? తన కోరిక తీరకముందే అమ్మ చనిపోయింది. అమ్మ కోరిక తీరకముందే అమ్మ చనిపోయింది. అమ్మ 1941 జూన్ నాలుగో తారీకున పోయింది. మాకు జులై 17న అబ్బాయి పుట్టాడు. నా భార్య, అమ్మ పోయినప్పుడు ఎంతో ఏడిచింది కాని, నాకు మాత్రం ఏడుపు రాలేదు. నేనెన్నడూ అమ్మని సుఖపెట్టలేదు. అమ్మకున్న కొద్దిపాటి సొత్తును కూడా తెగనమ్మేశాను.

ఈ ఏడైనా మంచి వేషం దొరికితే బాగుండును. భగవంతుడు నన్ను రేబని, ఖోకాని కాపాడాలి!

అసలు భగవంతుడన్నవాడు ఉంటే సంగతి.

(అంతవరకు చదివేసరికి నాలోని ఉత్కంఠ పెరిగింది. నెమ్మదిగా పేజీలు తిప్పసాగాను.)

జనవరి 2–
యఫ్.యస్. స్టూడియోకు డెరెక్టర్ సి.డి. గారిని చూడడానికి వెళ్ళాను. ఆయన అసిస్టెంటు, ఆయన చాలా పనిలో ఉన్నారని చెప్పాడు. ఆ రోజంతా స్టూడియోలోనే ఉండిపోయాను. సి.డి. నటీమణులతోటి మాట్లాడటం, నవ్వడం జోక్స్ వెయ్యడం అంతా బయటికి వినిపిస్తూనే ఉంది. అదేకాబోలు చాలా పనిలో ఉండడం!

జనవరి 13–
యల్.యమ్. గారు ఒక ఆరు రోజులపాటు పని ఇస్తానని చెప్పారు. ఒకరోజు పనికి పన్నెండణాలు – ప్రొడక్షన్ అసిస్టెంట్ ఇందులో పావలా చొప్పున లాగేస్తాడు. నేనసలు వాడికెందుకు డబ్బులియ్యాలి? ఇవ్వనే ఇవ్వను.

జనవరి 15–
కొత్త సంవత్సరంలో పనిచేసిన మొట్టమొదటిరోజు ఇవాళ.

అసిస్టెంట్ డెరెక్టర్ సెట్లో నన్ను పట్టుకుని తిట్టాడు. ఫూల్ అన్నాడు. ఏం చేస్తాం! అవన్నీ భరించాలి! వాడు నాకంటే పెద్ద ఫూల్ అనుకున్నాను. డైరెక్టర్‌గారికి బంధువు కాకపోయినట్టయితే వాడూ నా స్థానంలోనే ఉండేవాడు గదా!

జనవరి 16–
యం.సి.సి. స్టూడియో ప్రొడక్షన్ మేనేజరు పనుంటే తనే పిలుస్తాననీ ప్రతిరోజూ స్టూడియోకు రానక్కరలేదనీ గసిరి చెప్పాడు. తనే పిలుస్తాడట! వాళ్ళకేం అవసరం నన్ను పిలవడానికి!

జనవరి 19–
రేబ చెవి రింగులను అమ్మాను. పాపం – అవి రేబకి, అమ్మ ఇచ్చింది.

జనవరి 20–
కె.సి.ఐ. స్టూడియో లోపలికి వెళ్ళబోతుండగా ద్వారపాలకుడు హీరోయిన్ కారు వస్తున్నందువల్ల పక్కగా నుంచోమని కొంచెం మొరటుగా చెప్పాడు. ఆవిడతో ప్రొడ్యూసర్ యస్.యమ్.యల్. కూడా ఉన్నారు. వారికి వంగి నమస్కరించాను. అయితే వారు మాత్రం నన్ను చూడలేదు. అసలీ పెద్దవారంతా అంతే – నేనూ ఒక రోజు పెద్దవాణ్ణి కాకపోతానా!

స్టూడియో లోపలికి వెళ్ళబోతుండగా దర్వాన్ మోటుగా పక్కకి లాగేశాడు. నాకు కోపం వచ్చి ఎదిరించాను. అతను నన్ను కొట్టాడు. ఏం చేసేది? వాడు బలవంతుడు! నేను అన్ని విధాలుగానూ బలహీనుడిని. ఇంతలో సౌండ్ ఇంజనీర్ డి.యన్.డి. బయటికి వచ్చారు. నేను ఏడుస్తూ విషయం ఆయనకు చెప్పాను. ఆయన దర్వాన్‌ని విషయం ఏమిటని అడిగారు. వాడు ఆయనకి అంతా అబద్ధమే చెప్పాడు. నేను రోజూ వచ్చి అందర్నీ బాధపెడుతున్నానట. వాడి మాటలు విని ఆయన 'ఆహా' అనేసి వెళ్ళిపోయారు.

రేబా పరిస్థితి కొంత ఫరవాలేదు. కానీ ఖోకాకి జ్వరం వచ్చింది. ఆ దర్వాన్ మీద ఎలాగైనా పగ తీర్చుకోవాలి.

జనవరి 22–
రెండ్రోజులుగా నిద్ర లేదు – అతనిమీద పగ తీర్చుకోవాలి. కానీ ఎలా? రేబా ఎప్పుడో ఒకరోజు నేను గొప్పవాడినవుతానని, అప్పుడు తీర్చుకోవచ్చునీ అన్నది. కాని ఆ రోజు ఎప్పుడు వస్తుంది?

ఫిబ్రవరి 7
ఆరు రోజులు పనిచేసినందుకు నా బిల్లుపాసయింది – మొత్తం నాలుగు రూపాయలు! డైరెక్టర్ ఆర్.యన్.యన్. గారి దగ్గర మరో అవకాశం వచ్చింది. ఆయన పొగడ్తలకు ఉబ్బిపోతాడు. అంచేత ఆయన దగ్గరకు వెళ్ళడం సులభం. ఇంటివాడికి పదహారు రూపాయలు ఇచ్చాను. డిసెంబరు, జనవరి నెలలకు రేబ చెవి రింగులు అమ్మగా వచ్చిన డబ్బు అంతా అయిపోయింది.

ఖోకా రాత్రంతా ఏడుస్తూనే ఉన్నాడు. పాపం రోజురోజుకూ చిక్కిపోతున్నాడు.

ఫిబ్రవరి 8–
నాకు రావలసిన డబ్బు, వాళ్ళు ఇవ్వలేదు. ఇది ప్రొడక్షన్ అసిస్టెంట్ చేసిన పనే అయివుంటుంది. తిన్నగా వెళ్ళి ప్రొడ్యూసర్‌గారినే కలుస్తాను.

ఫిబ్రవరి 10–
ప్రొడ్యూసర్‌గారు నన్ను చూడడానికి నిరాకరించాడు. 'స్టూడియోకి వెళ్ళవయ్యా, ఆయనను ఇక్కడ చూడ్డానికి వీల్లేదు' అన్నాడు పనివాడు. ఏం చేసేది? తల పగిలిపోయేటట్లు ఉంది. అన్నీ కష్టాలే!

రేబా ఇవాళ రాత్రి ఉల్లాసంగా కనిపించింది. తెల్లవారురఘామున ఖోకా విపరీతంగా ఏడవడం మొదలుపెట్టాడు.

ఫిబ్రవరి 11–
ఖోకాకు మందులు కొనడానికి డబ్బు లేదని చెప్పింది రేబా. స్టూడియోకి పరుగెత్తి ప్రొడ్యూసర్ గదిలోకి చొరబడ్డాను. ఆయనకు కోపం వచ్చింది. 'ఇవాళ పెద్ద తారలకు డబ్బియ్యాలి. ఎక్స్ట్రాల సంగతి చూడ్డానికి నాకు టైము లేదు' అని అరిచాడు.

పెద్ద తారలు!

"నాకసలు నీ డబ్బే అక్కరలేదు. అది కూడా నీ పెద్ద తారలకే ఇచ్చుకో!" అందామనుకున్నాను.

మార్చి 14–
నెల్లాళ్ళు కష్టపడ్డాను.

యం.ఆర్.బి. ప్రొడక్షన్స్‌లో ఓ శవం వేషం వెయ్యడంవల్ల అనుకోకుండా ఓ పదిరూపాయలు వచ్చాయి. ఖోకా కొంచెం కోలుకున్నాడు. అయినా ఆరోగ్యం మాత్రం ఇంకా చిక్కలేదు. రేబా ఆరోగ్యం కూడా దెబ్బతింటోంది.

మార్చి 19–
డైరెక్టర్ డి.కె.వి.ని చూశాను. ఆయన బొంబాయి నుంచి తిరిగి వచ్చాడు. "పోయిన సంవత్సరం, తిరిగి రాగానే నాకు అవకాశం ఇస్తానని చెప్పారు" అని అడిగాను. ఆయన తనకు ప్రస్తుతం పనేం లేదనీ అంచేత తను అవకాశం ఇచ్చేందుకు అవకాశం లేదనీ అన్నాడు.

నేనింకా ఉండగానే, స్నానం చెయ్యడానికి వెళ్ళాలన్న మిషమీద గబగబా వెళ్ళిపోయాడు.

అన్నీ అబద్ధాలే... స్నానంట!

ఆయన ఈమధ్యే ఓ సినిమా ఒప్పుకున్న సంగతి నాకు తెలీదనుకున్నాడు!

మార్చి 30–
రేబా, ఖోకా, నేనూ మొత్తం ముగ్గురమూ చచ్చిపోయేటట్టు ఉన్నాం. డబ్బు లేదు. నగలూ లేవు. ఎక్కడా వేషంలేదు. అందరికీ లంచాలు కావాలి. డబ్బుగాని, పొగడ్తలుగాని లంచంగా ఇవ్వాలి. అందరి దగ్గరా అప్పులు చేశాను. ఇవాళ ఓ కాబూలీవాలా దగ్గర కూడా డబ్బు పుచ్చుకున్నాను.

ఏప్రిల్ 8–
కాబూలీవాలా ఇక డబ్బు ఇవ్వనని శుభవార్త చెప్పేశాడు!

ఏప్రిల్ 9–
డైరెక్టర్ కె.కె.సి. నన్ను బోలెడుమంది ఎక్స్ట్రాల ముందు అవమానపరిచాడు. మా వాళ్లలో కొందరు ఫక్కున నవ్వారు.

ఏప్రిల్ 10–
ఖోకాకు అకస్మాత్తుగా విపరీతమైన జబ్బుచేసింది. మందులు ఎక్కడ నుంచి తీసుకుని వచ్చేది?

భగవంతుడు లేడు.

ఏప్రిల్ 11–
ఖోకా పరిస్థితి అధ్వాన్నంగా తయారైంది. రేబా పరిస్థితి కూడా చాలా ఇదిగా ఉంది. రెండ్రోజులుగా ఆమెకు లంఖణాలే.

ఖోకాకు మందులు కావాలి... ఎలా?

ఏప్రిల్ 12–
ఇంటాయన పెళ్ళాం రేబాకు రెండు రూపాయలు అప్పిచ్చింది.

ఆ భగవంతుడు ఉన్నాడు.

ఏప్రిల్ 15–
ఖోకా.......

ఏప్రిల్ 16–
........అంతా అయిపోయింది.

ఏప్రిల్ 20–
ఇక ఇప్పుడు రేబా కూడా చనిపోతుంది.

ఆమెకు మెదడులో విపరీతమైన పోటువచ్చింది. ఆమె అలా బాధతో మెలికలు తిరిగిపోతుంటే నేను చూడలేను. నాకు డబ్బు కావాలి......

రేబా బ్రతకాలి.....

డబ్బుకోసం ఎవర్ని అడిగేది?

ఎక్కడ ముష్టెత్తను?

* * *

ఆ డైరీ ఇంకేమీ లేదు– అతను నా దగ్గరకు వచ్చినది ఆ రోజేగనక, ఆ డైరీలో అంతకన్నా ఇంకేమీ కనబడలేదు. ఆ డైరీ మూసివేశాను.

కాని "ఖోకా.... అంతా అయిపోయింది. రేబా బ్రతకాలి" అన్న మాటలు నాకింకా కనిపిస్తూనే ఉన్నాయి. ఆ డైరీ చదవగానే నాకు కళ్ళు చెమ్మగిల్లాయి. నే నతనికోసం అన్ని స్టూడియోలూ తిరిగాను. ప్రతి ప్రొడక్షన్ బోయ్‌నీ అతని గురించి అడిగాను. అందరికీ అతను తెలుసు. కానీ, అతను ఎక్కడుంటాడో ఎవరికీ తెలియదు.

మళ్ళీ అతను నాకు కనిపించనేలేదు!



# కులపతి అడివి బాపిరాజు

– రావినూతల సత్యనారాయణ

**భూమిక:**

కళలలోనే పుట్టి, కళలలోనే పెరిగి, కళలకు జీవితం అంకితం చేసి, కళాసేవలోనే కాలధర్మం చెందిన మహనీయుడు అడివి బాపిరాజు.

కథకుడు కవి కావడం, నవలా రచయిత చిత్రకారుడు కావడం వీటన్నిటా నిష్ణాతుడు నాట్య కోవిదుడు కావడం అరుదు. అయితే, బాపిరాజు కవీ, కథకుడూ, నవలా రచయిత, చిత్రకారుడు, నాట్యాచార్యుడు, నటుడూ! అన్నిటికన్నా మించి సహృదయ సార్వభౌముడు. వ్యత్యాసాలెరుగని సుందర సమాజం ఆయన ఆదర్శం. దానిని సాధించడంకోసమే ఆయన 1920లోనే జాతీయ సమరంలో పాల్గొని, కారాగార క్లేశం అనుభవించారు. తమ ఆదర్శాల వ్యాప్తి, కళాసందేశ విస్తృతి అవిచ్ఛిన్నంగా కొనసాగడానికి, ఆయనొక నూతన సాంప్రదాయం, శిష్యపరంపర నెలకొల్పారు. అందుచేతనే, నవ్య సాహిత్య పరిషత్తు ఆయనను కులపతిగా పేర్కొని తనను తాను సత్కరించుకొంది.

**బాపిరాజుగారి జీవిత విశేషాలు:**

బాపిరాజు పశ్చిమ గోదవరి జిల్లా భీమవరంలో 1895వ సంవత్సరం, అక్టోబరు నెల, 8వ తేది జన్మించారు. శ్రీమతి సుబ్బమ్మ, శ్రీ కృష్ణయ్యగారలు ఆయన తల్లిదండ్రులు. ఈ పుణ్యదంపతులకు ఇద్దరు పుత్రులు, ఐదుగురు పుత్రికలు. బాపిరాజు గారు రెండవ సంతానము. కృష్ణయ్య గారు కొవ్వూరు తాలుకా ఆఫీసులో "షరాబు" ఉద్యోగం చేసేవారుట. అందుచేత బాపిరాజుగారి బాల్యం కొవ్వూరులోనే గడిచింది. రాజుగారి ప్రాథమిక విద్య 1903లో కొవ్వూరులో ప్రారంభమైంది. హైస్కూలు విద్య భీమవరం, నర్సాపురం, విజయవాడ పట్టణాలలో జరిగింది. ఫిఫ్తుఫారం, స్కూలుఫైనలు క్లాసులు విజయవాడ శ్రీ కన్యకాపరమేస్వరి హిందు హైస్కూల్లో చదివారు. బాపిరాజుగారు చిన్న వయసునుండే పద్య రచన ప్రారంభించారు. శతావధానాలంటే చెవికోసుకునేవారు. తిరుపతి వెంకట కవుల ప్రభావం రాజు మీద బాగా వుంది. వారి శతావధానాలు ఎక్కడ జరిగినా పనికట్టుకుని వెళ్ళేవారుట. తిరుపతి వెంకట కవులకు ఏకలవ్య శిష్యులైనారు! నరసాపురంలో అయ్యప్ప అనే విద్యార్థిని జంట కవిని చేసుకొని అయ్యప్ప బాపిరాజు కవులు పేరుతో అవధానాలు చేశారు. ఆ తర్వాత బెజవాడ స్కూల్లో చదువుతున్న రోజుల్లో కొప్పవరపు సుబ్బారావు ఆయనకు జంటకవి అయ్యాడు. కొంత కాలానికి సుబ్బారావు తిరుపతి కవులకు ప్రత్యర్థులగు కొప్పవరపు కవుల పార్టీవాడై పోయినందున, బాపిరాజు ఒంటి కవి అయ్యారు. ఉన్నత విద్యకై బాపిరాజు రాజమండ్రిలోని ప్రభుత్వ కళాశాలలో చేరారు. ఆ కళాశాలకు ఆరోజుల్లో ఆస్వాల్డు కూల్డ్రే అనే బ్రిటీషు ప్రతిభాశాలి ప్రిన్సిపాలుగా వుండేవారు. ఆయన అనేక రంగాలలో ప్రతిభాశాలిగా పేరు గడించారు. విద్యార్థులకు విద్య బోధించడమే కాక, ఈత, పడవ నడపడం, గుఱ్ఱపు స్వారి, కొండ లెక్కడం, అడవుల్లో

తిరగడం, ఎక్కువ దూరం నడవడం, హాకీ, టెన్నీసువంటి ఆటలు ఆడడం, కవిత్వం, చిత్రలేఖనంవంటివన్నీ నేర్పేవారు. గోదావరి ఒడ్డుకు శిష్యుల్ని తీసుకు వెళ్ళి ప్రకృతి సౌందర్యాన్ని ఎలా తిలకించాలో చెప్పేవారు. పాపికొండలు, పట్టిసము ప్రాంతాలకు తీసుకెళ్ళి కళాసౌందర్యాన్ని దర్శింప జేసేవారుట! శిష్యులతో నాటకాలు వేయించే వారని ప్రసిద్ధి. కవితా గోష్టులు నిర్వహించి ఆ గోష్టులలో శిష్యుల చేత తమతమ స్వీయ కవితలను చదివించేవారట! మరుగుపడిన జానపద సాహిత్యాన్ని విద్యార్థులకు తేటతెల్లంగా విశదపరచేవారని ప్రతీతి. తీరిక దొరికినప్పుడల్లా కళా, సాహిత్య విషయాలు చర్చించేవారుట. కూల్డ్రేగారికి చిత్రకళ అంటే అపారమైన ప్రీతి. భారతదేశంలో ఉన్న అనేక శిల్పకళాక్షేత్రాలగు అజంతా, ఎల్లోరా, అమరావతి, హంపీ, భువనేశ్వరం, సాంచి, మహాబలిపురం మొదలైన అనేక పురాతన కళాక్షేత్రాలని శిష్యులతో సందర్శించే వారుట. తనప్రియ శిష్య బృందానికి చిత్రకళా రహస్యాలని చెప్పడమేకాక, సుప్రసిద్ధ చారిత్రక ప్రదేశాల్ని చూపించేవారని చెప్పుకుంటారు. సహజంగానే బాపిరాజు బహుముఖ ప్రతిభ కూల్డ్రేగాని ఆకర్షించింది. ఆయన ప్రియ శిష్యుడగుటయే కాక, అత్యంత సన్నిహితుడయ్యాడు. అడవి బాపిరాజు, దామెర్ల రామారావు, కవికొండల వెంకటరావు, వరదా వెంకటరత్నం, భమిడిపాటి కామేశ్వరరావు మొదలైన ప్రముఖు లందరూ కూల్డ్రేగారి శిష్యులే! కూల్డ్రేగారు శిష్యుల ప్రతిభా పాటవాలను పరిశీలించి, ఎవరు ఏయేకళలకు పనికి వస్తారో ఆయా కళలలో చేర్పించేవారు. బాపిరాజుతో గురువుగానేకాక, స్నేహితుడిగా, శిష్యుడిగా, ఆత్మీయుడుగా బంధువుగా వుండేవారుట! బాపిరాజు కూల్డ్రే దగ్గిర సర్వ చిత్రకళా మర్మాల్ని కూలంకుషంగా నేర్చుకున్నారు. కూల్డ్రే దొర బాపిరాజు జీవితాన్ని నందనవనంగా తయారు చేశారు. ఈ విషయాన్ని బాపిరాజు ఇలా చెప్పారు. “ఆయన శిష్యుడనై, ఆయనకు అంతేవాసినై నడచిన ఆ సంవత్సరాలు నా జీవితంలో అమూల్యమై వెలుగొందినవి. మట్టిముద్దలా వున్న నన్ను ఆయన ఒక అద్భుత కలశంగా మార్చినారు. కూల్డ్రే ఉత్తమ కవులు, ఉత్తమ చిత్రకారులు, యమునా గంగా స్వరూపమై నా యీ జీవితాన్ని ప్రయాగ చేశారు”. తొలకరి పీఠికలో కూల్డ్రే ఇలా వ్రాశారు. “అతడూ నేనూ భవభూతి చెప్పిన సమానధర్మంలోని వాళ్ళము... అతడు జానపద జీవితమన్నా, జానపద గేయాలన్నా చెవికోసుకునేవాడు. ఏ విషయంమీదైనా మధురాతి మధురంగా మాట్లాడేవాడు. పుట్టు కథకుడు... అతడు నాకు ఒక జాబులో వ్రాసిన సనాతన బ్రాహ్మణ వివాహ వర్ణనను నా *సౌత్ ఇండియన్ అవర్స్* అనే గ్రంథంలోని వివాహ ప్రకరణంలో కొంచెం హెచ్చు తగ్గుగా మక్కీకి మక్కీ ఎక్కించాను. నా రచనల్లో బాపిరాజు ఛాయలు అడుగడుగునా కనబడుతాయి. నా *సానెట్స్ ఆఫ్ ఈస్ట్ అండ్ వెస్ట్* అనే కావ్యంలోని ‘గోదావరి దరి మిత్రుడికీ’ అనే శీర్షిక క్రింద వున్న మొదటి పద్యం 1917వ సంవత్సర ప్రాంతంలో క్రిష్టమస్ కార్డుపై అతడు వ్రాసి నాకు పంపిన తెలుగు పద్యానికి ముక్కకు ముక్క అనువాదం...” అంటారు కూల్డ్రే. ఇలా వారి అనుబంధాన్ని వివరించే ఎన్నో సంఘటనలనుగూర్చి చెప్పవచ్చు. బాపిరాజు జీవితంలో కూల్డ్రేగారికి అత్యంత ప్రాధాన్యత వుంది. బాపిరాజు జీవితాన్ని కళామయం చేసిన గురువర్యులు ముగ్గురు: కూల్డ్రే, ప్రమోద్‌కుమార్ ఛటర్జీ, ముట్నూరి కృష్ణారావు. ఆయన కళాహృదయాన్ని మునుముందుగా కనిపెట్టి దానికి దోహదమిచ్చినవాడు కూల్డ్రే.. దానిని పెంచి పోషించినవాడు ప్రమోదకుమార ఛటోపాధ్యాయ, దానిని శాఖోపశాఖలుగా వృద్ధి చేసింది ముట్నూరి కృష్ణారావు.

బి.ఎ. రెండవ సంవత్సరము చదువుతుండగానే బాపిరాజుకి వివాహం జరిగింది. శిష్యుని పెండ్లికి గురువు కూల్డ్రే వచ్చి ఆశీర్వదించి, మంచి గంధంతో చేసిన రాధాకృష్ణ విగ్రహాన్ని పెండ్లి కానుకగా ఇవ్వడం చెప్పుకోతగ్గ విశేషం.

బాపిరాజు పట్టబద్రుడైన తరువాత, గాంధీజీ సిద్ధాంతాలకు ప్రభావితులై 1920లో జాతీయ కాంగ్రెస్‌లో చేరారు. అప్పటి నుండి ప్రతి కాంగ్రెసు సమావేశానికి హాజరయ్యేవారు. 1921లో మహాత్ముడు సహాయ నిరాకరణోద్యమాన్ని ప్రారంభించారు. గాంధి పిలుపుమేరకు బాపిరాజు సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నారు.

అరెస్టు అయ్యారు. అందరితోపాటు ఆయన కూడా జైలుకు వెళ్ళారు. రాజమండ్రిలో కొంతకాలం, కడలూరు జైలులో కొంతకాలం ఉన్నారు. ఒకేడు కారాగృహవాసం చేసి, బరస్సు కవి గీతాలు వరవడిగా తాను రచించిన అప్పటి పాటలన్నీ కలిపి *తొలకరి* అనే గ్రంథాన్ని ప్రకటించారు. జైలులో వున్న సమయంలోనే శాతవాహన కాలాన్ని చిత్రించే అద్భుత కథాకల్పనతో *హిమబిందు* అనే నవల వ్రాయనారంభించారు. అంతేకాదు, జైలర్లవీ, తన తోటి మిత్రులవీ పెన్సిలు స్కెచ్‌ల్ని వేశారు. నవలల్ని వ్రాసుకుంటూ, రాజకీయ, సాంఘిక మత కళాసాహిత్య వ్యాస ప్రసంగాలు చేస్తూ, బాపిరాజు తన జైలు జీవితం గడిపారు. జైలు నుండి విడుదల అయిన తర్వాత, బందరు జాతీయ కళాశాలలో శ్రీ ప్రమోదకుమర్ ఛటోపాధ్యాయ శిష్యునిగా చిత్రకళా విద్యార్థిగా జేరారు. ఛటర్జీ భారతదేశమంతా తిరిగి, అనేక కళాక్షేత్రాలు సందర్శించి, చిత్ర, శిల్ప రహస్యాల్ని ఆకళింపు చేసుకున్నారు. రేఖారచనలో ఆయన ఆరితేరిన కళాకోవిదుడు. ఆంధ్రజాతీయ కళాశాలలో ఛటర్జీగారు ఎంతోమంది యువ చిత్రకారుల్ని తయారు చేశారు. వీరిలో అడవి బాపిరాజు అగ్రగణ్యులు. ఛటర్జీ అంతేవాసిగా బాపిరాజు సంపూర్ణ చిత్రకారునిగా రూపొందారు. ఆధునిక ఆంధ్ర చిత్రకారుల్లో బాపిరాజుతో సరితూగగల మరోవ్యక్తి లేరేమో అన్నంత అద్భుతమైన చిత్రాల్ని లిఖించారు. అనేకమంది యువ చిత్రకారుల్ని ప్రోత్సహించి శిక్షణ కూడా యిచ్చారు. 1928లో న్యాయశాస్త్రం చదివే నిమిత్తం మద్రాసు వెళ్ళారు. 1931లో బి.ఎల్.లో పట్టభద్రులయ్యారు. తన స్వస్థలమైన భీమవరంలో కొంతకాలం న్యాయవాదిగా పనిచేశారు. కానీ న్యాయవాద వృత్తి ఆయనకు నచ్చలేదు. కొంతకాలం ఉద్యోగ ప్రయత్నాలు చేశారు. దొరికిన ప్రతి చిన్న ఉద్యోగాన్ని చేశారు. నాలుగు సంవత్సరాలు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురి అయ్యారు. ఇలావుండగా 1935వ సంవత్సరంలో బందరు జాతీయ కళాశాల ఆహ్వానం మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాలు పదవిని చేబట్టారు. ప్రిన్సిపాల్ పదవీ నిర్వహణ విషయంలో తన గురువైన కృష్ణారావుని మార్గదర్శకునిగా తీసుకుని ఎంతో సమర్థవంతంగా నిర్వహించి, జాతీయ కళాశాలను మంచి ఆదర్శవంతమైన కళాశాలగా తయారు చేశారు. బాపిరాజు లలిత కళలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారు. జాతీయ కళాశాలలో భారతీయ చిత్రలేఖన శాఖ ఒకటి నెలకొల్పి, చిత్రలేఖనంలో ఎంతోమంది శిష్యుల్ని తయారు చేశారు.

బాపిరాజువల్ల మేలుపొందిన హరిజన విద్యార్థులు ఎంతోమంది ఉన్నారు. వారిలో ప్రభాకర్ జోసఫ్, గుత్తి రామకృష్ణ, ఊట్ల కొండయ్య ముఖ్యులు. ప్రభాకర జోసఫ్ తర్వాత కాలంలో గాంధీజీ, వినోభాజీలకు అతి సన్నిహితుడై ప్రభాకర్‌జీగా పేరు తెచ్చుకున్నారు. బాపిరాజు జాతీయ కళాశాల ప్రిన్సిపాలుగా పనిచేస్తున్న రోజుల్లోనే సినీ పరిశ్రమలోనికి చిత్రకళా దర్శకునిగా ప్రవేశించారు. తెలుగు చలన చిత్రానికి కళాదర్శకత్వం వహించిన మొదటి ఆంధ్రుడు బాపిరాజు. అంతేకాక, మొదటి బాలల చిత్రానికి కళాదర్శకత్వం వహించిన ఘనత కూడా ఆయనకే దక్కింది.

ఈ చిత్రానికి బాపిరాజు తయారు చేసిన డిజైనులు అందరి మన్ననలందుకొన్నవి. బాపిరాజు కళాదర్శకత్వంలో సతీ అనసూయ, ధ్రువవిజయం, మీరాబాయి సినిమాలు విడుదలయ్యాయి. బాపిరాజు శిల్ప ప్రతిభ *మీరాబాయి* చిత్రంలో ప్రతిబింబిస్తుంది. ఈ చిత్రంలోని వైష్ణవాలయం దృశ్యం, శివాలయ దృశ్యం కళాకారుల ప్రశంసలందుకొన్నవి. బాపిరాజు స్వయంగా సినిమా తీయవలెనని ఎంతో ప్రయత్నించారని, అయితే, ఆయన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయని, ఎన్నో ఆశలతో ఏదో చేద్దామని సినిమా పరిశ్రమలో చేరారు కాని, ఆయన కోర్కెలు తీరలేదు. కాని, ఆ రంగంలో ఎందరో శిష్యుల్ని తయారు చేశారు. గులాం మహమ్మద్ కలకత్తావాలా నిజాం ప్రభుత్వాన్ని సమర్థించే ఉద్దేశ్యంతో రాజకీయ ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని *మీజాన్* దినపత్రికను స్థాపించారు. ఉర్దూ, ఇంగ్లీషు భాషల్లోనేకాక, తెలుగు భాషలో కూడా ఆ పేపరు ప్రచురించాలని తలపెట్టారు. *మీజాన్* తెలుగు పత్రిక సంపాదకత్వానికి బాపిరాజుని అడిగారు. బాపిరాజు ఈ సంపాదకత్వం అంగీకరించి హైదరాబాదు చేరుకున్నారు. *మీజాన్* తెలుగు పత్రికకు మూడున్నర సంవత్సరములు 1944 నుండి 1947 ఆగష్టు 7వ తేదీ

వరకు సమర్థతతో సంపాదకత్వం నిర్వహించారు. బాపిరాజు సంపాదకత్వంలో *మీజాన్* దినపత్రిక బహుళ ప్రచారం పొందింది. ఇంత విస్తరణ కలిగి బహుజనాదరణ పొందిన దినపత్రిక అప్పట్లో మరొకటి లేదని ప్రతీతి. దీనికి కారణం బాపిరాజు సంపాదకత్వమే! *మీజాన్* పత్రిక సంపాదకత్వం వహించకపోతే ఆయన సాహిత్యం మరుగునపడిపోయేదేమో?! తాను వ్రాసుకున్న *హిమబిందు*, *గోన గన్నారెడ్డి* మొదలైన నవలల్ని *మీజాన్* పత్రికలో సీరియల్‌గా ప్రచురించారు. అలాగే *మీజాన్*‌లో కొన్ని కథలు, నాటికలు, గేయాలు కూడా ప్రచురించారు. అంతేకాకుండా, యోగ్యులైన రచయితల్ని ఉపసంపాదకులుగా ఎన్నుకున్నారు. అందుచేతనే రాజకీయ పత్రికైన *మీజాన్* సాహిత్య రూపన్ని సంతరించుకుంది! గులాం మహ్మద్ కలకత్తావాలాకు బాపిరాజుపై అభిమానం గౌరవం పెరిగాయి. *మీజాన్* పత్రికకు సంపాదకుడిగా పనిచేసి తెలంగాణా తెలుగువారితో ఐక్యమై తెలంగాణా సాహితీ పరులకు సన్నిహిత బంధువైనాడు బాపిరాజు. తెలంగాణా చారిత్రక శిల్ప సాంప్రదాయాన్ని శోధించి ఆకళించుకొని, తెలంగాణా సిసలైన తెలుగుగడ్డ అని చాటి చెప్పారు. కారణాంతరాల వలన బాపిరాజు *మీజాన్* పత్రిక సంపాదకత్వానికి రాజీనామా ఇవ్వవలసి వచ్చింది. 1949లో తన కుమార్తెలైన రాధావసంత, ప్రేమకుమారీలకు వివాహాలు చేశారు.

1950 ప్రాంతంలో తెలుగు భాషా సమితి ఆధ్వర్యాన తయారు కాబోతున్న *తెలుగు విజ్ఞాన సర్వస్వాని*కి సాహిత్యం, భాషా, కళలు, విద్య మొదలగు విషయాలకు సంబంధించిన సంపుటానికి సమాచారం సమకూర్చడానికి ఉపసంఘంలో సభ్యుడిగా చేరారు.

తర్వాత కొంతకాలం పెదపావని రాణీలక్ష్మీదేవి కుమార్తెలకు సాహిత్య, చిత్రలేఖనాలలో శిక్షణ ఇస్తూ గడిపారు. 1951లో సింహళం వెళ్ళి సిగిరియా కుడ్య చిత్రాల ప్రతుల్ని తీసుకురావలసిందిగా అప్పటి మద్రాసు ప్రభుత్వం బాపిరాజుని కోరింది. బాపిరాజువెంట పిలకా లక్ష్మీనరసింహమూర్తి, కె. శ్రీనివాసులు, కోడూరి రామమూర్తి, మరియు రాంభట్ల కృష్ణమూర్తిగారలు సిగిరియా, (సింహళం) వెళ్ళారు. ఆ యాత్ర మద్రాసు పనుపున జరిగింది కనుక, సిలోన్ ప్రభుత్వం బాపిరాజుని ఘనంగా ఆహ్వానించింది. సిలోన్‌లో 15రోజులుండి, కుడ్య చిత్రాల ప్రతిరూపాలతో (కాపీలతో) తిరిగి మద్రాసు చేరుకున్నారు. కుడ్య చిత్రాలను మద్రాసు మ్యూజియంలో ప్రభుత్వం భద్రపరచింది. ఈ సిగిరియా చిత్రాల ప్రతులు బాపిరాజుకిగల చిత్రకళా ప్రావిణ్యాన్ని చాటుతాయి.

సిగిరియా నుండి తిరుగు ప్రయాణంలో బాపిరాజు ఒకరోజు కె. శ్రీనివాసులుగారి అతిథిగా వున్నారు. ఒక రాత్రి థియసాఫికల్ హైస్కూలులోని తెలుగు బాలబాలికలతో గడిపారు. బాపిరాజు తమ పాటలతోనూ, నృత్యాలతోను, విద్యార్థి, విద్యార్థులనేకాక, అచట సమావేశమైన తెలుగువారినందరినీ ఆనందపరిచారు. ఆనాడు సమవేశమైన విద్యార్థులలో ఈ వ్యాసకర్త కూడా వున్నారు. ఆ అనుభవం ఈ వ్యాసకర్త జీవితంలో మరువజాలనిది! ఆ తర్వాత కొద్ది నెలలకే 22-09-1952న బాపిరాజు స్వర్గస్థులయ్యారు. ఆంధ్రదేశం ఒక బహుముఖ ప్రజ్ఞాశాలిని కోల్పోయింది.

**బాపిరాజు రచనా ప్రస్థానం:**

తెలుగు సాహిత్య కేదారంలో బంగారు పంటలు పండించిన కృషీవలులలో బాపిరాజు ముఖ్యులు. పాత తరానికి చెందిన విద్యావంతులు పడిపడి చదివిన రచయితలలో అడివి బాపిరాజు అగ్రగణ్యులు. పాశ్చాత్య భాషా సంపర్కంవల్ల తెలుగు సాహిత్యానికి సంక్రమించిన నూతన సాహిత్య ప్రక్రియలన్నీ చేపట్టి అద్భుత రచనలతో తెలుగు సాహిత్యాన్ని పెంపొందజేసి, తనకై ఒక విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్న మనీషి అడవి బాపిరాజు. రచయితగా బాపిరాజు ప్రతిష్టకు పతాకమెత్తినది ఆయన నవలలు. వీటిలో ప్రత్యేక పోకడలు పొడగడతాయి. కళాపారీణుడగు ఆయన హృదయం ఆయన నవలలన్నిటా కనబడుతుంది. బాపిరాజు ప్రతిభావ్యుత్పత్తులకు, కథాకథన కౌశలానికి, సన్నివేశ కల్పనా చాతుర్యానికి, పాత్ర చిత్రణా ప్రతిభకు, శైలీమాధుర్యానికి వారి నవలలు ఉదాహరణలు. తెలుగు నవలా సాహిత్యంలో అవి మైలురాళ్ళు. బాపిరాజు పన్నెండు నవలలు వ్రాశారు. అందులో ఇదివరలో ముద్రితాలు తొమ్మిది. అముద్రితాలు మూడు.

**ముద్రిత నవలలు:**

*నారాయణరావు, తుఫాను, కోనంగి, నరుడు, జాజిమల్లి*. ఇవి సాంఘిక నవలలు. *హిమబిందు, గోన గన్నారెడ్డి, అడవి శాంతిశ్రీ, అంసుమతి*. ఇవి చారిత్రక నవలలు (ఈ తొమ్మిది సంపూర్ణ నవలలు. ఇదివరలోనే ముద్రితమైనవి). *మధురవాణి, శిలారథం, కైలాసేశ్వరుడు*. ఈ మూడు చారిత్రక నవలలు పూర్తి చేయకుండానే బాపిరాజు స్వర్గస్థులయ్యారు. అవి అముద్రితంగానే వుండిపోయాయి. అయితే, డా. దిట్టకవి శ్యామలాదేవి *మధురవాణి* నవలను పూర్తిచేసి, సంపూర్ణ నవలను ప్రచురించారు. అందువలన ప్రస్తుతం పది నవలలు ముద్రితమై లభించుచున్నవి.

**సాంఘిక నవలలు:**

బాపిరాజు రచించిన సాంఘిక నవలలో ప్రసిద్ధిగాంచిన రచన నారాయణరావు. ఇది పాత్ర ప్రధాన నవలగా ప్రశంసలందుకొన్నది. 1934వ సంవత్సరంలో ఆంధ్ర విశ్వకళా పరిషత్తువారు నిర్వహించిన నవలా రచన పోటీలో *నారాయణరావు*కు ఉత్తమ బహుమతి లభించింది. ఈ నవల *ఆంధ్రపత్రిక* దినపత్రికలో ధారావాహికంగా వెలువడింది (అయితే బాపిరాజు వ్రాసిన మొదటి నవల *హిమబిందు*). నారాయణరావు మొట్టమొదట ప్రచురితమైన నవల అయినందున దానిని రాజు తన తండ్రి కృష్ణయ్యకి అంకితమిచ్చారు. ఆ నవల కేంద్ర సాహిత్య అకాడమీవారి మెప్పును పొంది తమిళం, కన్నడం, మళయాళం, బెంగాలి, హిందీ, పంజాబీ మొదలగు ఇతర భాషలలోనికి అనువదించబడింది. అంతేకాదు, ఆ నవలను మద్రాసు, ఆంధ్ర విశ్వవిద్యాలయాలు పాఠ్య గ్రంథముగా నిర్ణయించుట గర్వకారణం.

*నారాయణరావు* నవల తెలుగునాటి జమిందారుల కథ. సమకాలీన ఆంధ్ర సామాజికుల సమస్యల్ని, భూకామందుల్ని, జమిందారి వ్యవస్థ నిర్మూలనాన్ని, ఆంధ్ర జాతీయ స్వాతంత్ర్యోద్యమాన్ని, గాంధీజీ సిద్ధాంతాల్ని చక్కగా ప్రతిబింబింపజేశారు రచయిత ఈ నవలలో. బాపిరాజు నవలలోని నాయకుడు మొదలు, తక్కిన పాత్రలంతా ఆయన పరిసరాలలో పరిచితులైన సజీవులే. నారాయణరావు ముష్టి లక్ష్మీనారాయణ అనే కాంగ్రేసు నాయకుడు! ఆయన వ్యక్తిత్వంలోని కొన్ని లక్షణాలను రచయిత నారాయణరవు పాత్రలో విలీనము చేశారు.

**తుఫాను:**

నారాయణరావు తర్వాత బాపిరాజు కలం నుండి వెలువడిన నవల *తుఫాను*. ఈ నవలను బాపిరాజు తమ ప్రియ స్నేహితుడైన కోలవెన్ను రామకోటేశ్వరరావుకి అంకితమిచ్చారు. ఈ నవలలోని ముఖ్యపాత్ర (నాయకుడు) శ్రీనాథమూర్తి. ఈ పాత్రను సృష్టించడంలో రాజు తమ గురువైన ప్రమోద్‌కుమార ఛటర్జీగారి జీవితాన్ని ప్రేరణగా గ్రహించారు. శ్రీనాథమూర్తి భార్య శకుంతల అకాల మరణానికి గురౌతుంది. భార్య మరణంతో శ్రీనాథమూర్తి జీవితంలో పెనుతుఫాను చెలరేగుతుంది. ఆ తుఫానులో శ్రీనాథమూర్తి పడే ఆవేదన వర్ణనాతీతం! తుఫాను కథా కథనం Flash back పద్ధతిలో నడుస్తుంది. ఈ నవలలోని కథలో బాపిరాజు అత్యంత చాకచక్యాన్ని చూపించారు. ఈ నవలలోని పాత్ర హేమకుసుమ సుందరి అనే అమ్మాయి నిశాపతి, కల్పమూర్తి, తీర్థమిత్రుడు, త్యాగతి అనే నలుగురు పురుషులతో స్నేహం చేస్తుంది. సినిమాలకు, షికార్లకు, వినోదాలకు అందరూ కలసి వెళ్తారు. అయితే ఈ నలుగురు పురుషులూ హేమను గాఢంగా ప్రేమిస్తారు! ప్రతి ఒక్కడూ హేమను తనదానినిగా చేసుకోవాలని ఆశిస్తారు. అయితే, హేమ మనస్సు అందరినీ ఆకర్షించినప్పటికీ, వారిలోని ఏదో ఒక లోపం ఆమె ప్రేమకు అవరోధాన్ని కలిగిస్తుంది. అందువలన వారి ప్రేమ కేవలం స్నేహంగానే మిగులుతుంది! రచయిత ఈ కథను అత్యంత నైపుణ్యంతో తీర్చిదిద్ది పాఠకుల అభిమానాన్ని చూరగొన్నారు.

**కోనంగి:**

ఆడవి బాపిరాజు ఎంత హాస్యప్రియులో ఆయన కోనంగి నవల తెలియజేస్తుంది. “సమస్యల అగ్నిగుండాలలో చిక్కుకుని వేడెక్కిన ప్రతిమనిషీ పన్నీటిజల్లులాంటి హాస్యాన్ని పైన కుమ్మరించుకోవల్సిన ఆవశ్యకతను ఈ నవల నొక్కి చెబుతుంది” (డా. కసిరెడ్డి వెంకటరెడ్డి). సర్వజ్ఞతని సంతరించుకున్న కోనంగేశ్వరరావు (కోనంగి) పాత్రలో బాపిరాజు వ్యక్తిత్వ ఛాయలు సాక్షాత్కరిస్తాయి.

జాతీయోద్యమ ప్రభావంతో రచింపబడిన నవల కోనంగి. కథంతా మద్రాసు నగరం చుట్టూ తిరుగుతుంది. ఆనాటి మద్రాసు రాజకీయాల్ని చక్కగా ప్రతిబింబింపజేశారు రచయిత.

కోనంగి మద్రాసులో *నవజ్యోతి* పత్రిక స్థాపిస్తాడు. ఆ పత్రికకు కోనంగే సంపాదకుడు. *నవజ్యోతి* పత్రిక బ్రహ్మాండంగా నడుస్తుంది. పత్రికద్వారా అనేక విషయాలపై, ముఖ్యంగా ఆనాటి రాజకీయలపై కోనంగి వ్రాసిన సంపాదకీయాలు ప్రముఖుల ప్రశంసలందుకొన్నవి. *కోనంగి* నవల ఒక విజ్ఞాన సర్వస్వం. శృంగారాన్ని – చమత్కారన్ని రంగరించి ఆంధ్ర నవలా పాఠక లోకానికి బాపిరాజు అందించిన అమృతం! నవల సుఖాంతంగా ముగుస్తుంది.

**నరుడు:**

గాంధీజీ సిద్ధాంతాలకు లోనైన బాపిరాజు హరిజనోద్ధరణను మనసులో పెట్టుకుని ఈ నవలను వ్రాశారు. అగ్రవర్ణాలవారు, తమకన్నా తక్కువ కులాలవారిని ముఖ్యంగా హరిజనుల్ని ఏవిధంగా అణగత్రొక్కేవారో *నరుడు* అనే నవలలో విపులంగా చిత్రితమైంది. హరిజనుడైన ఎల్లమంద అనేక కష్టాలకు లోనైనా, తన స్వయం కృషితో విదేశాలకెళ్ళి ఉన్నతవిద్యనభ్యసించి, విద్యావంతుడై డా. జెన్నీఫర్‌ను వివాహం చేసుకుంటాడు. ఏ కులానికి చెందినవాడైనా, ప్రతి మానవుడూ, నరుడే అన్న అభిప్రాయాన్ని ఈ నవల ద్వారా వ్యక్తం చేశారు రచయిత బాపిరాజు. ఈ నవలను డా. చెన్నాప్రగడ సుబ్బారావుకి అంకితమిచ్చారు బాపిరాజు.

**జాజిమల్లి:**

పువ్వులను చూస్తే ఆనందమే అందరికీ! పువ్వులు జన్మచాలించి పూబోడులై పుడతాయా? తెలియదుకాని, *జాజిమల్లి* నవల నాయిక పద్మావతికి మాత్రం జాజిపువ్వులంటే మహాయిష్టం. పువ్వులను చూచినప్పుడు ఆమె తనను తాను మరచిపోతుందట! అందుకే ఈ నవల పేరు *జాజిమల్లి* అని పెట్టారు రచయిత. ఈ నవలను భారత పురోభివృద్ధికి పురుషులతో సమభాగం పంచుకొని ముందంజవేస్తున్న ఆంధ్ర స్త్రీసమాజనికి అంకితమిచ్చారు బాపిరాజు! ముదావహం!

**చారిత్రక నవలలు:**

బాపిరాజు చరిత్ర వ్రాయకపోయినా, నవలల్లో, కథల్లో చరిత్ర వ్రాసి, చారిత్రక విషయాలను చొప్పించి మన కళ్ళకు కట్టినట్లు వర్ణించారు. ఆంధ్రుల చరిత్రను ఆధారంగా చేసుకొని మొదట నవలలు వ్రాసిన ఘనత బాపిరాజుకే దక్కుతుంది. ఆయనకు ఆంధ్రులపట్ల, ఆంధ్రచరిత్ర, సంస్కృతులపట్లగల గౌరవం అపారం. ఆంధ్రుల శౌర్యాన్ని, ధీరత్వాన్ని ఆయన నవలల్లో చక్కగా చిత్రీకరించారు. బాపిరాజు రచించిన పది నవలలో అయిదు నవలలు చారిత్రకాలే! ఆ అయిదు నవలలు ఆంధ్రుల ఐదుకాలాలకు చెందినవి. *హిమబిందు* శాతవాహనుల చరిత్రను, *అడవి శాంతిశ్రీ* ఇక్ష్వాకుల కాలాన్ని, *అంశుమతి* చాళుక్యుల చరిత్రను, *గోన గన్నారెడ్డి* కాకతీయ వైభవాన్ని, *మధురవాణీ* తంజావూరు నాయక రాజుల జీవిత విశేషాలను పాఠకులకు పరిచయం చేస్తాయి.

**హిమబిందు:**

బాపిరాజు వ్రాసివ మొదటి చారిత్రక నవల *హిమబిందు*. ఇది ఆంధ్రశాతవాహన కాలానికి సంబంధించినది. ఈ నవలలో ఆనాటి ఆంధ్రుల సంస్కృతికి, జనజీవన విధానానికి, రాజకీయపు యుక్తులకు, కుయుక్తులకు, మతమౌఢ్యానికి అద్దం పట్టే విధంగా రచింపబడింది. నవల చదువుతున్నంతసేపూ పాఠకుడికి తాను కూడా ఆనాటి సంఘంలో ఒకడై జీవిస్తున్న అనుభూతి కలుగుతుంది. బాపిరాజు అద్భుతసృష్టి *హిమబిందు*. ఆయన అమృత హృదయమే *హిమబిందు*గా రూపొందిందన్న భావాన్ని విజ్ఞులు వెల్లడించారు. నవలలోని పాత్ర చిత్రణ ఆకర్షణీయంగా రూపొందింది.

**అడవిశాంతిశ్రీ:**

ఈ నవల ఇక్ష్వాకుల కాలానికి సంబంధించినది. శాతవాహనుల పతనానంతరము చక్రవర్తులైన ఇక్ష్వాకుల చరిత్రను తెలిపే ఉత్తమ నవల *అడవిశాంతిశ్రీ*. ఈ నవలలో బాపిరాజు బౌద్ధ వైదిక పరమైన మతస్పర్థల్ని కళ్ళకు కట్టినట్లుగా వర్ణించారు. బౌద్ధమతాన్ని గురించిన అనేక విషయాలు, వారి సభ్యతా సంస్కారాలు ఈ నవల ద్వారా పాఠకులు తెలుసుకొనగలుగుతారు.

**అంశుమతి:**

ఈ నవల చాళుక్యుల కాలానికి చెందినది. వాతాపి సామ్రాట్టు పులకేసి పృథ్వీ వల్లభ మహారాజు, తన రెండవ తమ్ముడైన కుబ్జవిష్ణువర్ధనుని తూర్పు చాళుక్యాంధ్ర సామ్రాజ్యం స్థాపించటానికి అనుమతిస్తాడు. అన్న ఆజ్ఞ మేరకు కుబ్జవిష్ణువర్ధనుడు విజయ యాత్రను జరిపి, వేంగి రాష్ట్రపతి విష్ణుకుండిన మంచన భట్టారిక మహారాజు ఏకైక పుత్రిక అంశుమతీ దేవిని వివాహమాడటం ఈ నవలలోని ఇతివృత్తం! శ్రీ ఆంధ్రసామ్రాట్టు వేంగి మహానగర స్వామి, మహరాజు మంచన భట్టార దేవుని ఏకైక పుత్రిక అంశుమతీ కుమారి. పదునెనిమిది వత్సరముల ఎలప్రాయముననున్నది. ఆ బాలిక లోకోత్తర సుందరియని ప్రసిద్ధిగాంచినది! కుబ్జవిష్ణువర్థనుడు ఆమెను వివాహం చేసుకుంటాడు. కుబ్జవిష్ణువర్థనుని విజయ యాత్రలతోసహా, అమంశుమతి ప్రణయ విశేషాలు ఈ నవలలో చక్కగా చిత్రితమైనవి. చాళుక్యుల కాలానికి సంబంధించిన చారిత్రక అంశాలు అతిచక్కగా వ్యక్తపరచారు బాపిరాజు ఈ నవలలో.

**గోనగన్నారెడ్డి:**

ఈ నవల రుద్రమదేవి పరిపాలనా కాలాన్ని చిత్రిస్తుంది. రుద్రమదేవుడు పురుషుడు కాదు స్త్రీ అన్న రహస్యము రాజ్యం నలుమూలలా వ్యాపిస్తుంది. అంతేకాదు, అప్పటివరకూ తనకు తాను బాలుడిగా భావించుకొనిన రుద్రమకు తనలోని స్త్రీత్వం అనుభూతి సామంత రాజైన వీరభద్రుని ప్రేమలో పడేటట్లు చేస్తుంది! అదే సమయంలో ఓరుగల్లు కోటని ఆక్రమించేటందుకు యుక్తులూ, కుయుక్తులూ మొదలవుతాయి. ఆ తరుణంలో రుద్రమదేవికి అండగా వృద్ధుడైన మంత్రి శివయ్యదేశికులూ, గోన గన్నారెడ్డి (గజదొంగ, ఈ నవల నాయకుడు) నిలుస్తారు. గోన గన్నారెడ్డి స్వతహః మంచివాడు. అతని పినతండ్రి లకుమయారెడ్డి మోసంతో తనకు చెందిన సామంత రాజ్యాన్ని అపహరించినందున కొంతమంది యువకులను చేరదీసి, వారికి యుద్ధవిద్యలు నేర్పించి, కాకతీయ సామ్రాజ్యన్ని యెదిరించే సామంత రాజులపై తన ప్రతిఘటన చర్యలు మొదలెడతాడు. గణపతిదేవ చక్రవర్తి మరణాంతరం, రాజ్యంపై పెరిగిన దండయాత్రలకు యెదురు నిలిచి కాకతీయ సామ్రాజ్యానికి రక్షణ కవచంగా నిలబడుతాడు! యుద్ధాలు, ఒప్పందాలు, మధ్యమధ్యలో ప్రేమాయణాలతో కథ సాగిపోతుంది! కాకతీయ పాలనాన్ని, ఆనాటి సాంఘిక, సాంస్కృతిక స్థితిగతులను కళ్ళకు కట్టినట్టు చక్కగా చిత్రించారు రచయిత బాపిరాజు ఈ నవలలో! ఆంధ్రుల చరిత్రపై ఆసక్తికలవారంతా తప్పక చదవదగిన గొప్ప రచన ఇది.

**బాపిరాజు అసంపూర్ణ నవలా త్రయం:**

బాపిరాజు అకాల మరణం కారణాన వారి నవలలు *మధురవాణి, శిలారథము, కైలాసేశ్వరుడు* మొదలగు మూడు నవలలు అసంపూర్ణంగా ఉండిపోయాయి.

**మధురవాణి:**

బాపిరాజు *మీజాన్* దినపత్రికకు సంపాదకుడుగా ఉన్న రోజులలో *మధురవాణి* నవలను వ్రాశారు. వ్రాసినంతవరకు (120 పేజీలు) *మీజాన్* పత్రికలో ముద్రితమైనది. తంజావూరు నాయక రాజుల్లో పేరు ప్రఖ్యాతులార్జించిన మహారాజు రఘునాథ నాయకుడు. రఘునాథ నాయకుడు వీరుడు బహుభాషా కోవిదుడు, మధుర కవి, సంగీత నాట్య శాస్త్రాలలో ద్రష్ట; రసజ్ఞుడు. ప్రముఖుడైన రఘునాథ నాయకుని చరిత్రకు సంబంధించిన నవల ఇది. రఘునాథ నాయకుని ఊరేగింపుతో నవల ప్రారంభమౌతుంది. కథంతా రఘునాథ నాయకుడు, మధురవాణి పాత్రల చుట్టూ తిరుగుతుంది. కనుల పండుగగా ఊరేగింపు జరుగుతుంది. గురువుగారైన గోవింద దీక్షితుల ఇంటి ముందు ఏనుగు ఆగుతుంది. ఆ సమయంలో రఘునాథ నాయకునికి హారతివ్వటానికి ఎంతోమంది బాలికలు వస్తారు. అపురూప సౌందర్యవతైన చెంచులక్ష్మిని యువరాజు చూచి ముగ్ధుడౌతాడు. చెంచులక్ష్మి కూడా యువరాజుని చూచి ఆకర్షితురాలౌతుంది! చెంచులక్ష్మి వేశ్యసంజాత, అమె తల్లి మరకతవల్లి. రఘునాథ నాయకుని మేనమామ మారెప్ప నాయకుని ప్రియురాలు. మరకతవల్లి, మారెప్ప నాయకునికి పుట్టిన అందాల కల్పవల్లి చెంచులక్ష్మి. అంటే రఘునాథ నాయకునికి మరదలౌతుంది! చెంచులక్ష్మి గోవింద దీక్షితుల శిష్యురాలు. ఆయన దగ్గర సంగీతం,

నాట్యం, కవిత్వం మొదలైన విద్యలు నేర్చుకుంటుంది. రఘునాథ నాయకుడు కూడా గోవిందదీక్షితుల శిష్యుడే! ఒకనాడు చెంచులక్ష్మికి పాఠాలు చెబుతుండగా అక్కడికి అతడు వస్తాడు. గురువు చెంచులక్ష్మిని ఆయనకు పరిచయం చేస్తారు. ఆమెను బహుభాషా కోవిదురాలని మెచ్చుకొని రఘునాథ నాయకుడు ఆమెకు ముత్యాల హారాన్ని బహుకరిస్తాడు. అప్పటికే రఘునాథ నాయకునికి కళావతి, రామభద్రాంబ అనే యిద్దరు భార్యలున్నారు. చెంచులక్ష్మిని మోహించి మూడవ భార్యగా స్వీకరించాలని తలచి, అప్పటి నుండి చెంచులక్ష్మిని మధురవాణి అని పిలుస్తాడు. వీరిరువురి ప్రణయానికి, పరిణయానికి రగం సిద్ధం చేశారు బాపిరాజు. అయితే, వారి అకాల మరణంతో ఆరచనకు అంతరాయం కల్గింది.

రఘునాథ నాయకుడు మధురవాణిని శాస్త్రరీత్యా, ధర్మబద్ధంగా వివాహం చేసుకొనడానికిగాని, భోగపత్నిగా స్వీకరించడానికి ఆయన వృద్ధమంత్రి గోవిందముఖి దీక్షితులు ఏవో రాజకీయాలు, ప్రజా శ్రేయస్సు అంటూ అడ్డు చెప్తాడు. అందుచేత ప్రయత్నం ఆగిపోతుంది. ప్రణయమూ, కవిత్వమూ, కళలూ వారి బ్రతుకులే అయ్యాయి. మధురవాణి రఘునాథ రాయల వారి ఆస్థాన కవయిత్రి, కనకాభిషేకం చేయించుకున్న దిట్ట! మధురవాణి, రఘునాథ నాయకుని పాత్రలను ఈ విధంగా మలచి పోషించి నవలా పూరణ సొంపుగా నిర్వహించారు డాక్టరు దిట్టకవి శ్యామలాదేవి.

**శిలారథం:**

విజయనగర సామ్రాజ్యపతి శ్రీకృష్ణదేవరాయల కాలానికి సంబంధించిన చారిత్రక నవల *శిలారథము*. ఇది ప్రారంభములోనే ఆగిపోయింది. ఈ నవలను గురించి బాపిరాజు తన నోటుబుక్కులో సంగ్రహంగా వ్రాసుకున్నారు. ఆ కథ ఈ విధంగా వుంది.

పరిమళ రంగనాయకుడు శ్రీకృష్ణదేవరాయల సామంతుడు. రంగనాయకుని కుమారుడు చెన్నకేశవ నాయకుడు. అతడు చిన్నప్పటి నుండి తండ్రితో యుద్ధాలకు వెళ్ళేవాడు. ఒకసారి ఉమ్మత్తూరులో యుద్ధం జరుగుతుంది. ఆయుద్ధంలో శ్రీకృష్ణదేవరాయలకు అంగరక్షకుడిగా పరిమళ రంగనాయకుడు ఉంటాడు. అతడిని ఇమ్మడిచొక్క నాయక ఒడయార్ దొంగచాటుగా చంపుతాడు. తన తండ్రిని చంపిన ఒడయార్‌పై కక్షతీర్చుకోవాలని చెన్నకేశవ నాయకుడు నిశ్చయించుకుంటాడు. అంతేకాక, ధర్మయుద్ధంలో చంపుతానని విఠల దేవాలయంలో శిలారథంవద్ద ప్రతిజ్ఞ చేస్తాడు. అన్నప్రకారం చెన్నకేశవ నాయకుడు ముఖాముఖీ పోటీలో ఇమ్మడిచొక్కనాథ ఒడయార్‌ని చంపుతాడు. దీంతో చెన్నకేశవ నాయకుని కసి తీరుతుంది. ప్రతిజ్ఞ నెరవేరుతుంది. కథ ముగుస్తుంది.

**కైలాసేశ్వరుడు:**

విశ్వబ్రాహ్మణ వంశస్థుడైన బాలశిల్పి లోకేశ్వరాచార్యుని వంశవర్ణనతో *కైలాసేశ్వరుడు* నవల ప్రారంభమౌతుంది. ఆంధ్రచాళుక్య సామ్రాజ్యంలో పేరుప్రతిష్టలార్జించిన ఉత్తమ శిల్పి నాగమాచార్యుడు. నాగమాచార్యుల కుమారుడు లోకేశ్వరాచార్యులు. అతడు తండ్రివలే ఉత్తమ శిల్పి. లోకేశ్వరాచార్యునికి అపర్ణాదేవి విగ్రహం చేయాలని కోర్కె. రాష్ట్రకూట కృష్ణమహారాజు రాజనీతి చతురుడు. సర్వదక్షిణాపథానికి రాష్ట్రకూటులు మాత్రమే చక్రవర్తులుగా వుండాలని అతని కోరిక! మిగతా వివరాలు నవలా రూపంలో వ్రాయకుండానే బాపిరాజు పరమపదించారు.

ఇదీ, స్థూలంగా బాపిరాజు నవలా రచనా ప్రస్థానం. ఆయన నవలలు కథాకథన కౌశల్యానికి, ఆదర్శపాత్ర చిత్రణా నైపుణ్యానికి, సన్నివేశ కల్పనా చాతుర్యానికి, శైలీమాధుర్యానికి, భావనాసుందర ప్రాబల్యానికి పేరెన్నికగన్నవి. "బాపిరాజు ధర్మం నిర్వచించునపుడు ధర్మవేత్తయై, యుద్ధములు వర్ణించునెడల సమరశాస్త్ర విశారదుడై, ప్రేమికుల సంభాషణలలో రసమూర్తియై, శిల్పచాతుర్యం నుగ్గడించువేళ శిల్పియై, గానం పాడించునెడల గాయకుడై, శాస్త్రచర్చలు సలుపు నెడల సకల శాస్త్రవేత్తయై, పాత్రోన్మీలన వేళలలో సహృదయుడై, మొత్తంమీద నవలా రచనయందు మహాకవి అయినాడు" అంటారు కురుగంటి సీతారామయ్య.

**బాపిరాజు కథలు:**

బాపిరాజు ప్రసిద్ధ కథారచయిత. ఆయన దాదాపు

44 కథల్ని వ్రాశారు. వీరి వొక్కొక్క కథా వొక్కొక్క కళాఖండం. *అంజలి, తరంగిణి, మాలికానృత్యం, భోగీరలోయ, రాగమాలిక, వింధ్యాచలం* అనే పేర్లతో ఆరు సంపుటాలుగా ప్రచురితమైనవి. బాపిరాజు కథల్ని నాల్గురకాలుగా విభజింపవచ్చు: కాల్పనిక కథలు, వాస్తవిక కథలు, పిల్లల కోసం వ్రాసిన కథలు, చారిత్రక కథలు. వారి కథలలో మనకు కొట్ట వచ్చినట్లు కనిపించేది ఆయన వస్తు వైవిధ్యం. ఆయన కథ ఎత్తుగడలు ఆకర్షణీయంగా ఉంటాయి. ఆయన కథల ప్రారంభం పాఠకులకు ఉత్కంఠతను కలిగించే విధంగా ఉంటుంది. సాధారణంగా బాపిరాజు కథలలోని పాత్రలు ఎక్కువగా కళాజగత్తుకు చెందిన కళామూర్తులు, సర్వవిద్యా పరిపూర్ణులు. అలాగని తక్కినవారిని పాత్రలుగా గ్రహించలేదని కాదు. ఆయన హృదయం సువిశాలమైనది. అన్ని వర్గాల వారిని పాత్రలుగా స్వీకరించారు. బిచ్చగాళ్ళను, అంధుల్ని, అనాథల్ని, పశులకాపరుల్ని, ఉప్పరుల్ని పాత్రలుగా స్వీకరించి కథలు వ్రాశారు. బాపిరాజు కథలలో గాంధీజీ సిద్ధాంతాలకు ప్రభావితమైన పాత్రలు కొన్ని ఉన్నాయి.

బాపిరాజు కథలన్నీ ఇంచుమించు సుఖాంతాలే! ప్రతి కథా అందంగా, ఆహ్లాదంగా ముగుస్తుంది. బాపిరాజు శైలి హృద్యంగా వుంటుంది. ఆయన శైలిలో సౌందర్యం, సౌకుమార్యం రెండూ చోటుచేసుకుంటాయి. ప్రతిచిన్న విషయాన్ని నగిషీలు చెక్కుతూ చక్కగా వర్ణిస్తారు. తెలుగు కథా సాహిత్యంలో బాపిరాజులా వర్ణనలు చేసినవారు లేరంటే అతిశయోక్తి కాదు. బాపిరాజు తన కథల్లో పాత్రోచిత భాషను ప్రయోగించి, పాత్రలకు తద్వారా కథలకు సహజత్వాన్ని సిద్ధింప చేశారు. వీరిభాష సరళంగా కమనీయంగా ఉంటుంది. ఆయన కథల్లో *శైలబాల, బొమ్మలరాణి, భోగీరలోయ, నాగలి, తిరుపతికొండ, సంధ్యానృత్యం, సోమసుత, సూర్యసుత, నేలతల్లి* మొదలగునవి గొప్ప కథలని పేరుపొంది ప్రశంసలందుకొన్నవి. ఈ కథలన్నీ కన్నడం, హిందీ, బెంగాలి, పంజాబీ, ఇంగ్లీషు మొదలగు అనేక భాషలలోకి అనువదించబడి, పాఠకుల మన్ననలందుకొన్నవి. మస్తి వెంకటేశ్ అయ్యాంగారివంటి కన్నడ రచయిత బాపిరాజు రచనలవైపు ఆకర్షితుడై కన్నడంలోకి అనువదించారని తెలుసుకొనుట తెలుగువారికి గర్వకారణం!

**బాపిరాజు కవితలు:**

బాపిరాజుకి చిన్నవయసు నుంచే గేయాలు వ్రాయడం అలవాటు. తాను వ్రాయడమేకాక, తన చుట్టూవున్న యువకులను ఆకర్షించి, వారిచేత కూడా వ్రాయిస్తూ వుండేవారట! బాపిరాజు గేయ కవిత్వంలో ప్రత్యేకత సంపాదించారు. నవ్య సాహిత్యంలో బసవరాజు అప్పారావు, బాపిరాజు, నండూరి సుబ్బారావు గేయ కవిత్రయంగా పేరుగాంచారు. బాపిరాజు 16 గేయ సంపుటాల్ని వ్రాశారు. అందులో కొన్ని సంపుటాలు మాత్రమే ముద్రణకు నోచుకున్నవి. *తొలకరి* 1922లోనూ, *గోధూళి* 1938లోనూ, *శశికళ* 1954లోనూ ముద్రించబడినవి. *తొలకరి* సంపుటాన్ని *ఆంధ్రపత్రిక* ముద్రణాలయంవారు 1922లో ముద్రించారు. ఈ గేయ సపుటాన్ని తమ గురువర్యులైన ఆస్వాల్డు కూల్డ్రేకి అంకితమిచ్చారు. దీనికి అవతారిక కూల్డ్రేగారే వ్రాశారు. ఇందులో 27 శీర్షికలున్నవి.

*గోధూళి* జానపద గేయాల సంపుటి. ఇది పల్లీయుల భాషలోనే వ్రాయబడింది. ఈ సంపుటిని నవ్యసాహిత్య పరిషత్తువారు 1938లో ప్రచురించారు. ఈ గేయకావ్యం డా. బెజవాడ గోపాలరెడ్డి దంపతులకు అంకితమీయబడింది. ఇందులో 25 గేయాలు వున్నాయి.

**శశికళ:**

ఈ సంపుటిలో 72 గేయాలున్నవి. బాపిరాజు మరణాంతరం శశికళా ప్రచురణవారు (రామచంద్రాపురం) 1954లో దీనిని ప్రచురించారు. ఈ సంపుటికి శ్రీరావులపర్తి భద్రిరాజు ప్రస్తావన రచించారు. శశికళ బాపిరాజుకి ఉపాసన దేవత. ఈ సంపుటాన్ని శిల్పకళా లక్ష్మి శశికళకే అంకితమిచ్చారు! శశికళను గూర్చి కావ్యంలో ఒకచోట ఇలా వ్రాస్తారు బాపిరాజు:

*చిత్ర రూపము రంగు శశికళ – శిల్ప కౌశల్యము శశికళ*
*చిత్రకారుని కుంచె శశికళ – శిల్పి చేతులలో ఉలి శశికళయే!*
*కావ్యనాయిక నాకు శశికళ – కావ్యరసము స్థాయి శశికళ*
*కావ్య వ్యంగ్యము రీతి శశికళ – కావ్యమే నాగీతి శశికళయే!*

అని ఆసుందర రూపాన్ని పలువిధాలుగా కీర్తించారు. బాపిరాజు స్వచ్ఛంద ప్రణయానికి అనుగుణంగా ప్రేయసిని అన్వేషించి, ఆమెను ఆరాధిస్తారు. ఆమె అంగాంగ సౌందర్యాన్నేగాక, ఆత్మసౌందర్యాన్ని ఆరాధించారు. బాపిరాజు శశికళా ప్రియులు. ఆయన జీవితమంతా కళామయం చేసి, చివరకు ఆయనను తనలో లీనం చేసుకుంది. శశికళ రాజుగారి రాణి, వాణి, బాణి.

**బాపిరాజు సమగ్ర కవితా సంకలనం:**

బాపిరాజు సమగ్ర కవితాసంకలనం – సంపుటి (1) పేర కిన్నెర ఆర్ట్సు థియేటర్స్ హైదరాబాదు వారు 1996లో ప్రచురించారు. అప్పటి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీకృష్ణకాంత్ కవితా సంపుటాన్ని ఆవిష్కరించారు. సభలో సర్వశ్రీ శ్రీపాదరావు, డా. సి. నారాయణరెడ్డి గారు, డా. జి. సుబ్రహ్మణ్యం మొదలైన పెద్దలు పాల్గొని బాపిరాజు బహుముఖ ప్రజ్ఞాపాటవాలను గూర్చి ప్రసంగించారు. పుస్తక విశిష్టతను గూర్చి ముచ్చటించారు. కావ్య సంకలనంలో *శిల్పబాల*, *అంజలి*, బాపిరాజు వచన కవిత, *జ్యోతి*, *పచ్చగడ్డి పూలపళ్ళెము*, *దీపమాల* అనే ఆరు కావ్యములు సంకలితమైనవి. అలాగే సంపుటి 2లో *తొలకరి*, *గోధూళి*, *శశికళ*, *చిగురుటాకులు*, అవీఇవీ అనే రచనలు చేర్చబడినవి. ఈ సంపుటాన్ని బాపిరాజు శతవార్షిక ఉత్సవ కమిటీ, విశాఖపట్నం వారు ప్రచురించారు.

**వ్యాసకర్త:**

బాపిరాజు తెలుగు బాషలో డెబ్భైకి పైగా వ్యాసాలు వ్రాసి, గొప్ప వ్యాస రచయితగా కూడా పేరు గడించారు. విషయ వైవిధ్యాన్నిబట్టి వీరి వ్యాసాల్ని స్థూలంగా కళా, కళాక్షేత్ర, చరిత్ర – సంస్కృతి, సాహిత్య విమర్శ, సాంఘిక వ్యాసాలు అనే పలు విధాలుగా వర్గీకరించవచ్చు.



బాపిరాజు బొమ్మ

రాజు తెలుగు సాహిత్యంలో కేవలం గొప్ప రచయితగానేకాక, మహా వక్తగా పేరెన్నికగన్నవాళ్ళలో ఒకరుగా ప్రసిద్ధిగాంచారు. వారి ఉపన్యాసాలలో మాట, పాట, ఆటా, త్రివేణీ సగమంలా పెనవేసుకొని శ్రోతలకు ఎనలేని ఆనందానుభూతుల్ని కలుగజేస్తాయి. కళా విశేషాలపై అనేక విమర్శనాత్మక వ్యాసాలు ఆంగ్ల భాషలోనూ రచించారు.

**ప్రముఖ చిత్రకారుడు:**

బాపిరాజులో మిగతా ప్రతిభలు ఎన్ని వున్నా, ఆయన జీవితాన్ని ఆనందమయంగా నడిపిన ప్రధాన మానస శక్తి కళాతృష్ణ! ఆయన చిత్ర రచనలో సారాన్ని అందుకున్నంతగా సంఖ్యను అందుకోలేదు. చిత్ర రచనలో మూడు రచనారీతులు ప్రధానం – రేఖ లేకుండా కేవలం రంగుల రచన, రంగు లేకుండా కేవలం రేఖల రచన, రేఖలు రంగులు రెండిటి మిశ్రమ రచన. బాపిరాజు ఈ మూడు విధానాల్లోను సిద్ధహస్తుడు. మద్రాసు ప్రభుత్వం ఆయనను 1951లో సింహళానికి పంపింది. అక్కడి సిగీరియా కుడ్య చిత్రాల ప్రతులను రచించి తెమ్మని. ఇక్కడి నుండి మరికొందరు చిత్రకార మిత్రులను తీసుకొని సింహళం వెళ్ళి బాపిరాజు ఆ పనిని విజయవంతంగా ముగించుకొని వచ్చారు. ఆయన కళా చరిత్రకారులు, కళా సమీక్షకులు కూడా! ఆయన జలవర్ణ చిత్రాలను, తైలవర్ణ చిత్రాలను ఎంతో నైపుణ్యంతో రచించారు. బాపిరాజు కళాఖండాలన్నీ ఒకచోట లేవు. కొన్ని విదేశాల్లో వుండిపోయాయి. మరికొన్ని దేశంలో ఆయన అభిమానులవద్ద, స్నేహితులవద్ద వుండిపోయాయి. డెన్మార్కులోని చిత్రశాలలో వీరి *శబ్దబ్రహ్మ* అనే చిత్రం ప్రదర్శించబడివుంది. *భాగవతపుత్రుడు* అనే చిత్రం తిరువాంకూరు పాలకుల ప్రాసాదంలోను, *ఆనందతాండవం* తిరువాంకూరు మ్యూజియంలోను, *సూర్యదేవుడు* అనేది బీహారులోను ఉండిపోయాయి. అలాగే వీరి తిక్కన, శశికళ ఆంధ్రవిశ్వ విద్యాలయంలోను, సముద్ర గుప్తుడూ, పార్వతిపరమేశ్వరులు రాధాకృష్ణ మనదేశంలోనే కొందరి చిత్రసంగ్రహాలయాలలో ఉన్నాయి! బాపిరాజు వ్యావహారిక జగత్తుకంటే, రసతత్వజగత్తులోనే ఎక్కువగా జీవించారు. అనేకచోట్ల కళాపీఠాల్ని స్థాపించి, కులపతి బాపిరాజుగా ప్రసిద్ధిగాంచారు!

## బాపిరాజు రాసిన ఓ మధుర గీతం

పాడకే నా రాణి పాడకే పాట
పాట మాధుర్యాల ప్రాణాలు మరిగెనే

చరణం 1 : రాగమాలాపించి వాగులా ప్రవహించి
సుడిచుట్టు గీతాల సురిగిపోనీయకే పాడకే

చరణం 2 : కల్హారముకుళములు కదలినవి పెదవులు
ప్రణయపద మంత్రాల బంధించె జీవనము
పాడకే

శ్రుతిలేని నా మదికి చతురగీతాలేలా
గతిరాని పాదాలకు గతుల నేర్పిమ్మకే
పాడకే

పై పాటను ఘంటసాల మధురాతిమధురంగా గానం చేశారు. ప్రస్తుతం యూట్యూబ్‌లో ఈ గీతం వినవచ్చు.

**ముగింపు:** సముద్రాన్ని ఏ గట్టునుంచైనా, చూడగలిగినంతే చూడగలం! బాపిరాజు సాహితీ విజ్ఞాన ప్రతిభ అపారమైనది. "ఆయన ఒక విజ్ఞాన సర్వస్వం. లలితకళా సర్వవిజ్ఞాన మహోదధి. భారతీయ సాహిత్యం, శిల్పం, చిత్రలేఖనం, వాస్తువైభవం, వేదాంతం, సంస్కృతి, యుగయుగాల భారతీయాత్మ స్వరూపం ఆయనంత లోతుగా అధ్యయనం చేసిన మహారచయిత, విజ్ఞానఖని తెలుగువారిలోనే కాదు, సర్వభారతీయ రచయితలోనైనా చాలా అరుదుగా కనబడతారు".



చదువుల తల్లి

విశ్వకవి రవీంద్రనాథ్‌తో పోల్చదగిన తెలుగుకవి ఎవరైనా వుంటే ఆ కవి బాపిరాజు మాత్రమే! అటు కలం, ఇటు కుంచె పట్టిన రసరాజు ఆయన! ప్రకృతినిగూర్చి, మానవ ప్రకృతినిగూర్చి, ఉదాత్త మానవీయ సహజాతాలను గూర్చి బాపిరాజు చేసిన వర్ణనలు ప్రపంచ మహాకవుల వర్ణనలతో సరితూగుతాయి. నవ్యాంధ్ర సాహిత్య లోకాన్ని తనకుగల ప్రజ్ఞా విశేషంచేత, ధీవిశేషంచేత దీప్తిమంతంచేసి, పాఠకుల హృదయాలలో చెరగని ముద్రవేసుకున్నారు కులపతి బాపిరాజు. ఆయన స్మృతికి జోహార్లు!


**ప్రొ. రావినూతల సత్యనారాయణ**
**హైదరాబాద్, ఫోన్**: 961 852 4702.



సిరి మల్లిక రాసి, బొమ్మలు వేసిన పుస్తకం.
అల్లరి చేసిన పాపను నేను కాదు, నేను కాదు అంటూ చివరకు తానే మంచి పాపను అంది.
చిన్నారి సిరి మల్లిక సుతయేన్ పుస్తకాలు చదివిన స్ఫూర్తితో ఈ చిన్న పుస్తకం సృష్టించింది.






'మంచిపుస్తకం' వారు ముద్రింపించి, రూ. 25/-కు ఇస్తున్నారు.

పుస్తకాల కోసం - 949 074 6614 నెంబరుకు ఫోన్ చేయండి.

# నజరానా

శ్రావణ మాస గాడాంధకారం
ఏకాంత ప్రశాంత వాతావరణం
మరచిపోయిన గాథలేవో
స్ఫురిస్తున్న తరుణం - జిగర్ మురాదాబాదీ

దారి కఠినం, గమ్యమూ దూరం
ప్రతి అడుగూ చూసివేయాలి
నడకలో గుచ్చుకునే ప్రతి ముల్లునీ
నడుస్తూనే తీసివేయాలి - నియాజ్ హైదర్

ఇవాళ హృదయాన్ని
దివాళా తీసి కూర్చున్నాను
కొంత సంతోషమూ దొరికింది
కొంత దుఃఖమూ మిగిలింది - జిగర్

వాతావరణం రసహీనంగా ఉంది
నీ ప్రేమ లేకుండా!
ఎలా పుచ్చుకోను మధువు?
ఏ మిత్రుడూ రాకుండా! - జఫర్ గోరఖ్‌పురీ

ఎవరూ మూల్యమడగలేదు
విరిగిన నా మనసును
ఎవరు కొన్నా ఏంచేసుకుంటారు
పగిలిపోయిన గ్లాసును? - ఆతిష్

ఆ పూబోడి సోయగాన్ని
చూస్తుంటే ఎంత విచిత్రం?
ప్రాభాత సమీర స్పర్శకే సుమా!
ఆ సుమగాత్రి అయ్యింది కలుషితం - ఈషా

నాలో నేనే ఉంటున్నాను
నీ కోసమే పరితపిస్తుంటాను
దినమంతా నీ వీథిలో పడి
దుఃఖపు రాళ్లను ఏరుకుంటున్నాను - నాసిర్ కాజ్మీ

కలుసుకుందాం! అనే మాట
అలవోకగా అనేసింది
ఎక్కడ? అని అడిగేసరికి
'కలలో' అంటూ కదిలిపోయింది - అమీర్ మీనాయీ

సిగ్గులొలుకుతూ
నా సన్నిధిలో తాను
ఆమె దగ్గరున్నంతసేపూ
నేను, నేనులో నేను - జిగర్

తడిసిన కురుల్ని పిండి
ఎవరు విదిలించారు నీళ్లను?
తూగుతూ వచ్చిన మబ్బు
విరిగి వర్షించింది జల్లును - షేక్ అర్జూ

చెదురుతున్న ముంగురులు
చెంపల మీదకు రానీ
నీ ముఖం చూసి మేఘం
సిగ్గుపడి తప్పుకోనీ - మస్‌హఫీ అమ్రోహ్వీ

పరులకోసం దుఃఖించేవాళ్లు
ఎందరుంటారులే నేస్తం
తమ గోడు గురించి తామే
విలపించేవాళ్లే సమస్తం - సాహిర్ లుథియాన్వీ

ఎదురు చూపులకైనా
ఓ హద్దంటూ ఉంటుంది
కడకు వెన్నెల కూడా
కటికెటెండలా మారుతోంది - బిస్మిల్ సయీదీ

వలపు దారిలో అలసిపోయి
ఎక్కడ నేను చతికిలబడ్డానో
అక్కడ నాకంటే ముందే వచ్చిన
బాటసారుల్ని చూశానెందరినో - బహదూర్ షా జఫర్

ప్రతి బాధనీ తుడిచేయడం
కాదు సుమా భావ్యం
ఎదను అతికి ఉండాలి
ఏదో ఒక గాయం - జాంనిసార్ అఖ్తర్

బహుశా వైద్యంతోనైనా
కుదురుకుంటుందేమో చావు
కానీ జీవితాన్ని మాత్రం
బాగుచేసే మందులేవీ లేవు - ఫిరాఖ్

---

ఈ ఉర్దూ కవితల్ని తెలుగు చేసినవారు: డా. ఎండ్లూరి సుధాకర్, రాజమహేంద్రవరం. ఫోన్: 924 665 0771.

## వేదిక

## చదవకుండా - రాయకుండా

ఒడిస్సీ నృత్య విశేషాలు మనోహరంగా వివరించారు. 'పదతాడనం' చేస్తున్నందుకు మన్నించాలనే వినమ్ర భావాన్ని భూమాతపట్ల ప్రదర్శించే నృత్య సంస్కృతి ఎంతో గౌరవాత్మకమైనది. ప్రతి నెల ఏదో ఒక నృత్య సంప్రదాయాన్ని ఎలానూ ఇస్తున్నారు కాబట్టి దృశ్యకళ కనుక ఆయా నృత్యసంప్రదాయ ప్రదర్శనకు సంబంధించిన వీడియోకాని, ఫోటోలుకాని **మిసిమి** పక్షాన ఫేస్‌బుక్‌లో పెడితే బాగుంటుందని నా సూచన. తూము రామదాసు తెలంగాణాలో ప్రప్రథమ నాటకకర్త కావడం సంతోషించదగ్గ విషయం. రామదాసుగారి *కాళిదాసు* నాటకం ఇంకా లభించకపోవడం చాలా విచారకరం. వారి *ఆంధ్రప్రదేశ్ నిదానము* గ్రంథాన్నైనా అందరికీ అందుబాటులోకి తీసుకుని రావలసిన అవసరం ఉంది. ఇందుకు వదాన్యులు, ప్రభుత్వం పూనుకోవాలి.

నాట్యవిదుషీమణి ఎంత గొప్ప కళాకారిణి అయినా ఆమె స్వభావంలోని కొన్ని కోణాలు అంతగా హర్షించేవి కావు.

'కొత్త రాగాలను కనుగొన్నామన్నంతలోనే పాతరాగాలను అర్థంచేసుకోవాలి పూర్తిగా' అనే ఎదురు సవాలు చప్పట్లు కొట్టడానికే పనికివస్తుందేమో! ఏమైనా ఇది అర్ధసత్యమవుతుంది. రామన్ గారు నచ్చచెప్పగా ఆమె అతికష్టంమీద 'ఇంటర్వ్యూ'కు అంగీకరించిందీ ఎందుకు? తెలుసుకోవాలనుకున్నవారిని ఫూల్స్ చేయడానికా? అంత 'అసందర్భం' అని భావించినప్పుడు ఎందుకొప్పుకోవాలి? 'ఆమెను రంగస్థలం మీద నుంచి తప్పుకోవాల'ని సలహా ఇచ్చిన విమర్శకుల అభిప్రాయం రామన్‌గారు స్పష్టపరచలేదు. సాటి నర్తకీమణిని సంగీతం గురించి అడిగి మొహంమీదనే ఈడ్చికొట్టినట్లు మాట్లాడటం సంస్కారం అవుతుందా? అయినా 'నాకు బాగా సంగీతం వచ్చు' అని విద్వాంసులైనా అంటారా? ఆమె వినయాన్ని 'బాల' అంతగా అవమానించారా? రామన్ గారు ఈ వ్యాసాన్ని ఏం ఉద్ధరించడం కోసం రాసినట్లు? బాలసరస్వతి ప్రతిభకు ప్రాముఖ్యమిచ్చే అంశాలుంటే పాఠకులకు మేలు జరిగేదికదా!

'సురభిళ పరిమళం' రెండు పదాలూ పదార్థాకాలే. ఎందుకీ పునరుక్తి? ఇక పదాలే లేవా? మూడు శీర్షికలలోనూ జావళీలను ఇవ్వటం ఒక విశేషం... 'శివదీక్షాపరారులను' అనే జావళీని 'పూజాఫలం' సినిమాకోసం జానకి పాడారు. ఈ జావళికి మరో 3 చరణాలు కూడా ఉన్నాయి.

3. చరం పంచాక్షరీజపశీలనురా
   కూకి పలుకులను వినజాలనురా
   కొంచెపు వగలు నేనెంచనురా
   మ్రొక్కుచు రుద్రాక్ష సరులు తెంచకురా ॥ శివ ॥

4. అజ్జజూచి చన్నులదుమకురా నా
   సెజ్జ గొలుసుబట్టి కదియకురా
   బుజ్జగించను పసికోలనురా
   పజ్జన కెమ్మోవినొక్కకు భక్తురాలను రా ॥ శివ ॥

5. మోము మోమునుబట్టి జేర్చకురా నీ
   నామముతోడ బూతిగూర్చకురా
   వేమరు తొడభిక్ష వేడకురా పోపో
   రా మన్నారు రంగ మల్లాడకురా ॥ శివ ॥

సినిమా కాబట్టి క్లుప్తంగా తీసుకుని ఈ మూడు చరణాలు వదిలేశారు. అతి శృంగార భావం కూడా కారణం కావచ్చు.

'జావళి' పదానికి వ్యుత్పత్తి అర్థం చెప్పడం చెప్పుకోదగ్గ విశేషం. 'సినిమాలోని జావళీలు' అని ప్రత్యేకంగా వ్యాసం వ్రాయడానికి ఆస్కారమిచ్చే సూచనను ఈ వ్యాసంలో మనం ఊహించవచ్చు. దేవులపల్లి రామానుజారావుగారికి సంబంధించిన ఎన్నో అమూల్య విషయాలను రచయిత తెలిపారు. సత్యనారాయణగారికి అభినందనలు. 'విశ్వనాథవారి' చిన్న కథలు. సమీక్ష బాగుంది. ఎవరో ఏదో అంటే దానికి 'సిమ్మన్న' గారు జవాబు చెపుతున్నట్లు వ్యాసం స్ఫురింజేస్తున్నది. విశ్వనాథవారి 'కోడిగుడ్డంత గోధుమగింజ' కథను ఉటంకించలేదు. కానీ ఆ కథలు మన నాగరికతను, న్యాయవ్యవస్థను ఎంతో క్షుణ్ణంగా పరిశీలించి గొప్ప వ్యంగ్యంతో చెప్పిన చక్కని కథనం ఆకట్టుకుంటుంది. ఈ కథ ఒకప్పుడు 10వ తరగతి పాఠ్యపుస్తకాలు చేర్చారు. దాన్ని బోధించే అదృష్టం నాకు దక్కింది.

'అలరాజు' వ్యాసాలు జాషువాగారి పద్యాన్ని కోట్ చేశారు. 'సుకవి మరణించె' అన్నారు. కాని 'కవియు మరణించె' అని ఉండాలి. 'నాయకురాలు మోసం విజయం సాధించిందని బ్రహ్మనాయుడి వర్గాలు ఘర్షణకు దిగాయి. గెలుపు నాయకురాలిదేనంటూ తీర్పునొసగాడు' అన్నారు. కాని ఆ వర్గాల ఆరోపణను సరిగా విచారించకుండానే అలరాజు తీర్పు చెప్పాడా! 'విచారణ' గురించిన ప్రస్తావన వ్యాసంలో ఎక్కడా లేదు.

మొత్తంమీద **మిసిమి** నన్ను చదవకుండా ఊరుకోనివ్వదు, చదివాక ఏదో ఒకటి రాయకుండా నిద్రపోనివ్వదు.

**మిసిమి**కి రచయితలకు అందరికీ అభినందనలు.

డా. ఎం. పురుషోత్తమాచార్య
నల్గొండ. ఫోన్ : 939 661 1905.

# చదవండి...

- ఎన్నార్కె




✧ **పన్యాల రంగనాథరావు కథలు :** మొదటి భాగం. పన్యాలవారి మిత్రులు యామిజాల ఆనంద్‌గారు ఈ కథలను సేకరించారు. 1938లో వ్రాసిన మొదటి కథ నుంచి 1973లో వ్రాసిన చివరి కథవరకూ అన్నిటినీ ఒక క్రమంలో పెట్టి ప్రచురించారు. ఒకప్పటి రచయితల కథాసంవిధానం తెలుసుకోవడానికైనా ఈ పుస్తకంలోని కథలను చదవాలి.

*పేజీలు : 322, వెల ₹ 200/-*




✧ **మట్టిగూడు పర్యావరణ కవిత్వ నేత్రం :** రచయిత జి. సత్యశ్రీనివాస్. ఇవి 5 ప్రకరణాలుగా మొత్తం 26 వ్యాసాలు కవులపై వారి రచనలపై విశ్లేషణలున్నాయి.

*పేజీలు : 155, వెల ₹ 120/-*

*పై రెండు పుస్తకాలకు : నవచేతన పబ్లిషింగ్ హౌస్, గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), జి.ఎస్.ఐ. పోస్ట్, హైదరాబాద్-500068. తెలంగాణ. ఫోన్స్ 040-24224453 / 54 మరియు అన్ని విశాలాంధ్ర, ప్రజాశక్తి బుక్ హౌస్, నవ తెలంగాణ బుక్ హౌస్‌లు.*




✧ **సాహిత్య తోరణాలు :** రచయిత దుర్గాంబ పుత్ర మువ్వల సుబ్బరామయ్య. రచయిత అనేక సాహితీ అంశాల మీద రచనలు చేశారు. ఇందులో సాహితీ అంశాలతోబాటుగా వేదాలు, సోక్రటీస్, జెండ అరిస్తా మొదలు అనేక అంశాలపై వ్రాసిన వ్యాసాలున్నాయి.

*పేజీలు : 197, వెల ₹ 120/- ప్రతులకు : జయంతి పబ్లికేషన్స్, కార్ల్ మార్క్స్ రోడ్, విజయవాడ. ఫోన్ : 897 826 1496.*




✧ **ఆవిడెవరు? కథలు :** రచయిత్రి కన్నెగంటి అనసూయ. ఇవన్నీ కుటుంబ సంబంధాలను ఉన్నతీకరించే కథలు. సాహిత్య పరంగా ఆమె అనేక పురస్కారాలను అందుకున్నారు.

*పేజీలు : 164, వెల ₹ 150/- ప్రతులకు : కన్నెగంటి అనసూయ, 406, వింధ్యా 4, కూకట్‌పల్లి 'వై' జంక్షన్, జయభారతి గార్డెన్స్, కూకట్‌పల్లి, హైదరాబాద్-500 018. e-mail: anasuyakanneganti@gmail.com*




✧ **జానపదాలు - జ్ఞానపథాలు :** రచయిత యల్లాప్రగడ ప్రభాకరరావు. రెండు వేల సంవత్సరాల క్రితం సామాజిక సమస్యలకు సమాధానంగా చెప్పబడిన తిరువళ్లువర్ రచన తిరుక్కురళ్‌కు తెలుగు అనువాదం. ఇది మూడవ ముద్రణ.

*పేజీలు : 156, వెల ₹ 100/- ప్రతులకు : పంగులూరి హనుమంతరావు, 16-11-511/జి/7, శాలివాహననగర్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్-500 036. ఫోన్ : 990 864 8474.*



✧ **కవిత వ్రాసిన కమ్మవారు మూడవ సంపుటము :** సూర్యదేవర రవికుమార్ రచయిత. సాహిత్య పరిశోధక గ్రంథం. 80కి పైగా రచయితలు వారి రచనల గురించి వివరణలు ఇచ్చారు.

*పేజీలు : 192, వెల ₹ 150/- ప్రతులకు : సూర్యదేవర స్వరూపరాణి, యస్-4, పరమేశ్వరి టవర్స్, 4వ లైను, లక్ష్మీపురం, గుంటూరు-522 007. ఫోన్ : 944 154 7360.*

✧ **విజయచిత్ర జ్ఞాపకాలు :** రచయిత బి.కె. ఈశ్వర్. రచయిత, జర్నలిస్టు అయిన బి.కె. ఈశ్వర్ తాను సాహిత్య ప్రయాణం చేసిన విజయచిత్రలో ప్రచురించబడిన వ్యాసాల సంపుటి.

*పేజీలు : 288, వెల ₹ 175/- ప్రతులకు : సాహితీ ప్రచురణలు, విజయవాడ.*

# మిసిమి
మాసపత్రిక

మీరు చందాదారులుగా చేరండి బహుమతిగా పంపండి

మీ ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల – ఇవన్నీ మీకు అపురూపమైనవేకదా! మీకు ప్రియమైనవారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యంకదా! వీరందరికీ మీరు **మిసిమి** ని బహుమానంగా నెలనెలా పంపవచ్చు. మీకు – మీ స్నేహితులకు కలిపి రెండు సంవత్సరాల చందా కట్టి మీరూ మా నుంచి బహుమతి పొందవచ్చు. మీ ఊరి గ్రంథాలయానికి లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం చందా **మిసిమి** పేర ₹720/- (రెండు సంవత్సరాలకు) పంపి, చిరునామా వివరాలు మాకు ఫోన్ ద్వారా, ఇ-మెయిల్ ద్వారాగానీ, వాట్సాప్ (నెం : 99 49 51 65 67) ద్వారా గానీ తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం. ప్రతినెలా మీరు వారిని మంచి సారస్వతంతో పలకరించినట్లే......



రెండు సంవత్సరాల
చందాదారులకు
(₹ 720+50/-)
*నోబెల్ సాహిత్య పురస్కారోపన్యాసాలు*
గ్రంథం బహుమతి

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | **STATE BANK OF INDIA** |
| Account | : | **MISIMI** |
| A/c. No. | : | **10261569316** |
| Branch | : | **Saifabad, Hyderabad, INDIA** |
| IFS Code | : | **SBIN0007315** |

(ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కు రూ. 50/- బ్యాంకు ఛార్జీలు కలపండి.)



రెండు సంవత్సరాల
చందాదారులకు
(₹ 720+50/-)
*పురస్కార సాహిత్యం*
*(కేంద్ర సాహిత్య అకాదెమీ పురస్కారం పొందిన గ్రంథాల విశ్లేషణ)*
గ్రంథం బహుమతి



మూడు సంవత్సరాల
చందాదారులకు
(₹ 1080+50/-)
*బైరన్ (జీవిత కథ)*
గ్రంథం బహుమతి



నాలుగు సంవత్సరాల
చందాదారులకు
(₹ 1440+50/-)
*నా కథ చార్లీ చాప్లిన్*
గ్రంథం బహుమతి





అయిదు సంవత్సరాల
చందాదారులకు
(₹ 1800+50/-)
**మిసిమి** *చిత్ర కళా నీరాజనం*
పుస్తకం బహుమతి

**మిసిమి**
మాసపత్రిక
Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Hyderabad - 500 020. Ph. **040-27645536.**



అలియ రామరాయలు – రక్షస తంగడి యుద్ధం

MISIMI / మిసిమి
RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2015-17
Date of Posting: On 29th & 30th of every month.
Date of Publication: 25.12.2017



కాకతీయ చక్రవర్తి గణపతి దేవుడు – శిలాతోరణం